

'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 288

మంగళవారం 8-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దండయాత్ర పూర్తయింది

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన భారత జట్టు

72 ఏళ్ల తర్వాత దక్కిన అరుదైన విజయం

గతంలో 11 ప్రయత్నాల్లో విఫలం
సిడ్నీలో జరిగిన నాలుగో టెస్టు 'డ్రా'
2–1తో సిరీస్ టీమిండియా సొంతం
'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పుజారా
2011 ప్రపంచ కప్ విజయంకంటే మధురమన్న కెప్టెన్ కోహ్లి

– స్పోర్ట్స్‌లో

అర్హులు ఎవరు?

అగ్ర కులాల్లోని పేదలను గుర్తించేందుకు కేంద్రం కొన్ని మార్గదర్శకాలను కూడా రూపొందించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ రిజర్వేషన్ల ఫలాలు పొందాలంటే..

- ఐదెకరాల కంటే ఎక్కువ వ్యవసాయ భూమి ఉండకూడదు.
- కుటుంబ వార్షికాదాయం రూ. 8 లక్షల లోపు ఉండాలి.
- వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న సొంత ఇల్లు ఉండకూడదు.
- మున్సిపాలిటీల్లో 100 గజాలు, మున్సిపాలిటీ కాని ప్రాంతాల్లో 200 గజాలకు మించిన స్థలాలు ఉండకూడదు.

అగ్రవర్ణ పేదలకు 10% కోటా

విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం



- జనరల్ కోటాలోనే ఈ రిజర్వేషన్
- నేడే పార్లమెంటుకు సవరణ బిల్లు
- ఎన్నికల్లో ఓటమి భయంతోనే: కాంగ్రెస్ విమర్శ
- బిల్లుకు మద్దతిస్తామని ప్రకటన
- ఆమోదం లభిస్తే 50 శాతం దాటనున్న రిజర్వేషన్లు

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ

మరో నాలుగు నెలల్లో లోక్‌సభకు సాధారణ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సోమవారం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా ఉన్న డిమాండ్‌కు తలొగ్గుతూ అగ్ర కులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జనరల్ కోటాగా ఉన్న 50 శాతం నుంచే మరో పది శాతాన్ని పక్కకు తీసి ఈ రిజర్వేషన్లు కల్పిస్తారు. అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో మార్పు ఉండదు. అగ్ర కులాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణల బిల్లును కేంద్రం మంగళవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి పూర్తిస్థాయి పార్లమెంటు సమావేశాలు కావడం గమనార్హం. ఇది బీజేపీ ఎన్నికల గిమ్మిక్కు అనీ, మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోవడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే జరగుతుందని భయపడి ఉన్నపళంగా రిజర్వేషన్లను తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ బిల్లును ఉభయ సభలూ మూడింట రెండొంతుల ఆధిక్యంతో ఆమోదించాల్సి ఉంది. ఈ రిజర్వేషన్లు అమలైతే బ్రాహ్మణ, కమ్మ, కాపు, రాజ్‌పుత్, జాట్, మరాఠా, భూమిహార్ తదితర కులాల్లోని పేదలకు లబ్ధి చేకూరనుంది. కాపులు, మరాఠాలు, జాట్‌లు ఇటీవలి కాలంలో రిజర్వేషన్ల కోసం ఆందోళనలు నిర్వహించడం, అవి హింసాత్మకంగా మారడం తెలిసిందే.

50 శాతానికి అదనంగానే..

గతంలో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన

మిగతా 2వ పేజీలో ▶

ఇదీ ఈబీసీ కోటా కథ

7లో



మహాత్మాగాంధీ పాదయాత్ర చేశారు గానీ.. ఒకే ఇంట్లో ముగ్గురు పాదయాత్ర చేయడం చరిత్రలో ఇదే తొలిసారి అనుకుంటా. ఇది నిజంగా చరిత్రాత్మకం. ముగ్గురి లక్ష్యం కూడా ఒకటే. ప్రజలతో కలిసి మమేకమవడం. ఒకటే గమ్యం.. ఒకటే లక్ష్యం.. ప్రజల కోసం ప్రజలతో ఉండాలనేదే.'

'ఎండా... వాన... అనకుండా ముందుకు వెళ్లాడు. చెప్పాలంటే వాళ్ల నాన్న పోయినప్పటి నుండి తొమ్మిది సంవత్సరాలుగా జగన్ ఏ రోజూ ఇంట్లో ఉన్నది లేదు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యలోనూ పాలు పంచుకుంటూనే ఉన్నాడు'

– వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ

అంతిమ విజయం సత్యానిదే

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ

- ప్రజలను, వాళ్ల కష్టాలను చూసేకొద్దీ జగన్‌లో ప్రేమ రోజు రోజుకూ పెరుగుతోంది
- అందుకే ప్రజలు తమ వాడిగా భావిస్తున్నారు
- ఓదార్పుయాత్ర జగన్‌ను ఒక నాయకుడిగా నిలబెడితే పాదయాత్ర ఆ నాయకున్ని స్థిరపరిచింది
- వాళ్ల నాయనలాగా మంచి చేయగలుగుతాడు అనే విశ్వాసం ప్రజల్లో కలిగింది..
- పాదయాత్రలో ప్రజాభిమానం పొంగిపొర్లుతోంది
- ఒక జిల్లాకు మించి మరో జిల్లాలో పాదయాత్ర బ్రహ్మాండంగా జరుగుతోంది
- ప్రజా సంకల్పయాత్రను అడ్డుకునేందుకు కొందరు రకరకాలుగా ప్రయత్నించారు
- జగన్ ఏదైనా ధైర్యంగా ఎదుర్కొంటాడు
- ప్రజల కోసం ఎందాకైనా నిలబడతాడు.. మాట తప్పడు
- నా బిడ్డను ఒక్కసారి ఆశీర్వదించమని అందరినీ కోరుతున్నా

ఎన్ని కష్టాలు, అడ్డంకులు ఎదురైనా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తన బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే గర్వంగా ఉందని వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. 2017 నవంబర్ 6వ తేదీన ఇడుపులపాయ నుంచి వైఎస్ జగన్ ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర సుదీర్ఘ ప్రయాణం అనంతరం తుది ఘట్టంలోకి చేరుకోవడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ సీనియర్ జర్నలిస్టు, 'సాక్షి' టీవీ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావుకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

- ఇంటర్వ్యూ పూర్తి పాఠం 8, 9 పేజీల్లో



జనకోటి గుండె చప్పుళ్ల నడుమ

జగమెరుగని యాత్ర



ముగింపు ఘట్టంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర

1.25 కోట్ల మందికిపైగా ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకున్న జగన్

రేపు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీ బహిరంగ సభ

సాక్షి, అమరావతి

మొత్తం 341 రోజులు.. 3,648 కిలోమీటర్లు..
ప్రతి పల్లెను పలుకరిస్తూ.. కోటి 25 లక్షల మందికి పైగా ప్రజలను ప్రత్యక్షంగా కలుస్తూ వారితో మమేకం...
తెలుగు గడ్డపై కనీవినీ ఎరుగని ఇలాంటి పాదయాత్ర చరిత్రలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు...

ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతివనం (వైఎస్సార్ ఘాట్) నుంచి 2017 నవంబర్ 6వ తేదీన చేపట్టిన 'ప్రజా సంకల్పయాత్ర' ఈనెల 9వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. అప్పటికి ఈ అపూర్వ పాదయాత్ర 3,648 కిలోమీటర్ల మైలురాయిని చేరుకోనుంది. రాష్ట్రంలోని దాదాపు 2,516 గ్రామాల మీదుగా సాగే ప్రతిపక్ష నేత పాదయాత్రలో బుధవారం నాటికి 124 బహిరంగ సభలు (ఇప్పటికి 123 సభలు) పూర్తవుతాయి. చిన్న పట్టణాల్లో ఈ సభలకు కనిష్టంగా 30 వేల నుంచి గరిష్టంగా 50 వేల మంది వరకు జనం తరలివచ్చారు. ముఖ్య పట్టణాలు, నగరాల్లో జనం పోటెత్తడంతో 60 వేల నుంచి లక్ష మందికిపైగా హాజరైనట్లు అంచనా. ఈ లెక్కన బహిరంగ సభల్లోనే ఒక్కో సభకు సరాసరిన 60 వేల మంది హాజరైనట్లు భావించినా మొత్తం 74.40 లక్షల మంది హాజరైనట్టు లెక్క.

కోట్ల మందిని కలుసుకుంటూ...

ప్రతిపక్షనేత తన వెంట నడిచిన వారితోపాటు గ్రామాల్లో బారులు తీరిన ప్రజలను రోజుకు కనిష్టంగా 15 వేల మందిని స్వయంగా కలుసుకున్నారు. 341 రోజుల పాదయాత్రలో ప్రతిపక్ష నేతను కలిసే వారి సంఖ్య 51.15 లక్షలు అవుతోంది. మొత్తంగా చూస్తే 1.25 కోట్ల మందికిపైగా ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారితో మమేకమై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ఈ పాదయాత్ర ఓ అరుదైన ఘట్టంగా చరిత్రపుటల్లోకెక్కనుంది. మరోపక్క ఆత్మీయ సమావేశాలకూ వేలసంఖ్యలో ఆయా వర్గాల ప్రజలు హాజరయ్యారు. వీరితో పాటు ప్రసారమాధ్యమాల ద్వారా పాదయాత్ర, బహిరంగ సభలను

మిగతా 2వ పేజీలో ▶

పోలవరం వేదికపై 'గిన్నిస్' నాటకం

- నాలుగున్నరేళ్ల నిర్లక్ష్యం, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు యత్నం
- చంద్రబాబు కమీషన్ల కక్కుర్తే ప్రాజెక్టుకు శాపం అంటోన్న సీనియర్ ఐఏఎస్‌లు
- ఆ రెండు ఎత్తిపోతలకు పెట్టిన ఖర్చు పోలవరంపై చేసి ఉంటే ఇప్పటికే పూర్తయ్యేది



- వివరాలు 5లో

ఇదండీ సంగతి



...పరిస్థితి మరీ ఇంత ఘోరంగా ఉందా... సర్లే ఊరు కోవయ్యా!



మోదీ చోర్!

- దేశం మొత్తం అదే మాట
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే కాంగ్రెస్‌తో కలయిక
- నేను ఎంతో సీనియర్‌ని..
- ప్రధాని పదవిని రెండుసార్లు వదిలేశా
- తాత ఆశయాలు నెరవేర్చేందుకే లోకేష్ రాజకీయాల్లోకి..
- పశ్చిమగోదావరి జన్మభూమి సభలో చంద్రబాబు

5లో

ఇవ్వంగాక ఇవ్వం

- జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ వివరాలు ఇచ్చేది లేదు
- ఎన్‌ఐఏకి తెగేసి చెప్పిన విశాఖ పోలీసులు
- కోర్టుకూ అదే సమాధానం
- పోలీసుల తీరుపై కోర్టు ఆగ్రహం
- నిందితుడి బెయిల్ పిటిషన్ నోటీసును ఎన్‌ఐఏకి ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశం
- సర్కారు కుట్ర లేకుంటే ఇంత ఆందోళన ఎందుకు.. అదే కోణంలో ఆలోచిస్తున్న ఎన్‌ఐఏ
- సమాచారం ఇచ్చారో.. అంతే సంగతులంటూ అధికారులకు ఓ మంత్రి బెదిరింపులు

4లో

మే నెలలో ఎన్నికలకు అవకాశం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా



పార్వతీపురం: రాష్ట్రంలో మే నెలలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా తెలిపారు. సోమవారం రాత్రి విజయనగరం జిల్లా పార్వతీపురం వచ్చిన ఆయన స్థానిక సబ్‌కలెక్టర్ అతిథి గృహంలో రాత్రి బస చేశారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ..మార్చిలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకు జనాన్ని చైతన్యపరచనున్నట్లు వివరించారు.

నేడు, రేపు ఆర్టీసీ కార్మికుల ధర్నా

సాక్షి, అమరావతి: ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ, సర్వీస్ నిబంధనల సాధన కోసం మంగళవారం, బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ నేతలు రమణారెడ్డి, చంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయూ ఇచ్చిన సమ్మె నోటీసుకు తమ యూనియన్ సంఘీభావం తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

పళ్లు తోమడం తప్ప.. అన్నీ మేమే చేస్తున్నాం

మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

జలుమూరు: 'గత ప్రభుత్వాలు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తి పుట్టినప్పటి నుంచి చివరి వరకు.. పళ్లు తోమడం తప్ప అన్నీ మేమే చేస్తున్నాం' అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. అందువల్ల అందరూ తమకే ఓటెయ్యాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా అల్లాడలో జరిగిన జన్మభూమి గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలన్నీ టీడీపీ కార్యకర్తలకే ఇస్తున్నారని సభలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు తిత్లీ తుపాను వల్ల నష్టపోయిన వారికి అందించే పరిహారంలో కూడా అర్హులకు అన్యాయమే జరిగిందని వాపోయారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అన్ని అభివృద్ధి పనులు తామే చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. వంశధార, నాగావళి నదుల వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు గానూ నిర్మించతలపెట్టిన కరకట్టలకు వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.350 కోట్లు మంజూరు చేస్తే.. తాము రూ.1,050 కోట్లు మంజూరు చేశామన్నారు.

చంద్రబాబుకు బీజేపీ ఎమ్మెల్యే పొగడ్తలు

పోలవరం పనుల్లో రికార్డు పట్ల కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



కేక్ కట్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ నేతలను వారిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సాక్షి, విశాఖపట్నం: సీఎం చంద్రబాబును పొగడ్తల్లో ముంచెత్తడంలో టీడీపీ నాయకులను మించిపోయారు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 33వ వార్డు జన్మభూమి గ్రామ సభ అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో నిర్వహించారు. ఈ సభకు బీజేపీ విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో పాటు సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ అల్లుడు ఎం.భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వాన్ని, చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు.. పోలవరం కాంక్రీట్ పనులు గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం పట్ల టీడీపీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. టీడీపీ నేతలు ఇదంతా తమ అధినేత చంద్రబాబు కృషేనంటూ గొప్పలు చెప్పుకుంటుండగా.. వేదికపైనే ఉన్న బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఈ పనులు జరుగుతున్నాయని వాదిస్తున్న వారిని ఎమ్మెల్యే వారించి టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలు కలిసే చేస్తున్నాయని చెప్పడంతో బీజేపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మిరాశీ అర్చకులపై నేడు చర్చ

తిరుమల: తిరుమలలో మంగళవారం జరగనున్న టీటీడీ పాలక మండలి సమావేశంలో మిరాశీ అర్చకులకు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై చర్చ జరగనుంది. ఇప్పటికే కోర్టు రెండు రకాల తీర్పులు ఇవ్వడంతో పాలక మండలి దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సిందే. కాగా తిరుమల మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తి చేసి 280 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరో 1,100 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పాలక మండలి ఆమోదానికి రానుంది.

జగమెరుగని యాత్ర

▶ మొదటి పేజీ తరువాయి

వీక్షించిన దేశ విదేశాల్లోని కోట్లాది తెలుగు ప్రజలందరినీ కలుపుకొంటే ఈ సంఖ్య భారీగానే ఉండనుంది.

పోటెత్తిన జనసంద్రం..

ముగింపురోజు నాటికి పాదయాత్ర గ్రామాల సంఖ్య 2,516కి చేరనుంది. 231 మండల కేంద్రాలు, 54 మున్సిపాలిటీలు, 8 నగరాలు, మహానగరాల మీదుగా సాగిన జగన్ పాదయాత్రకు జనం అడుగడుగునా వెల్లువెత్తారు. ప్రతిపక్షనేతను కలిసి సమస్యలు చెప్పుకునేందుకు, టీడీపీ సర్కారు అరాచకాలు, అక్రమాలు, అవినీతిని వివరించేందుకు ప్రతిపక్ష నేతను కలిసేందుకు బారులుతీరారు. ఫొటోలు దిగేందుకు, సెల్ఫీలు తీసుకొనేందుకు పోటీపడ్డారు. వృద్ధులు, యువత, మహిళలు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, చిరుద్యోగులు, వివిధ సామాజికవర్గాల ప్రతినిధులు, కర్షకులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు వైఎస్ జగన్‌ను కలిసేందుకు కదలి వచ్చారు. పాదయాత్ర గ్రామాల మీదుగా సాగినప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, రైతు కూలీలు పరుగు పరుగున వచ్చిన దృశ్యాలు అనేకం. పట్టణాలు, నగరాల్లో ప్రతిపక్ష నేతను అనుసరిస్తూ పాదయాత్రలో మమేకమైన వారి సంఖ్య వేలల్లోనే ఉంది. ప్రతిపక్ష నేతను కలిసేందుకు రోడ్ల వెంబడి బారులు తీరారు. మేడలు, మిద్దెలు ఎక్కి వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు జనం పోటెత్తారు. తమ ప్రియతమ నాయకుడు, ప్రతిపక్ష నేతను కళ్లారా తిలకించి ఆయన ప్రసంగాన్ని వినేందుకు పోటెత్తిన జనంతో బహిరంగ సభలు జన సంద్రంలా మారాయి. పాదయాత్ర గుంటూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాలోకి ప్రవేశించినప్పుడు కనకదుర్గమ్మ వారధి జనప్రవాహంతో నిండిపోయింది. అలాగే తూర్పు గోదావరి జిల్లాలోకి యాత్ర చేరుకున్నప్పుడు రాజమండ్రి వద్ద గోదావరిపై ఉన్న రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి జనవారధిగా మారింది. విశాఖలో కంచరపాలెం వద్ద జరిగిన సభ నగర చరిత్రలోనే మైలురాయిగా నిలిచింది.

రాజకీయ అజెండాగా మారిన 'ప్రత్యేక హోదా'

వైఎస్ జగన్ పాదయాత్ర రాష్ట్రంలోనే కాకుండా జాతీయస్థాయిలోనూ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పలు సమస్యలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజల్లో భరోసా, స్థైర్యాన్ని నింపుతూ సాగిన ఈ పాదయాత్ర అధికార టీడీపీని బెంబేలెత్తించగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో గుబులు రేపింది. రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో వేడిని రగిల్చింది. ప్రత్యేక హోదా అంశాన్ని రాజకీయ అజెండాగా మార్చి రాష్ట్ర ప్రజల ఆశలకు కొత్త ఊపిరులూదింది. ప్రజలందరూ ప్రత్యేక హోదాపైనే ఆశలు పెట్టుకోగా అదే హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు స్వార్థ ప్రయోజనాలు, ఓటుకు కోట్లు కేసు భయంతో హోదాను కేంద్రానికి తాకట్టుపెట్టారు. అయితే దాదాపు ఐదేళ్ల పాటు నిరంతర పోరాటం ద్వారా ప్రజలను జాగృతం చేసి ప్రత్యేక హోదా నినాదాన్ని వైఎస్ జగన్ సజీవంగా ఉంచారు. ప్రత్యేక హోదా సాధన కోసం తమ ఎంపీలతో రాజీనామా చేయించి ఈ అంశాన్ని ప్రధాన అజెండాగా మార్చారు. హోదాపై పలుమార్లు మాటమార్చి 'యూటర్న్' తీసుకున్న చంద్రబాబు ఎన్నికలు సమీపించడంతో గత్యంతరం లేక ప్రత్యేక హోదా బాట పట్టారు. వైఎస్సార్ సీపీ ఎంపీల రాజీనామాలతో చంద్రబాబు మరోదారి లేక కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఎన్డీఏ నుంచి వైదొలగారు.

నవరత్నాలతో భరోసా..

టీడీపీ పాలనలో విచ్చలవిడిగా సాగుతున్న అరాచకాలు, అక్రమాలు, అవినీతి, దుర్మార్గాల గురించి పాదయాత్ర పొడవునా ప్రజలు ప్రతిపక్షనేతతో మొరపెట్టుకున్నారు. పెన్షన్లు, ఇళ్ల మంజూరులో జన్మభూమి కమిటీల దందాలు, టీడీపీ నేతల భూకబ్జాలు, ఇసుక దందాలు, అక్రమంగా గనుల తవ్వకాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. టీడీపీ ప్రజాకంటక పాలన నుంచి తమను ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, అసంఘటిత కార్మికులు కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో తమ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టనున్న పలు కార్యక్రమాల గురించి పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో వైఎస్ జగన్ ప్రస్తావించారు. వైఎస్సార్ సీపీ ప్రకటించిన నవరత్నాల హామీ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. ఇవే కాకుండా పాదయాత్రలో తన దృష్టికి వచ్చే సమస్యలపైనా తాము అధికారంలోకి రాగానే ఎలాంటి చర్యలు తీసుకుంటామో జగన్ స్పష్టంగా వివరిస్తున్నారు. ప్రతి సభలోనూ ప్రతిపక్షనేత ప్రసంగం ప్రజలను ఆకట్టుకోవడంతోపాటు సర్కారు అరాచకాలపై లోతుగా ఆలోచించేలా సాగింది. ఇక వివిధ కులాలు, సామాజిక వర్గాల ప్రజలతో వైఎస్ జగన్ నిర్వహించిన ఆత్మీయ సమావేశాలు వారికి ఎంతో భరోసాను కల్పించాయి. తూర్పు గోదావరి జిల్లాలో పర్యటన సమయంలో కాపుల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో పాటు వారిని ఆదుకునేందుకు కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.10 వేల కోట్ల నిధిని సమకూరుస్తామని ప్రతిపక్ష నేత ప్రకటన చేశారు.


స్పష్టమైన కార్యాచరణ

పాదయాత్ర పొడవునా అనాథలు, అణగారిన వర్గాలను ఓదారుస్తూ వైఎస్ జగన్ ముందుకు కదిలారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, మెగా డీఎస్సీ తదితర హామీలతో భరోసా కల్పించారు. వివిధ కులాల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ డెయిరీలు, చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ, తిత్లీ తుపాను బాధితులకు పరిహారం మొత్తాన్ని చెల్లిస్తామని వైఎస్ జగన్ స్పష్టమైన ప్రకటన చేసి వారికి స్థైర్యాన్ని కల్పించారు.

ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం

పాదయాత్ర సందర్భంగా విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో పర్యటన అనంతరం హైదరాబాద్‌కు పయనమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం రాష్ట్ర ప్రజలనే కాకుండా జాతీయ స్థాయిలోనూ అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరి నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో పనిచేసే దుండగుడు ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో పదునైన ఆయుధంతో హత్యాయత్నానికి పాల్పడగా వైఎస్ జగన్ అప్రమత్తమై పక్కకు తప్పుకోవడంతో ఆయన భుజంపై కత్తి దిగబడింది. సంఘటన జరిగిన గంటల వ్యవధిలోనే డీజీపీ ఆర్పీ ఠాకూర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కేసు దర్యాప్తును నీరుగార్చేలా వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

ముగింపు సభకు భారీ ఏర్పాట్లు



తలశిల రఘురామ్

ఇచ్ఛాపురం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : జననేత జగన్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 9వతేదీన ఇచ్ఛాపురం ఆర్టీసీ పాత బస్టాండ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాదయాత్రలో ఇప్పటికే ఇచ్ఛాపురం సమీపంలోకి వచ్చిన జగన్ కొత్త కొజ్జీరియా గ్రామం నుంచి 9వ తేదీ ఉదయం తన పాదయాత్రను ప్రారంభించి లొద్దపుట్టి గ్రామం వద్ద మధ్యాహ్న భోజన విరామం కోసం ఆగుతారు. అక్కడి నుంచి మధ్యాహ్న విరామం తరువాత జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విజయసంకల్ప స్తూపం వద్దకు బయలు దేరుతారు. తన యాత్ర ముగింపు సూచకంగా ఆకర్షణీయంగా నిర్మించిన ఈ స్తూపాన్ని జగన్ ఆవిష్కరించి..ఆ తరువాత అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇచ్ఛాపురం పట్టణంలోకి అడుగుపెట్టి బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన ప్రజాప్రస్థానం పాదయాత్ర విజయస్తూపం, తన సోదరి షర్మిల చేసిన మరో ప్రజాప్రస్థానం స్తూపం మీదుగా జగన్ బహిరంగ సభకు వెళతారు. అక్కడితో ఆయన చారిత్రాత్మకమైన పాదయాత్ర ముగుస్తుంది. బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ సాక్షితో మాట్లాడుతూ 341వ రోజు యాత్ర ముగింపు రోజున జగన్ సుమారు 9 కిలోమీటర్ల మేరకు నడిచే అవకాశం ఉందన్నారు. ఇడుపులపాయలోని వైఎస్ సమాధి వద్ద తొలి అడుగు పడిన జగన్ పాదయాత్రకు చివరి అడుగు ఇచ్ఛాపురం బస్టాండులో పూర్తవుతుందన్నారు. జగన్ యాత్ర ముగింపు అపూర్వ ఘట్టాన్ని కళ్లారా చూసేందుకు, ఆయన సందేశం వినేందుకు ఆసక్తితో ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర పార్టీ ప్రముఖ నేతలంతా హాజరవుతున్నట్లు రఘురామ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభం అవుతుందన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

విజయసంకల్పం స్తూపానికి తుది మెరుగులు



మరో రెండు రోజుల్లో యాత్ర ముగుస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం విజయసంకల్పం స్తూపానికి రాత్రింబవళ్లు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇప్పటికే స్తూపంపై వైఎస్ చిత్రాలను, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను అమర్చారు. నిర్మాణం పటిష్టంగా జరుగుతోందని.. మొత్తం మీద దీన్నొక దర్శనీయమైన స్థలంగా తీర్చి దిద్దేందుకు నిర్వాహకులు కృషి చేస్తున్నారని రఘురామ్ వివరించారు.

అగ్రవర్ణ పేదలకు 10 శాతం కోటా


▶ మొదటి పేజీ తరువాయి

తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం దాటకూడదు. మిగతా 50 శాతం సీట్లు, ఉద్యోగాలను పూర్తిగా ప్రతిభ ఆధారంగా (జనరల్ కోటా)నే భర్తీ చేయాలి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలను మినహాయిస్తే మిగిలిన అన్ని చోట్లా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి మొత్తంగా 49.5 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అంటే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లను మరో 0.5 శాతానికి మించి పెంచే వీలు లేదు. ఈ సమస్యను అధిగమించేందుకే కేంద్రం రాజ్యాంగ సవరణ చేపట్టనుంది. ఈ బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే మొత్తం రిజర్వేషన్ల శాతం దాదాపు 60కి చేరుతుంది. రాజ్యాంగంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్ల గురించి ప్రస్తావనేదీ లేదు కాబట్టి అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి. అధికరణం 15, 16లను సవరించడం ద్వారా రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. కేంద్ర మంత్రి ఒకరు మాట్లాడుతూ 'బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించాక రాజ్యాంగాన్ని సవరించి, అగ్ర కులాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తాం. ప్రాథమిక హక్కులను అనుసరించి అగ్ర కులాల్లోని వారికి ఈ రిజర్వేషన్లు ఇస్తాం. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు నిబంధన.. రాజ్యాంగాన్ని సవరించకుండా పార్లమెంటును నిలువరించలేదు' అని చెప్పారు. పలువురు బీజేపీ నేతలు ఈ రిజర్వేషన్ల ప్రతిపాదనను స్వాగతించారు. ఈ నిర్ణయం చరిత్రాత్మకమైనదనీ, అందరి తోడుగా అందరి వికాసమనే ప్రభుత్వ విధానంలో ఇది భాగమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ మిత్రపక్షం ఎల్జేపీ అధ్యక్షుడు, దళిత నేత రాం విలాస్ పాశ్వాన్ కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానించారు. కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ అధ్యక్షుడు రాందాస్ అఠవాలే కూడా ప్రభుత్వాన్ని మెచ్చుకున్నారు. నిమ్న, అగ్ర కులాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే: కాంగ్రెస్

ప్రజలను మోసగించేందుకే బీజేపీ ఈ రిజర్వేషన్ల ప్రతిపాదనను తీసుకొచ్చిందనీ, ఆ పార్టీకున్న ఓటమి భయానికి ఇది నిదర్శనమని కాంగ్రెస్ విమర్శించింది. అయితే తాము ఈ బిల్లుకు మద్దతు ఇస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ 'పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు అవసరమైనంత ఆధిక్యం బీజేపీకి లేదన్న విషయం ఆ పార్టీకి బాగా తెలుసు. అయినా దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకే, ఎన్నికలకు సరిగ్గా నాలుగు నెలల ముందు ఈ బిల్లు తీసుకొస్తున్నారు. మరి గత నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలలు ఏం చేశారు?' అని నిలదీశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మంది సభ్యులు మద్దతు తెలపడం తప్పనిసరి. విపక్షాల మద్దతు లేకుండా బీజేపీ ఈ బిల్లును ఆమోదింపజేసుకోవటం అసాధ్యం. అయితే అగ్ర కులాల ఓట్ల కోసం ఈ బిల్లుకు అడ్డుచెప్పే ప్రయత్నాన్ని ఏ పార్టీ చేయబోదని బీజేపీ విశ్వసిస్తున్నట్లు సమాచారం. రిజర్వేషన్ల బిల్లుతో సాధారణ ఎన్నికల్లో అగ్ర కులాల ఓట్లు తమకు గణనీయంగా పడతాయని బీజేపీ భావిస్తోంది.

1991లోనే పీవీ ప్రయత్నం



అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించడం ఇదే తొలిసారి కాదు. 1991లోనూ నాటి ప్రధానమంత్రి, తెలుగు వ్యక్తి పీవీ నరసింహారావు ఈ ప్రయత్నం చేశారు. మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంతో అగ్ర కులాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వారిని శాంతింపజేసేందుకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 1991 సెప్టెంబర్ 25న ఆఫీస్ ఆఫ్ మెమొరాండంను ఇచ్చారు. అయితే దీన్ని అమలు చేయడం కుదరదంటూ సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్థికంగా వెనుకబడిన అగ్ర కులాల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో తక్కువగా ఉన్నారని నిరూపించేలా ఏదైనా వ్యవస్థ ఉంటే వారికి రిజర్వేషన్లు ఇవ్వొచ్చని అప్పట్లో కోర్టు చెప్పింది. అయితే ఈసారి మాత్రం సుప్రీం కోర్టు తీర్పుతో సమస్య రాకుండా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకుని బీజేపీ ప్రభుత్వం కొత్త బిల్లును రూపొందించింది. దీంతో పార్లమెంటు ఆమోదం లభిస్తే, ఉన్నత కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రయోజనం చేకూరనుంది.

వైఎస్ జగన్‌పై 'ఆధ్యాత్మిక దాడి'కి కుట్ర!

- తిరుమల కొండపై చంద్రబాబు కుటిలపన్నాగాలు పన్నుతున్నారు
- దైవదర్శన సమయంలో 'జై జగన్' అంటూ నినాదాలు చేయించే కుట్ర
- తద్వారా దేవుడంటే జగన్‌కు చిన్నచూపని ప్రచారం చెయ్యాలన్న వ్యూహం
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి
- బాబు దుష్ట రాజకీయాలను తిప్పికొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి



ఇచ్ఛాపురంలో మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రాజకీయ దాడులు చేసినా, వ్యక్తిత్వాన్ని హననం చేసేలా దుష్ప్రచారం చేసినా, చివరకు భౌతికంగా అంతం చేసేందుకు హత్యాయత్నం జరిగినా చలించని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఇప్పుడు తిరుమల కేంద్రంగా ఆధ్యాత్మిక దాడి చేసేందుకు కుట్ర జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2017 నవంబర్ 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమైన ప్రజా సంకల్ప యాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుందని చెప్పారు. యాత్ర అనంతరం జగన్ తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తారని వివరించారు. ఇదే అదనుగా వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేయించేందుకు చంద్రబాబు పన్నిన కుతంత్రాలు తమకు తెలిశాయన్నారు. ఈ దైవదర్శనం సమయంలో 'జై జగన్' అంటూ నినాదాలు చేసేందుకు టీడీపీ కార్యకర్తలను రంగంలోకి దింపారని ఆరోపించారు. దైవసన్నిధిలో దైవనామ స్మరణ గాకుండా జగన్‌కు అనుకూలంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలే అలా నినాదాలు చేశారంటూ ప్రచారం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. తద్వారా దేవుడంటే జగన్‌కు చిన్నచూపంటూ దుష్ప్రచారం చేసి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు టీడీపీ తెగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన పాదయాత్ర ద్వారా ప్రజలకు అత్యంత చేరువైన జగన్‌ను ఏ విధంగానూ నిలువరించలేకపోయిన చంద్రబాబు.. ఇప్పుడు దేవుడిని అడ్డంగా పెట్టుకొని హిందువులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలు పడుతున్న కష్టనష్టాలు తెలుసుకొని, వారికి భరోసా ఇచ్చేందుకు జగన్ తలపెట్టిన చరిత్రాత్మక పాదయాత్ర ప్రాధాన్యం తగ్గించాలని టీడీపీ నాయకులు అనేక ప్రయత్నాలు చేశారని చెప్పారు. చంద్రబాబు మొదలుకొని మంత్రులు, టీడీపీ నాయకుల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టారీతిన తీవ్ర వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అయినా ప్రజా మద్దతుతో ప్రజా సంకల్ప యాత్ర విజయవంతంగా సాగిందన్నారు.

ఈ కక్షతోనే జగన్‌ను భౌతికంగా అంతం చేసేందుకు విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నం చేశారని చెప్పారు. ఇవి ఫలించకపోవడంతో టీడీపీ నాయకులు సంఘ విద్రోహ శక్తులతో ఆధ్యాత్మిక దాడి చేసేందుకు తెగించారనే విషయం తెలిసిందన్నారు. ప్రజలే వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, అమెరికా విభాగ సమన్వయకర్త రత్నాకర్, నాయకులు కాయల వెంకటరెడ్డి, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యాకేజీ ఇస్తే అభినందించి ఇప్పుడు డ్రామాలా?

- టీడీపీ ఎంపీలకు చివాట్లు పెట్టిన కేంద్ర మంత్రి పియూష్ గోయల్
- కేంద్రం సాయం విషయంలో టీడీపీ తప్పుడు ప్రచారం



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ ఎంపీలపై కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే కేంద్రాన్ని అభినందించి ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి ప్యాకేజీని స్వాగతించిన చంద్రబాబు.. ప్రధాని నరేంద్ర మోదీని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని అభినందించారని గోయల్ గుర్తు చేశారు. సోమవారం పార్లమెంటు ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ ఎంపీలకు కేంద్ర మంత్రి చివాట్లు పెట్టారు. ప్యాకేజీ ఇస్తే అభినందించి ఇప్పుడు నిరసన పేరుతో డ్రామాలు ఆడుతున్నారా అంటూ ప్రశ్నించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో భారీ అవినీతికి పాల్పడిన టీడీపీ నేతలు వాటిని కప్పిపుచ్చుకొనేందుకే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారంటూ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఏపీ ప్రజలను టీడీపీ నేతలు (దగ్గరలో ప్లకార్డులు పట్టుకొని నిలబడిన టీడీపీ ఎంపీలను చూపుతూ) మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏపీకి ప్రత్యేక హోదాతో సమానమైన ప్యాకేజీ, ఆర్థిక లోటు భర్తీకి అదనంగా నిధులు ఇచ్చామన్నారు. అయితే కేంద్ర సాయం విషయంలో మాత్రం టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు ఏ విధంగా అయితే టీడీపీ, కాంగ్రెస్ కూటమిని తిరస్కరించారో అదే విధంగా ఆంధ్ర ప్రజలు కూడా టీడీపీకి తగిన బుద్ధి చెబుతారని పియూష్ గోయల్ హెచ్చరించారు. ఏపీకి అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీతోనే చంద్రబాబు జట్టుకట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.


పాపం పండే రోజు దగ్గర్లోనే ఉంది: జీవీఎల్

టీడీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాల పాపం పండే రోజు దగ్గర్లోనే ఉందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. పార్లమెంటులో టీడీపీ ఎంపీలు వేసే వేషాలు కొన్ని రోజులు మాత్రమే అని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎంపీలు అందరూ ఓడిపోతారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అడ్రస్ గల్లంతు కాబోతోందన్నారు. అగ్రకులాల పేదవారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని, 70 ఏళ్ల నుంచి వీరిపట్ల కాంగ్రెస్ చూపిన వివక్షను మోదీ అంతం చేశారని జీవీఎల్ ట్వీట్ చేశారు.

339వ రోజు

07–01–2019, సోమవారం

జగతి, శ్రీకాకుళం జిల్లా



ఉద్దానం ప్రాంతానికి మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి బాబూ?

ఈరోజు మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, బొరివంక, జగతి గ్రామాల మీదుగా పాదయాత్ర సాగింది.

ఉదయం వికలాంగుల హక్కుల సంఘం ప్రతినిధులు కలిశారు. బాబుగారి పాలనలో ఉద్యోగాలే భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు కుటుంబానికి భారం కారాదని, ఆ విధివంచితులు సమాజంలో గౌరవంగా బతకాలని.. నాన్నగారు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారు. ఉద్యోగావకాశాలు కూడా కల్పించారు. ఇప్పుడా అవకాశాలు మృగ్యమయ్యాయన్నది వారి వ్యథ.

ఉదయం భీమవరం నుంచి వచ్చిన నిర్మల కుమారి, విమలకుమారి అనే అక్కచెల్లెళ్లు ఇదే విషయం చెప్పారు. వారి చెల్లెలు శాంతకుమారి పుట్టుకతోనే మూగ, చెవుడు. నాన్నగారి హయాంలో ఆ దివ్యాంగురాలికి వచ్చిన ఉద్యోగమే ఆమె జీవితాన్ని నిలబెట్టిందట. మా కుటుంబమంతా రుణపడి ఉన్నామని ఆ అక్కచెల్లెళ్లు చెబుతుంటే చాలా సంతోషమనిపించింది. నా పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా.. రోజూ 'సాక్షి'లో వచ్చిన పాదయాత్ర డైరీ పేజీలను సేకరించి, పుస్తకంలో పొందుపరిచి బహూకరించారు. పదమూడు జిల్లాల్లో జరిగిన పాదయాత్రపై కవితను కూర్చి వినిపించారు. నన్ను కలిసిన ఆనందంతో ఉద్వేగానికి గురై కంట తడిపెట్టడం కదిలించింది.

ఈరోజు పాదయాత్ర జరిగిన ప్రాంతమంతా కొబ్బరిచెట్లే. అతి పొడవుగా పెరిగే దేశీయ చెట్ల కొబ్బరి ఈ ప్రాంతానికే ప్రత్యేకం. ఉత్తరాది రాష్ట్రాలకు బాగా ఎగుమతి అవుతుంది. నూనె శాతం, పోషక విలువలు అధికంగా ఉండి నాణ్యమైన కొబ్బరినందించే ఈ చెట్లను ఇప్పుడు తిత్లీ తుపాను దారుణంగా దెబ్బతీసింది. ఎటు చూసినా పూర్తిగా దెబ్బతిన్న కొబ్బరి తోటలు, వాలిపోయిన చెట్లే కనిపించాయి. ఉద్దానం కొబ్బరి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు కోనసీమను మరిపించిన ఈ కొబ్బరి తోటల్లో నేడు శ్మశాన ఛాయలు కనిపిస్తున్నాయి.

ముప్పై, నలభై ఏళ్ల చెట్లు అలా నేలవాలిపోవడంతో, వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్లో చీకట్లు పరుచుకున్నాయి. ఇక్కడ కొబ్బరి చెట్టంటే ఇంటికి పెద్ద కొడుకుతో సమానం. మళ్లీ చెట్లను నాటినా ఫలసాయం రావడానికి పదేళ్లు పడుతుందని వాపోయారు. వలసలు మినహా మరో గతి లేదంటూ రైతన్నలు కన్నీటిపర్యంతమయ్యారు.

ఇక్కడి కళింగపట్నం, ఇద్దెవానిపాలెం తదితర గ్రామాల్లో కేవలం పిల్లలు, వృద్ధులు, మహిళలు తప్ప మగవాళ్లందరూ వలసెళ్లి పోయారని తెలిసి చాలా బాధేసింది. కుసుంపురం వద్ద రోడ్డు పక్కనే పెద్ద అమ్మవారి గుడి ఉంది. దాన్ని కేవలం వలస కార్మికులే నిర్మించారట. అది ఈ ప్రాంత వలసల తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక్కడి ప్రజలకు చేయూతనిచ్చి, వలసలను నివారించి ఉద్దానానికి పునర్వైభవం తేవాలన్న నా సంకల్పం మరింత బలపడింది.

సర్వశిక్షా అభియాన్‌లో పనిచేసే కంచిలి, కవిటి మండలాల ఉద్యోగులు కలిశారు. ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటూ వేతనాల్లో మాత్రం కోత విధిస్తోందని చెప్పారు. పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన బాబుగారు ఓట్లేయించుకుని మోసం చేశారని వాపోయారు.

ఈరోజు ఉదయం నడిచిన గ్రామాలన్నింటిలో బెంతో ఒరియా కులస్తులు అత్యధికంగా ఉన్నారు. గతంలో ఎస్టీలుగా గుర్తించిన తమకు ఇప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని మొరపెట్టుకున్నారు. తల్లిదండ్రులకేమో ఎస్టీ సర్టిఫికెట్లున్నాయి. పిల్లలకు మాత్రం ఇవ్వడం లేదట. 'సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ లేక, కనీసం నేటివిటీ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకపోతే మా పిల్లల భవిష్యత్తు ఏం కావాలి?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ఈ ఉద్దానం ప్రాంతానికి కొబ్బరి పరిశోధన కేంద్రం, కోకోనట్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తానంటూ మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి? కొబ్బరి తోటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నా.. పరిహారం మాత్రం ఇవ్వడం లేదని, చెల్లని చెక్కులిచ్చి మోసం చేస్తున్నారని మొరపెట్టుకుంటున్న రైతన్నలకు ఏం సమాధానం చెబుతారు? మూడేళ్లకే ఫలసాయాన్ని అందించే కొబ్బరి మొక్కలను సరఫరా చేస్తానన్నారు. ఆ కార్యక్రమం ఏమైంది?

వై.యస్. జగన్.



‘కానిస్టేబుళ్ల సర్వీసు సమస్యల్ని పరిష్కరిస్తాం’

సాక్షి, అమరావతి: ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సర్వీసుకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల్ని త్వరలో పరిష్కరిస్తామని ఆ శాఖ కమిషనర్ లక్ష్మీనరసింహం చెప్పారు. విజయవాడలోని అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ కానిస్టేబుళ్ల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మార్పు కోటయ్య, ఇతర నేతలు కమిషనర్‌ను సోమవారం కలిశారు. కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పించాలని వారు కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేఎల్ భాస్కర్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర నాయుడు, అసోసియేషన్ నేతలు రమణయ్య, శ్రీనివాసరావు తదితరులున్నారు







తిరుమల శ్రీవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ సాదరంగా స్వాగతం పలికారు.



నలుగురు అంగన్వాడీ కార్యకర్తలకు జాతీయ అవార్డు

ఢిల్లీలో అందజేసిన కేంద్ర మంత్రి మేనకా గాంధీ



అవార్డులు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మాతా, శిశు సంక్షేమంలో లక్ష్యాలను చేరుకోవడంలో మెరుగైన పనితీరు కనబరిచిన నలుగురు అంగన్వాడీ కార్యకర్తలకు జాతీయ పురస్కారాలు లభించాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. వీరిలో కృష్ణా జిల్లా యాకమూరుకు చెందిన ఎం.సువర్ణలత, గోసవీడుకు చెందిన జి.వెంకట్రావమ్మ, అనంతపురం జిల్లా తలుకూరుకు చెందిన జె.రమాదేవి, అమరాపురానికి చెందిన ఎంసి. పద్మావతి ఉన్నారు. అలాగే తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన బి. సుశీల, వికారాబాద్‌కు చెందిన జె.విజయలక్ష్మి కూడా ఈ అవార్డును అందుకున్నారు.

‘విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి’

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బ్యాంకులు, ప్రభుత్వ సాచివేత ధోరణి వల్ల విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ (ఏపీబీఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ రత్నం ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. ధర్నాలో పాల్గొన్న జేవీ రత్నం మాట్లాడుతూ.. విశ్రాంత బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం, రిజర్వు బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులతో సమానంగా తమకు కుటుంబ పింఛన్ పెంచాలని, 2002కు ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు 100 శాతం కరువు భత్యం ఇవ్వాలని కోరారు. 2010 ఏప్రిల్ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పెన్షన్ ప్రయోజనాల ప్రణాళిక అమలు చేయాలన్నారు. ధర్నాలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఎల్లారావు, వైస్ ప్రెసిడెంట్ కేఎస్.రామ చంద్రరావు, వీవీఎస్.ప్రసాద్‌బాబు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.





ప్రజా సంకల్ప యాత్ర

339వ రోజు

ఇప్పటి వరకు నడిచిన దూరం

3,628.2 కిలో మీటర్లు

339వ రోజు నడిచిన దూరం

10.2 కిలో మీటర్లు

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు తలతంపర

ముగింపు: జగతి

ముఖ్యాంశాలు

» శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం కంచిలి మండలం తలతంపర, కవిటి మండలం మాణిక్యపురం, చిన్నబల్లిపుట్టుగ, కుసుమపురం, వరక, లోళ్లపుట్టుగ, బొరివంక, బెజ్జిపుట్టుగ గ్రామాల ప్రజలతో మమేకం.

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు జగతి

ముఖ్యాంశాలు

» జగతి, కవిటి మండల కేంద్రం, తుత్తుడిపుట్టుగ క్రాస్, బొర్రపుట్టుగ క్రాస్, రాజపురం, అగ్రహారం గ్రామాల ప్రజలతో మమేకం.



జగతి రోడ్డులో సీపీఎస్‌ను రద్దు చేయాలన్న ప్లకార్డులు చేతబట్టి..

ప్రజాసంకల్ప యాత్ర మరిన్ని చిత్రాల కోసం QR code స్కాన్ చేయండి

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

వెల్లువెత్తిన వినతులు

- పాదయాత్ర ముగింపు దశలో ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ
- తిత్లీ పరిహారం పంపిణీలో రాజకీయ వివక్ష చూపుతున్నారంటూ ఆవేదన
- జన్మభూమి కమిటీ దాష్టీకాలపై బాధితుల ఆగ్రహం
- అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వేడుకోలు
- మన ప్రభుత్వం రాగానే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని వైఎస్ జగన్ భరోసా

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి



బల్లిపుట్టుగలో భావోద్వేగానికి గురైన అవ్వను ఓదార్చుతున్న వైఎస్ జగన్

మాణిక్యపురంలో వైఎస్ జగన్ వెంట నడుస్తున్న జనవాహిని

అన్నా.. మాకు సాగు, తాగు నీరు లేదు.. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందడం లేదు.. చదువుకోవాలన్న కాంక్ష ఉన్నా స్థోమత లేదన్నా.. అర్హతలున్నా పింఛన్ ఇవ్వడం లేదు.. భూమి ఇచ్చారుగానీ పట్టాలివ్వలేదు.. ఉద్యోగాలు రావడం లేదన్నా.. అంటూ పలు వర్గాల ప్రజలు ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. డయాలసిస్ వసతి పెంచాలని కిడ్నీ వ్యాధిగ్రస్తులు విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్ పాదయాత్ర 339వ రోజు సోమవారం కంచిలి, కవిటి మండలాల్లోని తలతంపర క్రాస్ మాణిక్యపురం, చినబల్లిపుట్టుగ, బల్లిపుట్టుగ, కుసుమపురం, వరక, బొరివంక, బెజ్జిపుట్టిగ మీదుగా జగతి వరకూ సాగింది. ప్రజా సంకల్ప యాత్ర మరో రెండు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో వినతులు వెల్లువెత్తాయి. జన్మభూమి కమిటీల దాష్టీకాలు, అధికార పార్టీ ఎమ్మెల్యేల వేధింపులపై ఫిర్యాదులొచ్చాయి. వందలాది మంది అగ్రిగోల్డ్ బాధితులు వైఎస్ జగన్‌ను కలిసి తమను ఆదుకోవాలని కోరారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉద్దానం కిడ్నీ వ్యాధి బాధలకు తోడు.. తిత్లీ తుపాను వచ్చి తమ ప్రాంతాన్ని అతలాకుతలం చేసిందని.. పరిహారం చెల్లింపులో మోసాలు, రాజకీయ వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని పలువురు ప్రతిపక్ష నేత ఎదుట వాపోయారు. అందరి సమస్యలు ఓపికగా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే అందరికీ మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు.

వెల్లువెత్తిన ఉద్దానం

కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్దానం ప్రాంతంలోనూ వైఎస్ జగన్‌కు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజల నుంచి ఆదరాభిమానాలు వెల్లువెత్తాయి. ఆయనను కలిసి సంఘీభావం తెలపడానికి గ్రామాల్లో జనం పోటీపడ్డారు. ఒక చోటకు మించి మరో చోట మహిళలు ఆయనకు నీరాజనాలు పట్టారు. అభిమానాన్ని చాటారు.

జగన్‌ను కలిసిన తెలంగాణ నేతలు

వైఎస్సార్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర పార్టీ నేతలు పలువురు ప్రజా సంకల్ప యాత్రలో ఉన్న వైఎస్ జగన్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రఫుల్లరెడ్డి, బి.అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు బొడ్డు సాయినాథ్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు బండారు వెంకటరమణ, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు నాగదేశి రవికుమార్ తదితరులు.. జగన్‌తో పాటు కొద్ది దూరం పాదయాత్రలో నడిచారు.



ప్రతిపక్ష నేతకు సమస్యలు చెప్పుకుంటున్న బెంతో ఒరియా సంఘం నేతలు

బెంతో ఒరియాల సమస్యకు శాశ్వత పరిష్కారం

దీనిపై వైఎస్ జగన్ స్పందిస్తూ .. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే బెంతో ఒరియాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ సైతం తమ సమస్యపై అప్పట్లో కమిటీ వేసి పరిష్కారం చూపే ప్రయత్నం చేశారని, ఆయన మరణానంతరం తమను పట్టించుకున్న వారు లేరని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక స్టేటస్‌కోను సైతం రద్దు చేసిందన్నారు. జగన్‌ను సీఎంను చేసేందుకు కష్టించి పనిచేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి శివరామరాజు

శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రముఖ క్షత్రియ నాయకుడు, విద్యావేత్త సూరపురాజు శివరామరాజు సోమవారం ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు వైఎస్ జగన్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన ఈ తెలుగుదేశం ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందన్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తున్న వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషిచేస్తామని శివరామరాజు చెప్పారు.



చిన్నారితో ఆత్మీయంగా..



శివరామరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్

కులధ్రువీకరణ పత్రాలు ఇప్పించరూ..

పోలాకి: ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు కొండప్రాంత గిరిజనులుగా గుర్తింపబడి.. ఆ తర్వాత క్రమేణా మైదానప్రాంత గిరిజనులుగా ఉన్న బెంతో ఒరియాలకు ప్రస్తుతం కులధ్రువీకరణ పత్రాలివ్వడం లేదని ఆ సంఘం నాయకులు వైఎస్ జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం మాణిక్యపురం గ్రామం వద్ద బెంతో ఒరియా ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు సరోజ్‌కుమార్ జెన్నా ఆధ్వర్యంలో సంఘం నాయకులు వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో దాదాపు 30 వేల మంది బెంతో ఒరియాలున్నట్లు తెలిపారు. ఇక్కడ రాజకీయాల్లో పోటీచేసేందుకు ఎస్టీలుగా కులధ్రువీకరణ పత్రాలిస్తున్నారని.. అయితే తమ పిల్లల చదువులకు, ఉద్యోగాలకు అవసరమైనపుడు మాత్రం ఎస్టీలుగా కులధ్రువీకరణ పత్రాలివ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

పింఛన్ రాకుండా జన్మభూమి కమిటీలు అడ్డుకుంటున్నాయన్నా..



అన్నా.. నేను లారీ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడిని. 2010లో రోడ్డు ప్రమాదంలో కాలు పోయింది. సదరంలో 60 శాతం దివ్యాంగ ధ్రువీకరణ పత్రం అందజేశారు. 2014 నుంచి పింఛన్ కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నా. అయినా పింఛన్ ఇవ్వకుండా జన్మభూమి కమిటీలు అడ్డుకుంటున్నాయి.

– పెద్దిరెడ్డి వేంకటేశ్వర్లు, విజయవాడ, కృష్ణాజిల్లా

అన్నా.. మీరు రాస్తున్న డైరీ ఆకట్టుకుంటోంది



అన్నా.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ 2017 నవంబర్ 6 నుంచి నేటి వరకు సాగిన ప్రజా సంకల్ప యాత్ర ఓ చరిత్ర. అందులో భాగంగా మీరు తెలుసుకుంటున్న ప్రజా సమస్యలపై స్పందిస్తూనే ప్రభుత్వ తీరును ఎండగడుతూ రాస్తున్న డైరీ రాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంది. అందుకే పాదయాత్ర తొలిరోజు నుంచి మీరు రాస్తున్న డైరీని సేకరిస్తూ ఓ పుస్తకంలా తయారు చేశాం. అది మీకు ఇచ్చేందుకు వచ్చాం.

– గూట్ల విమల, నిర్మల, భీమవరం.. పశ్చిమగోదావరి జిల్లా

మెడికల్ ఎమర్జెన్సీని ప్రకటించండి..



సార్.. కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉన్న ఉద్దానం ప్రాంతంలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి. ప్రత్యేకంగా నెఫ్రాలజీ యూనిట్, వైద్యులు, డయాలసిస్ కేంద్రం, రక్తనిల్వల కేంద్రం, ఐసీయూ సెటప్‌తో కూడిన ప్రత్యేక వైద్యశాలను కవిటిలో ఏర్పాటుచేయాలి. మీరు అధికారంలోకి వచ్చాక చర్యలు చేపట్టండి..

– డాక్టర్ పూడి రామారావు, వైద్య సలహాదారు, ఉద్దానం ఫౌండేషన్, బల్లిపుట్టుగ

ఇవ్వంగాక ఇవ్వం

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ వివరాలు ఇచ్చేది లేదు

ఎన్‌ఐఏకి తెగేసి చెప్పిన విశాఖ పోలీసులు - కోర్టుకూ అదే సమాధానం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కుట్ర కేసు దర్యాప్తు మొదలు పెట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు విశాఖ పోలీసుల నుంచి సహాయ నిరాకరణ కొనసాగుతోంది. విశాఖ విమానాశ్రయంలో గత ఏడాది అక్టోబర్ 25న వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రహోం శాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు జనవరి 1న ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి రంగంలోకి దిగిన ఎన్‌ఐఏ ప్రధాన దర్యాప్తు అధికారి (సీఐఓ) మహ్మద్ సాజిద్‌ఖాన్ సహా ఐదుగురు అధికారులకు విశాఖ పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద కేసులను సైతం ధైర్యంగా, చాకచాక్యంగా ఎదుర్కొన్న ఎన్‌ఐఏ అధికారులకు ఇలా ఓ రాష్ట్ర పోలీసు యంత్రాంగం నుంచి సహాయనిరాకరణ ఎదురుకావడం ఇదే తొలిసారిగా చెబుతున్నారు. కేసు విచారణ ఫైళ్లు అప్పగించడం సంగతి పక్కన పెడితే కనీసం కేసు వివరాలను కూడా చెప్పేందుకు విశాఖ పోలీసు అధికారులు నిరాకరించడాన్ని ఎన్‌ఐఏ అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఎన్‌ఐఏ అధికారులు విశాఖ చేరుకున్న రోజు నుంచే నగర పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్హా సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఎన్‌ఐఏ బృందం జగన్‌పై హత్యాయత్నం ఘటనపై విచారణకు రెండు నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులను, కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ పోలీసులను సంప్రదించింది. తొలి రెండురోజులు సమాచారం ఇవ్వలేమని, ఆ మేరకు ప్రభుత్వ ఆదేశాలున్నాయని ఎన్‌ఐఏ వర్గాలతో చెప్పిన సిట్ అధికారులు సోమవారం కనీసం వారిని కలిసేందుకు కూడా ఇష్టపడలేదని తెలుస్తోంది. కేసును ఎన్‌ఐఏకు అప్పగించడంపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్రప్రభుత్వానికి లేఖ రాయాలని, అవసరమైతే కోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాలతో విశాఖ పోలీసులు, సిట్ అధికారులు ఎన్‌ఐఏ వర్గాలను ఏమాత్రం లెక్క చేయడం లేదు. కాగా ఎన్‌ఐఏ అధికారులకు విశాఖ పోలీసుల్లో ఎవరైనా సహకరిస్తున్నారా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నిఘా వేశారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ సీనియర్ మంత్రి, టీడీపీలో కీలక నాయకుడు ఆదివారం పొద్దుపోయాక ఈ కేసు గురించి వాస్తవాలు తెలిసిన ఓ పోలీసు అధికారికి ఫోన్ చేసి బెదిరింపు ధోరణిలో మాట్లాడినట్టు తెలుస్తోంది. ఎన్‌ఐఏ అధికారులకు ఏ మాత్రం సహకరించినా బాగుండదు.. అని హుకుం జారీ చేసినట్లు పోలీసువర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ఇక సోమవారం విశాఖ వచ్చిన హోం మంత్రి, ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కూడా కేసును ఎన్‌ఐఏకి అప్పగించడాన్ని తీవ్రంగా తప్పుపడుతూ వ్యాఖ్యలు చేశారు.

కుట్ర లేకుంటే అంత ఆందోళన ఎందుకో

వైఎస్ జగన్‌పై హత్యాయత్న ఘటన వెనుక భారీ కుట్ర, విచారణలో పెద్దల ప్రభావం లేకుంటే ఎన్‌ఐఏ రంగంలోకి దిగగానే రాష్ట్ర ప్రభుత్వానికి, టీడీపీ పెద్దలకు ఇంత ఉలికిపాటు ఎందుకన్న వాదనలు ప్రతిపక్షాలు, ప్రజల నుంచే కాదు స్వయంగా ఎన్‌ఐఏ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. ఈ మేరకే ఎన్‌ఐఏ వర్గాలు యోచిస్తూ కేసు దర్యాప్తు ఎటు నుంచి మొదలుపెట్టాలనే యోచిస్తున్నాయి.

పోలీసులు సహకరించడం లేదు.. ఎన్‌ఐఏ వర్గాలు


వాస్తవానికి విచారణ దశలో ఉన్నప్పుడు కేసు వివరాల గురించి మేం ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. విశాఖలోనే మకాం వేసిన మాకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల నుంచి సహకారం అందని మాట నిజమే. ఎన్‌ఐఏకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ వాళ్లేదో ఛాలెంజ్ చేయాలని చూస్తున్నారు.. ఈ విషయాలను మేం కేంద్ర హోంమంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లి కేసు దర్యాప్తును ముందుకు ఎలా తీసుకువెళ్లాలో చూస్తాం.. అని ఎన్‌ఐఏకి చెందిన ఓ అధికారి సోమవారం సాక్షి ప్రతినిధి వద్ద వ్యాఖ్యానించారు.

కోర్టుకూ అదే సమాధానం.. న్యాయమూర్తి ఆగ్రహం

విశాఖ లీగల్: రాష్ట్ర ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జె.శ్రీనివాసరావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో నిందితుడి తరపు న్యాయవాది సలీమ్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన సీడీ ఫైల్ ఇవ్వాలని ఏపీపీ పోలీసులను కోరగా.. పైఅధికారుల అనుమతిలేనిదే ఇవ్వలేమని స్పష్టం చేశారు. దీనితో ఏపీపీ అదే విషయాన్ని న్యాయమూర్తికి తెలిపారు. దీనితో న్యాయమూర్తి పార్థసారధి పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోలేదని పేర్కొంటూ బెయిల్ పిటిషన్ విచారణకు సంబంధించిన నోటీసును ఎన్‌ఐఏకు జారీ చేశారు. ఎన్‌ఐఏకు నోటీస్ ఇచ్చి విచారణ కొనసాగించాలని ఆదేశిస్తూ కేసును ఈనెల 19కి వాయిదా వేశారు.

అపూర్వ ఘట్టం ప్రజా సంకల్ప యాత్ర

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి



వైఎస్ జగన్‌కు జ్ఞాపిక అందిస్తున్న నాగిరెడ్డి

కవిటి/శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర దేశ చరిత్రలోనే ఓ అపూర్వ ఘట్టమని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి చెప్పారు. పాదయాత్ర దిగ్విజయంగా పూర్తిచేసినందుకు వైఎస్ జగన్‌కు నాగిరెడ్డి జ్ఞాపికను అందించారు. సహకరించిన వివిధ విభాగాల ప్రతినిధులకు పార్టీ రైతు విభాగం ఆధ్వర్యంలో కవిటి మండలం బొరివంక సమీపంలో జగన్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందించారు. వైఎస్ జగన్ అడుగులో అడుగు లేసి.. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని విజయవంతం చేసిన మీడియా, భద్రతా వర్గాలు, వైద్య విభాగం.. తదితర వర్గాలకు పార్టీ రైతు విభాగం.. జ్ఞాపికలతో సత్కరించి గౌరవించాలన్న సంకల్పం మంచి కార్యక్రమమని వైఎస్ జగన్ ప్రశంసించారు. కార్యక్రమంలో రైతు విభాగం ప్రతినిధులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వంగాల భరత్ కుమార్‌రెడ్డి, రామాంజనేయులు, అనంతపురం, కడప, విజయవాడ, చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ రైతు విభాగాల అధ్యక్షులు బి.రాజారాం, ఎస్.ప్రసాదరెడ్డి, ఆదికేశవరెడ్డి, కొండ్రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు టి.రామకృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో వైఎస్ జగన్ వెంట అడుగులేసిన వారికి దుస్తులు పంపిణీ

ప్రజా సంకల్ప యాత్రలో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ వైఎస్ జగన్‌తో కలిసి నడిచిన 50 మందికి సోమవారం కవిటి మండలం జగతి గ్రామంలో దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి ఉన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి. పక్కన భూమన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్. చిత్రంలో మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు

'సేవారత్న' పుస్తకావిష్కరణ

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిపై 'సేవా రత్న' (ప్రేరణ, ప్రాణం, వైఎస్ అనేది ట్యాగ్ లైన్)అనే పుస్తకాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిన వైఎస్సార్ జిల్లా పార్టీ నాయకులు ఆయనతో ఈ పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి, వైఎస్ కుటుంబానికి 35 ఏళ్ల నుంచి సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉందని.. ఆ విషయాలన్నీ ఈ పుస్తకంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్‌బాబు, రాజంపేట మాజీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి, రైల్వేకోడూరు, కడప ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, ఎస్‌బీ అంజద్‌బాషా పాల్గొన్నారు.

వ్యాపార దృక్పథంతో వ్యవసాయం

- రైతు ఆదాయం రెట్టింపునకు కేంద్రం కీలక సిఫార్సులు
- అందుకోసం మార్కెటింగ్‌లో మౌలిక సదుపాయాల కల్పన
- ఉత్పాదకత పెరగాలి.. వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి
- వ్యవసాయ రుణాలు పెరగాలి.. కేంద్ర సమగ్ర నివేదిక

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగాన్ని వ్యాపార దృక్పథంతో చూడాలని, అప్పుడే రైతుకు మెరుగైన ఆదాయం సమకూరుతుందని కేంద్రం కీలక సిఫార్సు చేసింది. రైతు ఆదాయం రెట్టింపుపై ప్రత్యేక దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను విడుదల చేసింది. ఆ నివేదికపై వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతోంది. రైతు ఆదాయం రెట్టింపు కావాలంటే కేవలం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలతోనే సరిపోదని, వ్యవసాయాన్ని వ్యాపారం వైపు బదలాయించాల్సిన అవసరముందని విశ్లేషించింది. వినియోగదారుడి అవసరాలే కేంద్రంగా వ్యవసాయం చేస్తే పెద్ద ఎత్తున లాభాలు గడించవచ్చని పేర్కొంది. అలాగే వ్యవసాయ రంగాన్ని ఆధునికత వైపు పరుగులు పెట్టించాలని పేర్కొంది. దేశంలో 85 శాతం మంది రైతులు సన్న, చిన్నకారు రైతులేనని, వారి చేతుల్లో అత్యంత తక్కువ విస్తీర్ణం కలిగిన కమతాలు ఉన్నాయని పేర్కొంది. అటువంటి వారికి సాగు ఖర్చు తగ్గించేలా వ్యవసాయ యాంత్రీకరణ కల్పించాలని వివరించింది. దేశంలో వ్యవసాయం రైతుకు లాభసాటిగా లేదు. 2011–12 నాటి లెక్కల ప్రకారం సాగుచేసే రైతు ఆదాయం ఏడాదికి రూ. 78,264 ఉంటే, వ్యవసాయ కూలీ ఆదాయం రూ. 32,311 ఉండగా, వ్యవసాయేతర కార్మికుడి ఆదాయం రూ. 2.46 లక్షలుగా ఉంది. మొదటి నుంచీ రైతు పరిస్థితి ఇలాగే ఉంది. దీంతో రైతులు అప్పులపాలవుతున్నారు. ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. దేశంలో మూడో వంతు రైతులు వరి లేదా గోధుమలే పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం పలు సిఫార్సులు చేసింది.

ప్రధాన సిఫార్సులు..

- యాంత్రీకరణను అందిబుచ్చుకుంటే ఉత్పాదకతలో ఉన్న భారీ తేడాను అధిగమించవచ్చు. దీనివల్ల ఆహార భద్రతకు భంగం కలగకుండా చూసుకోవచ్చు.
- సూక్ష్మసేద్యంతో ఉత్పాదకతను పెంచుకోవచ్చు. అలాగే సాగునీటి వసతులు కల్పిస్తే ఉత్పాదకత పెరుగుతుంది.



- అధిక ఉత్పత్తినిచ్చే వంగడాలను తయారు చేయడం వల్ల కూడా ఉత్పాదకత పెరుగుతుంది. దీనివల్ల రైతులకు అధిక ఆదాయం సమకూరుతుంది.
- వ్యవసాయ పరిశోధనలపై పెట్టుబడులు పెట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. అందువల్ల పరిశోధన, విస్తరణ రంగాలపై దృష్టి సారించాలి.
- ప్రస్తుత ధరల విధానాన్ని ఆధునీకరించాలి. గత నాలుగున్నర దశాబ్దాలుగా దేశంలో కేవలం వరి, గోధుమల మద్దతు ధరపైనే దృష్టి సారించారు. దీనివల్ల ఇతర ఆహారధాన్యాల సాగు, ఆదాయంలో అనేక తేడాలు కనిపించాయి. వాటి ధరలు తగ్గడంతో రైతులు ఆదాయం కోల్పోయారు.
- మార్కెట్‌లో ధరల తీరుపై రైతుకు ఎప్పటికప్పుడు అందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించాలి.
- సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులో ఉంచితే వారి ఆదాయం కూడా పెరుగుతుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. గ్రామీణ రోడ్లు, విద్యుత్ సరఫరా, రవాణా సదుపాయలు కల్పించాలి. తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే ఇవన్నీ అవసరం. ఫలితంగా వారు అధిక ఆదాయం పొందుతారు.
- మార్కెట్లలోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలి. దీనివల్ల పంటల నాణ్యత పెరుగుతుంది. నష్టం తగ్గుతుంది. ప్రధానంగా నిల్వ, ట్రేడ్ రంగాల్లో అనేక మార్పులు తీసుకురావాలి.
- అత్యంత కీలకమైన రుణ సదుపాయం రైతుకు అందాలి. అప్పుడే పంటల సాగు, విత్తనాలు, ఎరువుల వంటి వాటికి ఇబ్బంది ఉండదు. ఈ విషయంపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది.

పోలవరం వేదికపై ‘గిన్నిస్ రికార్డు’ నాటకం



- నాలుగున్నరేళ్ల నిర్లక్ష్యం, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు యత్నం
- చంద్రబాబు కమీషన్‌ల కక్కుర్తే ప్రాజెక్టుకు శాపం అంటోన్న సీనియర్ ఐఏఎస్‌లు
- ఆ రెండు ఎత్తిపోతలకు పెట్టిన ఖర్చు పోలవరంపై చేసి ఉంటే ఇప్పటికే పూర్తయ్యేది

సాక్షి, అమరావతి: నాలుగున్నరేళ్ల నిర్లక్ష్యం.. రూ.వేల కోట్ల అవినీతి.. అడుగడుగునా నాణ్యత లోపాలు.. ఒక్క రోజులో కాంక్రీట్ మిశ్రమంతో పూతేసే నాటకానికి సీఎం చంద్రబాబు తెరతీశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలవరం వేదికగా గిన్నిస్ రికార్డు పేరుతో నాలుగున్నరేళ్ల అక్రమాలను మరిపించేందుకు సరికొత్త డ్రామాలు మొదలుపెట్టారు. పోలవరం ప్రాజెక్టు పనులను కనీసం ప్రాథమిక స్థాయిని కూడా దాటించలేని తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఎప్పటిలానే సోమవారం గిన్నిస్ రికార్డ్ పేరుతో మరో నాటకాన్ని సీఎం ప్రదర్శించారు. డిసెంబర్ 15 నుంచి ఈనెల 5దాకా పోలవరం స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్, స్పిల్ ఛానల్‌లో ఒకే రోజు 28 వేల నుంచి 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ మిశ్రమాన్ని పోయడానికి వీలుగా సెంట్రింగ్, షట్టరింగ్ వంటి పనులను పూర్తి చేశారు. ఇనుప కడ్డీలతో చేసిన సెంట్రింగ్, షట్టరింగ్‌ను ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ 31,315.5 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ మిశ్రమంతో నింపే పనులు చేపట్టారు. దీనికి ‘గిన్నిస్ బుక్’ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. రికార్డుల కోసం ప్రయత్నం చేయడాన్ని ఎవరైనా స్వాగతిస్తారు. అయితే ఆ రికార్డును సీఎం చంద్రబాబు తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు వినియోగించుకోవడంపై జలవనరుల శాఖ అధికారవర్గాలే తప్పుపడుతున్నాయి. దశాబ్దాల కల.. పోలవరం ప్రాజెక్టును 2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సాకారం చేశారు. 2009 వరకూ రూ.5,135.87 కోట్లతో 40 శాతానికిపైగా పనులను పూర్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులైన ‘కొందరు’ రైతులను భూసేకరణకు సహకరించకుండా కోర్టులను ఆశ్రయించేలా పురిగొల్పిన నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పనులను అడ్డుకోవడానికి కుట్ర చేశారు. నాడు కోర్టులను ఆశ్రయించిన రైతులకు 2014లో అధికారంలోకి వచ్చాక ఎకరానికి రూ.52 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతో ఆ కుట్రలు బట్టబయలయ్యాయి.

కమీషన్‌లే పోలవరానికి శాపం..

విభజన చట్టం మేరకు పోలవరాన్ని తామే నిర్మించి ఇస్తామని 2014లో కేంద్రం వాగ్దానం చేసింది. అయితే చంద్రబాబు కమీషన్‌ల కక్కుర్తితో 2015లో గోదావరి కుడిగట్టుపై రూ.1667 కోట్లతో పట్టిసీమ.. 2016లో ఎడమగట్టుపై రూ.1638 కోట్లతో పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టారు. 2009 నాటికే దాదాపు పూర్తయిన పోలవరం కుడి కాలువలోకి పట్టిసీమ ఎత్తిపోతల గోదావరి జలాలను ఎత్తిపోసి కృష్ణా డెల్టాకు.. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువలోకి నీటిని ఎత్తిపోసి ఏలేరు రిజర్వాయర్‌కు తరలించారు. పోలవరం పూర్తయితే ఈ రెండు ఎత్తిపోతల పథకాలు వృథా. అంటే రూ.3,305 కోట్ల ప్రజాధనం వృథా. పైగా ఏటా విద్యుత్ బిల్లుల రూపంలో కనిష్ఠంగా రూ.1200 కోట్లు అదనపు భారం. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సెప్టెంబరు 8, 2016దాకా పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్(జలాశయం)లో తట్టెడు మట్టి ఎత్తకుండా అడ్డుపడ్డారు. పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న తర్వాత అంటే సెప్టెంబరు 8, 2016 నుంచే హెడ్ వర్క్స్ పనుల్లో కదలిక వచ్చింది. అంచనా వ్యయాన్ని పెంచేసి.. పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి భారీ ఎత్తున కమీషన్‌లు దండుకున్నారు. కమీషన్‌లకు కక్కుర్తి పడకుండా 2014 నుంచే పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు వెచ్చించిన నిధులను కూడా పోలవరంపై ఖర్చు పెట్టి ఉంటే ఈ పాటికి ప్రాజెక్టు పాక్షికంగా పూర్తయ్యేది. గ్రావిటీపై కుడి, ఎడమ కాలువలకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉండేది. వీటిని పరిశీలిస్తే సీఎం చంద్రబాబు కమీషన్‌ల కక్కుర్తి పోలవరానికి శాపమైందన్నది స్పష్టమవుతోంది.

వారానికో వర్చువల్ రివ్యూ.. నెలకో రియాలిటీ షో

పోలవరం నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న తర్వాత ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి సీఎం చంద్రబాబుకు లేదని అధికారవర్గాలే చెబుతున్నాయి. ప్రతి సోమవారం వర్చువల్ రివ్యూ.. నెలకు ఒక సారి క్షేత్ర స్థాయి పర్యటనతో షోయింగ్‌లూ, మూణ్నెళ్లకో డ్రామాలాడుతూ ప్రాజెక్టు పనులు నత్తనడక సాగుతున్నా శరవేగంగా సాగుతున్నట్లు ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికీ హెడ్ వర్క్స్‌లో కీలకమైన 18 డిజైన్‌ల అతీగతీ లేకపోవడాన్ని అధికారవర్గాలే ఎత్తిచూపుతున్నాయి. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే.. పనులు చేయడానికి అత్యంత కీలకమైన డిజైన్‌లను కేంద్ర జలసంఘంతో ఎందుకు ఆమోదింపజేసుకోలేకపోయారని ప్రశ్నిస్తున్నారు. అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి.. పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి.. భారీ ఎత్తున కమీషన్‌లు వసూలు చేసుకోవడానికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేలా కేంద్రంపై సీఎం ఒత్తిడి తెచ్చారే గానీ.. ఆ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఏమాత్రం లేదని జలవనరుల శాఖ అధికారవర్గాలే చెబుతున్నాయి.

మోదీ చోర్!

- దేశం మొత్తం అదే మాట
- పశ్చిమగోదావరి జన్మభూమి సభలో చంద్రబాబు




పోలవరం కాంక్రీట్ పనుల్లో గిన్నిస్ రికార్డు సాధించిన సందర్భంగా రామయ్యపేటలో పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/మెట్రో/సాక్షి, అమరావతి : ప్రధాని నరేంద్ర మోదీని దేశం మొత్తం చోర్ (దొంగ) అని అంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాఫెల్ కుంభకోణంలో రూ.43వేల కోట్లు కొల్లగొట్టి తన స్నేహితునికి మోదీ అప్పగించారని ఆరోపించారు. ఆయన పాలనలో ఆర్థిక వ్యవస్థ పతనమైందని, బ్యాంకులు లూటీ అయ్యాయనీ, వాటిని దోపిడీ చేసిన వారు విదేశాలకు పారిపోయారన్నారు. వీటన్నింటినీ ప్రశ్నించే వారిపై ఆయన అక్రమంగా కేసులు బనాయించేందుకు సీబీఐని ప్రయోగిస్తున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన 6వ విడత జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. యూపీలో అఖిలేష్ యాదవ్, మాయావతి పొత్తు పెట్టుకుంటే అఖిలేష్‌పై కేంద్రం సీబీఐ కేసులు పెట్టిందన్నారు. అనుకూలంగా ఉన్నందుకే కేసీఆర్‌పై కేసును తప్పించారని, అదే విధంగా రాష్ట్రంలో ప్రతిపక్ష నేతపైనా కేసులు తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. భవిష్యత్‌లో నీతివంతమైన పాలన అందించేందుకు కాంగ్రెస్‌తో జతకట్టామని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రధానికి ఆ అర్హతలేదు

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచానని మోదీ అంటున్నారనీ, ఆయన గురించి మాట్లాడే అర్హత ప్రధానికి లేదని చంద్రబాబు చెప్పారు. తాను ప్రధాని పదవి కోసం కలలు కంటున్నానని అనడంలో వాస్తవంలేదనీ, రెండుసార్లు ప్రధాని పదవి కోసం అవకాశం వచ్చినా వదులుకున్న ఘనత తనదన్నారు. తన కుమారుడు లోకేష్ అభివృద్ధి కోసం తాను పాటుపడుతున్నట్లు అంటున్నారనీ, కానీ.. తాత ఆశయాలు నెరవేర్చేందుకు రాజకీయాల్లోకి వస్తానని లోకేష్ చెప్పాడని చంద్రబాబు చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని మార్చేందుకే తాను ఢిల్లీకి వెళ్తున్నట్లు సీఎం చెప్పారు. కేంద్రం, వైఎస్సార్‌సీపీ కలిసి రాష్ట్ర హక్కులు కాలరాసే విధంగా ఎన్‌ఐఏను తీసుకొచ్చారన్నారు.

సీఎంతో టోనీ బ్లెయిర్ భేటీ



ఇదిలా ఉంటే.. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ చంద్రబాబుతో సమావేశమయ్యారు. సచివాలయానికి సోమవారం రాత్రి వచ్చిన బ్లెయిర్‌ను సీఎం ఆర్టీజీ సెంటర్‌కు తీసుకెళ్లి దాని గురించి వివరించారు. టోనీకి తనకు మధ్య ఎప్పటి నుంచో సాన్నిహిత్యం ఉందని చంద్రబాబు చెప్పారు. అనంతరం బ్లెయిర్‌ను సన్మానించారు. ఆ తర్వాత సచివాలయంలోనే టోనీకి సీఎం ఆతిథ్యమిచ్చారు.

‘పోలవరం’లో గిన్నిస్ రికార్డు: పోలవరం ప్రాజెక్టు కాంక్రీట్ పనుల్లో నవయుగ సంస్థ గిన్నిస్ రికార్డును సాధించింది. 2019 జనవరి 6న చేపట్టిన కాంక్రీట్ పనులకు సంబంధించి 24 గంటల్లో 32,315.5 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి ఇంజినీర్లు డబుల్ వరల్డ్ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గిన్నిస్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. 2019లో గ్రావిటీ ద్వారా నీరు అందించి తీరతామని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా రామయ్యపేటలో పైలాన్ ఆవిష్కరించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం: బీజేపీ



గవర్నర్ నరసింహన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా అధికారంలో ఉన్న టీడీపీ నేతలు రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని బీజేపీ నేతలు సోమవారం హైదరాబాద్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పార్టీ నేత, రిటైర్డు డీజీపీ దినేష్‌రెడ్డి, అధికార ప్రతినిధులు సుధీష్ రాంబొట్ల, విజయబాబు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబే స్వయంగా ఒక మహిళా కార్పొరేటర్‌ను ఫినిష్ చేస్తానంటూ బెదిరించాడని, ఆ పార్టీ నేతలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటి మీదకు వెళ్లి దాడికి పాల్పడ్డారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

కేంద్రం ఇచ్చిన ఇళ్లకు మూడు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జీవోలు

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలకు మూడు నెలల క్రితం 1,71,176 ఇళ్లను మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు లబ్ధికోసం ఇప్పుడు జీవోలు ఇచ్చింది. కేంద్రం గతేడాది అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంత పేదలకు 1,60,454 ఇళ్లను అలాగే పట్టణ ప్రాంతాల్లో పేదలకు 10,722 ఇళ్లను మంజూరు చేసింది. వీటికి సబంధించి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మంజూరు చేస్తున్నట్లు జీవోలను జారీ చేసింది. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడానికే టీడీపీ సర్కార్ ఇప్పటివరకూ జీవోలు ఇవ్వకుండా జాప్యం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరు చేసిన ఒక్కో ఇంటి యూనిట్ వ్యయం రూ. 2.50 లక్షలుగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందులో కేంద్రం రూ. 1.5 లక్షలు సబ్సిడీగా ఇస్తుండగా రాష్ట్రం రూ. 50 వేలు ఇవ్వనుంది. మిగతా రూ. 50 వేలు లబ్ధిదారుడు వాటాగాను, రుణంగాను భరించాల్సి ఉంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో మంజూరు చేసిన ఇంటి యూనిట్ వ్యయం రూ. 3.5 లక్షలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. కేంద్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీగా ఇవ్వనున్నాయి. మిగతా రూ. లక్షలో లబ్ధిదారు రూ. 25 వేలు చెల్లించాల్సి ఉండగా మరో రూ. 75 వేలను రుణంగా తీసుకోవాల్సి ఉందని ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

నష్టాల లోటు ఎలా భర్తీ చేస్తారో చెప్పాలి

- విద్యుత్ చార్జీలు పెంచకపోవడం ఎన్నికల స్టంటే
- ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు



జస్టిస్ భవానీ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్నందున విద్యుత్ చార్జీల పెంపు వాయిదా వేశారని, ఎన్నికలయ్యాక మళ్లీ చార్జీలు పెంచే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచనందుకు డిస్కంలకు వాటిల్లే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లు విద్యుత్ చార్జీలను పెంచకుండా ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ అధ్యక్షతన విశాఖలోని ఏపీఈపీడీసీఎల్‌లో 2019–20 ఆర్థిక సంవత్సరానికి మొదటి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈపీడీసీఎల్ పరిధిలో ఈ ఏడాది విద్యుత్ చార్జీలను పెంపుదల చేయకుండా ప్రతిపాదిస్తున్నట్టు సీఎండీ హెచ్‌వై దొర ఏపీఈఆర్‌సీకి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. తొలుత ఏపీఎస్‌ఈబీ రిటైర్డ్ అధికారి ఎ.పున్నారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 2.20 కోట్ల ఎల్‌ఈడీ బల్బుల వినియోగం ద్వారా ఏటా 2,161 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొన్నారన్నారు. కానీ ఈపీడీసీఎల్‌లో 558 మిలియన్ యూనిట్లు, ఎస్‌పీడీసీఎల్‌లో 223 మిలియన్ యూనిట్లు మాత్రమే ఆదా అవుతోందని థర్డ్‌పార్టీల సర్వే ద్వారా తేలిందని చెప్పారు. రాష్ట్రంలో ఎల్‌ఈడీ బల్బులకు రూ.500 కోట్లు వృథాగా వెచ్చించారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఆర్థికమంత్రి చెబుతున్నారని, పెంపుదల భారాన్ని భరిస్తామని ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాభిప్రాయ సేకరణలో లేవనెత్తిన అంశాలకు ఈపీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర సమాధానమిచ్చారు. ప్రస్తుత విద్యుత్ చార్జీలే రానున్న ఏడాదికి కూడా కొనసాగుతాయని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ తెలిపారు. త్వరలో విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌ల్లోనూ ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ సభ్యులు పి.రామ్మోహన్, పి.రఘు, ఈపీడీసీఎల్ డైరెక్టర్లు శోభా హైమావతి, బొడ్డు శేషుకుమార్, టీవీఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకేసు ఎన్‌ఐఏకి ఎలా అప్పగిస్తారు?: చినరాజప్ప

సాక్షి, విశాఖపట్నం: జగన్‌పై హత్యాయత్నం కేసును కేంద్ర ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కి అప్పగించడంపై రాష్ట్ర హోంమంత్రి చినరాజప్ప ఆక్రోశం వ్యక్తం చేశారు. సోమవారం విశాఖపట్నంలో జరిగిన జన్మభూమి సభలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు చాలా చిన్నదని, దేశంలో అనేక కేసులున్నా పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి వైఎస్ జగన్‌తో కలిసి కేంద్రం కావాలనే కేసుని ఎన్‌ఐఏకు బదలాయించిందని విమర్శించారు. ఈ కేసును ఎన్‌ఐఏకి అప్పగించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం నిపుణులతో చర్చిస్తోందని, అనంతరం దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని హోంమంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రధాని, రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు ఒకేసారి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లపై అవినీతి ఆరోపణలు చేయడం చూస్తుంటే ఇరువురు కలిసే విమర్శలు చేస్తున్నట్టుగా ఉందని రాజప్ప అన్నారు.

భువనేశ్వర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్, సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబరు (08507) భువనేశ్వర్–సికింద్రాబాద్ ప్రత్యేకరైలు జనవరి 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (నెంబరు 08508) జనవరి 11 తేదీ రాత్రి 9.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.

నేరం చేయకపోతే భయమెందుకు బాబు?

- ఎన్‌ఐఏకు సహకరించవద్దని పోలీసులకెందుకు ఆదేశాలిచ్చావ్?
- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్న
- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ పార్లమెంటులో నిరసన



పార్లమెంటు ఆవరణలో గాంధీజీ విగ్రహం వద్ద ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నంలో నీ ప్రమేయం లేకపోతే అంత భయమెందుకని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఎన్‌ఐఏ విచారణకు సహకరించవద్దని పోలీసులకు ఎందుకు ఆదేశాలిచ్చావో చెప్పాలని చంద్రబాబును నిలదీశారు. ఎన్‌ఐఏ విచారణతో వాస్తవాలు బయటకొస్తాయన్న భయంతోనే ఈ విధంగా ప్రవర్తిస్తున్నాడని దుయ్యబట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌ఐఏను అడ్డుకుంటున్న చంద్రబాబుకు ప్రజాస్వామ్యంపై కనీస గౌరవం లేదని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నాసిరకం పనులతో అవినీతిమయం చేసి ఏ ఒక్క నిర్వాసితుడికీ 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వనందుకు గిన్నిస్‌బుక్‌లో ఎక్కించారా? అని ఎద్దేవా చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే ఏపీకి ప్రత్యేక హోదా సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ స్థానాలు కైవసం చేసుకొని వైఎస్ జగన్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తారన్నారు.

ఢిల్లీలో నేడు ‘అవినీతి చక్రవర్తి’ విడుదల..

గత నాలుగున్నరేళ్లుగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలో చేసిన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో వైఎస్సార్‌సీపీ రూపొందించిన ‘అవినీతి చక్రవర్తి’ పుస్తకాన్ని ఆ పార్టీ నేతలు మంగళవారం ఢిల్లీలో ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ప్రత్యేక హోదా కోసం ఎంపీ పదవులకు రాజీనామా చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి పాల్గొంటారు.

పునరావాసం కల్పించింది 1,317 కుటుంబాలకే!

పోలవరం ప్రాజెక్ట్ వల్ల నిర్వాసితులైన 56,495 ఎస్టీ కుటుంబాల్లో ఇప్పటి వరకు కేవలం 1,317 కుటుంబాలనే పునరావాస కాలనీలకు తరలించినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని కేంద్ర జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులైన ఎస్టీ కుటుంబాలకు పునరావాసం కల్పించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నట్లు జాతీయ ఎస్టీ కమిషన్ రాష్ట్రపతికి సమర్పించిన నివేదికలో పేర్కొన్న విషయం వాస్తవమేనా అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. పోలవరం ప్రాజెక్ట్ వల్ల నిర్వాసితులైన గిరిజనులు అన్న అంశంపై జాతీయ ఎస్టీ కమిషన్ ఒక ప్రత్యేక నివేదిక రూపొందించిన విషయం వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. నిర్వాసితులైన గిరిజన కుటుంబాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం చేపట్టవలసిన కొన్ని ముఖ్యమైన చర్యలను ఎస్టీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందన్నారు. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనల సడలింపు అంశాన్ని సమీక్షించి, పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని నెలకొల్పిందని పర్యావరణ శాఖ సహాయ మంత్రి డాక్టర్ మహేష్ శర్మ ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు బదులిచ్చారు. సీఆర్‌జెడ్ కారణంగా కోస్తా ప్రాంతాల్లో తలెత్తుతున్న సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌తోపాటు తీర ప్రాంతం కలిగిన ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి ఎదురవుతున్న సవాళ్లను ఈ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు.

గొలగమూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్

జాతీయ రహదారి ఎన్‌హెచ్–16లో కోల్‌కత్తా–చెన్నై రహదారులు కలిసే నెల్లూరు జిల్లాలో గొలగమూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదనలు స్వీకరించిందని, అలాగే నెల్లూరు బైపాస్ ఎన్‌హెచ్–16వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు ఉన్నట్టు కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సోమవారం రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. అలాగే కడప–మైదుకూరు–కర్నూలు ఎన్‌హెచ్–18 పనులు ఈ ఏప్రిల్‌లోపు పూర్తవుతాయని మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

అడ్డదారిలో పోస్టుల భర్తీ!



- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను నిలిపివేయాలన్న సుప్రీంకోర్టు, యూజీసీ ఆదేశాలు బేఖాతర్
- రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు భిన్నంగా ముందుకు..
- పోస్టుల భర్తీపై పలు వ్యాజ్యాలు, స్టేలున్నా ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు
- ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా ముగించేందుకే హడావుడి
- 20 నుంచి ఇంటర్వ్యూల కోసం కాల్ లెటర్స్ పంపిన రాయలసీమ, యోగి వేమన వర్సిటీలు

సాక్షి, అమరావతి: ఎన్నికలు ముంచుకొస్తుండడంతో రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో బోధనా పోస్టులను ముడుపులు ముట్టచెప్పేవారికి, అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు హడావుడిగా సిద్ధమయ్యారు. ఈ పోస్టుల భర్తీని యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా చేపడుతున్నట్లు ఒకపక్క కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నా, స్టే ఆర్డర్లు ఉన్నా ఖాతరు చేయకపోవడం గమనార్హం.

భర్తీని నిలిపివేయాలన్న యూజీసీ..

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నందున తుది నిర్ణయం వెలువడే వరకు బోధనా పోస్టుల భర్తీని నిలిపివేయాలని యూజీసీ కొద్ది నెలల క్రితం దేశంలోని అన్ని వర్సిటీలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీని నిలిపివేయాలని ఆదిత్యనాథ్‌దాస్ ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉండగా లిఖిత పూర్వకంగా ఆదేశించారు. వర్సిటీల్లో బోధనా పోస్టుల భర్తీపై సుప్రీంకోర్టులో ఉన్న వ్యాజ్యంలో తుది తీర్పు వెలువడే వరకు ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని హైకోర్టు కూడా ఆదేశించింది. అయితే ఇందుకు విరుద్ధంగా ఇప్పటికే కొన్ని వర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులకు ఎంపికను పూర్తి చేయడం గమనార్హం. కోర్టుల తీర్పులను పట్టించుకోకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు వర్సిటీలు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల కోడ్ వెలువడేలోగా ఈ పోస్టులను తమ వారితో భర్తీ చేసుకునేలా ఉన్నత విద్యామండలి ముఖ్యులు, ప్రభుత్వ పెద్దలు కథ నడిపిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల క్రితం అనంతపురం జేఎన్‌టీయూ, రాయలసీమ, యోగి వేమన వర్సిటీలకు సంబంధించి నియామక ప్రక్రియపై ఉన్నత న్యాయస్థానం స్పష్టమైన తీర్పులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను త్వరగా పంపాలని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ఒకరు తమకు ఫోన్‌చేసి ఒత్తిడి చేస్తున్నారని అనంతపురం జేఎన్‌టీయూ వర్గాలు చెబుతున్నాయి.

అంతా అక్రమాలమయమే

యూనివర్సిటీల్లో బోధనా పోస్టుల భర్తీ వ్యవహారం ఆది నుంచి అక్రమాలమయంగా మారిందన్న విమర్శలున్నాయి. రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో దాదాపు 4 వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వాటిని 1,385కి కుదించింది. రేషనలైజేషన్‌ను కూడా ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలంగా చేయించారు. సీఎంవోలో ఓ సలహాదారు, ఉన్నత విద్యామండలిలో ఉపాధ్యక్షుడు ఒకరు కలసి తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు అనుకూలంగా పోస్టుల రేషనలైజేషన్ చేయించారన్న ఆరోపణలున్నాయి. వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాలరాస్తూ ఈ వ్యవహారాన్ని ఉన్నత విద్యామండలి ద్వారా నడిపించారు. ఈ నేపథ్యంలో 1,104 పోస్టులను ఒకదశలో, 281 పోస్టులను రెండో దశలో భర్తీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. మొత్తం పోస్టుల్లో ప్రొఫెసర్ 101, అసోసియేట్ ప్రొఫెసర్ 174, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 1,110 ఉన్నాయి.

కోర్టుల్లో వ్యాజ్యాలున్నా..

రేషనలైజేషన్ అక్రమాలపై పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన వర్సిటీలతో సంబంధం లేకుండా పోస్టులను రేషనలైజేషన్ చేయడంపై న్యాయస్థానం ప్రభుత్వానికి అక్షింతలు వేసింది. రేషనలైజేషన్‌పై కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తుండగానే ప్రభుత్వం తాను రూపొందించిన జాబితాలను వర్సిటీల పాలకమండళ్ల ద్వారా ఆమోదింపచేసి ప్రకటించింది. ఒక విభాగం పోస్టును మరో విభాగానికి, ప్రొపెసర్ పోస్టులను అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుగా మార్చడం తదితర అక్రమాలపై కూడా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై విచారణ కొనసాగుతుండగానే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీని ప్రభుత్వం ఆయా వర్సిటీల ద్వారా చేపట్టింది. దీనిపై కూడా పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు.

స్క్రీనింగ్ టెస్టుపై వివాదాలు...

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాలరాస్తూ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని యూనివర్సిటీలకు కలిపి ఒకటే పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసేలా వర్సిటీలు, ఉన్నత విద్యామండలి, ఏపీపీఎస్సీ ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు ఏపీపీఎస్సీ పరీక్ష నిర్వహించడం, అది తీవ్ర గందరగోళాన్ని రేపడం తెలిసిందే. ఈ పరీక్షలకు సంబంధించి కూడా పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే నెలలో వెలువడే సంకేతాలు ఉండడంతో కోడ్ అమల్లోకి వస్తే పోస్టుల భర్తీ కుదరదనే ఉద్దేశంతో సర్కారు హడావుడిగా రంగంలోకి దిగింది. తాజాగా జేఎన్‌టీయూ అనంతపురం, యోగివేమన తదితర వర్సిటీల్లో పోస్టుల భర్తీపై దాఖలైన వ్యాజ్యాల్లో ఉన్నత విద్యామండలి, ఉన్నత విద్యాశాఖల తీరును తప్పుబడుతూ న్యాయస్థానం అక్షింతలు వేసింది.

షెడ్యూళ్లు సిద్ధం చేసిన ఉన్నత విద్యామండలి

ఎన్నికల షెడ్యూల్ వచ్చే నెలలో ప్రకటించే అవకాశాలుండడంతో వర్సిటీల్లో పోస్టులను సాధ్యమైనంత త్వరగా తమ వారితో భర్తీ చేసేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. ఫిబ్రవరిలోనే పోస్టుల ఎంపికను పూర్తి చేయాలనే ఉద్దేశంలో సర్కారు ఉంది. ఇప్పటికే యోగి వేమన, రాయలసీమ, విక్రమ సింహపురి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీల్లో బోధనా పోస్టులకు ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. అనంతపురం జేఎన్‌టీయూ, కాకినాడ జేఎన్‌టీయూల షెడ్యూళ్లను కూడా సిద్ధం చేస్తుండటంతో అర్హులైన వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్వ్యూల కోసం ఇప్పటికే పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. ఎక్కువ పోస్టులను ఓ సామాజిక వర్గానికి చెందిన వారికి కట్టబెట్టేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. రాయలసీమ వర్సిటీ ఈనెల 20వ తేదీ నుంచి ఇంటర్వ్యూ తేదీలను నిర్ణయించింది. ఆ మేరకు మౌఖిక పరీక్షలకు హాజరు కావాలని అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించింది. యోగి వేమన వర్సిటీ కూడా ఈనెల 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీవరకు ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను ఖరారు చేసి అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపడం గమనార్హం.

సాక్షి
మంగళవారం, జనవరి, 8

పేదలకు కోటా!

ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎవరూ ఊహించని రీతిలో కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రవర్ణ నిరుపేదలు లబ్ధి పొందే విధంగా విద్య, ఉద్యోగావకాశాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర మంత్రివర్గం తీర్మానించింది. నిజానికి కేంద్రం అగ్రవర్ణ పేదలు అనే మాట వాడలేదు. జనరల్ కేటగిరీలోని నిరుపేద వర్గాలకు కోటా సదుపాయం ఇస్తున్నట్టు మాత్రమే ప్రకటించింది. ఈ నిర్ణయం అగ్రవర్ణాల్లోని పేదలతోపాటు ఇతర మతాల్లోని పేదలకు కూడా వర్తిస్తుంది. ఆ సంగతలా ఉంచి ఇది సాకారమైతే ఇప్పుడున్న రిజర్వేషన్లు 60 శాతానికి చేరుతాయి. కోటా పరిమితి 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చింది గనుక ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఎవరైనా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది. మన రాజ్యాంగం ఆర్థిక వెనుకబాటుతనాన్ని రిజర్వేషన్లకు ప్రాతిపదికగా తీసుకోవటం లేదు. దాన్ని అధిగమించటం కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను కూడా సవరించాల్సి ఉంటుంది. మంగళవారం ముగియాల్సిన పార్లమెంటు శీతాకాల సమావేశాలను మరో రోజు పొడిగించాలని నిర్ణయించారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును మంగళవారం ప్రవేశపెట్టాలని కేబినెట్ తీర్మానించింది. అయితే ప్రస్తుత సమావేశాల్లో ఇది ఆమోదం పొందే అవకాశాలు లేవనే చెప్పాలి. పార్లమెంటు లోపలా, వెలుపలా ఎంతో లోతుగా చర్చించాల్సిన అంశం అలా ఒక్కరోజులో ఆమోదం పొందాలని భావించడం కూడా పొరపాటు. రిజర్వేషన్లు ఉండటం అవసరమా కాదా అన్న చర్చ ఈనాటిది కాదు. స్వాతంత్ర్యానికి ముందూ, తర్వాత కూడా ఆ విషయంలో చర్చలు సాగాయి. సాగుతున్నాయి. రిజర్వేషన్లు ఉండరాదని గతంలో ఉద్యమాలు సాగించిన అగ్ర కులాలు తమను కూడా బీసీలుగా పరిగణించి ఆ సదుపాయం వర్తింపజేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నాయి. రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితరచోట్ల అందుకోసం ఉద్యమాలు సాగాయి. ఇతర కారణాలతోపాటు అగ్రవర్ణాల్లో ఉండే ఈ అసంతృప్తి కూడా ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో తమ పార్టీ వైఫల్యానికి దారి తీసి ఉండొచ్చునని బీజేపీలో అంతర్మథనం మొదలైందని మీడియా కథనాలు చెబుతున్నాయి. విపక్షాలు ఆరోపిస్తున్నట్టు దాని పర్యవసానంగానే ఈ నిర్ణయం వెలువడి ఉండొచ్చు కూడా.

పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ల సదుపాయం కల్పిస్తూ 1991లో పీవీ నరసింహారావు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించినప్పుడు సుప్రీంకోర్టు దాన్ని తోసిపుచ్చింది. ఇది రాజ్యాంగంలోని 16వ అధికరణాన్ని ఉల్లంఘిస్తున్నదని తెలిపింది. ఆ తర్వాత ఏ ప్రభుత్వమూ దాని జోలికి పోలేదు. ఆర్థిక సంస్కరణల పర్యవసానంగా అప్పట్లో పెల్లుబికిన నూతన అవకాశాల వల్ల కావొచ్చు... రాజ్యాంగాన్ని సవరించి అయినా ఆ కోటా అమలు చేసి తీరాలని ఎవరూ ఉద్యమించలేదు. కానీ ఏళ్లు గడిచేకొద్దీ సంస్కరణల కారణంగా పుట్టుకొచ్చిన కొత్త సమస్యలు అన్ని వర్గాలనూ తాకడం మొదలైంది. చేతివృత్తులు దెబ్బతిని అట్టడుగు కులాలు, సాగు సంక్షోభం ఏర్పడి వ్యవసాయంపై ఆధారపడే కులాలు ఒడిదుడుకుల్లో పడటం ప్రారంభించాయి. అందువల్లే తమకు రిజర్వేషన్ల ఫలాలు అందటం లేదని ఎస్సీ కులాల్లో, ఓబీసి కులాల్లోని అత్యంత వెనకబడిన వర్గాల్లో అసంతృప్తి రాజుకుంది. పర్యవసానంగా కొత్తగా రిజర్వేషన్లు కావాలనేవారూ, ఉన్న రిజర్వేషన్లను వర్గీకరించాలని కోరేవారు రంగంలోకొచ్చారు. నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వీటిని దృష్టిలో ఉంచుకునే నిరుపేద వర్గాల పిల్లలు చదువుకోవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్, వైద్యం చేయించుకోవడానికి ఆరోగ్యశ్రీ, నెలనెలా పింఛన్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఇవి ఆచరణలో మంచి ఫలితాలనిచ్చాయి. అలాంటి పథకాలు లేనిచోట, ఉన్నా సమర్థవంతంగా అమలుకాని చోట రిజర్వేషన్ల డిమాండ్ బలంగా ముందుకొచ్చింది.

ప్రస్తుత రిజర్వేషన్ల ప్రాతిపదిక వేరు. తరతరాలుగా సామాజిక అణచివేతకు, వివక్షకూ గురవుతూ అన్నివిధాలా వెనకబడి ఉన్న కులాలకు రిజర్వేషన్ల సదుపాయం కల్పించాలని మన రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించారు. మొదట్లో ఎస్సీ, ఎస్టీలకు ఉండే ఈ సదుపాయం అనంతరకాలంలో ఓబీసీలకు కూడా అమలుకావడం మొదలైంది. తాజాగా కల్పిస్తామంటున్న కోటాకు ప్రాతిపదిక పేదరికం అంటున్నారు. పేదరికం కారణంగా ఎవరైనా సామాజిక వెనకబాటుకు గురయ్యారని ఎలా నిరూపిస్తారో, ఆ నిర్ణయానికి దారితీసిన సర్వే ఏమిటో, దాని డేటా ఏమిటో తెలియాల్సి ఉంది. ఇవి లేనప్పుడు తాజా నిర్ణయం న్యాయసమీక్షకు నిలిచే అవకాశం లేదు. దాని సంగతలా ఉంచి పేదరికాన్ని నిర్ణయించేందుకు ప్రభుత్వం నిర్ధారించిన ప్రాతిపదికలు గమనిస్తే ఎంతమంది ఆ కోటాకు అర్హులవుతారో చెప్పలేం. వార్షికాదాయం రూ. 8 లక్షలు లేదా 5 ఎకరాల లోపు సాగుభూమి లేదా 1,000 చదరపు అడుగుల లోపు నివాస స్థలం, మున్సిపల్ ప్రాంతాల్లో 200 చదరపు అడుగుల లోపు నివాసస్థలం ఉన్నవారే నిరుపేదలుగా పరిగణనలోకి వస్తారు.

ఒకపక్క మన ఆర్థిక వ్యవస్థ పనితీరు అద్భుతంగా ఉన్నదని చెప్పుకుంటాం. జీడీపీ అంతకంతకూ పెరుగుతున్నదని మురుస్తుంటాం. కానీ క్షేత్ర స్థాయిలో వాటి ఫలాలు ఎవరికీ చేరటం లేదని వివిధ వర్గాల అసంతృప్తిని చూస్తే అర్థమవుతుంది. అగ్రవర్ణ పేదలకు సైతం లబ్ధి చేకూరుస్తామంటే కాదనే వారుండరు. కానీ నిజంగా ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలున్నాయా? రిటైరయ్యేవారు అవుతుండగా లక్షలాది ఖాళీలను అలాగే ఉంచుతున్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టు ఉద్యోగాలతో కానిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కోటా విస్తరణ నిరుద్యోగాన్ని, పేదరికాన్ని సమూలంగా తుడిచి పెడుతుందా? వివిధ వర్గాల అసంతృప్తికి, ఆర్థిక సంక్షోభానికి ఉన్న మూలకారణాలను స్పృశించకుండా, వాటికి పరిష్కారాలను వెదక్కుండా...ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచకుండా రిజర్వేషన్ల వల్ల ప్రయోజనం ఏముంటుంది? తాజా నిర్ణయం సమాజంలో కొత్త వైషమ్యాలకు దారితీయరాదని ఆశిద్దాం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి శు.విదియ ఉ.9.44 వరకు, తదుపరి తదియ నక్షత్రం శ్రవణం రా.10.01 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం రా.2.24 నుంచి 4.11 వరకు, దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 9.32 వరకు తదుపరి రా.10.48 నుంచి 11.40 వరకు
అమృతఘడియలు... ఉ.10.30 నుంచి 12.14 వరకు.

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

అప్పుల సుస్తీ-అభివృద్ధి నాస్తి

రాష్ట్ర ఖజానా నుంచి ఇష్టానుసారం దోచేస్తూ అప్పుల ఊబిలోకి నెట్టేసిన ముఖ్యమంత్రి ఎన్నికల ముందు అవాస్తవాలతో ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. అప్పులను ఆస్తుల కల్పనకు కాకుండా రెవెన్యూ, దుబారాకు, ప్రచార ఆర్భాటాలకు, ఈవెంట్లకు పెద్దఎత్తున వ్యయం చేశారు. ప్రాజెక్టుల పాత అంచనాలను పెంచేసి ఎస్కలేషన్ పేరుతో కాంట్రాక్టర్లకు చెల్లిస్తూ ప్రభుత్వ పెద్దలు భారీ ఎత్తున కమీషన్లు పొందుతున్నారు. నీరు–చెట్టు పనులన్నీ నామినేషన్‌పై అధికార పార్టీ నేతలకు పంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టులను చెల్లించనందున నాలుగేళ్లలో రూ.124.31 కోట్ల మేర వడ్డీని చెల్లించాల్సిన పరిస్థితి తీసుకువచ్చింది. కాగా, రాష్ట్ర ఖజానాను సొంత ఖజానాగా సర్కారు మార్చేసిందని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ప్రజాధనానికి ధర్మకర్తగా ఉంటూ ప్రతీ పైసాకు జవాబుదారీగా పాలన అందించాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. నాలుగేళ్లలో అప్పుల్లో భారీ వృద్ధిని చంద్రబాబు సాధించారు. ఆర్థిక వ్యవస్థను, రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ మరో పక్క రాష్ట్ర ఖజానా నుంచి దోచేస్తూ సొంత జేబులు నింపుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని అధికార యంత్రాంగమే కోడై కూస్తోంది. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ఖజానా నుంచి ఇష్టానుసారం దోచేస్తూ అప్పుల ఊబిలోకి నెట్టేసిన ముఖ్యమంత్రి ఎన్నికల ముందు అవాస్తవాలతో ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. తాత్కాలిక నిర్మాణాలు, ఐటీ పేరుతో భారీగా అనుత్పాదక వ్యయాన్ని చేశారు. అంతేకాకుండా చేసిన అప్పులను ఆస్తుల కల్పనకు కాకుండా రెవెన్యూ, దుబారాకు, ప్రచార ఆర్భాటాలకు, ఈవెంట్లకు పెద్దఎత్తున వ్యయం చేశారు. దీంతో రాష్ట్ర అప్పులు ప్రమాదకర స్థాయికి చేరిపోయాయి. నాలుగేళ్లలో ఏకంగా 1,63,670 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, రాష్ట్ర ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పులు 25.9 శాతానికి మించరాదు. అయితే ముఖ్యమంత్రి అస్తవ్యస్థ ఆర్థిక నిర్వహణ కారణంగా, స్తోమతకు మించి అప్పులు చేయడంతో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పులు ఏకంగా 32.03 శాతానికి చేరాయి. రాష్ట్ర విభజన నాటికి 13 జిల్లాలకు కలిపి ఏపీ అప్పు 96 వేల కోట్ల రూపాయలు ఉండగా ఇప్పుడు 2017–18 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి అకౌంటెంట్ జనరల్ గణాంకాల మేరకే 2,59,670 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. వివిధ కార్పొరేషన్ల పేరుతో భారీఎత్తున అంటే ఏకంగా 71,815 కోట్ల రూపాయల మేర వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించేస్తూ ఆ అప్పులకు గ్యారెంటీ కూడా ఇచ్చేసింది. ఇందులో ఇప్పటికే ఏకంగా 35,768 కోట్ల రూపాయలను అప్పులు చేశారు. ఈ విధంగా చేసిన అప్పులను ఆస్తుల కల్పనకు కాకుండా ప్రాజెక్టుల్లో పాత అంచనాలను పెంచేసి ఎస్కలేషన్ పేరుతో కాంట్రాక్టర్లకు చెల్లిస్తూ ఆ చెల్లింపుల నుంచి ప్రభుత్వ పెద్దలు భారీ ఎత్తున కమీషన్లు పొందుతున్నారు. నీరు–చెట్టు పనులన్నీ కూడా నామినేషన్‌పై అధికార పార్టీ నేతలకు పంచేశారు. ఇప్పటివరకు ఏకంగా 16 వేల కోట్ల రూపాయల పనులు పంచేశారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులను అప్పులు చేసి చెల్లింపచేస్తున్నారు. ఇన్ని కోట్లు వ్యయం చేసినప్పటికీ రాష్ట్రంలో సగం జిల్లాలు కరువుతో అల్లాడుతుండటంతో రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రభుత్వం నిత్యం వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టులతోనే కొనసాగేది. ఇప్పుడు గత రికార్డులను అధిగమించి మళ్లీ గత నాలుగేళ్ల నుంచి వేస్ అండ్ మీన్స్ ఓవర్ డ్రాఫ్టుల్లో రికార్డు సృష్టించింది. మన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతీ ఆర్థిక సంవత్సరంలో 1500 కోట్ల రూపాయల మేర వేస్ అండ్ మీన్స్ సౌకర్యాన్ని ఆర్‌బీఐ కల్పించింది. ఈ సౌకర్యాన్ని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకుని 14 రోజుల్లోగా చెల్లిస్తే ఎటువంటి వడ్డీని చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టులను సకాలంలో చెల్లించనందున గత నాలుగేళ్లలో 124.31 కోట్ల రూపాయల మేర వడ్డీని చెల్లించాల్సిన పరిస్థితి తీసుకువచ్చింది. చేబదుళ్లకు వడ్డీ చెల్లించిందంటే ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా ఉందో అద్దం పడుతుంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తొమ్మిదేళ్ళ పాలనలో కూడా ఏడాదిలో 365 రోజుల్లో అత్యధికంగా 230 రోజులు చేబదుళ్లలోనే నడిపిన చరిత్ర ఉంది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ, ద్రవ్య లోటులో కూడా రాష్ట్ర ప్రభుత్వం వృద్ధి సాధించడం గమనార్హం. 2017–18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ లోటు –415.80 కోట్ల రూపాయలుగా ప్రతిపాదించగా ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత రెవెన్యూ లోటు –16,772.83 కోట్ల రూపాయలకు వెళ్లింది. అలాగే బడ్జెట్ అంచనాల్లో

శ్వేతపత్రం-10
రాష్ట్ర ఆర్థిక రంగంపై విశ్లేషణ



ద్రవ్య లోటు –23,054.44 కోట్ల రూపాయలుగా ప్రతిపాదించగా ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత ద్రవ్య లోటు –33,591.92 కోట్ల రూపాయలుగా తేలింది. ద్రవ్య, రెవెన్యూ లోటులు ద్రవ్య జవాబు దారీ బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధనలకు మించి ఉండటం గమనార్హం. 'మళ్లీ ఎలాగూ అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకుందాం' అనే రీతిలో చంద్రబాబు సర్కారు వ్యవహరిస్తోందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వచ్చే ప్రభుత్వానికి ఆర్థికంగా వెసులుబాటు లేకుండా చేసే విధంగా చంద్రబాబు సర్కారు అప్పులు చేస్తోందని, ఇందుకు ఉదాహరణ ఇప్పటికే బడ్జెట్ పరిమితికి మించి అప్పులు చేసిన సర్కారు ఇప్పుడు మరీ బరితెగించి వివిధ కార్పొరేషన్ల పేరుతో బడ్జెట్ బయట ఏకంగా 71,815 వేల కోట్ల రూపాయలు అప్పు చేయడమేనని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. బడ్జెట్ బయట కార్పొరేషన్ల పేరు మీద అప్పులు చేయడానికి సర్కారు గ్యారెంటీ ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ గత ఆర్థిక సంవత్సరంలో సొంత ఆదాయంలో 90 శాతం మేర అప్పులకు గ్యారెంటీ ఇవ్వవచ్చునని, అయితే ఇప్పుడు ఆ పరిమితి కూడా పూర్తి అయ్యేలాగ బడ్జెట్ బయట అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేసింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో గ్యారెంటీ పరిమితి కూడా మించిపోవడంతో ఇటీవల మున్సిపల్ ఆస్తులు తాకట్టు పెట్టి బడ్జెట్ బయట వాణిజ్య బ్యాంకుల నుంచి 11,340 కోట్ల రూపాయల అప్పునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్యారెంటీ పరిమితి మించిపోవడంతో కేవలం 3,000 కోట్ల రూపాయల అప్పునకే సర్కారు గ్యారెంటీ ఇస్తూ మిగతా మొత్తానికి తదుపరి ఆర్థిక సంవత్సరాల్లో గ్యారెంటీ ఇస్తామని ప్రభుత్వం జారీచేసిన జీవోలోనే స్పష్టం చేసిందంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎంత వరకు చంద్రబాబు సర్కారు దిగజార్చిందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో సీఆర్‌డీఏకు వాణిజ్య బ్యాంకులు, బాండ్ల ద్వారా 14,275 కోట్ల రూపాయలు అప్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. అలాగే సాగునీటి ప్రాజెక్టులను తాకట్టు పెట్టి 30 వేల కోట్ల రూపాయలు అప్పు చేయాలని నిర్ణయించి ఇప్పటికే ఆరు వేల కోట్ల రూపాయలు అప్పు చేశారు. గత నాలుగేళ్లలో ఆస్తుల కల్పన వ్యయానికి కేవలం 49,367 కోట్ల రూపాయలు వ్యయం చేసినట్లు ఇటీవల 15వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికలోనే స్పష్టం చేసింది. అంటే గత నాలుగేళ్లలో 1,63,670 లక్షల కోట్ల రూపాయలు అప్పుచేస్తే ఆస్తుల కల్పనకు 49,367 కోట్ల రూపాయలే వ్యయం చేసినట్లు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే పేర్కొన్నందున మిగతా అప్పుల మొత్తం 1,14,303 లక్షల కోట్ల రూపాయలు అనుత్పాదక రంగాలకు వ్యయం చేసినట్లు స్పష్టం అయింది. ఆస్తుల కల్పనకు చేసిన వ్యయంలో నీరు–చెట్టు, ఎస్కలేషన్ తాత్కాలిక సచివాలయం, జల్సాలు, ఈవెంట్లు, దుబారాల కోసం మొత్తం 27,101 కోట్ల రూపాయలు వ్యయం చేశారు. ఇందులో పెద్ద మొత్తంలో ప్రభుత్వ పెద్దలు భారీగా ఆర్థిక ప్రయోజనాలు పొందారని స్పష్టం అవుతోంది. ఖజానా నుంచే దోపిడీకి పాల్పడటంలో ఈ సర్కారు అందెవేసిన చేయిగా మారిపోయిందని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. కాంట్రాక్టర్లకు జీవో 22 ప్రకారం అంచనాలను పెంచేసి ఎస్కలేషన్ పేరుతో ఏకంగా 9,100 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించింది. దీని వల్ల అదనంగా ఎటువంటి ఆస్తి సమకూరకపోగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల జేబులు మాత్రం కమీషన్ల రూపంలో నిండాయనేది జగమెరిగిన సత్యం అని అధికారవర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఆస్తుల కల్పనకు చేసిన వ్యయంలో ఇప్పటివరకు ఒక్క శాశ్వత ఆస్తిని కూడా కల్పించకపోగా తాత్కాలిక సచివాలయం పేరుతో 1,000 కోట్ల రూపాయలను వ్యయం చేసింది. అలాగే ఈవెంట్లు, ముఖ్యమంత్రి భవనాలు మరమ్మతులు, లగ్జరీ జల్సాల కోసం గత నాలుగేళ్లలో ఏకంగా 2,615 కోట్ల రూపాయలు వ్యయం చేశారు. ఈ సొమ్ము వ్యయాన్ని నివారించదగినదని, అయితే ఒక పక్క ప్రజల నుంచి విరాళాలను సేకరిస్తూ మరో పక్క పెద్దఎత్తున జల్సాలకు వ్యయం చేయడాన్ని అధికార వర్గాలు తప్పుపడుతున్నాయి. మరో పక్క ఐటీ పేరుతో ఎటువంటి ఆస్తులు ఒనగూరని రంగానికి భారీగా వ్యయం చేస్తున్నారని ఆర్థిక శాఖ వర్గాలు తప్పుపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులను కాదని ప్రైవేట్ సంస్థలు చేయాల్సిన పనులకు రాష్ట్ర ఖజానా నుంచి నిధులను వెచ్చిస్తున్నారని, ఇందులో భారీ దోపిడీ జరుగుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే రాష్ట్ర ఖజానాను సొంత ఖజానాగా సర్కారు మార్చేసిందని, లెక్కాపత్రం లేకుండా వ్యవహరిస్తోందని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇంత అప్పు చేసిన రాష్ట్ర సర్కారు కేవలం తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక పట్టిసీమ తప్ప ఎటువంటి శాశ్వత ఆస్తులను కల్పించలేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంత అప్పులు చేసినా శాశ్వత ఆస్తి కల్పించకపోయినా కేంద్రం నుంచి గత నాలుగేళ్లలో రాష్ట్రానికి నిబంధనల మేరకు పన్నుల వాటా రూపంలో రావాల్సిన నిధులు 88,214 కోట్ల రూపాయలు వచ్చాయి. ఇదే కాకుండా వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలు, రెవెన్యూ లోటు రూపంలో కేంద్రం నుంచి గత నాలుగేళ్లలో గ్రాంటు రూపంలో 84,245 కోట్ల రూపాయలు వచ్చినట్లు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘానికి సమర్పించిన నివేదికలో స్పష్టం చేసింది. అంటే కేంద్రం నుంచి పన్నుల వాటా రూపంలో, గ్రాంటు రూపంలో నాలుగేళ్లలో 1,72,428 కోట్ల రూపాయలు వచ్చినట్లు స్పష్టమైంది. కేంద్రం గ్రాంటు రూపంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన నిధులను కూడా వెచ్చించకుండా ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. అంతే కాకుండా పట్టణ పేదలకు సబ్సిడీపై మూడు లక్షల రూపాయల వ్యయంతో ఇంటి నిర్మాణం చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు లక్షల రూపాయలు పేదవాడి పేరు మీద అప్పు చేయిస్తోంది. అలాగే రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు కేంద్రం ఇచ్చిన 1500 కోట్ల రూపాయల నిధులను శాశ్వత భవనాలకు కాకుండా తాత్కాలిక భవనాలకు వెచ్చించారు. అంతే కాకుండా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు ఇచ్చిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుకు వెచ్చించడం లేదు. దీనికి అదనంగా రాష్ట్ర సొంత, పన్నేతర ఆదాయం ఎలాగా ఉంది. ఉద్యోగుల జీత భత్యాలు, ఇతర నిర్వహణ వ్యయం పోగా మిగతా మొత్తాన్ని ఆస్తుల కల్పనకు వెచ్చించకుండా దుబారాకు, కమీషన్లు వచ్చే రంగాలకు వెచ్చిస్తున్న విషయం తేటతెల్లం అవుతోంది. మరో పక్క రెవెన్యూ వ్యయం ఏటేటా భారీగా పెరిగిపోతోంది.

– సి. మాణిక్యాలరావు, సాక్షి ప్రతినిధి

తిరోగమనంలో ప్రాథమిక వ్యవసాయం

మరో పక్క ప్రాథమిక వ్యవసాయ వృద్ధి తొలి మూడు ఆర్థిక సంవత్సరాల్లో తిరోగమనంలో ఉన్నప్పటికీ ఉద్యానవనం, చేపలు, మాంసం వృద్ధిలతో ప్రాథమిక వ్యయం కలిపేసి రెండంకెల వృద్ధి అంటూ చంద్రబాబు సర్కారు గొప్పలు చెప్పుకుంటోందని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ప్రణాళికా శాఖ గత ఆర్థిక సంవత్సరంలో ముద్రించిన వృద్ధి రేటు గణాంకాలు ప్రాథమిక వ్యవసాయం తిరోగమనంలో ఉన్నట్లు తేటతెల్లం చేస్తున్నాయి. ఆ వివరాలు...

ఆర్థిక సంవత్సరం	వ్యవసాయం వృద్ధి
2014–15	–.35 శాతం
2015–16	–13.16 శాతం
2016–17	–7.01 శాతం

కాగ్ నివేదిక ప్రకారం గత నాలుగేళ్లలో చేసిన అప్పులను అప్పులు తీర్చడానికి, ఆస్తుల కల్పనకు ఎంత వెచ్చించారనే వివరాలు. (రూ.॥ కోట్లలో)

ఆర్థిక సం॥	అప్పులు	కేపిటల్ వ్యయం
2014–15	21,481	6,523
2015–16	53,682	14,172
2016–17	59,923	15,181
2017–18	39,663	13,491

రెవెన్యూ వ్యయం పెరుగుదల (రూ.॥ కోట్లలో)

ఆర్థిక సం॥	రెవెన్యూ వ్యయం
2014–15	79,474
2015–16	95,950
2016–17	1,16,178
2017–18	1,21,214

బడ్జెట్ బయట కార్పొరేషన్ల పేరుతో సర్కారు గ్యారంటీతో ఇప్పటి వరకు చేసిన అప్పుల వివరాలు

రంగం	అప్పు (రూ.॥ కోట్లలో)
పౌరసరఫరాల సంస్థ	13,500
ఏపీసీఆర్‌డీఏ	4,060
జలవనరుల శాఖ	4,000
ఏపీటీఐడీసీఓ	3,150
ఏపీఆర్‌డీసీ	3,000
రైతు సాధికార సంస్థ	3,000
ఏపీఐఐసీ	2,000
ఏపీఎస్ఆర్టీసీ	1,644
తాగునీటి సరఫరా సంస్థ	980
మున్సిపల్ కార్పొరేషన్లు	741
రాష్ట్ర గిడ్డంగుల సంస్థ	308
ఎస్సీ కార్పొరేషన్	235
ఫైబర్‌నెట్	150
మొత్తం	35,768

కేంద్ర పన్నుల వాటాగా రాష్ట్రానికి వచ్చిన నిధులు

ఆర్థిక సం॥	రూ॥ కోట్లలో
2014–15	11,446
2015–16	21,879
2016–17	26,264
2017–18	28,675

కేంద్రం నుంచి పథకాలు, రెవెన్యూ లోటు రూపంలో వచ్చిన నిధులు

ఆర్థిక సం॥	రూ॥ కోట్లలో
2014–15	16,211
2015–16	21,927
2016–17	23,346
2017–18	22,761

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్రం అప్పుల మొత్తం

ఆర్థిక సం॥	రూ॥ కోట్లలో
2014–15	1,48,743.45
2015–16	1,73,853.60
2016–17	2,01,314.08
2017–18	2,59,670.04

సొంత పన్నుల ద్వారా రాష్ట్ర ఆదాయం

ఆర్థిక సం॥	రూ॥ కోట్లలో
2014–15	38,038
2015–16	44,842
2016–17	49,374
2017–18	53,626

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక చేబదుళ్ల వివరాలు

ఆర్థిక సం॥	చేబదుళ్లు	వడ్డీ చెల్లింపు
2014–15	6,201	0.41
2015–16	31,307	54.00
2016–17	29,154	27.00
2017–18	45,860	43.31

అది అజ్ఞానం కన్నా హానికరం..

దారి తెలియని అజ్ఞానం కన్నా దారి తప్పిన విజ్ఞానమే ఎక్కువ నష్టపెడుతుంది. సమాజంలో అసలైన విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పెరిగేలా కృషి జరగాలి. విద్యాధికులు ఈ విషయంలో ముందుండాలి. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవాళ్లు మరింత శ్రద్ధగా ఆ పని చేయాలి. ఇప్పటికే మూఢనమ్మకాలతో దిగజారుతున్న సమాజానికి మరిన్ని మూఢనమ్మకాల్ని పరిచయం చేస్తూ మరింత గందరగోళ పర్చరాదు. జలంధర్ పట్టణంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక భారత సైన్స్ కాంగ్రెస్ 106వ సమావేశాల్లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసంగం శాస్త్రీయ స్ఫూర్తికి విరుద్ధం. ఆయన భారతంలో కౌరవుల జననానికి కారణం స్టెమ్ సెల్ పరిజ్ఞానమంటూ, అలాగే అప్పటి బాణాలు మిస్సైల్ టెక్నాలజీ అంటూ సరికొత్త థియరీలు చెప్పారు. శాస్త్రవేత్తలు, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఆ సమావేశాల వైపు చూస్తున్న దేశప్రజలకు ఒక విశ్వవిద్యాలయ పెద్ద చెప్పవలసిన మాటలా ఇవి? పురాణాల్ని, చరిత్రనీ, సంస్కృతినీ సైన్స్‌తో కలగలిపి వక్రభాష్యాలు చెప్పడంలో ఏ ప్రయోజనం వుంది? మన పూర్వీకులు గొప్పవారని చెప్పాలనుకొంటే చెప్పగలిగిన దృష్టాంతాలు చరిత్రలో కోకొల్లలు. ఆర్యభట్ట, సుశ్రుతుడు, నలంద, తక్షశిల విద్యాలయాలు తదితర విషయాలెన్నో ఉన్నాయి. పురాణాల్లో ఉదంతాల్ని సృజనాత్మకతకి దర్పణంగా వర్ణించవచ్చు. కానీ, తప్పుడు భాష్యాలు కొంప ముంచుతాయి.

సమకాలీనంగా కూడా దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు వెళ్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఒక మంచి వేదికని అశాస్త్రీయ విజ్ఞాన వేదికగా మార్చడం, అదీ బాధ్యతాయుత స్థానంలో ఉండీ చెయ్యడం ఇంకా పెద్ద తప్పు. పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు, పరిశోధనా పత్రాలకు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే పరిస్థితిలో ప్రస్తుతం దేశం లేదు. ఆ వాతావరణం కల్పించడానికి ఎంతో కృషి జరగాల్సి ఉంది. మరోవైపు మూఢనమ్మకాలు ప్రబలి ఆర్థికంగా దేశం నష్టపోతోంది. ప్రభుత్వం కన్నా, విధానకర్తలు కన్నా శాస్త్రీయ దృక్పథం పెంచడంలో విద్యాధికుల పాత్ర ఎక్కువ. అవసరమనుకొంటే ప్రభుత్వాన్ని నిలదీయాలి. శాస్త్రజ్ఞానం వైపు నిలవాలి. ఇకనైనా తన భాష్యం పొరపాటని వీసీ ప్రకటించాలి.

డా॥ డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

రాజ్యాంగేతర పాలన పోవాల్సిందే!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ, క్రమంగా విశ్వ హిందూ పరిషత్, ఆరెస్సెస్, భజరంగ్‌దళ్ తదితర సంస్థల ద్వారా ఉన్మాద చర్యలను రెచ్చగొట్టి, లౌకికవాద పునాదుల నుంచి తప్పుకున్న కారణంగానే, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో చావుదెబ్బ తిన్నది. రాజ్యాంగం మీద విశ్వాసం లేని నరేంద్రమోదీ రాజ్యాంగేతర శక్తిగా మారారు. మనుస్మృతిలో వున్న భావజాలాన్ని నమ్మి విశ్వవిద్యాలయాల్లో దళితుల విద్యను ధ్వంసం చేయడానికి పూనుకున్నారు. హేతువాదుల గొంతునొక్కి, మైనార్టీల హక్కులను కాలరాశారు. ప్రపంచం మొత్తం విజ్ఞానం వైపు పరుగులు తీస్తుంటే భారత్ మౌఢ్యంలో ఇరుక్కోవడానికి మోదీనే కారణం.

ఒక వైపు ప్రపంచ విజ్ఞాన శాస్త్రం, వైద్య శాస్త్రం, మనిషి ఆయుప్రమాణాన్ని పెంచుతుంటే ఆరెస్సెస్. బీజేపీలు మంత్ర తంత్ర వ్యవస్థను విస్తరింపజేసి పూజలు, యాగాలు, యజ్ఞాలు, అభిషేకాలు ఫలాలనిస్తాయని వైద్యశాలలు, శస్త్రచికిత్సలు, వైద్య పరిశోధనలు, భారతీయ వైద్య శాస్త్రానికి భిన్నమైనవని ప్రచారం చేస్తూ ప్రజల్ని యోగులకు, బాబాలకు, స్వాములకు బానిసలు చేస్తూ వెళ్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తూ వెళ్తున్నారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి. ఎందుకంటే దేశంలో విద్య కోసం, విజ్ఞానం కోసం, చట్టరక్షణ కోసం ఎంతో ఖర్చు పెడుతున్నాం. ఇక ఈ వ్యవస్థలన్నీ వ్యర్థం, కోడిగుడ్డు పస్తీ వేసి దొంగల్ని పట్టుకుంటాము అంటే రాజ్యాంగానికి అర్థమేముంది?

మరోవైపున ఆర్థిక వ్యవస్థ కుదేలు అవ్వడానికి మోదీయే కారణం. దేశంలో ఆర్థిక పతనం పెరిగిపోయింది. రూపాయికి విలువ పోయాక ప్రపంచ స్థాయిలో మన దేశం ఎక్కడుంటుందని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఇవాళ మనదేశంలో ప్రమాదకర సన్నివేశం ఆవిష్కృతమవుతోంది. రూపాయి విలువ రోజురోజుకూ దిగజారుతోంది. అవినీతి లేని దేశాల్లో ప్రజలు ఎంతో అభివృద్ధి చెందుతున్నారు. వీరికితోడు బ్యాంకులకు డబ్బు ఎగవేసే పెట్టుబడి దారుల సంఖ్య పెరిగింది.

రూ. 500, రూ. 1000 నోట్లు రద్దు చేసినప్పుడు ఒక్కసారిగా ప్రజలు విలవిలలాడారు. అప్పుడు కూడా ఆయన బాధపడలేదు, సమర్థించుకున్నాడు. కూరగాయలు అమ్మేవాళ్ళు, చిన్న చిన్న కొట్లవాళ్ళు, రోజు కూలీలు, వృద్ధులు ఒక సందర్భంలో టీ నీళ్ళు లేక, తింటానికి అన్నం లేక పస్తులున్నారు. అయినా మోదీ బాధపడలేదు. ఇదంతా వారి కర్మ అనుకునే స్వభావం ఆయనది. మోదీలో ఈ నాలుగున్నర ఏళ్లలో ఎక్కడా మానవతా స్ఫూర్తి కనపడలేదు. స్త్రీలపై కనికరం కనబడలేదు. ఢిల్లీ నడిబొడ్డులో స్త్రీలు మానభంగాలకు గురయ్యారు. ఎన్నో పవిత్ర హత్యలు కులం పేరుతో జరిగాయి. నాయకులకు నీతి నిజాయితీ లోపించాయి. తాగుబోతులుగా, వ్యభిచారులుగా, జూదగాళ్ళుగా, దోపిడీదారులుగా రాజకీయ నాయకులు మారారు. ఇటువంటి శక్తులన్నింటిని అమిత్‌షా, మోదీ ప్రోత్సహిస్తూ వచ్చారు.

కాన్షీరామ్ కాంగ్రెస్‌ను బ్రాహ్మణవాద పార్టీలో మొదటిదని, బీజేపీని బ్రాహ్మణవాద పార్టీలో రెండవదని చెబుతూ ఉండేవారు. దళితులు, బహుజనులు ఓటు శక్తిని తెలుసుకోవాలి. ఓటును అమ్ముకోవడం అంటే గుండెను అమ్ముకోవడమన్నంత చైతన్యం రావాలి. దళితులకు అంబేడ్కర్ ఇచ్చిన బంగారు కానుక ఓటు. దాన్ని కేవలం మందుకు, మాయమాటలకు, డబ్బుకు అమ్ముకోవడం దళితుల వెనుకబాటుతనానికి నిదర్శనం. దళిత బహుజనులు తమ ఓటు తాము నిజాయితీగా వేసుకున్న రోజున వారికి సంపదలో భాగస్వామ్యం వస్తుంది. అంబేడ్కర్ బానిసత్వాన్ని వదిలించుకొనే శక్తి నీకే రావాలని బోధించాడు. ఇతరులు మీకు బానిసత్వాన్ని నేర్పుతారు. బానిసత్వాన్ని వదిలించరు. బానిసత్వం అనేది ఒక వ్యసనం. అలసత్వం అనేది ఒక వ్యాధి. ఈ రెండింటి నుంచి దళితులు బయటపడాలి.


అంబేడ్కర్ ఎంతో పోరాడి తెచ్చిన ఓటును వివేచనా రహితంగా అమ్ముకోవడం వల్ల భారతదేశంలో రాజకీయ పరిణామం ఆలస్యమైపోతుంది. అందుకే మహాత్మాఫూలే, అంబేడ్కర్ భావజాలంతో కూడిన రాజ్యాధికార శక్తులు ముందుకు రావాలి. వామపక్షాలు వీరితో చేతులు కలపాలి. ఏది ఏమైనా చరిత్రలో మార్పు అనివార్యం. ప్రజలు ఆలోచిస్తున్నారనడానికి మోదీ తిరోగమనమే నిదర్శనం.

వ్యాసకర్త సామాజిక తత్వవేత్త, నవ్యాంధ్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు। 98497 41695

రెండు మహావృక్షాలు

ఒక విత్తనం మొలకెత్తి మొక్కై, చెట్టై, మహావృక్షం కావాలంటే మూలంలో బలం ఉండాలి. సారవంతమైన కొమ్మలతో విస్తరించాలి. పళ్లు, పూలతో ఆ వృక్షం వైభవంగా విలసిల్లాలి. అది మంచి వృక్షమైతే లోకహితం కోసం సువాసనలు వెదజల్లుతుంది. పరోపకారం కోసమే జీవిస్తుంది. ధర్మ గుణానికి ప్రతీకగా నిలుస్తుంది. చెట్టు బలం అంతా వేరులోనే ఉంటుంది. చెట్టంత మనిషి అని పొడవుగా, బలంగా ఉండే మనిషిని చెట్టుతో పోలుస్తారు. కానీ, చెట్టులా పరోపకార గుణంతో వర్ధిల్లే వారితో పోల్చాలని ఒక ఆధునిక కవి చెప్పారు.

చెట్టుకు, మనిషికి ధర్మగుణంలో చాలా పోలికలున్నాయి. చెట్టులా కొందరు వ్యక్తులు ప్రతిఫలాపేక్ష లేకుండా ఇతరుల కోసమే జీవించే వారుంటారు. వృక్షంలాగానే మనుషులు హుందాగా జీవించాలంటే నీతివంతంగా, ఆదర్శవంతంగా ఉండాలంటే తల్లిదండ్రుల పెంపకం బాగుండాలి. చుట్టూ ఉన్న వ్యక్తులు మంచివారై ఉండాలి. మహా భారతంలో ధర్మరాజును ధర్మ వృక్షంతోను, దుర్యోధనుని అధర్మ వృక్షంతోను పోలుస్తారు. ధర్మరాజు ధర్మతరువు. పరమాత్ముడైన కృష్ణుడు ఈ తరువుకు మూలం. ధర్మరాజు అరణ్యవాసంలో మహర్షుల ద్వారా ఎన్నో విషయాలు



జ్యోతిర్మయం

తెలుసుకుని జ్ఞాన సంపదను పెంచుకున్నాడు. అందుకే, సత్సాంగత్యం మనిషినెప్పుడూ ధర్మంవైపు నడిపిస్తుంది. తాత్కాలికంగా ఇబ్బందులెదురైనా శాశ్వతానందం లభిస్తుంది. దుర్యోధనుడు దుశ్శాసనాదులతో కలిసి కపట జూదంలోను, అరణ్యవాసంలో కొన్ని సందర్భాలలో తమ మాటలతో, చేష్టలతో పాండవులను బాధించి తాత్కాలికానందం పొందినా తన చెడ్డ పనుల వల్ల లోకనింద పొందాడు.

దుర్యోధనుడు అధర్మ తరువు. క్రోధ రూప మహావృక్షం. ఆ క్రోధానికి కారణం ఈర్ష్య. అన్యాయంగా పాండవుల రాజ్యాన్ని పొందాలన్న దురాశ. ఆ కోపం అతని చేత అనేక కార్యాలను చేయించింది. చివరికి పాండవులతో యుద్ధం చేసి తనవారినందరినీ కోల్పోయాడు. రోషమయ వృక్షం నిస్సారమైనదని నిరూపించాడు.

దుర్యోధనుడనే క్రోధరూప మహావృక్షానికి రూపుదాల్చిన మోహమైన ధృతరాష్ట్రుడు మూలం. దుర్యోధనుడు చేసే చెడుపనులన్నీ పుత్ర వ్యామోహంతో అతడు సమర్థించాడు. కొడుకు రోషమయ తరువుగా ఎదగటానికి దోహదమయ్యాడు. తండ్రి కొడుకుతో ఎలా ప్రవర్తించకూడదో ఇది చెబుతుంది. తమ వ్యక్తిత్వ వికాసానికి, జీవన ప్రస్థానానికి మార్గదర్శిగా ధర్మరాజుని ఎన్నుకోవాలా, దుర్యోధనుని ఎన్నుకోవాలా అన్నది మనుషుల వివేకంపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండు మహావృక్షాలు రెండు భిన్న వ్యక్తిత్వాలకు ప్రతీకలు.

– వాసంతి


ముంబైలో ప్రధాని మోదీ బయోపిక్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్

పౌరసత్వ బిల్లుకు కేబినెట్ ఓకే

- పాక్, అఫ్గాన్, బంగ్లాదేశ్ మైనారిటీల పౌరసత్వానికి సుముఖం
- బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, తృణమూల్, సీపీఎం
- పార్లమెంటులో అడ్డుకుంటామన్న జేడీయూ, శివసేన

న్యూఢిల్లీ/ గువాహటి: కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ దేశాలకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ ముసాయిదా బిల్లు–2018కు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మిత్రపక్షం అస్సాం గణపరిషత్(ఏజీపీ) సహా ఈశాన్య రాష్ట్రాల్లోని పలు విద్యార్థి సంఘాలు, నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ కేంద్రం ముందుకు వెళ్లేందుకే నిర్ణయించింది. ఈ బిల్లును మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. 2016లో తొలిసారి లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని(జేపీసీ) ప్రభుత్వం అప్పట్లో నియమించింది. అస్సాం, మేఘాలయలతో పాటు గుజరాత్, రాజస్తాన్‌లో పర్యటించిన ఈ కమిటీ.. ప్రజలు, నేతలు, నిపుణులు, వేర్వేరు సంఘాల అభిప్రాయాన్ని సేకరించింది. అలాగే అస్సాం, బిహార్, జార్ఖండ్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో పాటు డీజీపీలతో చర్చించింది. ఈ నివేదికను సోమవారం కమిటీ లోక్‌సభకు సమర్పించగా, కొన్ని గంటల్లోనే కేంద్రం తుది నిర్ణయం తీసుకుంది.

ఐదేళ్లలో హిందువులు మైనారిటీలవుతారు

పౌరసత్వ బిల్లుపై అస్సాం మంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వశర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టాన్ని తీసుకురాకుంటే రాబోయే ఐదేళ్లలో అస్సాంలో హిందువులు మైనారిటీలుగా మారిపోతారని హెచ్చరించారు. అలా జరిగితే అస్సాం మరో కశ్మీర్‌గా మార్చాలనుకుంటున్న శక్తులకు లాభం చేకూరుతుందన్నారు. ఇది జిన్నా వారసత్వానికి, భారత వారసత్వానికి యుద్ధమని ఆయన తెలిపారు. మరోవైపు, ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించబోదని అస్సాం సీఎం సోనోవాల్ చెప్పారు.

మద్దతు ఉపసంహరించుకున్న ఏజీపీ

కేబినెట్ పౌరసత్వ ముసాయిదా (సవరణ) బిల్లు–2018ను ఆమోదించడంతో అస్సాంలో బీజేపీ ప్రభుత్వానికి తమ 14 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు మిత్రపక్షం అస్సాం గణపరిషత్(ఏజీపీ) ప్రకటించింది. ఈ విషయమై ఏజీపీ అధ్యక్షుడు, అస్సాం మంత్రి అతుల్ బోరా మాట్లాడుతూ.. 'ఈ బిల్లును ప్రవేశపెట్టకుండా ఆపేందుకు చివరి ప్రయత్నంగా హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశాం. దీనివల్ల అస్సాం ఒప్పందం, జాతీయ పౌర రిజిస్టర్(ఎన్‌ఆర్సీ) ప్రక్రియ నిర్వీర్యం అవుతాయని వివరించాం. మేం ఎన్డీయే కూటమిలో చేరినప్పుడు అక్రమ వలసదారుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. కానీ బీజేపీ ఇంత ద్రోహం చేస్తుందని అనుకోలేదు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై విచారిస్తున్నాం' అని తెలిపారు. ఏజీపీ మద్దతు ఉపసంహరణతో అస్సాంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రస్తుతం వచ్చిన ఇబ్బందేమీ లేదు. మొత్తం 126 స్థానాలున్న అస్సాం అసెంబ్లీలో బీజేపీకి ప్రస్తుతం 74 మంది సభ్యుల బలముంది. 61 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీకి బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్(12), ఓ స్వతంత్ర అభ్యర్థి మద్దతు ఇస్తున్నారు. కాగా, పౌరసత్వ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించడంతో అస్సాం అంతటా ఆందోళనలు మొదలయ్యాయి. పౌర సంఘాలు, అల్ఫాతో కాంగ్రెస్, సీపీఐ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పార్లమెంటుతోపాటు అస్సాం భవన్ ముందు ఏఏఎస్‌యూ, కేఎంఎస్ఎస్ సభ్యులు నగ్నంగా నిరసన తెలిపారు.


గువాహటిలో పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా కాగడాలతో కాంగ్రెస్ నేతల నిరసన

కటాఫ్.. 2014, డిసెంబర్ 31

బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లో వివక్షకు గురై భారత్‌ను ఆశ్రయించిన మైనారిటీలకు పౌరసత్వం ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమని సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) తన నివేదికలో తెలిపింది. బీజేపీ ఎంపీ రాజేంద్ర అగ్రవాల్ అధ్యక్షతన ఏర్పాటైన జేపీసీ తన 440 పేజీల నివేదికలో 'వలసదారులకు అధికారికంగా పౌరసత్వం ఇచ్చేందుకు కేంద్రం 2014, డిసెంబర్ 31ని కటాఫ్ తేదీగా నిర్ణయించింది. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ వలసదారులు దేశంలోకి ప్రవేశించకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం వీలవుతుంది. అంతేకాకుండా వలసదారుల ముసుగులో పొరుగుదేశాలు పన్నే కుట్రలను తిప్పికొట్టవచ్చు' అని తెలిపింది. పలువురు అడ్డుచెప్పినప్పటికీ చివరికి మెజారిటీ ఓటుతో నివేదికకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.


ముసాయిదా బిల్లులో ఏముందంటే..

ఈ ముసాయిదా బిల్లు ప్రకారం అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన మైనారిటీలు అంటే.. హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, జైనులు, పార్సీలు, బౌద్ధులకు పౌరసత్వం కల్పిస్తారు. సరైన పత్రాలు లేకపోయినా వీరు కనీసం ఆరేళ్ల పాటు భారత్‌లో నివాసముంటే పౌరసత్వం ఇస్తారు. ఇందుకోసం పౌరసత్వ చట్టం–1955ను సవరించాల్సి ఉంటుంది. అయితే దీనిపై అస్సాం, మేఘాలయ, మిజోరం సహా ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. 1971, మార్చి 24 తర్వాత రాష్ట్రానికి వచ్చిన విదేశీయులను మతాలతో సంబంధం లేకుండా బయటకు పంపాలని అస్సాం ఒప్పందం–1985 చెబుతోంది. తాజాగా ఈ పౌరసత్వ ముసాయిదా బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే అస్సాం ఒప్పందం నిర్వీర్యమై పోతుందని అక్కడి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్, తృణమూల్, సీపీఎం ప్రకటించాయి. లౌకిక దేశంలో మతాల ఆధారంగా వ్యక్తులకు పౌరసత్వం ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నాయి. కాగా, ఈ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకిస్తామని ఎన్డీయే మిత్రపక్షాలైన శివసేన, జేడీయూ ప్రకటించాయి. ఈ మూడు దేశాల నుంచి భారత్‌ను ఆశ్రయించే మైనారిటీలకు పౌరసత్వం ఇస్తామని ఎన్నికల్లో బీజేపీ హామీ ఇచ్చింది.

నవోదయ స్కూళ్లలో 5వేల సీట్ల పెంపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో సీట్లను కేంద్రం మరో 5 వేలు పెంచింది. తాజా పెంపుతో నవోదయ విద్యాలయాల్లో అందుబాటులో ఉండే సీట్ల సంఖ్య 46,600 నుంచి 51వేలకు పెరిగింది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి ఈ పెంపుదల అమల్లోకి వస్తుందని కేంద్రం తెలిపింది. నవోదయ పాఠశాలల్లో ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం గురుకుల తరహా ఉచిత విద్యనందిస్తోంది. దేశంలో ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహించే విద్యా సంస్థలు నవోదయ విద్యాలయాలే. 2001లో దేశ వ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు హాజరుకాగా 2019లో ప్రవేశ పరీక్షకు నమోదు చేయించుకున్న విద్యార్థుల సంఖ్య 31 లక్షలకు చేరుకుంది. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లోనూ నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి జవడేకర్ తెలిపారు.

ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం ఫోన్ చేశారు. పలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై వీరు చర్చించారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పుతిన్.. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. గత ఏడాది మేలో రష్యాలోని సోచిలో ఇద్దరు నేతల చర్చలు, పుతిన్ భారత్ పర్యటనల ద్వారా అత్యంత కీలకమైన ఉమ్మడి భాగస్వామ్యంలో అధిగమించిన మైలురాళ్లను, సాధించిన విజయాలపై ఇద్దరు సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ రంగం, ఉగ్రవాద వ్యతిరేక చర్యలను మోదీ, పుతిన్ చర్చించారు. అంతర్జాతీయ అంశాలతోపాటు ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, తదితర ప్రపంచ వేదికలపై పరస్పర సహకారాన్ని కొనసాగించాలని నిర్ణయించారని విదేశాంగ శాఖ తెలిపింది. రష్యాలోని వ్లాడివొస్టోక్‌లో సెప్టెంబర్‌లో జరగనున్న ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని మోదీని పుతిన్ ఆహ్వానించారు.

కుష్టు ఉందని విడాకులు కుదరదు

న్యూఢిల్లీ: విడాకులు తీసుకోవాలనుకునే భార్య/భర్త తమ జీవిత భాగస్వామికి కుష్టు వ్యాధి ఉందనే కారణం చూపడం కుదరదు. ఈ మేరకు చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. 'జీవిత భాగస్వామికి కుష్టు వ్యాధి ఉందనే కారణం చూపి ఇకపై విడాకులు పొందేందుకు వీలుండదు. కుష్టు నయం కాదని ఇదివరకు అందరూ భావించేవారు. కానీ, ఈ వ్యాధికి చికిత్స ఉంది' అని వ్యక్తిగత చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా జరిగిన చర్చలో న్యాయశాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్షను చూపుతున్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వివాహ చట్టాల్లో ఈ మేరకు ప్రభుత్వం మార్పులు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ చర్చలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. దేశంలో కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించలేదు. ప్రభుత్వం ముస్లిం వ్యక్తిగత చట్టాల్లో జోక్యం చేసుకోవద్దు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో కుష్టు వ్యాధిని కారణంగా చూపి విడాకులు తీసుకునేందుకు చట్టం అనుమతిస్తోంది' అని చెప్పారు.

సెక్షన్ రద్దు చేసినా ఇప్పటికీ అరెస్టులా?



న్యూఢిల్లీ: ఇంటర్‌నెట్‌లో భావప్రకటనా స్వేచ్ఛపై గతంలో సెక్షన్ 66ఏపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలపై కేంద్రాన్ని సోమవారం వివరణ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఇప్పటికీ ఈ సెక్షన్‌ను ఉపయోగించి అరెస్టులు జరుగుతున్నాయన్న పిల్‌పై అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. 2015 మార్చి 24న ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా వ్యవహరించే అధికారులను అరెస్టుచేసి జైలుకు పంపాలని, జస్టిస్ నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. 2015లో సుప్రీంకోర్టు రద్దుచేసిన ఈ సెక్షన్ ఆధారంగా ఇప్పటివరకు 22 మందిని అరెస్టు చేశారని, పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది సంజయ్ పారిఖ్ న్యాయస్థానానికి తెలిపారు.

కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోవు

బెంగళూరు: కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికతల వల్ల మనుషులకు ఉద్యోగాలు ఉండవన్నది నిజం కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి అన్నారు. వాస్తవానికి ఏఐ, మెషీన్ లెర్నింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి వాటి వల్ల మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు వస్తాయన్నారు. వెట్టి చాకిరీని వదిలిపెట్టి సౌకర్యవంతంగా జీవించేందుకు, పనులను మరింత సులువుగా చేసుకునేందుకు సాంకేతికత అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. బెంగళూరులో జరిగిన 'ఇన్ఫోసిస్ ప్రైజ్' అనే వార్షిక బహుమతుల ప్రదాన వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'కంప్యూటర్ సైన్స్‌లో కృత్రిమ మేధ కచ్చితంగా ముఖ్యమైన అంశం. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) వంటి వాటి వల్ల మనుషులు జీవితాలు మరింత సౌకర్యవంతంగా మారుతాయి. ఉద్యోగాలు కూడా మరిన్ని పెరుగుతాయి. అలాగే ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) నివేదిక ప్రకారం పని ప్రదేశాల్లోని యంత్రాల్లో జరుగుతున్న మార్పులు 13.3 కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టించగలవు' అని వివరించారు.

పెట్రోల్ పంపుల్లో ఫాస్‌ట్యాగ్‌లు

న్యూఢిల్లీ: టోల్‌ప్లాజాల వద్ద వాహన క్యూలను తగ్గించే ఫాస్‌ట్యాగ్‌లు ఇకపై పెట్రోల్ పంపుల్లోనూ అందుబాటులోకి రానున్నాయి. వాహనం విండ్ స్క్రీన్‌పై అతికించే ఈ ఫాస్‌ట్యాగ్స్ ద్వారా టోల్ ప్లాజాల వద్ద రుసుము ఆటోమేటిక్‌గా జమ అవుతుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్‌ఎఫ్‌ఐడీ) విధానం ద్వారా లింక్ అయి ఉన్న ప్రీపెయిడ్ లేదా సేవింగ్ అకౌంట్ నుంచి నేరుగా లావాదేవీ జరిగిపోతుంది. దీనివల్ల ప్లాజాల వద్ద వాహనాలు ఆపే అవసరం ఉండదు. ఈ ఫాస్ ట్యాగ్‌లను దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ పంపుల వద్ద త్వరలోనే అందుబాటులో ఉంచుతారు. వీటితో పార్కింగ్ ఫీజు చెల్లింపులు, పెట్రోల్ కొనుగోలు కూడా చేసుకోవచ్చు. ఫాస్‌ట్యాగ్‌ల విక్రయం, పంపిణీకి సంబంధించి పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయం తెలిపారు.


ఈ నెల 15 నుంచి యూపీలోని ప్రయాగరాజ్ (అలహాబాద్)లో ప్రారంభమయ్యే కుంభమేళాకు భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు ఇవి. ఈ క్రతువు మార్చి 4 వరకు కొనసాగనుంది.

ప్రభుత్వానికి సీబీఐ పెంపుడు చిలుక

- అఖిలేశ్‌పై సీబీఐ దర్యాప్తు వార్తలపై పార్లమెంట్ స్తంభన
- లోక్‌సభలో టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యుల సస్పెన్షన్
- హెచ్‌ఏఎల్‌పై తప్పుదోవ పట్టిస్తున్నారు: రక్షణమంత్రి


రాజ్యసభ వెల్‌లోకి వచ్చి నిరసన తెలుపుతున్న ప్రతిపక్షాల నేతలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం సీబీఐని పెంపుడు చిలకలా మార్చేసిందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ఆరోపించింది. సీబీఐని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందనీ, ఆ సంస్థ అధికార పార్టీకి తొత్తుగా మారిందని విమర్శించింది. ఇసుక కుంభకోణానికి సంబంధించి ఎస్పీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ ప్రశ్నించనుందనే వార్తలు సోమవారం పార్లమెంట్‌ను కుదిపివేశాయి. లోక్‌సభలో సమాజ్‌వాదీ సభ్యులు ఆగ్రహంతో తమ వద్ద ఉన్న పత్రాలను చించివేసి, పెద్దగా నినాదాలు చేసుకుంటూ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభ సెక్రటరీ జనరల్ డెస్క్‌లోని అధికారుల వద్ద ఉన్న పత్రాలను లాక్కునేందుకు కూడా ప్రయత్నించారు. ఇదే అంశంపై రాజ్యసభలో ఎస్పీ, బీఎస్పీ, ఆప్, ఆర్‌జేడీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. వీరితోపాటు రఫేల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించాలని ఉభయ సభల్లోనూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. కావేరీ నదిపై కర్ణాటకలో డ్యామ్ నిర్మాణాన్ని ఆపాలంటూ ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లో నిలబడ్డారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకుగాను ఏఐఏడీఎంకేకు చెందిన ముగ్గురు, టీడీపీ సభ్యుడు ఒకరిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఈ గందరగోళం మధ్యనే పర్సనల్ లా, బాలలకు ఉచిత నిర్బంధ విద్య, ఉపాధ్యాయ విద్య జాతీయ కౌన్సిల్ సవరణ బిల్లులను లోక్‌సభ ఆమోదించింది.

కాంగ్రెస్‌వి దురుద్దేశపూరిత సందేహాలు

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)కు రూ.లక్ష కోట్ల విలువైన కాంట్రాక్టులిచ్చినట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన అబద్ధమంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మంత్రి నిర్మలా సీతారామన్ సభకు వివరణ ఇచ్చారు. '2014–18 మధ్య కాలంలో హెచ్‌ఏఎల్‌కు ప్రభుత్వం రూ.26వేల కోట్ల విలువైన కాంట్రాక్టులిచ్చింది. మరో రూ.73 వేల కోట్ల ఆర్డర్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో 83 తేజస్ విమానాలు (రూ.50 వేల కోట్లు), 200 హెలికాప్టర్లు (20 వేల కోట్లు), 19 డార్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు (3,400 కోట్లు), ఇతర రకాల హెలికాప్టర్లు (15 వేల కోట్లు), ఏరో ఇంజిన్ (8,400 కోట్లు) ఉన్నాయి. ప్రతిపక్షం అసత్యాలు చెబుతూ తప్పుదోవ పట్టిస్తోంది' అని పేర్కొన్నారు. అయితే, సభను మంత్రి తప్పుదోవ పట్టించినందున సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ తెలిపారు. హెచ్‌ఏఎల్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందంటూ ఆ సంస్థ సీఎండీ మాధవన్ ప్రకటించిన నేపథ్యంలో దీనిపై విచారణకు జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు.

రాజ్యసభ పొడిగింపు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలను కేంద్రం మరో రోజు పొడిగించాలని నిర్ణయించింది. ఈబీసీ కోటా బిల్లును ప్రవేశపెట్టేందుకు వీలుగా 9వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని అంగీకరించిన రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



అంబానీ కోసమే...

హెచ్‌ఏఎల్‌ను బలహీనపరుస్తున్నారు: రాహుల్

న్యూఢిల్లీ: రఫేల్ ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరింత స్వరం పెంచారు. సోమవారం పార్లమెంట్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్లుగా రూ.లక్ష కోట్ల కాంట్రాక్టుల్లో హెచ్‌ఏఎల్‌కు ఒక్క ఆర్డర్ కానీ, ఒక్క రూపాయి కానీ ప్రభుత్వం నుంచి రాలేదు. ఆమె రక్షణ మంత్రిగా కాదు, మోదీకి అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారు' అని అన్నారు. మోదీ ప్రభుత్వం అనిల్ అంబానీకి లాభం చేకూర్చేందుకే ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్‌ను బలహీనపరుస్తోందని ఆరోపించారు. 'ఎంతో అనుభవం, ప్రతిభావంతులైన ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు ఉన్న హెచ్‌ఏఎల్‌కు రూ.15,700 కోట్లను చెల్లించకుండా ప్రభుత్వం నిలిపివేసింది. ఆ సంస్థను ఆర్థికంగా దెబ్బకొట్టిన విషయంలో సమాధానం చెప్పేందుకు చౌకీదార్ (ప్రధాని మోదీ) సభలో ఉండరు. సభకు రావడానికి ఆయన భయపడుతున్నారు' అని రాహుల్ ఎద్దేవా చేశారు.

బంగ్లా ప్రధానిగా హసీనా ప్రమాణం


ప్రమాణం అనంతరం పత్రాలపై సంతకం చేస్తున్న హసీనా. పక్కన అధ్యక్షుడు హమీద్

ఢాకా: నాలుగోసారి బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా ఎన్నికైన ఆవామీ లీగ్ అధినేత షేక్ హసీనా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. బంగ్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ హసీనాతో బంగాభవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం 24 మంది కేబినెట్ మంత్రులుగా, 19 సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈసారి కేబినెట్‌లో 31 మంది కొత్తవారికి అవకాశం కల్పించారు. ఆవామీ లీగ్‌తో జతకట్టిన కూటమి పార్టీలకు చెందిన మాజీ మంత్రులకు స్థానం కల్పించలేదు. ఆవామీ లీగ్‌కు చెందిన వారిని మాత్రమే మంత్రులుగా ఎంపిక చేశారు. వరుసగా మూడుసార్లు, మొత్తంగా 4సార్లు బంగ్లాకు ప్రధానిగా ఎన్నికై హసీనా రికార్డు సృష్టించారు. 1996, 2008, 2014వ సంవత్సరాల్లో ఆమె ప్రధానిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ 11వ పార్లమెంటు ఎన్నికల్లో హసీనా నేతృత్వంలోని మహాకూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మహాకూటమి 96% సీట్లను సాధించింది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, ఓటర్లను భయపెట్టి హింసకు పాల్పడ్డారని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ వారిపై దాడులకు పాల్పడటం, హింస చెలరేగడంపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసింది.

ఒకే రోజు 13 అనుమతులిచ్చారు: సీబీఐ

- ఇది యూపీ ఈ–టెండర్ విధానానికి విరుద్ధం
- అఖిలేశ్‌కు విపక్షాల మద్దతు



లక్నో/న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ సీఎంగా ఉన్నప్పుడు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మొత్తం 14 మైనింగ్ లీజులకు ఆమోదం తెలిపారని సీబీఐ సోమవారం తెలిపింది. గనుల శాఖను తనవద్దే ఉంచుకున్న అఖిలేశ్ 13 లీజులను 2013, ఫిబ్రవరి 17న ఒక్క రోజులోనే క్లియర్ చేశారని వెల్లడించింది. ఇది యూపీ ఈ–టెండరింగ్ ప్రక్రియకు విరుద్ధమంది. సీఎం ఆమోదంతో ఈ లీజులను అప్పటి హమీర్పూర్ జిల్లా కలెక్టర్ చంద్రకళ ఇతరులకు కేటాయించారని పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు ఆమోదించిన ఈ–టెండర్ పాలసీ 2012కు విరుద్ధంగా ఈ కేటాయింపులు సాగాయంది.

అఖిలేశ్‌కు మాయావతి ఫోన్

అక్రమ మైనింగ్ కేసులో అఖిలేశ్‌ను సీబీఐ విచారించే అవకాశముందన్న వార్తల నేపథ్యంలో విపక్షాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. బీజేపీ ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేస్తోందని బీఎస్పీ కాంగ్రెస్, ఆప్ ఆరోపించాయి. ఈ సందర్భంగా అఖిలేశ్‌కు ఫోన్ చేసిన బీఎస్పీ చీఫ్ మాయావతి..'ఇలాంటి గిమ్మిక్కులకు భయపడొద్దు. మీకు నా పూర్తి మద్దతు ఉంటుంది. రాజకీయ విభేదాల నేపథ్యంలోనే బీజేపీ ప్రభుత్వం సీబీఐని ఉసిగొల్పుతోంది. రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు యత్నిస్తోంది' అని తెలిపారు. ఎస్పీ–బీఎస్పీ మధ్య పొత్తును అప్రతిష్టపాలు చేసేందుకే కేంద్రం ఇలాంటి వార్తలను వ్యాప్తిచేస్తోందని మండిపడ్డారు. సాక్షాత్తూ కేంద్ర మంత్రి సీబీఐ అధికార ప్రతినిధిగా మీడియా సమావేశం నిర్వహించడం రాజకీయ కుట్ర కాకుంటే మరేంటని ప్రశ్నించారు.

కూటమిని నిలువరించేందుకే: కాంగ్రెస్

2019 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి ఏర్పాటును నిలువరించడానికి విచారణ సంస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. అఖిలేశ్ యాదవ్‌పై కేంద్రం నిసిగ్గుగా సీబీఐని ఉసిగొల్పుతోందని ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు.

ఇదీ ఈబీసీ కోటా కథ

అగ్రవర్ణ పేదలు 6 కోట్లు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు(ఈబీసీ) ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో పదిశాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఎన్నో ఏళ్ల నేపథ్యం ఉంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల కిందకు రాని అగ్రవర్ణ పేదలకు కోటా ఇవ్వాలనే డిమాండ్ 30 ఏళ్ల క్రితమే వచ్చింది. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే అగ్రకులాల పేదలకు రిజర్వేషన్ ఇస్తామని మొదట హామీ ఇచ్చిన రాజకీయ నేత బీఎస్పీ స్థాపకుడు కాన్షీరామ్. తర్వాత ఈ పార్టీ అధ్యక్షురాలు మాయావతి, ఎస్పీ నేత ములాయంసింగ్ యాదవ్ కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు పలికారు. కేంద్రమంత్రి, ఆర్పీఐకి చెందిన రాందాస్ అఠావలే కూడా అనేక సందర్భాల్లో ఈ ప్రతిపాదనను సమర్థించారు.

సిన్హో కమిషన్

సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందని.. అగ్రవర్ణ పేదల కోసం యూపీఏ సర్కారు 'జాతీయ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కమిషన్'ను 2006లో నియమించింది. ఈ వర్గాల జీవన స్థితిగతుల అధ్యయనానికి మేజర్ జనరల్ (రిటైర్డ్) ఎస్ఆర్ సిన్హో చైర్మన్‌గా, మహేంద్రసింగ్ సభ్యులుగా కమిషన్ ఏర్పాటు చేశారు. 2008 జనవరి నాటికి ఈ కమిషన్ నివేదిక ఇవ్వాల్సిఉండగా, అనేక పొడిగింపుల తర్వాత, చివరికి యూపీఏ–2 హయాంలో 2010లో నివేదిక ఇచ్చింది.

కోటి కుటుంబాలు

ఎనిమిదేళ్ల క్రితం అగ్రవర్ణ పేదల సంఖ్య ఆరు కోట్లుగా ఈ కమిషన్ అంచనా వేసింది. దాదాపు కోటి కుటుంబాలున్నాయంది. అగ్రవర్ణ పేదలకు కోటా కల్పించడానికి తొలి అడుగుగా యూపీఏ ఈ కమిషన్‌ను నియమించింది. కమిషన్ సభ్యులు 28 రాష్ట్రాల్లో పర్యటించి సామాజికంగా బలహీనవర్గాలకు(ఎస్సీ, ఎస్టీ, బీసీ) చెందని కులాల జీవన స్థితిగతులను అధ్యయనం చేశారు. ఆదాయ పన్ను కట్టని అగ్ర కులాలకు చెందిన పేదలను ఓబీసీ(అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్)లతో సమానంగా పరిగణించాలనే ప్రతిపాదన మొదట ఈ కమిషన్ చేసింది. ఆర్థికంగా బలహీనులైన ఈ వర్గాలు బీసీల స్థాయిలో ఉన్నారని కూడా తెలిపిందని వార్తలొచ్చాయి. ఓబీసీలతో సమానంగా ఈ అగ్రవర్ణ పేదలను ప్రభుత్వం చూడాలని కమిషన్ కోరింది. ఈ కమిషన్ నివేదికలోని విషయాలను ఇంత వరకూ అధికారికంగా ప్రభుత్వం వెల్లడించలేదు.

రాజ్యాంగ సవరణ అవసరం

సామాజికంగా వెనుకబడని వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలంటే రాజ్యాంగంలోని 15, 16 అధికరణల సవవరణ అవసరం. అలాగే ప్రస్తుత అన్ని కోటాల పరిమితిని 50% నుంచి 60 శాతానికి పెంచడానికి కూడా రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. అన్ని రకాల రిజర్వేషన్ల మొత్తం 50 శాతం దాటకూడదనే సుప్రీంకోర్టు ఉత్తర్వులను అధిగమించాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త కోటా అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలి. అలా చేర్చాక కూడా దాన్ని పరిశీలించే అధికారం తమకు ఉంటుందని 2007లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహానీ వర్సెస్ కేంద్రం కేసులో అన్ని కోటాలకు 50% గరిష్ట పరిమితి విధించింది.

తొలిసారి ఈ పదప్రయోగం

అంబేడ్కర్ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రకటనలో తొలిసారి ఈబీసీ పద ప్రయోగం చోటు చేసుకుంది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో 2014–15 నుంచి అమల్లోకి వచ్చిన డా.అంబేద్కర్ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ ఫర్ ది ఇకనామికల్లీ బ్యాక్వర్డ్ క్లాస్ స్టూడెంట్స్ అనే పథకంలో తొలిసారి ఆర్థికంగా వెనుకడిన వర్గం (ఈబీసీ) అనే పదం ఉపయోగించారు. జనరల్ కేటగిరీకి చెందిన విద్యార్థులకు ఈ పథకం అమలు చేయడం ప్రారంభించారు. జాతీయ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కమిషన్ తన నివేదికను 2010లో సమర్పించాక ఈ స్కాలర్‌షిప్ పథకం అమలు మొదలైంది.



అమలు అంత తేలిక కాదు

ఈబీసీ కోటా అమలుకు లబ్ధిదారులను గుర్తించడం చాలా కష్టమని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ దళిత ఐఏఎస్ అధికారి చెప్పారు. ఈబీసీ అనే ప్రత్యేక వర్గాన్ని సృష్టించడం ద్వారా జనరల్ కేటగిరీని విభజించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. కోటా విషయంలో ఓబీసీ(అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్)లను వర్గీకరించడానికి నియమించిన ఐదుగురు సభ్యుల కమిషన్ ఏడాదిన్నర దాటినా ఆ పని పూర్తి చేయలేదు. రిజర్వేషన్‌కు సంబంధించి ఎలాంటి మార్పు చేయాలన్నా జాప్యం జరుగుతుందనడానికి ఇదే తార్కాణం.

మతం ప్రాతిపదికన కోటా కుదరదు

జాతీయస్థాయిలో మతం ప్రాతిపదికన రిజర్వేషన్‌కు అవకాశం లేకున్నా కొన్ని రాష్ట్రాల్లో మతపరమైన మైనారిటీలకు కోటాలు ఇస్తున్నారు. అలాగే ప్రస్తుతం తమిళనాడు, మహారాష్ట్రలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. సగానికి మించి కోటా అవసరమని తగినన్ని సాక్ష్యాధారాలు అందజేస్తే అందుకు అనుమతిస్తామని సుప్రీంకోర్టు 2010లో ప్రకటించింది.



తన నిర్ణయంపై జగన్ స్ట్రాంగ్‌గా ఉన్నాడు

ప్రశ్న: ఒంటరిపోరు అని జగన్ గారు స్పష్టం చేస్తున్నారు. మీకెట్లా అనిపిస్తోంది.. ప్రజల్లో దానిపట్ల సానుకూలత వస్తుందని భావిస్తారా?

విజయమ్మ: జగన్ ఒకటే చెబుతున్నాడు. మహాకూటమిగా అంతా కలిసి వచ్చినా తాను ఒంటరిగానే పోటీచేస్తానని చెబుతున్నాడు. ఏ పార్టీతో కలవబోనని చెబుతున్నాడు. గెలిచిన తరువాత అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం.. ఎవరైతే ప్రత్యేక హోదా ఇస్తారో వాళ్ల కోసం చేస్తానని చెబుతున్నాడు. అదే నిర్ణయం. దానిపైనే స్ట్రాంగ్‌గా ఉన్నాడు. పాదయాత్రలో చూసిన తరువాత నిజంగా ప్రజలు జగన్‌ను నమ్ముతున్నారు. కాబట్టి ఈ సారి తప్పనిసరిగా నిలబెడతారని నేను అనుకుంటున్నాను.

అంతిమ విజయం సత్యానిదే

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్సార్ సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ

సాక్షి, అమరావతి

'మనుషులను చూసే కొద్దీ... వాళ్ల బాధలను చూసే కొద్దీ... వాళ్ల కష్టాలను చూసే కొద్దీ తనలో ప్రేమను జగన్ రోజు రోజుకూ పెంచుకోగలుగుతున్నాడు. జగన్ చిన్నవాడైనందున అందరినీ అవ్వా, తాతా, అక్కా, చెల్లీ అని పిలుస్తాడు. ఎవరికి ఏ అవసరం వచ్చినా సొంత మనిషిలా ప్రేమను అందిస్తున్నాడు. ఒక భరోసా ఇస్తున్నాడు. ఆ భరోసా కోసం ఆ ఆప్యాయత చూపుతున్నాడు. అందుకనే తమవాడిలా భావిస్తున్నారు.'

'ఒక నాయకుడ్ని నిలబెట్టింది ఓదార్పుయాత్ర.. పాదయాత్ర ఆ నాయకుడ్ని స్థిరపరిచింది. స్టేబుల్‌గా చేసింది. నవరత్నాలతో ఫలానిది చేస్తానని వాళ్లకు ధైర్యం కలిగించాడు. ఓదార్పునిస్తున్నాడు కాబట్టి వాళ్లు నమ్ముతున్నారు.'

– వైఎస్ విజయమ్మ

ప్రశ్న: నమస్కారం విజయమ్మ గారు... మీకు ముందుగా అభినందనలు. ఇడుపులపాయలో పాదయాత్ర మొదలైనప్పుడు ఇలా పూర్తి అవుతుందని విశ్వాసంతో ఉన్నారా? ఇదివరకు మీరెలా ఫీలయ్యారు?

వైఎస్ విజయమ్మ: స్టార్ట్ చేసిన పనిని ఈ ఇంట్లో ఎవరూ పూర్తి చేయకుండా ఆపలేదు. జగన్ పూర్తి చేస్తాడనే నమ్మకం నాకు మొదటి రోజు నుంచే ఉంది.

ప్రశ్న: ఇప్పుడు గర్వంగా ఫీలవుతున్నారా... మీది పాదయాత్రల కుటుంబంగా మారిందా...? రాష్ట్ర స్థాయిలో గానీ దేశ స్థాయిలో గానీ బహుశా నాకు తెలిసి ఒకే కుటుంబం నుంచి ముగ్గురు ప్రముఖులు పాదయాత్ర చేసిన సందర్భం లేదు. మీరెలా ఫీలవుతున్నారు?

విజయమ్మ: ఒక ఇంట్లో ముగ్గురు పాదయాత్ర చేయడం నిజంగా చరిత్రలో ఎక్కడా ఉండదని అనుకుంటా. మహాత్మాగాంధీ చేశారు గానీ ఒకే ఇంట్లో ముగ్గురు చేయడం చరిత్రలో ఇదే తొలిసారి అనుకుంటా. ఈ పాదయాత్ర నిజంగా చరిత్రాత్మకం. ముగ్గురి లక్ష్యం కూడా ఒకటే ప్రజలతో కలిసి మమేకమవడం. ఒకటే గమ్యం.. ఒకటే లక్ష్యం.. ప్రజల కోసం ప్రజలతో ఉండాలనేదే.

ప్రశ్న: పాదయాత్ర ఆరంభించినప్పుడు నేను మా అబ్బాయిని ప్రజలకే అప్పగిస్తున్నా అని అన్నారుగా.. ఇప్పుడు ప్రజల్లో ఎలాంటి స్పందన ఈ పాదయాత్రలో చూశారు?

విజయమ్మ:వైఎస్సార్ సీపీ మొదటి ప్లీనరీలో జగన్‌ను నేను ప్రజలకు అప్పజెప్పడం జరిగింది. నా బిడ్డ కాదు ఇక మీ బిడ్డ.. జగన్‌ను మీ చేతుల్లో పెడుతున్నానని చెప్పి ప్రజలకు అప్పగించడం జరిగింది. ప్రజలు కూడా అదేవిధంగా ఆయన్ను అక్కున చేర్చుకున్నారు. ఓదార్పు యాత్ర అయినా పాదయాత్ర అయినా అదే అభిమానం చూపారు. ఇంట్లో వాళ్లంతా ఇన్ని వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారంటే ఇది పరుగు పందెం కాదు. ఇది ఇంత అని కొలమానం కూడా కాదు. ప్రజల్లో ఎంత మందితో కలిశాడు? ఎంతమందితో మమేకమయ్యాడు? వాళ్ల సమస్యలు విని ఎంతమందికి విశ్వాసం కలిగించాడు? అనేది ముఖ్యం.

ప్రశ్న: షర్మిల, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ పాదయాత్రలకు మధ్య పోలిక గురించి ఎప్పుడైనా అనుకుంటుంటారా?

విజయమ్మ:ఒక్కొక్కరి పాదయాత్రలో ఒక్కో వైవిధ్యం ఉంది. రాజశేఖర్‌రెడ్డి గారు పాదయాత్ర చేసిన నాటి పరిస్థితులే ఇప్పుడు కూడా పునరావృతమై ప్రజలు అవే ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి జగన్ పాదయాత్ర చేయాల్సిన అవసరం వచ్చింది. కరువుతో ప్రజలు మగ్గిపోతున్నారు. చాలా మంది వలసలు పోతున్నారు. మైక్రో ఫైనాన్స్, ఇతర సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఎక్కడ చూసినా కష్టాల్లో కూరుకుపోయారు. కరెంటు బకాయిలు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. చంద్రబాబు ఏ హామీనీ అమలు చేయలేదు కాబట్టి జగన్ ప్రజల్లోకి వెళ్లాడు. అసెంబ్లీలో తన వాణి వినిపించగలిగినంత వినిపించాడు. ఇది మనమంతా చూశాం.

ప్రశ్న: పాదయాత్రలో కొన్ని ఆశ్చర్యంగా అనిపిస్తాయి. వృద్ధులు ఏదైనా ఇబ్బందులు చెప్పుకునేందుకు వస్తే మనమైతే టచ్ చేయడానికి కూడా వెనుకాడతాం. ఆయన (జగన్) వారితో మమేకమై ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. చాలా మందిని పరామర్శిస్తున్న తీరు అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. అనుకూలురా? వ్యతిరేకులా? అనే అంశంతో సంబంధం జగన్ ఇదంతా చేయగలుగుతున్నాడు. ఈ ఓర్పు, ఇలా డీల్ చేసే పద్ధతి చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందని అనుకుంటున్నారు?

విజయమ్మ:మనుషులను చూసే కొద్దీ... వాళ్ల బాధలను చూసే కొద్దీ... వాళ్ల కష్టాలను చూసే కొద్దీ తనలో ప్రేమను జగన్ రోజు రోజుకూ పెంచుకోగలుగుతున్నాడు. జగన్ చిన్నవాడైనందున అందరినీ అవ్వా, తాతా, అక్కా, చెల్లీ అని పిలుస్తాడు. ఎవరికి ఏ అవసరం వచ్చినా సొంత మనిషిలా ప్రేమను అందిస్తున్నాడు. ఒక భరోసా ఇస్తున్నాడు. ఆ భరోసా కోసం ఆ ఆప్యాయత చూపుతున్నాడు. అందుకనే తమవాడిలా భావిస్తున్నారు. అదే తరహాలో వాళ్లు కూడా అప్యాయత చూపుతున్నారు.

ప్రశ్న: తల్లిగా ఎలా ఫీలవున్నారు. పాదయాత్ర కంప్లీట్ అవుతున్న తీరు...వీటన్నింటిపై..

విజయమ్మ: నిజంగా నేను జగన్‌ను చూసినప్పుడు ఇంతమంది ప్రజలకు ఓదార్పు కాగలుగుతున్నాడు. ఇంతమందికి ధైర్యం చెప్పగలుగుతున్నాడు అని సంతోషం అనిపిస్తుంది.

ప్రశ్న: పాదయాత్రకు గండి కొట్టడానికి కూడా ప్రయత్నాలు జరిగాయంటారా?

విజయమ్మ: పాదయాత్రకు గండి కొట్టడానికి మధ్యలో రకరకాల నిందలు... మనిషిని ఎంత సాబటేజ్ చేయాలంటే అంత చేసే కార్యక్రమం చేస్తున్నారు తెలుగుదేశం పార్టీ వాళ్లు. అలాంటి పరిస్థితుల్లో కూడా అన్నీ ఎదుర్కొంటూ ప్రజల మధ్యలోనే ఉన్నాడు. అన్ని కాలాలు ప్రజల మధ్యలోనే గడిపాడు. ఎండా... వాన... అనకుండా తడుచుకుంటూ ముందుకు వెళ్లాడు. చెప్పాలంటే వాళ్ల నాన్న పోయినప్పటి నుండి తొమ్మిది సంవత్సరాలుగా జగన్ ఏ రోజూ ఇంట్లో ఉన్నది లేదు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యలోనూ, ప్రతి ఇబ్బందిలోనూ పాలు పంచుకుంటూనే ఉన్నాడు. సమైక్య ఉద్యమం, ప్రత్యేక హోదా, ప్రజల ఇతర సమస్యలపై రెండు రోజులు, మూడు రోజులు, ఏడు రోజులు దీక్షలు చేస్తూ తను కడుపు మాడ్చుకుంటూ ప్రజల కోసం ప్రజలతోనే ఉంటూ వచ్చాడు.

ప్రశ్న: ఆ కేసు దర్యాప్తు తీరు సరిగా లేదు. ఎన్ఐఏకి అప్పగించాలని చాలా పోరాటం జరిగిన తర్వాతా వచ్చిన ఆదేశాలపై సహకరించక పోవడం పట్ల మీరు ఎలా స్పందిస్తారు?

విజయమ్మ: వాళ్ల ప్లానింగ్ లేకపోతే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆరోజు రాజశేఖర్‌రెడ్డి గారు ఆయన (చంద్రబాబు)పై అలిపిరిలో దాడి జరిగినప్పుడు వెళ్లి పరామర్శించి దేవుడు కాపాడాడు... గాడ్ గ్రేస్ అని చెప్పి ఆ తర్వాత ఆరోజు గాంధీ విగ్రహం వద్ద ధర్నా కూడా చేశారు. అలాంటి సంస్కృతి ఎక్కడ? ఇలాంటి సంస్కృతి ఎక్కడ? సంఘటన జరిగిన గంటలోనే డీజీపీ అలా మాట్లాడాల్సిన అవసరం ఏముంది...? చంద్రబాబు నాయుడు గారు మాట్లాడాల్సిన అవసరం ఏముంది? నాకు బాధ అనిపిస్తుంది.. నవ్వు కూడా వస్తుంది ఆయన మాట్లాడుతుంటే. అందరూ ఖండిస్తుంటే, ఖండించేవారంతా తన మీద దాడి చేస్తున్నారని మాట్లాడారు ఆయన (చంద్రబాబు) ఆ రోజు. బాధ్యత కలిగిన సీఎంగా ఉంటూ ఖండించకపోగా అలా మాట్లాడారు.

ప్రశ్న: కోడి కత్తి దాడి అని ఎద్దేవా చేస్తూ పత్రికల్లో రాయించడం, ఆయన మాట్లాడటం పట్ల మీరెలా ఫీలవుతున్నారు?

విజయమ్మ: నేనైతే వారి విజ్ఞతకే వదిలేస్తా..

ప్రశ్న: మంచివారికి రాజకీయాల్లో అంతగా పనికి రాదని కూడా అంటుంటారు కదా...?

విజయమ్మ: మంచి.. మంచేనండీ. ఎక్కడున్నా మంచి మంచే. రాజశేఖరరెడ్డి గారు మంచి చేశారు కాబట్టే ఇన్ని కోట్ల మంది గుర్తుపెట్టుకోగలిగారు ఆయన్ను. ఆయనకు స్థానమిచ్చారు. ఈరోజు అందరి ఇళ్లల్లో దేవుడి పక్కన ఆయన ఫొటోలు పెట్టుకుని పూజలు చేస్తా ఉన్నారు. ఈరోజు పెళ్లి చేసుకుంటుంటే నేరుగా ఆయన ఫోటో ఎదుట కార్డు పెట్టేసి వస్తారు. అంతటి స్థానం ఆయనది. ఎప్పుడూ మంచికి మంచి ఉంటుందని నేననుకుంటా.

ప్రశ్న: రాజకీయాల్లో మంచితనం ఒక్కటే సరిపోతుందా? మీ ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు రోజూ అబద్ధాలు ఆడతారని, మోసాలు చేస్తారని జగన్ లేదా వైఎస్సార్ సీపీ నేతలు విమర్శిస్తుంటారు. మరి అబద్ధాలు, మోసాలను ఎదుర్కోగలిగిన సత్తా ఉంటుందా మంచితనానికి?

విజయమ్మ: సత్యం ఎదుర్కొంటుంది. అంతిమ విజయం సత్యానిదే, నిజానిదే.

ప్రశ్న: అయినప్పటికీ ఆయన(చంద్రబాబు) పొత్తులు పెట్టుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నారు, మొన్నటి దాకా బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. ఇప్పుడేమో పవన్‌కల్యాణ్ గారిని రమ్మంటున్నారు. మీకేమనిపిస్తోంది?

విజయమ్మ:ఎవరెవరు కలుస్తారు, ఎవరెవరు ఉంటారనేది వాళ్ల వాళ్ల ఇష్టాలను బట్టి ఉంటుంది. మనం చెప్పాల్సిన పనిలేదు.



అసెంబ్లీలో జరిగిందేమిటి?

ప్రశ్న: అసెంబ్లీని వదిలేసి రోడ్డు వెంబడి నడుస్తున్నాడని, తిరుగుతున్నారని కొంతమంది అంటున్నారు కదా..

విజయమ్మ: నాయకులు ఎవరైనా ప్రజలకు జవాబుదారీ. అకౌంటబులిటీ ప్రజలకు. కాబట్టి ప్రజల పక్షంగా జనం సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీ వేదికగా ఉండాలి. కానీ వేదికగా లేదు. ఎందుకంటే జగన్ ప్రజా సమస్యల గురించి నిలదీస్తే కావాలనే ఇబ్బంది పెట్టేవారు. ఓ పది మందిని నిలబెట్టి తిట్టించేవారు. అయినా కూడా వాళ్ల నాన్నను తిట్టినా, తనను తిట్టినా జగన్ ఎప్పుడూ స్పందించే వాడు కాదు. చాలా కష్టంగా అసెంబ్లీని జరగనిచ్చే వాళ్లు. విపక్ష ఎమ్మెల్యేలను పెద్దగా మాట్లాడించే వాళ్లు కాదు. అట్లాంటి పరిస్థితుల్లో కూడా అసెంబ్లీకి పోతూనే ఉన్నారు. కానీ అసెంబ్లీలో జరిగిందేందంటే 23 మంది విపక్ష ఎమ్మెల్యేలను కొనుక్కోవటం. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం. ఇది చాలదన్నట్లుగా వారికి మంత్రి పదవులు ఇవ్వడం.. అంటే విలువలు, నైతికత ఏవీ లేవు. స్పీకర్ కూడా వారికి వంత పాడుతూ ఉండటం.. ఇలాంటప్పుడు అసెంబ్లీలో ఉన్నా కూడా ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో విధి లేకనే జగన్ పాదయాత్రను చేపట్టారు.

మోసపూరిత సర్కార్‌కు ఇక చరమగీతమే

- రాష్ట్ర వ్యాప్తంగా 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమం
- హామీలు అమలు చేయని చంద్రబాబును నమ్మంగాక నమ్మం అన్న ప్రజలు
- సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేశారని మండిపాటు

సాక్షి, నెట్‌వర్క్: ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 'నిన్ను నమ్మం బాబు' కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు చోట్ల సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు మోసపూరితంగా వ్యవహరించిన చంద్రబాబు సర్కార్‌కు చరమగీతం పాడతామని ప్రతినబూనారు. వందలాది హామీలిచ్చి ఏ ఒక్క హామీని అమలు చేయక తమను మోసగించిన చంద్రబాబును ఇక నమ్మంగాక నమ్మం అని నినదించారు. చంద్రబాబు సర్కార్ మోసాలను వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజలకు వివరించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే నవరత్నాలుతో పాటు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడతారని, తిరిగి దివంగత మహానేత వైఎస్ పాలనను తీసుకువస్తారని చెప్పారు. విజయనగరం జిల్లాలో నిన్ను నమ్మం బాబూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి నియోజకవర్గంలో పార్టీ నేత బొత్స సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాలూరు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర పాల్గొనగా ఇతర ప్రాంతాల్లో స్థానిక నేతలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి నేతృత్వంలో, పెదదోర్నాలలో ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కనిగిరి, చీర్లదిన్నె, గిద్దలూరు నియోజకవర్గం, కొండపిలో కార్యక్రమం జరిగింది. కృష్ణా జిల్లాలో చల్లపల్లిలో, కైకలూరు నియోజకవర్గంలో, తిరువూరులో, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా తడలో జరిగిన కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆధ్వర్యంలో, గుంటూరు జిల్లా కర్లపాలెంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గంలో అంబటి రాంబాబుతో పాటు పలువురు నేతలు వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతపురం నియోజక వర్గంలో అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో, మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలు నియోజకవర్గాల్లో నిన్ను నమ్మం బాబు కార్యక్రమం జరిగింది. పాలకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. పెనుబాకలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిన్ను నమ్మం బాబూ కార్యక్రమం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నాయి. చంద్రబాబు వైఫల్యాలను, మోసాలను ప్రజలకు వైఎస్సార్‌సీపీ నేతలు వివరించారు.



కాకినాడలోని కరపలో 'నిన్ను నమ్మం బాబూ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీనేత కన్నబాబు


గుంటూరు జిల్లా మాచవరంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘీభావ యాత్ర




కృష్ణాజిల్లా విజయవాడలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న యువకులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు


శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో నిన
నిర్వహిస్తున్న ఎమ్మెల్యే క


అనంతపురం జిల్లా హిందూపురం
ఆధ్వర్యంలో సంఘీ


పెదదోర్నాలలో బైక్ ర్యాలీలో పాల్గొన

ప్రజలు గమనిస్తూ ఉంటారు. చంద్రబాబు మొన్నటి వరకు బీజేపీతో కలిసి ఉన్నారు. ప్రత్యేక హోదా అవసరం లేదన్నారు. ప్రధాన శత్రువుగా భావించిన కాంగ్రెస్‌తో కలిసి తెలంగాణాలో పోటీచేశారు.

ప్రశ్న: మీరెప్పుడైనా ఊహించారా ఈ పరిణామాన్ని? మీరంతా ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్నారు. రాజశేఖరరెడ్డి గారు అంటేనే కాంగ్రెస్ అనే పరిస్థితి. ఇప్పుడేమో చంద్రబాబే కాంగ్రెస్‌లోకి వెళ్లి, తెలుగుదేశం కాంగ్రెస్‌లోకి వెళుతుందని, మీరేమో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి జగన్ గారు సొంత పార్టీ పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఏనాడైనా ఊహించారా?

విజయమ్మ: సంబంధాలైతే ఆయన(చంద్రబాబు)కు ఎప్పుడూ ఉన్నాయి కాంగ్రెస్‌తో.. అంతర్గత సంబంధాలు ఎప్పుడూ ఉండనే ఉన్నాయి. జగన్‌పై కేసులు పెట్టినప్పుడైనా, ఇంకోటైనా ఇవన్నీ కలిసే చేశారు. కలిసి రాసుకున్నారు. అంటే ఎందుకు చెబుతున్నానంటే కేసు వేసినప్పుడు ఎర్రన్నాయుడు, శంకర్రావు వేసింది సేమ్. కాబట్టి ఇంటర్నల్‌గా వాళ్లకు ఎప్పుడూ సంబంధాలు ఉన్నాయి. ఓపెన్‌గా ఇలా కలుస్తారని మాత్రం నేననుకోలేదు. ఇలా ఓపెన్‌గా కలవడానికి జగన్ పాదయాత్రే కారణమనుకుంటా అంతే. ఆ జనాన్ని చూసి, జగన్ పాదయాత్రను చూసే ఇది జరిగిందని నేననుకుంటా.

ప్రశ్న: పాదయాత్ర ప్రభావం ప్రజల్లో ఎలా ఉంటుందని మీరనుకుంటున్నారు. ప్రజల్లో పార్టీ విజయానికి ఏ రకంగా దోహదపడబోతోంది?

విజయమ్మ: ఒక నాయకుడ్ని నిలబెట్టింది ఓదార్పుయాత్ర.. పాదయాత్ర ఆ నాయకుడ్ని స్థిరపరిచింది. స్టేబుల్‌గా చేసింది. నవరత్నాలతో ఫలానిది చేస్తానని వాళ్లకు ధైర్యం కలిగించాడు. ఓదార్పునిస్తున్నాడు కాబట్టి వాళ్లు నమ్ముతున్నారు.

ప్రశ్న: నవరత్నాల్లో మీకు నచ్చిన అంశం ఏమిటి?

విజయమ్మ: జగన్ ఓదార్పుయాత్రకు వెళ్లినప్పుడు ఇద్దరు పిల్లలుంటే ఒకరినే చదివిస్తాం, ఒకరిని పనికి పంపిస్తామన్నారట. అందుకని అమ్మఒడి పథకం ఆలోచన వచ్చింది.

ప్రశ్న: విజయమ్మగారు గతసారి కచ్చితంగా గెలుస్తారని అంతా అనుకున్నారు. సర్వేలు వచ్చాయి. రెండు, మూడు నెలల ముందు మార్పులను పసిగట్టడంలో సఫలం కాకపోవడం వల్లనే అలా జరిగిందా, అలాంటి అనుభవాల నేపథ్యంలో ఈసారి ఎట్లా చేస్తారు. చంద్రబాబు వ్యూహాలను ఎలా ఎదుర్కొంటారు. జగన్ గారికి మీరు ఎలాంటి సలహాలు ఇస్తారు.

విజయమ్మ: అప్పుడు మోదీ ప్రభావం ఉంది. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని, ఉద్యోగాలు ఇస్తానని, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగులకు రెండువేలు నిరుద్యోగభృతి ఇస్తానని చాలా అబద్ధాలు చెప్పాడు. మాయలు చూపించాడు. అంతేకాకుండా తనకేదో అనుభవం ఉంది. తానేదో చేస్తానని చెప్పాడు. మళ్లీ డబ్బులు ఒకటి.

ప్రశ్న: మరి ఈసారి ఎలా ఎదుర్కోబోతున్నారు. ఇప్పుడు ఆయనకు అధికారం వచ్చింది. అధికారాన్ని ఢీకొనాల్సిన పరిస్థితి వచ్చింది కదా. మరి ఈసారి జగన్‌గారు ఎలా ఎదుర్కోవాలనుకుంటున్నారు.

విజయమ్మ: రాజశేఖరరెడ్డిగారు ఎన్నో కార్యక్రమాలు చేశారు. చెప్పినవి, చెప్పనవి కూడా చేశారు. ఈరోజు కూడా మాట తప్పే కుటుంబం కాదు, మాటపై నిలబడే కుటుంబమే. జగన్ తప్పకుండా చేస్తాడన్న నమ్మకం కూడా వచ్చింది. ఆ నమ్మకాన్ని పాదయాత్ర ద్వారా కల్పించుకోగలిగాడు. కాబట్టి నేననుకుంటా వాళ్లు ఎన్ని మాయ మాటలు చెప్పినా ఇప్పుడు నమ్మే పరిస్థితి లేదు. ఎందుకంటే ఇప్పుడైతే రైతులకు ఏదీ జరగలేదు. రుణమాఫీ చేస్తానన్నాడే కానీ వారిని బ్లాక్‌లిస్టులో పడేశాడు. డ్వాక్రా వాళ్లకు ఏమీ చేయలేదు. వాళ్లు కూడా బ్లాక్‌లిస్టులో పడిపోయారు. ఏమి చేసుకునే పరిస్థితి లేదు. ఒక ప్రాజెక్టు తెచ్చింది లేదు. ఒక ఇండస్ట్రీ తెచ్చింది లేదు. పోనీ రాజధాని కట్టాడా అంటే అదీ లేదు. మరి రైతుల భూములన్నీ లాక్కుని వ్యక్తిగతంగా వాళ్లు అభివృద్ధి అయ్యారు.

ప్రశ్న: జగన్‌లో ఉన్న మంచి లక్షణాలు అనండి, గొప్ప లక్షణాలనండి ఎట్లా చెబుతారు.

విజయమ్మ: జగన్ ఒకటే.. ధైర్యంగా ఫేస్ చేస్తాడు. చాలెంజ్‌గా తీసుకుంటాడు. అది ఎంతవరకైనా పోతాడు. ప్రజల కోసం నిలబడతాడు. మనిషి ఎంతకాలం బతికాడనేది కాదు. మనం ఎలా బతికామనేది ముఖ్యమనే ప్రిన్సిపల్స్, నైతిక విలువలకు గౌరవమిస్తాడు. మన పార్టీలోకి ఎవరు వచ్చినా కూడా రాజీనామా చేసి రావాల్సిందే. నంద్యాల ఎలక్షన్‌లో కూడా పాపం అప్పుడే గెలిచిన చక్రపాణిరెడ్డిని రాజీనామా చేసి రావాల్సిందేనన్నాడు. అట్లాంటి నైతికతకు విలువనిస్తాడు. ఏదంటే అది.. ఎక్కడదంటే అక్కడ దిగజారే మనస్తత్వం కాదు. స్ట్రెయిట్‌గా పోరాడతాడు. అది బలమో, బలహీనతతో

> జగన్ వ్యక్తిత్వం ఏమిటి.. జగన్ పట్టుదల ఏమిటి.. వాళ్ల నాయన చేసింది చేయగలుగుతాడు అనే నమ్మకం పాదయాత్రలో తెచ్చుకున్నాడు. చేయగలుగుతాడనే విశ్వాసం ప్రతి ఒక్కరిలో ఉంది. ఆ నమ్మకం తెచ్చుకున్నాడు.

> నిజంగా ఈ కుటుంబానికి ప్రజలతో ఉన్న అనుబంధం 45 సంవత్సరాలది. రాజశేఖరరెడ్డి గారు వెళ్లిన తరువాత కూడా ప్రజలు ఈ కుటుంబాన్ని వదిలిపెట్టలేదు. చంద్రబాబు గారికి ప్రజల్లో ఎప్పుడూ గొప్పగా ఉందని అనుకోను. కానీ, మేనేజ్‌మెంట్, మేనుప్లేట్ బాగా చేస్తారు. మీడియా.. పది చానల్స్ పెట్టుకుని గోబెల్స్ ప్రచారం బాగా చేస్తారు. చేయకపోయినా చేసినట్టు చూపిస్తారు. అది ఎంతో కాలం నిలబడదు. ప్రజలకు కూడా అర్థమవుతుందని నేననుకుంటున్నా.

> పాదయాత్రపై ప్రజల అభిమానం పొంగిపొర్లుతాంది అనుకుంటున్నాం. ఒక జిల్లా బాగా జరిగింది అనుకుంటే ఇంకో జిల్లా ఇంకా ఎక్కువగా జరుగుతాంది. చాలామంది ఒంగోలు వరకూ బాగా ఉంటుంది, ఆ తర్వాత తగ్గుతుంది అన్నారు. విజయవాడ, గుంటూరు ఏ జిల్లాలో అయినా సరే.. శ్రీకాకుళం వరకూ ఒక జిల్లాకు మించి మరో జిల్లాలో పాదయాత్ర బ్రహ్మాండంగా జరిగింది. ఎక్కడ చూసినా జనం ఉంటున్నారు.



రాజశేఖరరెడ్డి గారికి, జగన్‌కు.

ప్రశ్న: జగన్‌గారిలో మీరు చూసిన బలహీనతలు ఏమిటి, అరే ఈ పని చేయకుండా ఉండి ఉంటే బాగుండును, ఆయనలో ఈ మార్పు వస్తే బాగుండును అన్న సందర్భాలు ఏమైనా కనిపించాయా.

విజయమ్మ: అంటే లాస్ట్ టైమ్.. అంటే అందరూ చెప్పారు. రైతులకు రుణమాఫీ 50 వేలు చెప్పి ఉంటే జగన్ గెలిచిపోయే వాడు. వచ్చేసే వాడు. తనైతే బాధపడటం లేదు. చేయలేనిదా నికెందుకు. అమ్మా నువ్వూ, నేనే కదా ఉండింది. మన పార్టీ నుంచి 67 మందిని ప్రజలు గెలిపించారు. కేవలం ఐదు లక్షల మెజార్టీనే కదా. తను శాటిస్‌ఫైడ్. బలహీనత అంటే.. తనేమీ కుంగిపోలేదు. అట్లా కుంగిపోయే మనస్తత్వం కూడా కాదు.

ప్రశ్న: తొమ్మిదేళ్ల ప్రతిపక్షంలో ఉండటమంటే తమాషా విషయం కాదు. 2011 నుంచి పోరాటంలోనే ఉన్నారు. మీకెప్పుడూ ఈ పోరాటం ఏమిటి ఈ గోల ఏమిటి అని విసుగెప్పుడూ రాలేదా?

విజయమ్మ: విసుగు అంటే.. కష్టమనిపిస్తాది. బాధ అనిపిస్తాది. బాధల్లో నుంచే ముందుకు వెళతాఉన్నాము. ధైర్యంగా ముందుకు పోతా ఉన్నాము. తన ఇంటెన్షన్, తన మోటివేషన్ ప్రజలకు చేయాలనే. తపన ఉంది.. వాళ్ల నాన్న లాగా బాగా చేయాలని, మనం స్వార్థం వదిలేసి ఇతరుల కోసం చేయాలనుకున్నప్పుడు దేవుడు కూడా హానర్ చేస్తాడని నేననుకుంటున్నా.

ప్రశ్న: రాబోయే ఎన్నికల్లో ఎన్ని సీట్లు వస్తాయని అనుకుంటున్నారు.

విజయమ్మ: వస్తే మంచి మెజార్టీనే వస్తాదని అనుకుంటున్నా. 120 దాకా వస్తాయని అనుకుంటున్నా.

ప్రశ్న: జగన్‌గారి పాదయాత్రను మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్ అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు?

విజయమ్మ: పాదయాత్ర అనేది ప్రజలతో మమేకం కావడం. ప్రజల కష్టాలు తెలుసుకోవడం. వాళ్లకు ధైర్యం కల్పించడం, అదే లక్ష్యం. జగన్ లక్ష్యం కూడా అదే. షర్మిలమ్మ పాదయాత్ర, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర కూడా ప్రజల కష్టాలు తీర్చడమే లక్ష్యంగా సాగిందే. ఇది పరుగు పందెం కాదు కదా.

ప్రశ్న: వస్తున్న ఆదరణను ఎలా మెటీరియలైజ్ చేసుకుంటారు? చంద్రబాబు వ్యూహాన్ని ఎదుర్కోగలమని అనుకుంటున్నారా.. మీరేమంటారు?

విజయమ్మ: ప్రజలంతా గమనిస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఏం చేసినాడని ఓటేస్తారు? రైతులకు రుణమాఫీ చేశాడని ఓటెయ్యాలా? డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేశాడని ఓటెయ్యాలా? ఏదైనా ప్రాజెక్టు కట్టాడని ఓటెయ్యాలా? రాజధాని కట్టాడని ఓటెయ్యాలా?

ప్రశ్న: ఆయన పులివెందులకు నీళ్లిచ్చానని అంటున్నాడు.

విజయమ్మ: పైనుంచేమైనా కురిపిచ్చాడా అని అడుగుతున్నా. రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్టులు కట్టాడు కాబట్టి ఇప్పుడు అవి కట్టాం ఇవి కట్టాం అని చెబుతున్నారు. నీళ్లిచ్చాక కుళాయి తిప్పాడు అంతే. పోలవరం విషయానికొస్తే రాజశేఖర్‌రెడ్డి చేసిన కాలువలు కనిపిస్తున్నాయి గానీ, పోలవరం ఎక్కడైనా కనిపిస్తోందా? పోలవరం అనుమతులన్నీ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చినవే.

ప్రశ్న: కేంద్రం చేయాల్సిన ప్రాజెక్టు ఈయన చేతికి తీసుకోవడం వివాదాస్పదంగా మారుతోంది.. ఒక అభిప్రాయం ఉంది.

విజయమ్మ: కేంద్రమే చేసి ఉంటే ఈ పాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉండునేమో. ఈరోజు శ్వేత పత్రాల్లో ఏమని ప్రకటిస్తాడు? సంవత్సరానికోసారి ఆస్తులను ప్రకటిస్తున్నాడు. అవి ఎప్పుడో 30 ఏళ్ల కింద లెక్కలు కట్టి చెబుతున్నవే. ఎవరికి మంచి చేశాడని శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నాడని అడుగుతున్నా.

ప్రశ్న: చంద్రబాబు ఆస్తులపై మీరు కోర్టుకు వెళ్లారు గానీ మీ పోరాటం సఫలమైనట్టు లేదుగా?

విజయమ్మ: జరుగుతాయి. అన్నీ జరుగుతాయి. చట్టం ప్రకారం జరుగుతాయి. అన్నీ మేనేజ్ చేసే స్థితిలో ఆయన ఉన్నాడు. దేనికైనా సమయం వస్తుంది.

ప్రశ్న: హైకోర్టు విభజన కూడా జగన్‌పై కేసును గురించే ఉపన్యాసం ఇస్తున్నారు?

విజయమ్మ: హైకోర్టు విభజన జగన్ ఏమైనా అడిగారా? రాష్ట్రాన్ని విడగొట్టింది కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీలే. ప్రత్యేక హోదా హక్కు ఉంటే అది కూడా తెచ్చుకోలేదు. నాలుగున్నరేళ్లలో ప్యాకేజీ తేలేదు. స్పెషల్ స్టేటస్ ఇస్తామంటే చంద్రబాబు అడగనే లేదని బీజేపీ వాళ్లు ఇప్పుడు చెబుతున్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో స్టేటస్ తెచ్చింది లేదు. ఏం పూర్తి చేశాడని ఓట్లేస్తారు. పదేళ్లు మనకు హైదరాబాద్‌లో ఉండే అవకాశం ఇచ్చినప్పుడు కోర్టు, రాజధాని, సెక్రటేరియట్ ఇవన్నీ బాగా నిర్మించుకుని వెళ్లి ఉండవచ్చు. ఇప్పుడేమో తాత్కాలిక భవనాల పేరుతో కట్టారు. ఇవి శాశ్వత భవనాలకంటే ఎక్కువగా వ్యయం చేశారని చెబుతున్నారు. కాంట్రాక్టర్లకు మేలు చేశారు. కోర్టు బదిలీ వలన మనకే నష్టం. మూడేళ్ల నుంచి సీబీఐ కోర్టులో కేసు జరుగుతా ఉంది. ఈ కేసు విచారించిన జడ్జి ఏపీకి వెళ్లిపోయారు. ఒక జడ్జి వెళ్లిపోతే కొత్త జడ్జి మళ్లీ మొత్తం కేసు వినాలట. అంటే కేసు మళ్లీ మొదటికి వస్తుంది. దీనివలన జగన్‌కే నష్టం.

ప్రశ్న: మరి జనం చంద్రబాబు చెప్పే అబద్ధాలు నమ్ముతారా? జగన్ చెప్పే నిజాలు నమ్ముతారా?

విజయమ్మ: నిజాలు నమ్మే టైమొచ్చింది. అబద్ధం రుచిగా ఉంటుంది కాబట్టి లాస్ట్ టైమ్ ఆయన సీఎం అయ్యారు.

ప్రశ్న: ప్రధాని మోదీ, చంద్రబాబు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మోదీ అవినీతి జరిగిందని అంటున్నారు. ఈయనేమో కేంద్రం మోసం చేసిందంటున్నారు. దీన్నెలా చూస్తారు?

విజయమ్మ: ఎందుకు కలిసున్నారో తెలియదు. మొన్న మహారాష్ట్ర మంత్రి భార్యను టీటీడీ మెంబరును చేశారు. మరి వీళ్ల మధ్య ఏం జరుగుతోందో తెలియదు.

ప్రశ్న: పదే పదే గోబెల్స్‌లాగా చెబితే నమ్మేవారు ఉంటారా?

విజయమ్మ: ఆయన అవకాశవాది. నాలుగున్నరేళ్లు బీజేపీతో కలిసి ఉన్నాడు. వారికి వంతపాడాడు. వారితో కలిసున్నన్నాళ్లు వారిని పొగిడాడు. అప్పుడు మమ్మల్ని తల్లి కాంగ్రెస్ పిల్లకాంగ్రెస్ అన్నాడు. ఇప్పుడు బీజేపీ జగన్ కలిసి ఉన్నారు అంటున్నాడు. వాళ్ల నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూంటారు. ఏమైనా మాట్లాడేస్తారు?

ప్రశ్న: జనం ఇవన్నీ గమనించరా?

విజయమ్మ: ఇవన్నీ ఇప్పుడు గమనిస్తున్నారని నేననుకుంటున్నా.

ప్రశ్న: తెలంగాణ ఎన్నికల ఫలితాల మీద మీ కామెంటు?

విజయమ్మ: చంద్రబాబు కలిసి కాంగ్రెస్‌కు నష్టం చేశాడని అనుకుంటున్నా. లేకపోతే కాంగ్రెస్‌కు మరో 10 సీట్లు వచ్చి ఉండేవేమో.

ప్రశ్న: జనంలో అంత వ్యతిరేకత వచ్చిందంటారా? నేను హైదరాబాద్‌కు చాలా చేశానని చెప్పాడు కదా?

విజయమ్మ: హైదరాబాద్‌కు ఏం చేశాడు ఆయన?

> రాజశేఖర్‌రెడ్డి 20 సంవత్సరాల పోరాటంలో వారానికి ఐదు రోజులు తిరుగుతూనే ఉండేవారు. వారానికి రెండ్రోజులే ఇంటి దగ్గర ఉండేవారు. వైఎస్సార్ సీఎం అయ్యేనాటికి ఏ జిల్లాకు ఏం చెయ్యాలి, ఏ వర్గానికి ఏం చెయ్యాలి అనేది ఆయన దగ్గర బ్లూప్రింట్ ఉంది. షర్మిలమ్మ పాదయాత్ర చేసినప్పుడు జగన్ జైలుకు వెళ్లిన పరిస్థితుల్లో ఈ కుటుంబం ఎప్పుడూ ప్రజలతోనే ఉందని తెలియచెప్పడం కోసం, జగన్ లోపల ఉన్నా కూడా అన్నీ జరుగుతాయి అని భరోసా ఇవ్వడం కోసం ఆ రోజు షర్మిలమ్మ యాత్ర చేయాల్సి వచ్చింది. ఇప్పుడు పాదయాత్ర ద్వారా జగన్ గ్రాస్‌రూట్ లెవెల్ దాకా వెళ్లడం ద్వారా ప్రజల కష్టాలు తెలిసొచ్చాయి. తనకు కూడా ఒక బ్లూప్రింట్ తయారయిందనుకుంటున్నాను.

> ఆంధ్రప్రదేశ్‌కు నష్టం ఎప్పుడో జరిగిపోయింది. రాజశేఖర్‌రెడ్డి గారు ఈ లోకం నుంచి వెళ్లిపోయినప్పుడే నష్టం జరిగిందనుకుంటున్నాను. నిజంగా నాకంటే రాష్ట్ర ప్రజలే దురదృష్టవంతులని చెపుతా. ఆయనే బతికుంటే ఇప్పటికే అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యి ఉండేవి. రాష్ట్రానికి ఎటువంటి కొరత లేకుండా అన్నీ ఉండేవి. అలాంటిది ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ మిగలలేదు.

జగన్ గ్రాస్ రూట్ దాకా వెళ్లాడు

ప్రశ్న: గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, షర్మిలమ్మ పాదయాత్ర చేశారు. ఇప్పుడు జగన్ పూర్తిచేశాడు. ఒకవిధంగా మీ కుటుంబం పాదయాత్ర కుటుంబంగా పేరుపొందింది. భవిష్యత్‌లో జగన్‌కు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

విజయమ్మ: రాజశేఖర్‌రెడ్డి 20 సంవత్సరాల పోరాటంలో వారానికి ఐదు రోజులు తిరుగుతూనే ఉండేవారు. జగన్ లోపల ఉన్నా కూడా అన్నీ జరుగుతాయి అని భరోసా ఇవ్వడం కోసం ఆ రోజు షర్మిలమ్మ యాత్ర చేయాల్సి వచ్చింది. అప్పుడు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కూడా షర్మిలమ్మ బయటకు రావాల్సి వచ్చింది. గతంలో జగన్ యాత్రలు గ్రాస్ రూట్ లెవల్‌లోకి వెళ్లలేదు. ఓదార్పు యాత్ర ఎక్కడెక్కడ అవసరమో అక్కడ చేశాడు. అదే విధంగా దీక్షలు కూడా కొన్ని చోట్ల మాత్రమే చేశారు. కాని ఇప్పుడు పాదయాత్ర ద్వారా జగన్ గ్రాస్‌రూట్ లెవెల్ దాకా వెళ్లారు. నవరత్నాల్లో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి వంటి పాత పథకాలతో పాటు కొత్తగా మద్యపాననిషేధం, రైతు భరోసా పథకం వంటివి కూడా తీసుకున్నారు. అప్పుడు రాజశేఖర్‌రెడ్డి గారు యాత్ర సందర్భంగా రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని ఎలాగైతే చెపుతూ వచ్చారో ఇప్పుడు జగన్ నవరత్నాలని చెపుతూ తనను తాను ఎస్టాబ్లిష్ చేసుకుంటూ ఆ యాత్ర ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

ప్రశ్న: చంద్రబాబు కాంగ్రెస్‌ను వ్యతిరేకించే రోజుల్లో నవనిర్మాణ దీక్షలంటూ ఆ పార్టీని తిట్టేవారు. ఇప్పుడు బీజేపీని వ్యతిరేకిస్తూ ధర్మపోరాట దీక్షలు చేస్తున్నాడు. ఈ రెండింటిని మీరు ఎలా చూస్తారు?

విజయమ్మ: నవ నిర్మాణమూ లేదు ధర్మపోరాటమూ కాదు. అధర్మపోరాటమని చెపుతాను. కనీసం రాజధాని అయినా కట్టి వుంటే నవనిర్మాణం చేశాడనుకోవచ్చు.

ప్రశ్న: చంద్రబాబు ఓటుకు నోటు కేసుతో అప్పటికప్పుడు హైదరాబాద్‌ను విడిచి రావడం వల్ల రాష్ట్రానికి ఏమైనా నష్టం జరిగిందనుకుంటున్నారా?

విజయమ్మ: ఆంధ్రప్రదేశ్‌కు నష్టం ఎప్పుడో జరిగిపోయింది. చంద్రబాబు ఏమీ తయారు చేయలేదు. నిజంగా చంద్రబాబు గెలిచినప్పుడు నేను అనుకున్నా.. జగన్ గెలిచి ఉంటే బాగుండేది.. రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా రాజధాని నిర్మించాడు అని చరిత్రలో పేరు నిలిచిపోయేది కదా అనుకున్నాను. ఇప్పుడు చూస్తే రాజధానిని జగనే కట్టాలనుకుంటున్నా.

ప్రశ్న: చంద్రబాబు పాలనపై ప్రజల్లో పూర్తిగా విసుగువచ్చిందంటున్నారు. జగన్ పట్ల ఎటువంటి ఆదరణను ఈమధ్య కాలంలో మీరు గమనిస్తూవచ్చారు?

విజయమ్మ: ప్రజల్లో ఆదరణ లేకపోతే అంతమంది వచ్చే అవకాశమేలేదు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, గతంలో రాజశేఖర్‌రెడ్డిగారు ఏమి చేశారు.. తాను ఇప్పుడు అధికారంలోకి వస్తే ఏమి చేస్తాడో చెపుతుంటే ప్రజలు శ్రద్ధగా ఆలకిస్తున్నారు. ఎండ తీవ్రంగా ఉన్నా, వాన కురుస్తున్నా ఎక్కడా జనం వెనుదిరిగిన సందర్భంలేదు. అది ఎంతో అభిమానం ఉంటే తప్ప అలా వినడానికి అవకాశం ఉండదు. 14 నెలలుగా పాదయాత్రలో స్థానిక సమస్యలు తప్ప ప్రతీ రోజు చెపుతున్న అంశాన్నే చెపుతున్నాడు అని తెలిసినా టీవీల్లో వినే అవకాశం ఉన్నా సరే ఎందుకు ఆయన కోసం ఎదురు చూస్తున్నారు? ఆయన కోసం ఎందుకు కాసుకుకూర్చున్నారు? ఇంత శ్రద్ధగా వింటూ అభిమానం, ప్రేమ చూపిస్తున్నారంటే తప్పకుండా జగన్‌ను వారు నమ్ముతున్నారని నేను అనుకుంటున్నాను.

ప్రశ్న: కొందరు కొత్తగా ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన సన్నివేశాలని, ఇప్పుడు జగన్ గారి సన్నివేశాలతో పోలుస్తుంటారు. మీరు అప్పటి నుంచి చూస్తున్నారుగా.. ఇప్పుడు జగన్ ఇన్ని సభల్లో మాట్లాడుతున్న తీరును పోల్చిచూస్తే మీకు ఏమనిపిస్తోంది?

విజయమ్మ: ఎన్టీ రామారావు గారు పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ఎన్నికలు వచ్చి భారీ మెజార్టీతో ముఖ్యమంత్రిగా పీఠం ఎక్కారు. తొమ్మిది నెలలు అంటే ఏమంత కష్టం కాదు. జగన్ వచ్చి దాదాపు తొమ్మిదేళ్లయ్యింది. జగన్‌కు ఉన్న సమస్యలు ఆయనకు లేవు. జగన్‌కు ఉన్న ఇబ్బందులు, కష్టాలు ఆయనకు లేవు. చిన్నవాడు అయినా ఇవన్నీ ఎదుర్కొన్నాడు. రాజశేఖర్‌రెడ్డిగారంటే అన్నీ జమాయించుకొని రాగలుగుతాడన్న ధైర్యం ఉండేది. కానీ జగన్ చిన్నవాడు అయి ఉండటమో.. కొడుకు కావడం వల్లనేమో కానీ ఆందోళన ఉండేది. ఆందోళన ఒకపక్క ఉన్నా సరే అధిగమించగలడనే ధైర్యం ఇప్పుడు వచ్చింది. ముందుకు పోగలడన్న నమ్మకం వచ్చింది.

ప్రశ్న: పాదయాత్ర ముగింపు సందర్భంగా ఒక తల్లిగా, పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా మీరిచ్చే సందేశం?

విజయమ్మ: ప్రజలకు నేను ఒకటే చెపుతున్నా.. రాజశేఖర్‌రెడ్డి గారిని చూశారు. ఇప్పుడు జగన్‌ను తొమ్మిదేళ్లుగా చూస్తున్నారు. రాజశేఖర్ రెడ్డిగారు ఏ విధంగా మాట తప్పరో.. అదే విధంగా జగన్ కూడా మాటతప్పడని ఆయన పక్షాన నేను మీకు హామీనిస్తున్నాను. మాట కోసమే సోనియా గాంధీని ఎదిరించి పార్టీ నుంచి బయటకు రావడం జరిగింది. నాన్న కోసం చనిపోయిన కుటుంబాలను పరామర్శిస్తాను అని ప్రజలకు ఇచ్చిన మాట కోసం వారిని ఎదిరించి బయటకు రావడం జరిగింది. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడని మీ ద్వారా ప్రజలందరికీ హామీనిస్తున్నాను. తప్పకుండా జగన్ ముఖ్యమంత్రి అవుతాడని విశ్వసిస్తున్నాను. మీరందరూ కూడా విశ్వసించండి. ఒక్కసారి జగన్‌ను ఆశీర్వదించండి. ఒక్కసారి అవకాశం ఇవ్వండని ప్రజలందరినీ చేతులెత్తి కోరుతున్నాను.

ప్రశ్న: ఆ భరోసానే విజయం వైపునకు తీసుకెళుతుందని భావిస్తున్నారా?

విజయమ్మ: ఎవరికైనా సరే నేనున్నాను.. అని రాజశేఖర్‌రెడ్డి భరోసా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ భరోసా లేదని అందరూ అనుకుంటున్నారు. నేను ఈరోజు ప్రజలకు హామీ ఇస్తున్నాను. రాజశేఖరరెడ్డిగారు నాకు లేకపోవచ్చు కానీ, రాజశేఖర్‌రెడ్డి లాంటి భరోసా జగన్ ఇవ్వగలుగుతాడు అని ప్రజలకు హామీనిస్తున్నాను.

జగన్‌పై హత్యాయత్నం అనగానే భయం వేసింది

ప్రశ్న: నాడు పాదయాత్రలో రాజశేఖరరెడ్డికి సడన్‌గా రాజమండ్రి వద్ద అనారోగ్యం ఇబ్బంది తలెత్తింది. నేడు జగన్‌పై హత్యా యత్నం జరిగింది. ఈ రెండింటినీ అప్పుడెట్లా చూశారు. ఇప్పుడెట్లా చూశారు?

విజయమ్మ: అప్పుడంటే అనారోగ్యం, డీహైడ్రేషన్ వల్ల ఇబ్బంది వచ్చింది. అయితే దానికి భయపడాల్సిన అవసరం లేదు. వైద్యం జరుగుతుంది. వారం రోజులు కాకపోతే పది రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. వైఎస్ వారం రోజులు రాజమండ్రిలో విశ్రాంతి తీసుకొని తర్వాత పాదయాత్ర పూర్తి చేశారు. జగన్‌పై హత్యా ప్రయత్నం జరగడం భయమేసింది. నిజానికి వాళ్లు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేసులు పెట్టారు...జైల్లో పెట్టారు.. బెయిల్ రాకుండా చూశారు.. ఇది చేయలేదనకుండా అన్నీ చేశారు. అన్ని వ్యవస్థలను తమ చేతుల్లోకి తీసుకొని ఇబ్బందులు పెట్టారు. జగన్ ప్రజల్లో ఉంటున్నారని అంతిమంగా హత్యాప్రయత్నం చేశారు. దేవుని దయ, ప్రజల ఆశీర్వాదం, ప్రార్థనలు తనకు మెండుగా ఉన్నాయి కాబట్టి జగన్ తప్పించుకోగలిగాడు అని నేను అనుకుంటున్నా. పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా రెక్కీ నిర్వహించారని వింటున్నాం.



...న్ను నమ్మం బాబు కార్యక్రమాన్ని ...విశ్వాసరాయి కళావతి



...ంలో సమన్వయకర్త అబ్దుల్‌ఘని ...భావ పాదయాత్ర



...్న ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్

విచారణ అధికారం సీఈఆర్‌సీదే

- టీఎస్‌ఈఆర్‌సీ, ఏపీఈఆర్‌సీకి ఎలాంటి పరిధి లేదు
- కేసులన్నీ సీఈఆర్‌సీకి బదలాయించండి
- ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీలకు హైకోర్టు ఆదేశం
- మూడేళ్లుగా నలుగుతున్న వివాదానికి తెర

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర విభజనకు ముందు విద్యుత్ పంపిణీ సంస్థలు, విద్యుత్ ఉత్పాదన సంస్థల మధ్య నెలకొన్న వివాదాలపై విచారణ జరిపే అధికార పరిధి కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) లేదా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) లేదా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్‌సీ)లలో ఎవరికి ఉందన్న అంశంపై హైకోర్టు స్పష్టతనిచ్చింది. మూడేళ్లుగా న్యాయస్థానంలో నలుగుతున్న ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. విద్యుత్ పంపిణీ సంస్థలు, విద్యుత్ ఉత్పాదన సంస్థల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించే అధికారం సీఈఆర్‌సీకే ఉందని తేల్చి చెప్పింది. వివాదాలకు సంబంధించి ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీలు వేర్వేరుగా జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. అలాగే సీఈఆర్‌సీ జారీ చేసిన ఉత్తర్వులను సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది.

ఇదీ వివాదం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వెలుపల, లోపల ఉన్న పలు విద్యుత్ ఉత్పాదన, పంపిణీ సంస్థలు ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఏపీఎస్‌ఈబీ)తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) కుదుర్చుకున్నాయి. 2006–13 మధ్య కాలంలో ఉత్పాదన, పంపిణీ సంస్థల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర విభజనకు ముందు ఈ వివాదాలపై ఏపీఈఆర్‌సీ విచారణ చేపట్టింది. 2014లో రాష్ట్ర విభజన జరగడంతో తెలంగాణ టీఎస్‌ఈఆర్‌సీని ఏర్పాటు చేసింది. ఏపీ కూడా పాత ఈఆర్‌సీ స్థానంలో కొత్త ఈఆర్‌సీ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో పీపీఏ వివాదాలకు సంబంధించిన కేసులను ఎవరు విచారించాలన్న అంశంపై ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీ, విద్యుత్ పంపిణీ, ఉత్పాదన సంస్థల మధ్య వివాదం చెలరేగింది. ఇది సీఈఆర్‌సీకి చేరింది. ఈ వివాదంపై విచారణ జరిపే పరిధి తమకే ఉందని సీఈఆర్‌సీ 2015లో ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విద్యుత్ పంపిణీ సంస్థలు అదే ఏడాది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీ జారీ చేసిన పలు ఉత్తర్వులను సవాల్ చేస్తూ మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. ఇలా దాఖలైన మొత్తం 16 పిటిషన్లపై జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది.

సీఈఆర్‌సీ వాదనే సబబు..

'ఒకే అంశంపై ఏక కాలంలో విచారణ జరిపే పరిధి విద్యుత్ నియంత్రణ మండళ్లకు లేదు. కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలోకి వచ్చే అంశాలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్ల పరిధిలోకి రావు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య విద్యుత్ ఉత్పాదన, అమ్మకం ఉమ్మడి పథకమైంది. రాష్ట్ర విభజనకు ముందు ఆ వివాదాలపై ఏపీఈఆర్‌సీకి విచారణాధికారం ఉండేది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. నాలుగు విద్యుత్ పంపిణీ సంస్థల్లో ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు ఏపీకి వెళ్లగా, నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు తెలంగాణకు వచ్చాయి. దీంతో ఈ వివాదాలన్నీ అంతర్రాష్ట్ర వివాదాలయ్యాయి. కాబట్టి ఈ వివాదాలకు సంబంధించిన ఏపీఈఆర్‌సీ జారీ చేసిన ఉత్తర్వులు చెల్లుబాటు కావు. టీఎస్‌ఈఆర్‌సీ జారీ చేసిన ఉత్తర్వులు కూడా చెల్లుబాటు కావు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను టీఎస్‌ఈఆర్‌సీ రెండు భాగాలుగా విభజించింది. ఒక భాగం వివాదాలను తాను నిర్ణయిస్తే, మరో భాగం వివాదాలను మరో రాష్ట్రం నిర్ణయిస్తుందని భావించింది. ఏపీఈఆర్‌సీ ఏపీ పునర్విభజన చట్టం కింద తనకు మిగిలిన అధికారాలను బట్టి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెబుతోంది. టీఎస్‌ఈఆర్‌సీ వివాదాన్ని రెండు భాగాలుగా విభజించి, ఆ మేర ఉత్తర్వులు జారీ చేసినట్లు వాదిస్తోంది. వాస్తవానికి ఈ రెండూ వాదనలు తప్పు. ఈ మొత్తం వ్యవహారం రెండు రాష్ట్రాలకు సంబంధించింది కాబట్టి వాటిపై విచారణ జరిపే అధికార పరిధి తమకే ఉందన్న సీఈఆర్‌సీ వాదనే సరైంది. అందువల్ల ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీలు తమ ముందున్న కేసులన్నింటినీ సీఈఆర్‌సీకి బదలాయించాలి'అని ధర్మాసనం పేర్కొంది.

రాష్ట్రంలో అర్చకులకు గడ్డు పరిస్థితి

- వారికి అడుగడుగునా అవమానాలు
- వంశపారంపర్య హక్కు గాలికి
- బలవంతంగా పదవీ విరమణ
- హైకోర్టు తీర్పునూ బేఖాతరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి : అర్చకుల వంశపారంపర్యం హక్కు కొనసాగిస్తామని.. పదవీ విరమణ ఉండదని, వారికి కనీస వేతనం అమలుచేస్తామని.. ఆలయ సంప్రదాయాలను, వాటి భూములను కాపాడతామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వం తానిచ్చిన హామీలన్నింటినీ అటకెక్కించింది. వారిని నిలువునా ముంచేసి అడుగడుగునా అవమానాలకు గురిచేస్తోంది. సర్కారు వైఖరితో రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వారికి కనీస వేతనం అమలుచేయకుండా, ధూపదీప నైవేద్యం పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చింది. ధార్మిక పరిషత్ ఏర్పాటునూ విస్మరించింది. ఇదే సమయంలో తిరుమల ప్రధానార్చకులతోపాటు రాష్ట్రంలో అనేకమంది వంశపారంపర్య అర్చకులను పదవీ విరమణ కావించి ఇంటికి పంపించి తీవ్ర అన్యాయానికి గురిచేసింది. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై ఆ వర్గాలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేశాయి. అర్చకులకు అనుకూలంగా ఉన్నత న్యాయస్థానాలు తీర్పులిచ్చినప్పటికీ వాటిని రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసింది. టీటీడీ అర్చకులకు పదవీ విరమణ చెల్లదని 2018 డిసెంబరు 12న ఉమ్మడి హైకోర్టు తీర్పునూ పట్టించుకోలేదు. అర్చకులకు ఆరోగ్యం సహకరించినంతకాలం స్వామివారి సేవ చేసుకోవచ్చని, వారిని టీటీడీ ఉద్యోగులుగా పరిగణించాలని చేసిన సూచనను గాలికొదిలేసింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో తీసుకున్న నిర్ణయంతో అర్చకులకు వంశపారంపర్య హక్కులు తిరిగి సంక్రమించగా.. తదనంతర కాలంలో రాజకీయ జోక్యం పెరిగి ఆలయాల ప్రతిష్ట మసకబారుతూ వచ్చింది. ఆలయాల నిర్వహణలో పాలక మండలి అనుభవరాహిత్యం, అధికారుల దురహంకారంతో అర్చకుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నా సర్కారుకు కనికరం కరువైంది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా కణుపూర్ శివాలయం అర్చకస్వామి మల్లికార్జున శర్మ, రామచంద్రాపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు ఫణికుమార్ ఆచార్యులు మరణించగా వారి కుటుంబాలకు సర్కారు ఎలాంటి ఆర్థిక సాయం అందించకపోవడం ఇందుకు ఉదాహరణ. ఆలయాల భూములు, ఆభరణాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకున్న పాపానపోలేదు.

చిన్న ఆలయాల బాధ్యత అర్చకులకే అప్పగించాలి

రాష్ట్రంలో ఉన్న వేలాది చిన్న ఆలయాల నిర్వహణ బాధ్యతను అర్చకులకే అప్పగించాలి. అంతేకాక.. వాటికి నెలనెలా రూ.10వేలు అందించాలి. త్వరలో జరగనున్న టీటీడీ పాలక మండలి సమావేశంలో వంశపారంపర్య అర్చకులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. ఆలయాలపట్ల, అర్చకులపట్ల రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఆలయాల్లో రాజకీయ పాలక మండళ్లను నిషేధించి,, అర్చక సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. దేవదాయ చట్టం, ఉన్నత న్యాయస్థానాల తీర్పులను సర్కారు అమలుచేయాలి.

– పెద్దింటి రాంబాబు, ఏపీ అర్చక సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి

'బాబు వెన్నుపోటుపై మాట్లాడే హక్కు మోదీకి లేదు'

సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ఎన్టీఆర్ నుంచి టీడీపీని లాక్కొని ఆయన్ను మొదటి సారి వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, అనంతరం కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొని రెండో సారి వెన్నుపోటు పొడిచారని ప్రధాని మోదీ చేసిన విమర్శలపై టీడీపీ ఎంపీలు స్పందించారు. టీడీపీ ఎంపీలు సుజనా చౌదరి, సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ తదితరులు సోమవారం మీడియాతో మాట్లాడారు. కనకమేడల మాట్లాడుతూ.. చంద్రబాబు వెన్నుపోటు గురించి మాట్లాడే హక్కు మోదీకి లేదన్నారు. అడ్వాణీకి వెన్నుపోటు పొడిచిన చరిత్ర మోదీదని ఆరోపించారు. 'ఎప్పుడో 20 ఏళ్ల కిత్రం జరిగిన దాన్ని తీసుకొచ్చి' అని చెప్పడం ద్వారా ఎన్టీఆర్‌కు బాబు వెన్నుపోటు పొడవడాన్ని కనకమేడల పరోక్షంగా అంగీకరించడం గమనార్హం.

ఏపీ అభివృద్ధి బాండ్లు జారీ చేయండి

- కేంద్రానికి జయప్రకాష్ నారాయణ్ సూచన
- విభజన చట్టంలో హామీలపై నివేదిక విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా విభజన చేస్తూ కొన్ని హామీలు ఇచ్చినందున.. వాటిని అమలు చేయడానికి ప్రత్యేకంగా ఏపీ అభివృద్ధి పేరిట బాండ్లు జారీ చేయాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ కేంద్రానికి సూచించారు. బాండ్లకయ్యే సొమ్మును కేంద్రం తనకు వీలున్నప్పుడు తీర్చుకోవచ్చన్నారు. 'విభజన చట్టంలో పేర్కొన్న హామీలు– ప్రస్తుత స్థితి'పై జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ రూపొందించిన నివేదికను కమిటీ సభ్యులు సోమవారం విజయవాడలో విడుదల చేశారు. రిటైర్డు ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, అజేయ కల్లం, రిటైర్డు జడ్జి జస్టిస్ పర్వతరావు, ప్రొఫెసర్ ఆర్.రాధాకృష్ణ, ప్రొఫెసర్ ఎస్.గలాబ్‌తో కలిసి తమ నివేదికలోని 10 అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలుకు గానూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇంకా రూ.1.45 లక్షల కోట్ల ఆర్థిక సహాయం చేయాల్సిన అవసరముందని నిర్ధారించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రానికి, నాబార్డు వంటి కేంద్ర రంగ సంస్థలకు కొంత అప్పు చెల్లించాల్సి ఉందని చెప్పారు. హామీల అమలుకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన మొత్తంలో ఆ అప్పును మినహాయించడం ద్వారా హామీలు అమలు చేసే వీలుందన్నారు. ప్రత్యేక హోదా బ్రహ్మ పదార్థమేమీ కాదని జేపీ వ్యాఖ్యానించారు. రెవెన్యూ లోటు భర్తీ రూపంలోనో, మౌలిక వసతుల కల్పనకు నిధులు తెచ్చుకోవడం ద్వారానో, పారిశ్రామిక పన్ను రాయితీల ద్వారా గానీ ప్రత్యేక హోదా వల్ల కలిగే ప్రయోజనాలన్నీ సాధించుకోవచ్చన్నారు. తమ కమిటీ రూపొందించిన నివేదికను సీఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర రాజకీయ పక్ష నాయకులకు పంపిస్తామని చెప్పారు. కాగా, లోక్‌సత్తా పార్టీ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా డీవీవీఎస్ వర్మను నియమించారు.

కుప్పంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు అంచనాల పెంపు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి బురుగులపల్లి– మల్లప్పకొండ రోడ్డుకు అంచనాలు పెంచుతూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ఈ రహదారిలో ఐదు కిలోమీటర్ల అభివృద్ధికి రూ.8 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల ప్రకారం రూ.20.50 కోట్లకు పెంచుతూ జీవో జారీ అయింది. ఈ రహదారిలో ఘాట్ రోడ్డు ఉండటంతో అంచనాలు పెంచుతున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

కమీషన్ల కోసం అప్పులు

- ఏపీడబ్ల్యూఆర్‌డీసీ ద్వారా రూ.పది వేల కోట్ల రుణానికి అనుమతి ఇచ్చిన సర్కార్
- కమీషన్ల కోసం అంచనా వ్యయం పెంచేయడం వల్ల ప్రాజెక్టుల పనులకు నిధుల కొరత
- దాన్ని అధిగమించేందుకు ఇప్పటికే రూ.4వేల కోట్ల రుణం తీసుకున్న ఏపీడబ్ల్యూఆర్‌డీసీ
- తనఖా పెట్టిన పది ప్రాజెక్టుల పనులు పూర్తి చేయడానికి వినియోగించాల్సిన నిధులు దారి మళ్లింపు
- పెండింగ్‌లో ఉన్న బిల్లులు, పనులు సజావుగా సాగడానికి రూ.3వేల కోట్ల రుణానికి ప్రతిపాదన
- ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తం చేయడంతో కేబినెట్‌లో ఆమోదముద్ర వేయించిన సీఎం చంద్రబాబు
- ఏకంగా రూ.ఏడు వేల కోట్ల రుణం అధికంగా తీసుకోవడానికి అనుమతి
- కమీషన్లు దండుకొని.. ఎన్నికలకు పార్టీకి ఇం'ధనం' సమకూర్చేందుకు సీఎం వ్యూహం

సాక్షి, అమరావతి


కమీషన్‌ల కోసం అప్పులు చేయడం ఎక్కడైనా చూశారా? రూ.3 వేల కోట్ల రుణం తీసుకోవడానికి అనుమతి కోరితే, ఏకంగా రూ.పది వేల కోట్లు తీసుకోమని గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఎక్కడైనా విన్నారా? తెచ్చిన అప్పును తనఖా పెట్టిన ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కాకుండా ఇతర పనులకు మళ్లించడం ఎక్కడైనా ఉంటుందా..? ఈ వింతలు, విడ్డూరాలకు సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని కేంద్రంగా మార్చారు. మరో నెలన్నర రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వెలువడనుండడంతో సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా కమీషన్‌లు వసూలు చేసుకుని.. టీడీపీకి ఎన్నికల ఇం'ధనం' సమకూర్చుకోవడానికి ప్రణాళిక రచించారు. ఇందుకోసం రూ.3వేల కోట్ల రుణానికి ఏపీడబ్ల్యూఆర్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి సంస్థ) అనుమతి కోరితే ఏకంగా రూ.పది వేల కోట్లు తెచ్చుకొమ్మని సోమవారం సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పుల రూపంలో సమీకరించిన నిధుల నుంచి ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న రూ.5,111 కోట్ల బిల్లులు చెల్లించడంతోపాటు కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులను కోటరీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి, మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్‌లు వసూలు చేసుకోవడానికి పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లతో ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి, కమీషన్‌లు వసూలు చేసుకుంటున్నారు. నాలుగున్నరేళ్లలోనే రూ.37,952.92 కోట్ల వ్యయంతో చేపట్టిన 23 ప్రాజెక్టుల అంచనాలను రూ.96,060.73 కోట్లకు పెంచేశారు. అడ్డగోలుగా అంచనా వ్యయం పెంచేయడంతోనే– సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కొరత తలెత్తుతోందని ఆర్థిక, జలవనరుల శాఖ అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ నిధుల కొరతను అధిగమించడానికి ఏపీడబ్ల్యూఆర్‌డీసీ ద్వారా భారీ ఎత్తున రుణం తీసుకోవాలని సర్కార్ నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీడబ్ల్యూఆర్‌డీసీ రుణ పరిమితిని తొలగించి, భారీ ఎత్తున అప్పులు తీసుకోవడానికి గేట్లు ఎత్తేస్తూ.. ఏకంగా కేబినెట్‌లో సీఎం చంద్రబాబు తీర్మానం చేయించారు.

పది ప్రాజెక్టులు తనఖా పెట్టి..

ఏవైనా ఆస్తులు తనఖా పెడితే బ్యాంకులు రుణం ఇస్తాయి. ఏపీడబ్ల్యూఆర్‌డీసీకి ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో.. సోమశిల, శ్రీశైలం కుడిగట్టు కాలువ, వంశధార, గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ, చింతలపూడి, పురుషోత్తపట్నం, గోదావరి డెల్టా, కృష్ణా డెల్టాలను బదిలీ చేశారు. వాటిని తనఖా పెట్టి ఇప్పటికే రెండు బ్యాంకుల నుంచి రూ.4 వేల కోట్లు అప్పుగా తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ఈ మొత్తాన్ని ఈ పది ప్రాజెక్టులు పూర్తి చేయడానికే వెచ్చించాలి. అయితే ఇందులో సింహభాగం నీరు–చెట్టు కింద చేయని పనులూ చేసినట్లు చూపి టీడీపీ నేతలకు బిల్లుల రూపంలో దోచిపెట్టారు. సాగునీటి ప్రాజెక్టులతోపాటు నీరు–చెట్టు కింద చేసిన పనులకు ఇంకా రూ.5,111 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నిధుల కొరతను అధిగమించేందుకు రూ.మూడు వేల కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని సెప్టెంబరు 27న ఏపీడబ్ల్యూఆర్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అప్పు తీసుకోవడానికి ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు గత నెల 21న కేబినెట్ సమావేశంలో ఆమోదముద్ర వేయించారు.

ఇంతలోనే ఏమైందో?

ఏపీడబ్ల్యూఆర్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతిపాదన మేరకు రూ.3వేల కోట్లు రుణం తీసుకోవడానికి కేబినెట్ ఒప్పుకుంది. అయితే సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏకంగా రూ.10వేల కోట్ల రుణం తీసుకోవడానికి జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ అనుమతి ఇచ్చారు. కేబినెట్ ఆమోదించిన మొత్తం కంటే.. ఏకంగా రూ.7వేల కోట్లను అధికంగా రుణం తీసుకోవడానికి అనుమతి ఇవ్వడానికి సీఎం చంద్రబాబు ఒత్తిళ్లే కారణమని అధికారవర్గాలు చెబుతున్నాయి.



10. From the MD, APWRDC, Vijayawada Lr.No. BB/MD.APWRDC/Bank Loans/2017 Dated:27.09.2018

&&&&

ORDER:

In the GO 9th read above, the Government have transferred the assets and liabilities of the certain irrigation projects to APWRDC, Vijayawada along with the expenditure incurred by Govt of AP on those projects in the year 2017-18 for accelerating the progress of ongoing irrigation projects.

In the letter 10th read above, the MD, APWRDC, Vijayawada has requested the Government to accord permission to borrow a fresh loan of Rs.3000.00 Crores for accelerating the progress of ongoing irrigation projects for the reasons mentioned therein.

Government after careful examination of the matter, hereby accord permission to MD, APWRDC, Vijayawada to borrow a fresh loan upto Rs.10,000.00 Crores (Rupees Ten Thousand Crores only) from Banks at the lowest rate of interest by giving unconditional and irrevocable guarantee by the Government of Andhra Pradesh for repayment of loans.

ఏపీడబ్ల్యూఆర్‌డీసీ ఎండీ రూ.3 వేల కోట్ల రుణం కోసం అనుమతి కోరితే ఏకంగా రూ.10 వేల కోట్లు అప్పు చేయడానికి గేట్లు ఎత్తేస్తూ సర్కార్ జారీ చేసిన జీవో

మొబిలైజేషన్ అడ్వాన్సులు, కమీషన్‌ల కోసమే

ఎన్నికలకు రెండు నెలల ముందు ప్రాజెక్టులకు పునాది రాయి వేయడం.. ఆ తర్వాత వాటిని అటకెక్కించడం చంద్రబాబుకు సాధారణం. 1999, 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇదే రీతిలో శంకుస్థాపనలు చేసి, ఆ తర్వాత తట్టెడు మట్టి కూడా ఎత్తిన దాఖలాలు లేవు. ప్రాజెక్టుల పనులను చేపడుతున్నట్లు ప్రజలను నమ్మించి ఓట్లు దండుకోవడం, కాంట్రాక్టర్లకు ఇచ్చే మొబిలైజేషన్‌లు అడ్వాన్సులను కమీషన్‌లుగా తీసుకుని ఎన్నికల్లో వెదజల్లడం పరిపాటిగా మార్చుకున్నారు. మరో నెలన్నర రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వెలువడనుంది. అప్పటి నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుంది. ఈలోగా తాజాగా రూ.17,367.54 కోట్లతో ప్రతిపాదించిన 15 ప్రాజెక్టుల టెండర్లను పూర్తి చేసి.. ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించి, మొబిలైజేషన్ అడ్వాన్సులు ముట్టజెప్పి వాటినే కమీషన్‌ల రూపంలో వసూలు చేసుకుని ఎన్నికల్లో వెదజల్లాలన్నది సీఎం చంద్రబాబు వ్యూహం. 12 ప్రాజెక్టులకు నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఒత్తిడి తెస్తున్నారు. వీరికి మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇవ్వడానికి, పెండింగ్‌లో ఉన్న రూ.5,111 కోట్ల బిల్లులు చెల్లించడానికి తాజాగా రూ.పది వేల కోట్లు అప్పు చేస్తున్నారు. ఇందులో సింహభాగం ఎవరి జేబుల్లోకి వెళ్తుందన్నది బహిరంగ రహస్యమే!

కబ్జా కోరల్లో కృష్ణానది

- అభివృద్ధి ముసుగులో మూడెకరాల మేర నది పూడ్చివేత
- వెంకటపాలెం వద్ద వెలుగు చూసిన ఆక్రమణ
- నది మధ్య నుంచి ఒడ్డుకు భారీ డ్రెడ్జర్ ఏర్పాటు
- వేల ఎకరాలను వదిలేసి నదిని పూడ్చడంపై గ్రామస్తుల ఆగ్రహం



హద్దు దాటి మట్టిని నదిలోనికి వేసిన దృశ్యం

తుళ్లూరు రూరల్ (తాడికొండ): అమరావతిలో మరో దురాక్రమణ బట్టబయలయ్యింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామం పరిధిలో కృష్ణానదిని దాదాపు మూడు ఎకరాల మేర నది లోపల వైపు పూడ్చివేశారు. ఒక్క రోజులోనే పూడ్చివేతకు సరిపడ నల్లమట్టిని లారీల ద్వారా తరలించారు. ఆ మట్టిని యంత్రాలతో చదును చేశారు. నిజానికి రాజధానిలో ప్రభుత్వం చేపట్టే ప్రతి పని హంగు, ఆర్భాటాలతో జరుగుతుంటాయి. పర్యాటక ప్రాంతంగా వెంకటపాలెం నదీ తీరాన్ని తీర్చిదిద్దాలకుంటే.. అమరావతి ప్రాంతంలో ఇదే మొదటి ప్రాజెక్ట్ అవుతుంది. ఏవిధమైన హంగు ఆర్భాటాలు లేకుండా చేస్తున్నారంటే ఇది అధికార పార్టీ నేతల కబ్జాయేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో ఇతర వివరాలు ఏవీ లేకుండా కేవలం 'ఇతరులకు ప్రవేశం లేదు' అనే బోర్డు మాత్రమే అక్కడ ఉంచారు. సమాచారం ఇవ్వడానికి అధికారులెవరూ అందుబాటులో లేరు. ఈ విధంగా ఎవరు పడితే వారు బోర్డు పెట్టి సహజ వనరులను నాశనం చేస్తుంటే ఎలా? అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేల ఎకరాలు తీసుకున్నా సరిపోలేదా అని ప్రశ్నిస్తున్నారు.

డ్రెడ్జర్ ఏర్పాటు చేయడం ఎందుకు?

నదిని పూడ్చడానికి మట్టి చేరవేయడంతో పాటు నది గర్భం నుంచి ఇసుకను వేగంగా తవ్వి తరలించగల డ్రెడ్జర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఒడ్డు నుంచి దాదాపు అర కిలోమీటరు దూరంలో నది మధ్యలో ఈ డ్రెడ్జర్‌ను ఉంచారు. అక్కడి నుంచి భారీ పైపులైనును ఏర్పాటు చేసి ఇసుకను ఒడ్డుకు చేరవేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖ, ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం ఆ చుట్టుపక్కలకు వెళ్లిన దాఖలాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా, ఈ పనులు చేస్తున్నది ఓ కీలక మంత్రి అనుచరుడని విశ్వసనీయవర్గాల సమాచారం.

లంక భూముల విషయం చొరవ చూపరు ఎందుకని?

కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ఇప్పటివరకు శంకుస్థాపనలే జరిగాయి కానీ ఇంతవరకు ఒక్క భవనం కూడా నిర్మాణం చేపటలేదు. కారణం ఆ ప్రాంతంలో లంక భూములు సమస్యను ప్రభుత్వం, సీఆర్‌డీఏ పరిష్కరించలేదు. లంక భూములు సాగు చేస్తున్నది దళితులు కావడం, అందులో అధిక శాతం భూమి ప్రభుత్వం నుంచి గతంలో రైతులు పొందినది. వారికి ప్యాకేజీ ఇవ్వడం ప్రభుత్వాధినేతకు ఇష్టంలేదనే విమర్శలు ఉన్నాయి. నేడు వెంకటపాలెం వద్ద ఎలాంటి సమాచారం లేకుండా లంక భూములకు వెళ్లే ప్రాంతంలో నదిని పూడ్చివేస్తున్నారు. లంక రైతులకు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా పనులు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నో ఆందోళనలు చేసినా లంక భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎందుకు చొరవ తీసుకోదని ప్రశ్నిస్తున్నారు.

నదిని పూడ్చివేయడం అభివృద్ధా?



నదిని పూడ్చడం అభివృద్ధా? నది ఉధృతి ఎలా ఉంటుందో ఒక్క అధికారికైనా తెలుసా? లంక పొలాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూములు తీసుకునే విషయంలో మాత్రం చొరవ చూపించడం చాలా దారుణం. ప్రభుత్వానికి ఈ పద్ధతి తగదు. దళితులకు అన్యాయం చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదు.

– మందపాటి కోటయ్య, వెంకటపాలెం

అక్రమాలపై ఉన్న శ్రద్ధ పేదలపై లేదు



అధికార పార్టీ నేతలకు భూములు ఆక్రమించుకోవడంపై ఉన్న శ్రద్ధ పేదలకు చేయూతనివ్వడంపై లేనే లేదు. ఇన్నాళ్లు భూములు కావాలంటూ రైతులను పీడించారు. ఇప్పుడు నదులను ఆక్రమిస్తున్నారు. ఇంత విస్తీర్ణంలో నదిని పూడ్చడం అంటే చిన్న విషయం కాదు. ఇచ్చిన భూములలో అభివృద్ధి చేస్తే చాలు.

– లాలాది బాబురావు, వెంకటపాలెం

టీడీపీ నేతల దోపిడీకి అడ్డా..



రాజధాని నిర్మాణం తెలుగుదేశం పార్టీ నాయకుల దోపిడీకి అడ్డాగా మారిందనడానికి నిదర్శనం వెంకటపాలెంలో నదిని పూడ్చడం. ఇప్పటి వరకు సేకరించిన 33 వేల ఎకరాల పైన భూమిలో ప్రభుత్వం అభివృద్ధి చేసినది ఎమిటి? భూములు సరిపోలేదని నదులను పూడ్చడానికి సిద్ధమైంది. ఇది సరైన పద్ధతి కాదు. నిజంగా ప్రభుత్వం అభివృద్ధి పని చేస్తే దొంగచాటుగా చేయాల్సిన అవసరమేమిటి?

– ఉండవల్లి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త

సంక్షేమ శాఖకు జన్మభూమి ఎఫెక్ట్

- టాకింగ్ పాయింట్లు, లెక్కల్లో కింది స్థాయి అధికారులు
- కమిషనర్ ఆఫీసులకు వచ్చి వెనుదిరుగుతున్న బాధితులు

సాక్షి, అమరావతి: 'జన్మభూమి' పుణ్యమా అని సంక్షేమ శాఖ కార్యాలయాల్లో కమిషనర్లు, డైరెక్టర్లతో సహా వివిధ విభాగాల ఉన్నతాధికారులు అందుబాటులో లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులంతా జిల్లా ఇన్‌చార్జిలుగా జన్మభూమి కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. కొన్ని శాఖల ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రికి లెక్కలు తయారు చేసి ఇచ్చే పనిలో ఉన్నారు. ఈ మేరకు సాంఘిక, గిరిజన, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగుల శాఖలకు సంబంధించి ఇప్పటి వరకు ఐదేళ్లలో ఎంత మంది లబ్ధిదారులకు ఎంత మొత్తం లబ్ధి చేకూర్చారనే వివరాలు తయారు చేశారు. ఇవన్నీ పంచాయతీల్లో జరిగే జన్మభూమి–మా ఊరు సభల్లో పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కమిషనర్ కార్యాలయాలకు ఎంతోమంది దరఖాస్తుదారులు వివిధ పనుల నిమిత్తం నిత్యం వస్తున్నారు. శ్రీకాకుళం, అనంతపురం వంటి దూర ప్రాంత జిల్లాల నుంచి వచ్చిన వారు కూడా ఉన్నతాధికారులు లేకపోవడంతో అసహనంతో వెనుదిరుగుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో స్కాలర్ షిప్ విభాగానికి సంబంధించి మాత్రం విద్యార్థులకు కొంతమేర సమాధానం చెబుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రావత్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఉదయలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గంధం చంద్రుడు తదితర ఐఏఎస్ అధికారులను జిల్లాల ప్రత్యేకాధికారులుగా నియమించారు. మరో వారం రోజుల పాటు అధికారులు అందుబాటులో ఉండే అవకాశం లేదు. జన్మభూమి సభల్లో అధికారులు తయారు చేసిన అంకెల అభివృద్ధిని విద్యార్థులు, ఉపాధ్యాయుల ద్వారా చదివి వినిపిస్తారు. ఈ లెక్కలు చదివించాలని కోరుతూ ఉన్నతాధికారులు వారి చుట్టూ తిరుగుతున్నారు. దీంతో కార్యాలయాల్లో పాలనా వ్యవహారాలు కుంటుపడుతున్నాయి.

మళ్లీ చంద్రబాబుకు అధికారం పగటికల

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్




సీటీఆర్‌ఐ/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావటం పగటికలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. స్థానిక ఆనంద్ రీజెన్సీ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో చంద్రబాబు మాటలు ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈసారి చంద్రబాబుకు తన ఆశీర్వాదాలు లేకపోవడంతో అధికారంలోకి రావటం లేదని పాల్ జోష్యం చెప్పారు. ప్రజాశాంతి పార్టీ రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో పోటీ చేస్తుందని పాల్ పేర్కొన్నారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో మరో మీడియా సమావేశంలో పాల్ మాట్లాడుతూ.. రైతులు, నిరుద్యోగులు, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయలేకపోయారన్నారు. ప్రజలు తాగడానికి మంచినీరు అందించలేని పరిస్థితిలో రాష్ట్రం ఉందన్నారు.

సాక్షర భారత్ ఉద్యోగులకు బాబు అన్యాయం

మహాధర్నాలో సీపీఐ నేతలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గత పదేళ్లుగా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోన్న 21వేల మంది సాక్షర భారత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం చీకటి జీవోలతో తొలగించిందని, వీరిని తక్షణమే విధుల్లోకి తిరిగి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో మాట్లాడుతూ ఈ ఉద్యోగులతో అన్ని రకాల పనులు చేయించుకున్న ప్రభుత్వం, చివరికి జీతాలు ఇవ్వలేమని తొలగించడం నేరమని ఆయన పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ గతేడాది మార్చి నుంచి జూన్ వరకు ఈ ఉద్యోగులు పనిచేస్తున్నట్లుగా లెక్కలున్నాయని, సాక్షర భారత్ కేంద్ర ప్రభుత్వ పథకమనే సాకుతో సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని మండిపడ్డారు. సాక్షర భారత్ ఉద్యోగులు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం గద్దె దిగిపోవడం ఖాయమన్నారు. సంక్రాంతి లోగా వేతన బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
8-1-2019



1 కెరీర్‌లో తొలిసారి పుజారా 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెల్చుకున్నాడు.

3 దక్షిణాఫ్రికాలోనూ భారత్ గెలిస్తే... తొమ్మిది వేర్వేరు దేశాలపై వారి గడ్డపైనే టెస్టు సిరీస్‌లు గెలిచిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సరసన చేరుతుంది.

4 కోహ్లి సారథ్యంలో భారత జట్టు విదేశాల్లో నాలుగో సిరీస్ నెగ్గింది. తాజా విజయంతో సౌరవ్ గంగూలీ (4 సిరీస్‌లు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సమం చేశాడు.

5 ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ విజయాలు సాధించిన జట్ల సంఖ్య. ఇంగ్లండ్ (13 సార్లు), వెస్టిండీస్ (4 సార్లు), దక్షిణాఫ్రికా (3 సార్లు), న్యూజిలాండ్, భారత్ (ఒక్కోసారి) ఈ ఘనత సాధించాయి.

ఇంకేం ఇంకేం ఇంకేం కావాలె...

ఆస్ట్రేలియా గడ్డపై మ్యాచ్‌లు అంటే మన దగ్గర శీతాకాలంలో సూర్యోదయానికి ముందే లేచి చలిలో వణుకుతూ కూడా ఆటను చూడటం నాటి లాలా అమర్‌నాథ్ తరం నుంచి నేటి ధోని తరం భారత అభిమానుల వరకు అందరికీ అనుభవమే. క్రికెట్‌ను ఆస్వాదించడంలో ఎక్కడా తగ్గకపోయినా తుది ఫలితానికి వచ్చేసరికి మాత్రం చివరకు మనకు నిరాశే. ఈసారి గెలుస్తారేమో... తప్పక గెలుస్తారు... గెలవడం తప్ప మరో మాటకు తావు లేదు... ఇప్పుడైనా గెలుస్తారేమో... ప్రతీ సిరీస్‌కు ముందు ఆశలు పెట్టుకోని అభిమాని లేడు. మధ్యలో కొన్ని సార్లు గెలుపునకు అతి చేరువగా వచ్చి కూడా అనూహ్యంగా ఆ ఆనందాన్ని దూరం చేసిన క్షణాలు కూడా బోలెడు. అయితే ఇక గెలవగలరా అనే మాట తలపున కూడా రానీయకుండా... భారత జట్టు సిరీస్ విజయం కోసం తపించిన ప్రతీ అభిమాని గర్వపడే రోజు వచ్చింది. ఇంతకంటే మంచి అవకాశం లేదంటూ కంగారూ గడ్డపై అడుగు పెట్టిన కోహ్లి సేన దానిని చేసి చూపించింది. ఆసీస్ గడ్డపై తొలిసారి సిరీస్ జయకేతనాన్ని ఎగరవేసింది.

గావస్కర్, కపిల్ దేవ్‌లాంటి దిగ్గజాలు ప్రయత్నించారు. బిషన్ సింగ్ బేది బృందం త్రుటిలో అవకాశం చేజార్చుకుంది. అజహరుద్దీన్‌కు విజయం అందనంత దూరంలో నిలిస్తే కుంబ్లేకు కూడా అది సాధ్యం కాలేదు. మధ్యలో గంగూలీ విజయసౌరభం విరబూయించినా ఆఖరి మెట్టుపై అదృష్ట దేవత దూరంగా వెళ్లిపోయింది. కంగారూ గడ్డపై కెప్టెన్‌గా ధోనికి మిగిలింది అవమానభారమే. సర్వాంతర్యామి సచిన్ టెండూల్కర్... ఆసీస్ ఆటగాళ్ల గుండెల్లో నిద్రబోయిన వీవీఎస్ లక్ష్మణుడు... విధ్వంసానికి మారుపేరైన వీరేంద్రుడు... 'వాల్' రాహుల్ లాంటి వాళ్ల జమానాలో కూడా సిరీస్ గెలుపు కలగానే మిగిలి పోయింది. కానీ విరాట్ బృందం విశ్వరూపం చూపించింది. ఒక సెషన్‌లోనో, ఒక రోజులోనో పట్టు బిగించి తర్వాత దానిని సడలించే పాత కాలపు అలవాటును ఛేదించింది. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ప్రత్యర్థిని వారి సొంతగడ్డపై ఒక ఆటాడుకుంది. మధ్యలో ఓటమి ఎదురైనా కుంగిపోలేదు. అంతే వేగంతో మళ్లీ పైకి లేచి కొత్త చరిత్రను సృష్టించింది. ఎన్నాళ్లుగానో వేచిన 'ఉదయాన్ని' అభిమానులకు చూపించి సంబరాల్లో ముంచింది.

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన భారత్

- 2-1తో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సొంతం
- 'డ్రా'గా ముగిసిన చివరి టెస్టు
- వర్షంతో ఆఖరి రోజు సాధ్యం కాని ఆట
- జనవరి 12 నుంచి వన్డే సిరీస్

సిడ్నీ: ఆస్ట్రేలియాలో భారత జట్టు చారిత్రాత్మక టెస్టు సిరీస్ విజయం పూర్తయింది. వర్షం కారణంగా చివరిదైన నాలుగో టెస్టు ఆఖరి రోజు ఒక్క బంతి కూడా పడలేదు. ఆసీస్ ఓవర్‌నైట్ స్కోరు 6/0 వద్దనే ఆట ఆగిపోయింది. దాంతో సిడ్నీ టెస్టు 'డ్రా'గా ముగిసింది. ఫలితంగా నాలుగు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-1తో సొంతం చేసుకుంది. అడిలైడ్, మెల్‌బోర్న్ టెస్టులలో భారత్ గెలవగా... పెర్త్‌లో జరిగిన రెండో టెస్టులో ఆసీస్ విజయం సాధించింది. ఫలితంగా ఆసీస్ గడ్డపై భారత్ తొలిసారి సిరీస్ గెలిచినట్లయింది. ఎప్పుడో 1947-48 సిరీస్‌తో మొదలు పెట్టి 2014-15 వరకు 11 సార్లు ఆస్ట్రేలియాలో పర్యటించిన టీమిండియా 8 సార్లు ఓడిపోగా... 3 సార్లు సమంగా నిలిచింది. ఎట్టకేలకు 72 ఏళ్ల తర్వాత 12వ ప్రయత్నంలో విజయం భారత్ సొంతమైంది.

సోమవారం ఆస్ట్రేలియా సమయం ప్రకారం ఉదయం 10 గంటలకు మ్యాచ్ ప్రారంభం కావాల్సింది. అయితే వర్షం వెంటాడటంతో ఆటగాళ్లు గ్రౌండ్‌లోకి వెళ్లాల్సిన అవసరమే రాలేదు. పదే పదే అంపైర్లు తనిఖీలు, చర్చల అనంతరం చివరకు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు ఆటను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దాంతో భారత్ సిరీస్ విజయం ఖాయమైంది. చతేశ్వర్ పుజారా 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడంతో పాటు మొత్తంగా సిరీస్‌లో మూడు సెంచరీలు సహా 74.42 సగటుతో 521 చేసి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'అవార్డు కూడా గెలుచుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు: భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 300; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 6/0.

ఇంతగా ఎప్పుడూ గర్వపడలేదు

- నేను సాధించిన అతి పెద్ద ఘనత ఇదే
- ప్రపంచకప్ విజయంకంటే ఇది ఎక్కువ
- విరాట్ కోహ్లి భావోద్వేగం

ఆటగాడిగా, కెప్టెన్‌గా ఎన్నో విజయాలు సాధించిన కోహ్లి ఆస్ట్రేలియాపై గెలుపు తర్వాత కొత్తగా కనిపించాడు. సిరీస్ విజయం ఇచ్చిన అమితానందంతో అతను ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. సిడ్నీ టెస్టు తర్వాత భావోద్వేగభరితమైన అతను పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నాడు.


భార్య అనుష్కతో కోహ్లి

'నా కెరీర్‌లో ఇదే అతి పెద్ద ఘనత. అన్నింటికంటే అగ్రస్థానం ఇదే విజయానికి ఇస్తాను. 2011లో ప్రపంచకప్ గెలిచిన జట్టులో నేను జూనియర్ సభ్యుడిని. అంతకు ముందు వరల్డ్‌కప్ గెలవలేకపోయిన బాధ ఏమీ లేదు కాబట్టి విజయం తర్వాత కూడా కొందరు సీనియర్లలా నేను భావోద్వేగానికి గురి కాలేదు. అది మంచి విజయమే అయినా ఇక్కడ నేను చాలా భావోద్వేగానికి లోనవుతున్నాను. వరుసగా మూడోసారి పర్యటించాను కాబట్టి ఇక్కడ గెలుపు ఎంత ప్రత్యేకమో చెప్పగలను. ఈ సిరీస్ విజయం భారత జట్టును కొత్తగా చూపిస్తుంది. జట్టులో సభ్యుడిగా నేనెప్పుడూ ఇంతగా గర్వపడలేదు. ఇలాంటి టీమ్‌ను నడిపించడం గౌరవంగా భావిస్తున్నా. నాలుగేళ్ల క్రితం ఇక్కడే తొలిసారి కెప్టెనయ్యాను. ఇప్పుడు ఇక్కడే సిరీస్ గెలవడం మధురానుభూతి. గత 12 నెలలుగా మేం పడిన కష్టానికి ఇది ప్రతిఫలం.'

'సాంప్రదాయ శైలిలో టెస్టు క్రికెట్ మూలాలకు కట్టుబడి బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. అద్భుతంగా ఆడిన పుజారాను ప్రత్యేకంగా ప్రశంసించాలి. మయాంక్ చాంపియన్‌లా ఆడాడు. బ్యాట్స్‌మెన్ అంతా తమ వంతు పాత్ర పోషించారు. నా దృష్టిలో మెల్‌బోర్న్‌లో ఓపెనర్‌గా హనుమ విహారి దాదాపు 70 బంతులు ఆడటం కూడా సెంచరీతో సమానం. మన బౌలర్లు ఇంతగా ఆటను శాసించిన తీరును గతంలో ఎప్పుడూ చూడలేదు. వారి సన్నద్ధత, ఫిట్‌నెస్, ఆలోచనా ధోరణి అన్నీ గొప్పగా ఉన్నాయి. వారు పిచ్‌ను చూసి మాకు అనుకూలిస్తుందా అని ఎప్పుడూ ఆలోచించలేదు. జట్టు కోసం ఏదైనా చేసేందుకు వారు సిద్ధమయ్యారు. ఇది ఇంకా ఆరంభం మాత్రమే.'

'దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో కూడా మమ్మల్ని మేం నమ్మాం. అక్కడి పరాజయాలు మేం తప్పులు దిద్దుకునేలా చేశాయి. మనం సరైన దిశలో పని చేస్తే దేవుడు కూడా సహకరిస్తాడు. ఒక టెస్టులో గెలిస్తే చాలదని, సిరీస్ నెగ్గాలని మేం భావించాం కాబట్టి ఈ గెలుపు ఎంతో ప్రత్యేకం. మేం ఏదైనా చేయగలమని ఈ జట్టు నిరూపించింది. ఈ విజయం తర్వాతి తరం టెస్టులపై ఆసక్తి కనబర్చేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నా. వేడుకలు జరుపుకునే అర్హత మాకుంది. ఇవి సుదీర్ఘంగా సాగుతాయని మాత్రం చెప్పగలను. అభిమానులు కూడా అండగా నిలిచారు. విదేశీ గడ్డపై ఆడుతున్నట్లుగా అనిపించనే లేదు.'

మరికొన్ని క్రీడా వార్తలు - 14వ పేజీలో

"నా దృష్టిలో 1983 ప్రపంచకప్, 1985 వరల్డ్ సిరీస్ విజయాలకంటే ఇదే పెద్ద గెలుపు. ఎందుకంటే టెస్టు ఫార్మాట్ అన్నింటికంటే ఉత్తమమని, కఠినమైనదని నేను నమ్ముతా. నాపై వచ్చిన విమర్శలు పేలని తూటాల్లాంటివి (గావస్కర్‌ను ఉద్దేశించి). అవి భారత్ నుంచి ఇక్కడికి చేరేలోపే గాల్లో కలిసిపోతాయి. ఈ విజయం కోసం జట్టు ఎంతగా కష్టపడిందో నాకు బాగా తెలుసు. మేం మాత్రం ఆసీస్‌పై సరిగ్గా గురి చూసి గన్ పేల్చాం. గతంలో ఇక్కడ ఆడిన కెప్టెన్లు, భవిష్యత్తు గురించి నేను మాట్లాడను. ఈ రోజు గురించే ఆలోచిస్తా. 72 ఏళ్ల తర్వాత గెలిచాం. గెలిపించిన కెప్టెన్ కోహ్లికి నా సెల్యూట్. ఎందుకంటే అంత కసితో టెస్టులు ఎవరూ ఆడరు. ఈ జట్టులో సీనియర్లు, జూనియర్లు లేదా దేవుడు, దైవాంశ సంభూతులు ఎవరూ లేరు. అంతా భారత జట్టు సభ్యులే. పట్టుదల, అంకిత భావం కనబర్చిన ఆటగాళ్లకు హ్యాట్సాఫ్.



–రవిశాస్త్రి, భారత కోచ్

విదేశాల్లో సిరీస్ గెలవాలని మేం చాలా కాలంగా శ్రమిస్తున్నాం. అదీ ఆస్ట్రేలియాలో అంటే అంత సులువు కాదు. ఇందులో నా భాగస్వామ్యం ఉండటం గర్వంగా ఉంది. తొలి టెస్టులో సాధించిన సెంచరీ నాకు అన్నింటికంటే ప్రత్యేకం. కఠోర సాధన, సన్నద్ధత వల్లే ఇది సాధ్యమైంది. పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఎప్పటికీ నా తొలి ప్రాధాన్యత మాత్రం టెస్టులకే.

–పుజారా



భారత బౌలింగ్ దళం అద్భుతంగా ఉంది. వారు సిరీస్ ఆసాంతం మాపై ఒత్తిడి కొనసాగించారు. తొలి టెస్టులో మాకు అంది వచ్చిన పలు అవకాశాలను చేజార్చుకోవడమే ఫలితాన్ని శాసించింది. అక్కడ పట్టు కొనసాగించి ఉంటే 2-1తో మేమే గెలిచేవాళ్లమేమో. సొంత గడ్డపై మేం భారత్‌ను ఓడించగలమని సిరీస్‌కు ముందు నమ్మాం. కానీ భారత ఆటగాళ్లు కీలక సమయాల్లో జట్టును ఆదుకున్నారు. భారత్‌నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. మా టాప్-7 మొత్తం విఫలమైంది."

–టిమ్ పైన్, ఆసీస్ కెప్టెన్

ప్రశంసలు వెల్లువెత్తాయిలా...

కంగారూ గడ్డపై చరిత్ర సృష్టించిన టీమిండియాపై ప్రశంసల జల్లు కురిసింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ తదితరులు కోహ్లిసేనను ట్విట్టర్‌లో అభినందనలతో ముంచెత్తారు.

ఆసీస్‌లో టెస్టు సిరీస్ గెలవాలన్న భారత క్రికెట్ అంతిమ లక్ష్యాన్ని కోహ్లి అండ్ కో పూర్తిచేసింది. ఆల్‌రౌండ్ నైపుణ్యంతో సాధించిన ఈ విజయం మమ్మల్ని గర్వపడేలా చేసింది. ఇకపై దీన్నే అలవాటుగా చేసుకోవాలి –రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఆస్ట్రేలియాలో చారిత్రక విజయం సాధించిన టీమిండియాకు శుభాభినందనలు. ఈ సిరీస్‌లో సమష్టిగా అద్భుత ప్రదర్శనతో రాణించిన భారత్‌కే విజయార్హత ఉంది. –ప్రధాని నరేంద్ర మోదీ

ఆసీస్‌లో టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా ఘనచరిత్ర సృష్టించిన టీమిండియాకు అభినందనలు. విరాట్ సారథ్యం, పుజారా బ్యాటింగ్ అద్భుతం. కొత్తేడాదిలో జాతికి గొప్ప కానుక ఇచ్చారు. వన్డేల్లోనూ ఇదే జోరు కొనసాగాలి.
–బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియాకు అభినందనలు. మనందరికీ ఇది గర్వపడే క్షణం. –వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

భారత జట్టుకు అభినందనలు. చతేశ్వర్ పుజారా బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిస్తే బౌలింగ్‌లో బుమ్రా అద్భుతం. –హర్భజన్ సింగ్




భారత క్రికెట్‌లో గొప్ప రోజు. ఆటగాళ్ల పట్టుదల అపూర్వం. కుర్రాళ్ల ప్రదర్శన గర్వకారణం. వారితో కలిసి సీనియర్లు బాధ్యత పంచుకోవడంతో ప్రత్యేక విజయం సాధ్యమైంది. రిషభ్, కుల్దీప్‌లకు మంచి భవిష్యత్తు ఉంది. –సచిన్ టెండూల్కర్

చారిత్రక విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు. ఇది సమష్టి ప్రదర్శన. కుర్రాళ్లు సాధించిన ఘనతను చూస్తే చాలా సంతృప్తికరంగా ఉంది. –వీవీఎస్ లక్ష్మణ్

ఆస్ట్రేలియాలో తొలిసారి సిరీస్ గెలిచిన కోహ్లి, అతని సహచరులకు నా అభినందనలు. అన్ని రంగాల్లో ఆసీస్‌పై ఆ జట్టు ఆధిపత్యం కనబర్చింది. –మెక్‌గ్రాత్

ఈ విజయాన్ని ఆస్వాదించండి. స్మిత్, వార్నర్ లేకపోవడం గురించి కోడిగుడ్డుకు ఈకలు పీకే చర్చ మాత్రం చేయకండి. –గౌతం గంభీర్

అది మా తప్పు కాదు!



ఆస్ట్రేలియా జట్టులో స్మిత్, వార్నర్ లేకపోవడం భారత్ తప్పు కాదు. వారిపై తక్కువ సమయం పాటు నిషేధం విధించాల్సింది. తమకు ఎదురైన ప్రత్యర్థితో తలపడటమే ఆటగాళ్ల పని. టీమిండియా సాధించిన విజయం గొప్ప ఘనతగా చెప్పవచ్చు. గతంలో కూడా ఆసీస్ గడ్డపై భారత జట్లు విజయం కోసమే ఆడాయి. అయితే కోహ్లి మార్గనిర్దేశనంలో ఫిట్‌నెస్‌పరంగా ఈ జట్టు ఉత్తమంగా నిలిచింది. –సునీల్ గావస్కర్

మేరీ దేశ్ కీ ధర్తీ...

విజయానంతరం భారత ఆటగాళ్ల జోష్‌కు అంతు లేకుండా పోయింది. ముఖ్యంగా సిరీస్ హీరో పుజారాతో డ్యాన్స్ చేయించేందుకు పంత్ తదితరులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. తన వల్ల కాదన్నట్లుగా రెండు సార్లు గట్టిగా చేతులు మాత్రమే కదిలించి అతను ఊరుకున్నాడు. 'దీనిని పుజారా డ్యాన్స్ అనాలేమో. అతను మామూలుగా నడిచినప్పుడు కూడా చేతులు పెద్దగా కదల్చడు. చిన్న స్టెప్ కూడా వేయలేకపోవడం చూస్తే పుజారా ఎలాంటి సింపుల్ మనిషో మనకు అర్థమవుతుంది' అని కోహ్లి సరదాగా అన్నాడు. హోటల్లోనూ అభిమానులు క్రికెటర్లను ఆటపాటలతో ఆహ్వానించారు. 'పుకార్' సినిమాలోని దేశభక్తి పాట 'మేరీ దేశ్ కీ ధర్తీ సోనా ఉగ్‌లే...'కు అభిమానులతో కలిసి కోహ్లి డ్యాన్స్ చేశాడు.

సాక్షి బిజినెస్
మంగళవారం 8-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (సోమ రెండు రాత్రి 11.30)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
155 ▲	44 ▲
35,850	10,772

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	6,842	▲ 103
డోజోన్స్	23,601	▲ 197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,810	▼ 27
డాక్స్	10,748	▼ 20
షాంఘై	2,533	▲ 18
నికాయ్	20,039	▲ 477

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	68.64	70.28
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.00	90.13
€	యూరో	ఎస్‌బీఐ	77.91	80.82
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.04	65.47
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	48.56	50.78
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.29	52.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.25	20.03
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.15	10.08

బంధన్ చేతికి గృహ్ ఫైనాన్స్

- షేర్ల మార్పిడి రూపంలో విలీనం
- విలీన సంస్థ విలువ సుమారు రూ. 83,000 కోట్లు
- డీల్ జనవరి 1 నుంచి వర్తింపు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ తాజాగా గృహ్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. షేర్ల మార్పిడి రూపంలో ఈ విలీన ఒప్పందం ఉండనుంది. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి జనవరి 1 నుంచి ఇది వర్తించనుంది. ఇరు సంస్థల బోర్డులు సోమవారం ఈ ఒప్పందానికి ఆమోదముద్ర వేశాయి. రెండు పక్షాలకు ఇది ప్రయోజనకరమైన ఒప్పందంగా హెచ్‌డీఎఫ్‌సీ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ దీపక్ పరేఖ్ వ్యాఖ్యానించారు. పెద్ద ఎత్తున కార్యకలాపాలు విస్తరించేందుకు గృహ్ ఫైనాన్స్‌కి, మరింత వైవిధ్యమైన సెక్యూర్డ్ రుణాల పోర్ట్‌ఫోలియో దక్కడం ద్వారా బంధన్ బ్యాంక్‌కు ఇది లాభించగలదన్నారు. విలీన సంస్థలో 15 శాతం దాకా వాటాలను అట్టే పెట్టుకునేందుకు అనుమతించాలని రిజర్వ్ బ్యాంక్‌ను కోరతామని, అనుమతి లభించని పక్షంలో నిబంధనల ప్రకారం 10 శాతం లోపునకు తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. బ్యాంకు వృద్ధి ప్రణాళికల్లో భాగంగా డైవర్సిఫికేషన్‌పై దృష్టి పెట్టినట్లు, ఇందులో భాగంగానే గృహ్ ఫైనాన్స్ కొనుగోలు చేస్తున్నట్లు బంధన్ బ్యాంక్ సీఈవో చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు. విలీనానంతరం బంధన్ బ్యాంక్ పోర్ట్‌ఫోలియోలో అన్‌సెక్యూర్డ్ రుణాల వాటా 86 శాతం నుంచి 50 శాతానికి తగ్గుతుందన్నారు. విలీన బ్యాంక్‌కు దేశవ్యాప్తంగా 4,182 బ్యాంకింగ్ అవుట్‌లెట్స్, 476 ఏటీఎంలు ఉంటాయి. రుణ పోర్ట్‌ఫోలియోలో 58 శాతం మైక్రో ఫైనాన్స్ రుణాలు, 28 శాతం రిటైల్ హోమ్ లోన్స్, 14 శాతం ఇతరత్రా రుణాలు ఉంటాయి.

తగ్గనున్న బంధన్ హోల్డింగ్స్ వాటాలు ..

ప్రస్తుతం బంధన్ బ్యాంక్‌లో మాతృ సంస్థ బంధన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు (బీఎఫ్‌హెచ్‌ఎల్) 82.28 శాతం వాటాలు ఉన్నాయి. అటు గృహ్ ఫైనాన్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీకి 57.83% వాటాలు ఉన్నాయి. విలీనానంతరం బంధన్ బ్యాంక్‌లో బంధన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ వాటా 60.27%కి తగ్గుతుంది. అటు హెచ్‌డీఎఫ్‌సీకి 15% వాటాలు దక్కుతాయి. ఆ తర్వాత కొన్ని వాటాలను పబ్లిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు లేదా సెకండరీ మార్కెట్లలో విక్రయించడం ద్వారా దీన్ని క్రమంగా 10% లోపునకు తగ్గించుకుంటుంది. ఆర్‌బీఐ బ్యాంకింగ్ లైసెన్స్ నిబంధనల ప్రకారం.. కార్యకలాపాలు ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలో బంధన్ బ్యాంక్‌లో బీహెచ్‌ఎఫ్‌ఎల్ తన వాటాలు 82.3% నుంచి 40%కి తగ్గించుకోవాలి. కానీ అది జరగకపోవడంతో గతేడాది సెప్టెంబర్‌లో బంధన్ బ్యాంక్ కార్యకలాపాల విస్తరణ, సీఈవో చంద్రశేఖర్ ఘోష్ జీతభత్యాలపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించినప్పటికీ ఇటీవల సడలించింది. తాజా డీల్ పూర్తయినా బంధన్ బ్యాంక్‌లో బీహెచ్‌ఎఫ్‌ఎల్ వాటా 60.27% స్థాయికి మాత్రమే తగ్గుతుంది. దీంతో.. వాటాలను మరింత తగ్గించుకోవడానికి బీహెచ్‌ఎఫ్‌ఎల్ మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉండనుంది. ఇక, అటు హెచ్‌డీఎఫ్‌సీకి విలీన బ్యాంకులో ప్రమోటరు హోదా లభిస్తుంది. ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీకి.. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 19.72% వాటాలు ఉన్నాయి. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. ఒక బ్యాంకులో ప్రమోటరుగా ఉన్న సంస్థ మరో బ్యాంకులో ప్రమోటరుగా 10%కి మించి వాటాలు ఉండకూడదు దీంతో విలీన సంస్థలో ప్రారంభ దశలో 15.44% వాటాలు ఉన్నప్పటికీ.. హెచ్‌డీఎఫ్‌సీ కూడా క్రమంగా దీన్ని పది శాతం లోపునకు తగ్గించుకోవాల్సి రానుంది.

సోమవారం బీఎస్‌ఈలో బంధన్ బ్యాంక్ షేర్లు 5.21 శాతం క్షీణించి రూ. 501.10 వద్ద క్లోజయ్యాయి. గృహ్ ఫైనాన్స్ షేరు 3.9 శాతం క్షీణించి రూ. 306.20 వద్ద క్లోజయ్యింది.

గృహ్ ఫైనాన్స్..

అల్పాదాయ వర్గాలకు గృహ రుణాలు అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో 1986లో ఆగా ఖాన్ ఫౌండేషన్, హెచ్‌డీఎఫ్‌సీ కలిసి గృహ్ ఫైనాన్స్ ఏర్పాటు చేశాయి. సెప్టెంబర్ క్వార్టర్ గణాంకాల ప్రకారం.. గృహ్ ఫైనాన్స్ దాదాపు రూ. 2,738 కోట్ల రుణాలు ఇచ్చింది. మొత్తం లోన్ బుక్ పరిమాణం రూ. 16,663 కోట్లుగా ఉంది. ప్రధానంగా రిటైల్ విభాగంపై దృష్టి పెడుతున్న గృహ్ ఫైనాన్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో రూ. 220 కోట్ల నికర లాభం ఆర్జించింది.

బంధన్ బ్యాంక్..

బంధన్ బ్యాంక్‌కు.. 938 శాఖలు, 30,431 మంది ఉద్యోగులు ఉన్నారు. మొత్తం డిపాజిట్లు రూ. 33,869 కోట్లు, ఇచ్చిన రుణాలు రూ. 33,373 కోట్లుగా ఉన్నాయి. బంధన్ బ్యాంక్ ప్రధానంగా తూర్పు భారత దేశ రాష్ట్రాల్లోని గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. రుణాల పోర్ట్‌ఫోలియోలో ఎక్కువగా మైక్రో ఫైనాన్స్ లోన్సే ఉన్నాయి. అటు గృహ్ ఫైనాన్స్ పశ్చిమాది రాష్ట్రాల్లో .. గృహ రుణాల కేటగిరీలో కార్యకలాపాలు సాగిస్తోంది.

షేర్ల మార్పిడి ఇలా..

డీల్ ప్రకారం.. గృహ్ ఫైనాన్స్ షేర్‌హోల్డర్ల దగ్గరున్న ప్రతి 1,000 షేర్లకు గాను బంధన్ బ్యాంక్‌కి చెందిన 568 షేర్లు లభిస్తాయి. ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా ప్రమోటర్ హోల్డింగ్‌ను తగ్గించుకోవడానికి, అలాగే హౌసింగ్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించుకోవడానికి బంధన్ బ్యాంక్‌కు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. విలీన సంస్థ విలువ సుమారు రూ. 83,000 కోట్లుగా ఉంటుంది. బంధన్ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 59,800 కోట్లుగా ఉండగా, గృహ్ ఫైనాన్స్ విలువ రు. 23,224 కోట్లుగా ఉంది.

ఎరిక్సన్ కేసులో అనిల్ అంబానీకి నోటీసులు..



న్యూఢిల్లీ: టెలికం పరికరాల తయారీ సంస్థ ఎరిక్సన్ ఇండియా దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌కు సంబంధించి రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్) చైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో తమ వివరణ ఇవ్వాలంటూ అంబానీతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగతావారిని ఆదేశించింది. ఎరిక్సన్‌కు బాకీ పడిన మొత్తంలో రూ. 118 కోట్లు తక్షణం కట్టేందుకు తాము సిద్ధమని, ఇందుకు అనుమతించాలని ఆర్‌కామ్ తరఫు న్యాయవాదులు కపిల్ సిబాల్, ముకుల్ రోహత్గీ న్యాయస్థానాన్ని కోరారు. అయితే, రావాల్సిన మొత్తం రూ. 550 కోట్ల బాకీ పూర్తిగా డిపాజిట్ చేయాల్సిందేనంటూ ఎరిక్సన్ స్పష్టం చేసింది. మరో వైపు, రూ.118 కోట్లకు డిమాండ్ డ్రాఫ్టును రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాల్సిందిగా ఆర్‌కామ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశించినా గడువులోగా బాకీలు చెల్లించడంలో ఆర్‌కామ్ రెండు సార్లు విఫలం కావడంతో అనిల్ అంబానీపై ఎరిక్సన్ కోర్టు ధిక్కార పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే.

స్పెషాలిటీ ఉత్పత్తులపై అరబిందో ఫోకస్

అభివృద్ధి దశలో 147 ఉత్పాదనలు



హైదరాబాద్: ఔషధ రంగ సంస్థ అరబిందో ఫార్మా విభిన్న ప్రత్యేక ఉత్పత్తుల అభివృద్ధిలో నిమగ్నమైంది. ఆంకాలజీ, హార్మోన్స్, బయాలాజిక్స్, టాపికల్స్, నాసల్స్, పెప్టైడ్స్, ఇన్‌హేలర్స్, వ్యాక్సిన్స్ వంటి 147 ప్రొడక్టులు అభివృద్ధి దశలో ఉన్నట్టు కంపెనీ వెల్లడించింది. వీటి మార్కెట్ పరిమాణం రూ.8.27 లక్షల కోట్లు అని ఇన్వెస్టర్ ప్రెజెంటేషన్‌లో తెలిపింది. కొత్త ఉత్పత్తుల ద్వారా ఆదాయం 2019–20 తొలి త్రైమాసికం నుంచి ప్రారంభం అవుతుంది. మూడేళ్లలో ఈ ప్రొడక్టులను యూఎస్‌ఎఫ్‌డీఏ వద్ద అరబిందో ఫైల్ చేయనుంది.

వృద్ధికి వ్యవసాయం, తయారీ దన్ను!

- జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం
- 2018–19పై సీఎస్‌ఓ అంచనాలు
- ఆర్‌బీఐ అంచనాలకన్నా తక్కువ



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2018–19) వ్యవసాయం, తయారీ రంగాలు వెన్నుదన్నుగా నిలవనున్నాయని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌ఓ) పేర్కొంది. దీనితో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదుకానున్నట్లు అంచనావేసింది. 2017–18లో ఈ రేటు 6.7 శాతం కావడం గమనార్హం. సీఎస్‌ఓ సోమవారం విడుదల చేసిన జీడీపీ మొదటి ముందస్తు అంచనాలను క్లుప్తంగా చూస్తే...

- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 2018–19 సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి రేటు ఉండొచ్చని అంచనా వేసింది. ప్రస్తుత సీఎస్‌ఓ అంచనాలు ఆర్‌బీఐ అంచనాలకన్నా తక్కువగా ఉండడం గమనార్హం.
- పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే అంచనాలకన్నా కూడా తాజా అంచనాలు భిన్నంగా ఉండడం గమనార్హం. వృద్ధి రేటు 2018–19లో 7 నుంచి 7.5 శాతం శ్రేణిలో ఉంటుందని ఆర్థిక సర్వే పేర్కొంది.
- 2016–17లో వృద్ధి 7.1 శాతంకాగా అంతక్రితం ఏడాది (2015–16) వృద్ధి రేటు 8.2 శాతం.
- కేవలం పరిశ్రమ ఉత్పత్తికి సంబంధించి వాస్తవ జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్) వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరం 6.5 శాతం. అయితే, 2018–19లో 7 శాతంగా ఉండే వీలుంది.
- వ్యవసాయం, అటవీ, మత్స్య రంగాల వృద్ధి రేటు 3.4 శాతం నుంచి 3.8 శాతానికి పెరుగుతుంది.
- తయారీ రంగం వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 8.3 శాతానికి పెరిగే అవకాశం.
- అయితే, మైనింగ్ క్వారీయింగ్ రంగంలో ఉన్న క్షీణ రేటు – 2.9% నుంచి – 0.8 శాతానికి తగ్గే వీలుంది.
- వాణిజ్యం, హోటెల్స్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవల రంగాల్లో క్షీణ రేటు కూడా – 8 శాతం నుంచి –6.9 శాతానికి తగ్గవచ్చు.
- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ ఇతర సేవల విభాగంలో వృద్ధి రేటు 10 శాతం నుంచి 8.9 శాతానికి తగ్గే అవకాశం ఉంది.
- విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా వృద్ధి రేటు 7.2 శాతం నుంచి 9.4 శాతానికి పెరుగుతుంది.
- నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 8.9 శాతానికి పెరిగే అవకాశం.
- ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవల వృద్ధి రేటు స్వల్పంగా 6.6 శాతం నుంచి 6.8 శాతానికి చేరుతుంది.
- పెట్టుబడులకు సూచిక అయిన స్థూల స్థిర పెట్టుబడుల పరిమాణం (జీఎఫ్‌సీఎఫ్) రూ.47.79 లక్షల కోట్ల నుంచి రూ.55.58 లక్షల కోట్లకు పెరగనుంది.

తలసరి ఆదాయం రూ.1,25,397

జాతీయ తలసరి ఆదాయం 2018–19లో రూ.1,25,397గా ఉండొచ్చని సీఎస్‌ఓ పేర్కొంది. 2017–18లో ఈ మొత్తం రూ. 1,12,835. అప్పట్లో ఇది 8.6 శాతం వృద్ధి కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 11.1 శాతంగా ఉండనుంది.

మంచి ఫలితమే...



వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదైతే అది మంచి సానుకూల ఫలితమే అవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగవంతమైన వృద్ధిరేటు కొనసాగిస్తున్న దేశంగా తన హోదాను నిలబెట్టుకుంటుంది. పెట్టుబడులు పెరుగుతున్న సంకేతాలూ హర్షణీయమే.

– సుభాష్ చంద్ర గార్గ్,
ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

40వేల కోట్ల పెట్టుబడులు!!

- ఓఏఎల్‌పీ రెండో రౌండు వేలంపై అంచనా
- 14 బ్లాక్‌ల వేలం ప్రక్రియ ప్రారంభం
- మార్చి 12లోగా బిడ్ల దాఖలు



న్యూఢిల్లీ: ఓపెన్ ఏకరేజ్ లైసెన్సింగ్ విధానం (ఓఏఎల్‌పీ) కింద తలపెట్టిన రెండో విడత చమురు, గ్యాస్ బ్లాక్‌ల వేలం ద్వారా రూ. 40,000 కోట్ల పెట్టుబడులు రావొచ్చని అంచనా వేస్తున్నట్లు చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. గతేడాది నిర్వహించిన తొలి విడతలో 55 బ్లాక్‌లు వేలం వేయగా రూ. 60,000 కోట్ల మేర పెట్టుబడులకు కమిట్‌మెంట్ లభించినట్లు ఆయన తెలియజేశారు. రెండో విడతలో 14 బ్లాక్‌లు ఉన్నట్లు సోమవారం వేలం ప్రక్రియ ప్రారంభించిన మంత్రి చెప్పారు. మూడో విడత కింద 12 చమురు, గ్యాస్ బ్లాక్‌లు, అయిదు కోల్ బెడ్ మీథేన్ బ్లాక్‌ల వేలం వేయనున్నామని, ఈ ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభం కాగలదని ఆయన చెప్పారు. ఓఏఎల్‌పీ–2 కింద వేలం వేసే 14 బ్లాక్‌ల విస్తీర్ణం 29,333 చ.కి.మీ. ఉంటుందని, బిడ్‌ల దాఖలుకు మార్చి 12 తుది గడువుగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

12,600 మిలియన్ టన్నుల నిక్షేపాలు..

కేజీ బేసిన్‌లో ఒక డీప్ వాటర్ బ్లాక్‌తో పాటు అండమాన్, కచ్ బేసిన్‌లో చెరి రెండు, మహానది బేసిన్‌లో ఒక బ్లాక్ వేలం వేస్తున్న వాటిలో ఉన్నాయి. ఈ 14 బ్లాక్‌లలో దాదాపు 12,609 మిలియన్ టన్నుల చమురు, తత్సమాన గ్యాస్ నిక్షేపాలు ఉండొచ్చని అంచనా. ఓఏఎల్‌పీ –1 లో మొత్తం 55 బ్లాకులు వేలం వేయగా వేదాంత సంస్థ 41 బ్లాకులు దక్కించుకుంది. మిగతావాటిలో ప్రభుత్వ రంగానికి చెందిన ఆయిల్ ఇండియా తొమ్మిది, ఓఎన్‌జీసీ కేవలం రెండు మాత్రమే దక్కించుకున్నాయి. ఈ 55 బ్లాక్‌ల విస్తీర్ణం 59,282 చ.కి.మీ. ఉంటుంది. ప్రస్తుతం ఉత్పత్తి, అన్వేషణ లైసెన్సు పరిధిలో లేని చిన్న స్థాయి చమురు, గ్యాస్ బ్లాక్‌లను తీసుకునేందుకు కంపెనీలు ఓఏఎల్‌పీ కింద తమ ఆసక్తిని (ఈవోఐ) వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ఈ ఈవోఐల ఆధారంగా కేంద్రం ఏటా రెండు విడతలుగా వేలం నిర్వహిస్తుంది. ఉత్పత్తయ్యే చమురు, గ్యాస్‌లో ప్రభుత్వానికి అత్యధిక వాటా ఇచ్చే సంస్థకు బ్లాక్‌లు దక్కుతాయి.

విదేశీ భాగస్వాములకు ఓకే..

సంక్లిష్ట క్షేత్రాల్లో ఇంధన ఉత్పత్తి పెంపునకు ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా సంస్థలు ప్రైవేట్, విదేశీ సంస్థలను భాగస్వాములుగా చేసుకునేందుకు అనుమతించనున్నట్లు ప్రధాన్ వివరించారు.

కుంభమేళాలో జియో సేవలు


ఫ్యామిలీ లొకేటర్ యాప్ విడుదల



న్యూఢిల్లీ: అలహాబాద్‌లో ఈనెల 15 నుంచి ప్రారంభంకానున్న కుంభమేళాకు సంబంధించి ఓ సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను విడుదలచేసినట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. మార్చి 4వరకు కొనసాగే ఈ ప్రపంచ అతిపెద్ద ఉత్సవంలో పాల్గొనేవారు తమ కుటుంబ సభ్యులను మిస్‌కాకుండా 'ఫ్యామిలీ లొకేటర్' పేరుతో ఈ యాప్‌ను అందిస్తోంది. జనం మధ్యలో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలుకోవడం కుంభమేళాలో క్లిష్టతరం కాగా, ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చని రిలయన్స్ జియో వివరించింది. తప్పిపోయే కుటుంబ సభ్యులు, మిత్రులను కలిపేందుకు యూపీ పోలీసులు, కాష్ ఐటీ సంస్థ సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది.

ద్రవ్య లభ్యత సమస్యల్లేవు!

- అవసరమైతే తగిన చర్యలు తీసుకుంటాం
- ఇష్టానుసారం రైతు రుణ మాఫీలు సరికాదు
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ స్పష్టీకరణ
- చిన్న, లఘు, మధ్యతరహా ప్రతినిధులతో సమావేశం
- నేడు ఎన్‌బీఎఫ్‌సీ అధికారులతో భేటీ



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) సమస్యలు లేవని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ ఉద్ఘాటించారు. అవసరమైతే తగిన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టంచేశారు. గవర్నర్ సోమవారం లఘు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ప్రతినిధులతో సమావేశమయ్యారు. రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో ఆయా రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... మంగళవారం నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) ప్రతినిధులతో కూడా సమావేశమవుతానని, ఈ రంగంలో నగదు లభ్యత సమస్యల్ని తెలుసుకుంటామని చెప్పారు.

ఎప్పటికప్పుడు సమీక్ష...

లిక్విడిటీ అంశంపై ఆర్‌బీఐ క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తుందని దాస్ చెప్పారు. ''ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవస్థలో నగదు కొరత రానివ్వం. అదే సమయంలో అవసరానికి మించి ద్రవ్యం వ్యవస్థలో ఉండడాన్ని కూడా ఆర్‌బీఐ అనుమతించదు. వ్యవస్థలో ద్రవ్య లభ్యతను జాగ్రత్తగా పరిశీలిస్తూ, అవసరం మేరకు ఉండేలా ఆర్‌బీఐ జాగ్రత్తలు తీసుకుంటుంది'' అని దాస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతనెల్లో దాస్ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకర్లతో సమావేశమయ్యారు. వ్యవస్థలో నగదు లభ్యత, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు రుణ పరిస్థితులపై ప్రధానంగా చర్చించారు. తర్వాత ఈ నెల మొదట్లో రూ. 25 కోట్ల వరకూ రుణం ఉండి, చెల్లించలేకపోతున్న రుణాన్ని, ఒకేసారి పునర్‌వ్యవస్థీకరించడానికి ఆర్‌బీఐ అనుమతించింది. అయితే సంస్థ రుణం పునర్‌వ్యవస్థీకరించే నాటికి, ఆ సంస్థ జీఎస్‌టీలో నమోదై ఉండాలి. జీఎస్‌టీ నమోదు అవసరం లేదని మినహాయింపు పొందిన ఎంఎస్‌ఎంఈలకు ఇది వర్తించదు.

మధ్యంతర డివిడెండ్‌పై ఆర్‌బీఐ నిర్ణయం

కేంద్రానికి తాను మధ్యంతర డివిడెండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎంతివ్వాలన్న అంశాన్ని ఆర్‌బీఐ నిర్ణయిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి ఆర్‌బీఐ ఇచ్చిన మధ్యంతర డివిడెండ్ రూ.10,000 కోట్లు. ఆర్థిక సంవత్సరం మొత్తంలో రూ. 50,000 కోట్లు డివిడెండ్‌గా బదలాయించింది. ''2018–19లో ఎంత మధ్యంతర డివిడెండ్ ఇస్తుందన్న విషయం ఆర్‌బీఐ ప్రకటించినప్పుడు మీకు తెలుస్తుంది'' అని శక్తికాంతదాస్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ, జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి 2018–19లో రూ.54,817.25 కోట్ల డివిడెండ్ వస్తుందని బడ్జెట్ అంచనావేసింది.

2,000 నోట్లపై ఇక చెప్పేదేమీలేదు..

వ్యవస్థ నుంచి రూ.2,000 నోట్లను దశలవారీగా తొలగిస్తారన్న వార్తలపై గవర్నర్ సమాధానం ఇస్తూ, ''ఆర్థిక వ్యవహారాల శాఖ ఈ విషయంపై ఇప్పటికే ఒక ప్రకటన చేసింది. దీనిపై ఇంకా చెప్పాల్సింది ఏదీ లేదు'' అన్నారు. డీమోనిటైజేషన్ తర్వాత ప్రవేశపెట్టిన రూ.2,000 నోట్ల ముద్రణను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి తగినంత స్థాయిలో రూ.2,000 నోట్లు ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గర్గ్ తెలిపారు.

ఎన్‌పీఏలపై బ్యాంకులకు 'టార్గెట్' లేదు

మొండిబకాయిల (ఎన్‌పీఏ)ల సవాలు పరిష్కారంలో బ్యాంకులకు ఏదైనా లక్ష్యాలు నిర్దేశిస్తున్నారా? అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని గవర్నర్ స్పష్టం చేశారు. బ్యాంకుల మొండిబకాయిల స్థాయి తగ్గుతోందని కూడా ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రత్యేకించి ఈ విషయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరు బాగుందన్నారు. 2018 మార్చిలో రూ.9.62 లక్షల కోట్లకు చేరిన ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండిబకాయిలు అటు తర్వాత రూ.23,000 కోట్లకు తగ్గాయి.

ప్రభుత్వానికి డివిడెండ్ రూ.40,000 కోట్లు?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వచ్చే మార్చిలోపు కేంద్రానికి రూ.30,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్ల మధ్యంతర డివిడెండ్ ఇచ్చే అవకాశం ఉందని ఈ అంశంతో సంబంధమున్న అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ప్రధాని నరేంద్రమోదీ పాలనా యంత్రాంగం ద్రవ్యలోటు (ఒక నిర్దిష్ట కాలంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం–చేసే వ్యయం మధ్య నికర వ్యత్యాసం) పూడ్చుకోడానికి ఈ మొత్తం దోహద పడే అవకాశం ఉంది. గత ఆర్థిక సంవత్సరం కేంద్రానికి ఆర్‌బీఐ రూ.10,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించింది. జూలై–జూన్ మధ్య పన్నెండు నెలల కాలాన్ని ఆర్‌బీఐ తన ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తోంది.

నేపథ్యం ఇదీ..: కేంద్ర ప్రభుత్వానికి పన్ను వసూళ్లు తగ్గిన నేపథ్యంలో– భారత్ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కట్టుతప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమై మార్చి 2019తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నెలకు వచ్చేసరికే ద్రవ్యలోటు బడ్జెట్ నిర్దేశాలను దాటిపోయింది. 2018–19 ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ద్రవ్యలోటు ఉండాలని వార్షిక బడ్జెట్ నిర్దేశించింది.

ఇష్టానుసారం రైతు రుణ మాఫీ సరికాదు!

ఇష్టానుసారంగా రైతు రుణ మాఫీ మంచి విధానం కాదని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. ఇది దేశ బ్యాంకింగ్ రుణ వ్యవస్థపై అలాగే పునః చెల్లింపులకు సంబంధించి రుణ గ్రహీత ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రైతు రుణ మాఫీ ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో శక్తికాంతదాస్ తాజా ప్రకటన చేశారు. రాష్ట్రాల ద్రవ్యలోటు అంశంపై ప్రతికూల ప్రభావం చూపే అంశమిదని ఆయన అన్నారు. ''ఎన్నికైన ప్రతి ప్రభుత్వానికీ తమ ఆర్థిక అంశాలకు సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. అయితే రైతు రుణ మాఫీకి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తమ ద్రవ్య పరిస్థితులపై చాలా జాగరూకతతో కూడిన నిర్ణయం తీసుకోవడం అవసరం. ప్రతి ప్రభుత్వమూ తమ ఆర్థిక పరిస్థితులను గమనించుకోవాలి. రుణ మాఫీకి సంబంధించి బ్యాంకులకు తక్షణం డబ్బు బదలాయించగలమా? లేదా? అన్నది పరిశీలించుకోవాలి'' అని గవర్నర్ పేర్కొన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో రూ.1.47 లక్షల కోట్ల వ్యవసాయ రుణ మాఫీ ప్రకటనలు జరిగాయి.

సుజుకీ మోటార్ సైకిల్ వైస్ ప్రెసిడెంట్‌గా దేవాశిష్



ముంబై: సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా కంపెనీ కొత్త వైస్ ప్రెసిడెంట్‌గా దేవాశిష్ హంద నియమితులయ్యారు. అమ్మకాలు, మార్కెటింగ్, విక్రయానంతర సేవల విభాగాన్ని ఆయన నిర్వహిస్తారని సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా (ఎస్ఎమ్ఐపీఎల్) తెలిపింది. దేవాశిష్‌కు వాహన రంగంలో 25 ఏళ్లకు పైగా అనుభవం ఉందని, సుజుకీ భవిష్యత్తు వృద్ధి జోరుకు దేవాశిష్ ఇతోధికంగా తోడ్పడగలరన్న ధీమాను ఎస్ఎమ్ఐపీఎల్ ఎమ్‌డీ సతోషి యుచిడా వ్యక్తం చేశారు. గత నెలలో తమ అమ్మకాలు 34 శాతం వృద్ధితో 43,874కు పెరిగాయని పేర్కొన్నారు.

ఆరంభ పెట్టుబడుల కోసం నాబార్డ్ వెంచర్ ఫండ్



న్యూఢిల్లీ: వ్యవసాయ, గ్రామీణ వాణిజ్య సంస్థలకు కావలసిన ఆరంభ పెట్టుబడులను అందించడానికి నాబ్‌వెంచర్స్ లిమిటెడ్‌ను అందుబాటులోకి తేనున్నామని నాబార్డ్ తెలిపింది. కంపెనీల చట్టం కింద నాబ్‌వెంచర్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొంది. దీనికి సంబంధించిన తొలి ఫండ్ ఆఫర్‌ను వచ్చే నెల రెండో వారంలో ఉంటుందని వివరించింది. గ్రామీణ మార్కెట్‌కు సంబంధించి తమకు ఉన్న అపారమైన అనుభవం ఉందని పేర్కొంది. నిలకడైన ఉద్యోగ కల్పనను కొనసాగించడానికి వివిధ వాణిజ్య సంస్థలకు తోడ్పాటునందిస్తామని నాబార్డ్ పేర్కొంది.

రూ.3,000 వరకూ తగ్గిన ఎమ్ఐ ఏ2 ధరలు



ముంబై: చైనా స్మార్ట్‌ఫోన్ దిగ్గజ కంపెనీ షావోమి తన ఎమ్ఐ ఏ2 స్మార్ట్ ఫోన్ల ధరలను రూ.3,000 వరకూ తగ్గించింది. భారత్‌లో అమ్మకాలు ఆరంభించి ఐదేళ్లవుతోందని పేర్కొన్న కంపెనీ... ఈ సందర్భంగా ఎమ్ఐ ఏ2 స్మార్ట్‌ఫోన్ల ధరలను తగ్గించింది. 4 జీబీర్యామ్/64 జీబీ ఇంటర్నల్ మెమెరీ ఉన్న మోడల్ ధర రూ.2,000 తగ్గి రూ.13,999కు చేరిందని షావోమి తెలిపింది. అలాగే 6 జీబీ ర్యామ్/128 జీబీ ఇంటర్నల్ మెమెరీ స్మార్ట్‌ఫోన్ ధర రూ.3,000 తగ్గి రూ.15,999కు చేరిందని పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	32,840
బంగారం (22 క్యారెట్లు)	31,280
వెండి (కిలో)	42,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	31,960
బంగారం (22 క్యారెట్లు)	30,440
వెండి (కిలో)	42,600
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	31,960
బంగారం (22 క్యారెట్లు)	30,440
వెండి (కిలో)	42,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	32,500
బంగారం (22 క్యారెట్లు)	30,030
వెండి (కిలో)	40,030
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	32,480
బంగారం (22 క్యారెట్లు)	30,210
వెండి (కిలో)	39,700
విజయవాడ	
బంగారం(24 క్యారెట్లు)	32,850
బంగారం (22 క్యారెట్లు)	30,150
వెండి (కిలో)	40,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	32,910
బంగారం (22 క్యారెట్లు)	30,440
వెండి (కిలో)	40,300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	49.14	$47.96
బ్రెంట్	58.16	$57.06

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 08-01-2019

విశాఖ	458–00
చిత్తూరు	453–00
వరంగల్	455–00
చెన్నై	460–00
ముంబై	508–00
విజయవాడ	453–00
నమక్కల్	445–00
గోదావరి	453–00
7–1–2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	453–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.15
బెంగళూరు	452–00
కోల్‌కత్త	492–00
ఢిల్లీ	493–00

సెన్సెక్స్ 155 పాయింట్లు అప్

- ఆరంభమైన అమెరికా–చైనా చర్చలు
- మన దగ్గర తగ్గిన లిక్విడిటీ సమస్యలు
- దీంతో పెరిగిన సూచీలు
- మధ్యాహ్నం తర్వాత లాభాల స్వీకరణ
- దాదాపు సగం తగ్గిన లాభాలు
- 155 పాయింట్లు పెరిగి 35,850కు సెన్సెక్స్
- 44 పాయింట్లు ఎగసి 10,772కు నిఫ్టీ



సానుకూల అంతర్జాతీయ సంకేతాల కారణంగా సోమవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చలు ఆరంభం కావడం, రేట్ల పెంపుపై ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ ఒకింత సరళమైన వ్యాఖ్యలు చేయడంతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. మన మార్కెట్లో లిక్విడిటీ సమస్యలు తగ్గుముఖం పట్టటం, ఈ వారం నుంచి ఆరంభం కానున్న మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలు లాభాల జోరుకు దోహదం చేశాయి. ముడిచమురు ధరలు పెరిగినా, రూపాయి బలపడటం కలసివచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ 155 పాయింట్లు పెరిగి 35,850 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 10,772 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 36,000 పాయింట్లు, నిఫ్టీ 10,800 పాయింట్ల పైకి ఎగసినప్పటికీ, ట్రేడింగ్ చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆ స్థాయిల్లో నిలుదొక్కుకోలేకపోయాయి. రియల్టీ, టెక్నాలజీ, ఐటీ, విద్యుత్తు, కన్సూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ షేర్లు లాభపడ్డాయి. ఆరోగ్య సంరక్షణ, లోహ, వాహన షేర్లు నష్టపోయాయి. ఈ నెల 10న టీసీఎస్, 11న ఇన్ఫోసిస్ కంపెనీల తమ క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఈ క్యూ3లో కంపెనీలు మంచి ఫలితాలనే వెల్లడిస్తాయనే అంచనాలు సర్వత్రా నెలకొన్నాయి. మరోవైపు బ్యాంక్ నిల్వలను 1 శాతం మేర తగ్గించాలన్న చైనా కేంద్ర బ్యాంక్ నిర్ణయం మన మార్కెట్‌లో జోష్‌ను నింపింది. ఈ నిర్ణయం వల్ల చైనా ఆర్థిక వ్యవస్థలోకి 11,600 కోట్ల డాలర్ల అదనపు నిధుల అందుబాటులోకి వస్తాయి. ఈ సానుకూల వాతవరణంలో స్టాక్ సూచీలు భారీ లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. సెన్సెక్స్ 276 పాయింట్లు, నిఫ్టీ 78 పాయింట్ల లాభంతో ఆరంభమయ్యాయి. కొనుగోళ్ల జోరుతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 382 పాయింట్లు, నిఫ్టీ 107 పాయింట్ల వరకూ పెరిగాయి. మధ్యాహ్నం తర్వాత మన మార్కెట్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సగం వరకూ లాభాలు హరించుకు పోయాయి. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ఆరంభమై ఫ్లాట్‌గా ముగిశాయి.

- ఐషర్ మోటార్స్ షేర్ రూ.20,000 మార్క్ దిగువకు పడిపోయింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహన విక్రయాలు తగ్గడంతో గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేర్ నష్టపోతూనే ఉంది. ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్టానికి, రూ.19,751కు పడిపోయిన ఈ షేర్ చివరకు 1.5 శాతం నష్టంతో రూ.19,823 వద్ద ముగిసింది. ఈ షేర్‌తో పాటు పలు షేర్లు ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. అశోక్ లేలాండ్, దేనా బ్యాంక్, అమ్‌టెక్ ఆటో, భారత్ ఫోర్జ్, ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్ డీవీఆర్, మెక్‌లాయిడ్ రస్సెల్, నారాయణ హృదయాలయ, రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్, రోల్టా ఇండియా తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- నిర్మాణంలో ఉన్న రియల్టీ ప్రాజెక్ట్‌లపై జీఎస్‌టీ 5 శాతానికి తగ్గనున్నదన్న అంచనాల నేపథ్యంలో రియల్టీ షేర్లు 3–20 శాతం రేంజ్‌లో పెరిగాయి.
- బంధన్ బ్యాంక్‌లో గృహ ఫైనాన్స్ కంపెనీ విలీనం కానున్నదన్న వార్తల నేపథ్యంలో ఈ రెండు షేర్లు నష్టపోయాయి. బంధన్ బ్యాంక్ 5 శాతం నష్టంతో రూ.501 వద్ద, గృహ ఫైనాన్స్ షేర్ 3.8 శాతం నష్టంతో రూ.306 వద్ద ముగిశాయి.
- యాక్సిస్ బ్యాంక్ 2.8% లాభంతో సెన్సెక్స్‌లో భారీగా పెరిగి, రూ. 637 వద్దకు చేరింది.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)

బీఎస్ఈ	2,272
ఎన్ఎస్ఈ	24,602
ఎన్ఎస్ఈ (డెరివే.)	5,49,827
ఎఫ్ఐఐ	736
డీఐఐ	- 142

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
AXISBANK	637.4	2.87
INFRATEL	292.8	2.72
TATAMOTORS	175.25	2.52
GRASIM	822	1.97
MARUTI	7,376.00	1.96
ONGC	148.25	1.75
TITAN	944.1	1.69
INFY	671.7	1.61
HCLTECH	945	1.36
NTPC	147.7	1.34

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
IBULHSGFIN	789	-4.92
BAJAJ-AUTO	2,652.25	-3
YESBANK	186.55	-1.63
DRREDDY	2,560.00	-1.54
EICHERMOT	19,835.30	-1.33
BPCL	354.75	-1.31
HINDALCO	208.5	-1.14
BAJFINANCE	2,550.00	-1.01
COALINDIA	234.1	-1.01
HEROMOTOCO	2,961.00	-0.9

నార్వే వ్యాపార సదస్సులో 15 ఒప్పందాలు..

- ద్వైపాక్షిక వాణిజ్యం మరింత బలోపేతం!
- కీలక ఒప్పందాలపై మంగళవారం సంతకాలు
- శ్రేయీ ఎక్విప్‌మెంట్‌తో ఎంఓయూ పూర్తి

న్యూఢిల్లీ: భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నార్వే ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య 1.2 బిలియన్ డాలర్ల (రూ.8,356 కోట్లు) వాణిజ్యం జరుగుతుండగా, ఇది మరింత పెరగాలని భావిస్తున్నట్లు ఆదేశ ప్రధాని ఎమ్మా సోల్బర్గ్ వ్యాఖ్యానించారు. ఇక్కడ ప్రారంభమైన ఇండియా–నార్వే మూడురోజుల వ్యాపార సదస్సులో పాల్గొన్న ఆమె.. 'నూతన వ్యూహాలను అనుసరించటం ద్వారా మా దేశంతో భారత్ కొనసాగిస్తున్న ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నాం. ప్రైవేటు రంగంతో కలిసిపనిచేయడం, పరిశోధన, సాంకేతిక సహకారం పెంపొందే దిశగా చర్చిస్తున్నాం. ఇక్కడ మా దేశ కంపెనీలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, మరీ ముఖ్యంగా ఎనర్జీ రంగంలో అవకాశాలు చాలా ఉన్నట్లు గుర్తించాం. గ్రామీణ ప్రాంత ఆధారిత వాణిజ్యాన్ని కోరుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ సదస్సుకు హాజరైన వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ.. 'కీలక ఒప్పందాలపై మంగళవారం ఇరుదేశాలు సంతకాలు పూర్తిచేయనున్నాయి. తద్వారా నార్వేతో వ్యాణిజ్యం మరింత ముందుకు సాగనుందని భావిస్తున్నాం.' అని చెప్పారు. ఈ సదస్సులో.. సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఎనర్జీ, ఫైనాన్స్, ఆరోగ్య సంరక్షణ, ఆక్వాకల్చర్‌కు చెందిన 15 కంపెనీలు ప్రధాని మోదీ సమక్షంలో ఎంఓయూపై సంతకాలు చేశాయి.

శ్రేయీతో ఒప్పందం..

శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్‌కు అనుబంధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్.. నార్వే ప్రభుత్వానికి చెందిన ఎక్స్‌పోర్ట్‌క్రెడిట్ నార్గేతో (ఈసీఎన్) ఒప్పందం కుదుర్చుకుంది. సదస్సులో ఇరు సంస్థల మధ్య ఎంఓయూలపై సంతకాలు పూర్తయ్యాయి. 'ఒప్పందం ప్రకారం.. నార్వేజియన్ కాపిటల్ గూడ్స్ దిగుమతి, ఎక్విప్‌మెంట్ తయారీకి శ్రేయీ ఎక్విప్‌మెంట్‌కు ఆదేశం సహాయసహకారాలతో పాటు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్‌ను అందించనుంది.' అని సంస్థ చైర్మన్, ఎండీ హేమంత్ కనోరియా తెలిపారు.



ఇండియా-నార్వే వ్యాపార సదస్సులో నార్వే ప్రధాని ఎమ్మా సోల్బర్గ్. భారత్ వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు

భారత్ చేతికి చాబహార్ పోర్ట్ నిర్వహణ

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని కీలకమైన చాబహార్ పోర్ట్ నిర్వహణ భారత్ చేతికి వచ్చింది.దేశం వెలుపల ఒక పోర్ట్ నిర్వహణ చేపట్టటం భారత్‌కు ఇదే మొదటిసారి. చాబహార్ త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ పోర్ట్ నిర్వహణ బాధ్యత ఇప్పుడు భారత్ వంతని భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చాబహార్ పోర్ట్ నిర్వహణను చూసే ఇండియా పోర్ట్స్ గ్లోబల్ చాబహార్ ఫ్రీ జోన్(ఐపీజీసీఎఫ్‌జీ) కార్యాలయాన్ని ఇటీవలే ఆరంభించామని తెలిపింది.

రీడ్ అండ్ టేలర్ కేసులో మరో మలుపు

- రూ.3,524 కోట్ల మేర ప్రమోటర్ల మోసం
- క్రిమినల్ కేసుకు అనుమతి కోరిన ఆర్‌పీ
- నేడు విచారణ



ముంబయి: రీడ్ అండ్ టేలర్ కంపెనీ దివాలా ప్రక్రియ మరో మలుపు తిరిగింది. ప్రమోటర్ నితిన్ కస్లివాల్ రూ.3,524 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డాడని, ఆయనపై క్రిమినల్ కేసు పెట్టాలని రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) వెంకటేశన్ శంకర్ నారాయణన్ పేర్కొన్నారు. మరోవైపు రీడ్ అండ్ టేలర్‌ను గట్టెక్కించడానికి కాకుండా లిక్విడేషన్ కోసమే రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) ప్రయత్నాలు చేస్తున్నారని రీడ్ అండ్ టేలర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆసోసియేషన్ వ్యాఖ్యానించింది. వివరాలివీ..

రూ.3,524 కోట్ల మేర మోసాలు...

రీడ్ అండ్ టేలర్ కంపెనీ రూ.4,100 కోట్ల బకాయిలు చెల్లించడంలో విఫలం కావడంతో ఆ కంపెనీపై దివాలాప్రక్రియ కొనసాగుతోంది. ఈ కంపెనీ ప్రమోటర్ నితిన్ కస్లివాల్ రూ.3,524 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డాడని రిసొల్యూషన్ ప్రొఫెషనల్ వెంకటేశన్ శంకర్ నారాయణన్ వెల్లడించారు. అందుకని ఆయనపై క్రిమినల్ కేసు పెట్టడానికి అనుమతివ్వాలని ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనాన్ని ఆయన కోరారు. కేపీఎమ్‌జీ నిర్వహించిన ప్రత్యేక ఆడిట్‌లో నితిన్ కస్లివాల్ రూ.3,524 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డాడని తేలిందని ఆర్‌పీ, వెంకటేశన్ నారాయణన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎన్‌సీఎల్‌టీకి ఈ నెల 1న ఒక లేఖ రాశారు.

నేడు విచారణ: కంపెనీని టేకోవర్ చేయడానికి తమకు అవకాశమివ్వాలన్న ఉద్యోగుల సంఘం అభ్యర్థనపై నేడు (మంగళవారం) విచారణ జరగనున్నది. కస్లీవాల్ రూ.3,524 కోట్ల అవకతవకల అంశంపై కూడా విచారణ జరగవచ్చు.

మారుతీ నుంచి కొత్త మోడళ్లు..

త్వరలోనే ఒక మోడల్ విడుదల

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండు సరికొత్త మోడళ్లను భారత మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్లు మారుతి సుజుకి ఇండియా (ఎంఎస్ఐ) ప్రకటించింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 2 సరికొత్త ఉత్పత్తులను అందించనున్నట్లు సంస్థ చైర్మన్ ఆర్‌సి భార్గవ వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలోపు ఒక మోడల్‌ను భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారయన. ఈ అంశంపై మాట్లాడుతూ.. 'నూతన భద్రతా నిబంధనలకు అనుగుణంగా నూతన మోడళ్లలో ఎయిర్ బ్యాగ్స్, సీట్ బెల్ట్ రిమైండర్, రివర్స్ పార్కింగ్ సెన్సార్స్ వంటి ఫీచర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది జూన్ నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్నికల సమయంలో కార్ల కొనుగోలు అధికంగా ఉంటుందనే విషయం ఇప్పటికే నిరూపితమైంది. ఈ నేపథ్యంలో నూతన మోడళ్లపై దృష్టిసారించాం.' అని వ్యాఖ్యానించారు. ఈయన ప్రకటన అనంతరం.. ప్రీమియం కార్ నెక్సా, మరో సాధారణ మోడల్‌లో నూతన కార్లు విడుదల ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనావేశాయి.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	381.65	382.15
ASIAN PAINT	1396	1385.85
AXIS BANK L	637.45	619.6
BAJAJ AUTO	2658.55	2734.2
BAJAJ FINSE	6407.15	6410.45
BAJAJ FINAN	2553.6	2576.05
BHARTI AIRT	324.95	322.45
BPCL	355.55	359.45
CIPLA LTD	514.05	512.8
COAL INDIA	234.5	236.5
EICHER MOTO	19830.4	20103.6
GAIL (INDIA	357.1	353.15
GRASIM INDU	820.65	806.15
HCL TECHNOL	941.55	932.35
HDFC LTD	1972.9	1972.6
HDFC BANK L	2120.65	2117.45
HERO MOTOCO	2957.95	2987.85
HINDALCO I	208.55	210.9
HPCL	249.8	248.2
HUL	1784.95	1781.7
INDIABULLS	793.9	829.8
ICICI BANK	367.7	365.2
INDUSIND BA	1559.15	1548.2
BHARTI INFR	293.75	285.05
INFOSYS LIM	671.7	661.05
INDIAN OIL	133.45	133.95
ITC LTD	281.65	280.95
JSW STEEL L	289.85	287.95
KOTAK MAHIN	1246.6	1247.95
LARSEN & T	1383.8	1388.05
MAHINDRA & M	729.55	725.6
MARUTI SUZU	7362.05	7234.5
NTPC LTD	148.6	145.75
OIL AND NAT	147.85	145.7
POWER GRID	198.45	195.9
RIL	1104.75	1098.65
SBI	296.3	297.65
SUN PHARMAC	430.8	433.8
TATA MOTORS	175.35	170.95
TATA STEEL	485.5	487.65
TATA CONSUL	1897.9	1876.85
TECH MAHIND	687.5	681.1
TITAN COMPA	944.05	928.45
ULTRATECH C	3926.75	3914.55
UPL LIMITED	763.75	756.4
VEDANTA LIM	193.45	192.9
WIPRO LTD	324.25	324.45
YES BANK LI	187.15	189.65
ZEE ENTERTA	462.95	463.95

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1301.8	1303.65
ADITYA BIRL	97.6	98
ACC LIMITED	1477.95	1469.1
AMBUJA CEME	218	216.55
ASHOK LEYLA	93.45	96.8
BANDHAN BAN	498.05	528.9
BANK OF BAR	122.7	121.7
BHARAT ELEC	91.4	91.85
BHEL	72.25	71.4
BIOCON LIMI	620.65	618.55
BOSCH LIMIT	19510.4	19438.75
BRITANNIA I	3143.8	3122.7
CADILA HEAL	348.9	344.2
COLGATE PAL	1303	1310.1
CONTAINER C	681.15	678.05
DABUR INDIA	420.45	419.25
DLF LIMITED	179.8	175.15
AVENUE SUPE	1571.15	1577.75
GENERAL INS	263.6	263
GODREJ CONS	800.55	803.4
HAVELLS IND	693.55	678.55
HDFC STAND	393.05	393.5
HINDUSTAN Z	274.55	271.7
ICICI LOMBA	865.45	866.9
ICICI PRU L	319.95	324.7
VODAFONE ID	36.65	36.2
INTERGLOBE	1113.75	1143.2
L&T FINANCE	145.7	144.4
LIC HOUSING	479.35	488.1
LUPIN LIMIT	820.45	828.9
MARICO LIMI	386.8	378.85
UNITED SPIR	607.6	604.6
MOTHERSON S	157.1	158.65
MRF LTD	66978.55	66603.15
NHPC LTD	25.95	25.55
THE NEW IND	179.5	179.85
NMDC LTD.	94.95	93.95
ORACLE FIN	3596.2	3598.2
OIL INDIA L	174.6	174.55
PIRAMAL ENT	2279.55	2358.65
PETRONET LN	217.05	220.9
P&G HYGIENE	9804.2	9784.95
PIDILITE IN	1102.6	1105.7
STEEL AUTHO	53.4	53.15
SBI LIFE IN	602.45	602.85
SHREE CEMEN	16921.7	16737.1
SIEMENS LTD	1062.05	1062.7
SHRIRAM TRA	1176.3	1162.65
SUN TV NETW	595.35	592.2

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	7.44	7.83
Alphageo	468.9	469.3
Alu Flouride	123.05	122
Amar Raja Bat	735.15	724.1
And Bank	29.75	29.75
And Cemen	5.8	5.8
And Paper	448.35	451.1
And Petro	68.8	63.6
Aries Agro Ltd	103.6	101.3
Aurobindo Ph	724.25	725.4
Avantel Soft	227.1	227.95
Avanti Feeds	382.85	374.55
BN Rathi Sec	25.55	26.05
Bakelite	21.25	20.35
Balaji Amin	447.4	450.75
Bambino Agro	192.45	192.15
Bartronics	7.5	7.2
Bhagira Chem	429	433.4
Bhagya Nag	34	33.5
Bhagya Wood	17.55	17.65
Bhaskar Agro	22.1	21.05
Brilliant Sec	1.2	1.24
Color Chip	19.4	18.5
Combat Drugs	20.25	19.5
Cont Coffee	268.45	269.7
CoroFert	460.3	468.8
Cosboard Ind	15.58	15.28
Country Club	7.45	7.65
Cubex Tub	15	14.4
Cybermate	2.25	2.36
DR Reddy	2556.55	2601.65
Danlaw Tec	106.2	105
DecCement	403.9	398
Divi's Lab	1490.1	1458.7
Divya Granit	85	84
Dolphin Medi	0.73	0.76
Dredgin Corp	458.55	436.65
Everest Org	115	105
Fortune Info	40.8	40.2
Four Soft	43.65	42.65
Fourth Gen	1.9	2
Frontier Inf	3.47	3.36
GMR Infra	15.85	15.85
GVK Power	7.77	7.82
Gati Corpn	84.65	83.65
Gayatri Proj	177	178.25
Gayatri Sugrs	2.9	2.96
Gennex Lab	3.7	3.69
GodavDru	23.2	22.9
Goldstn Tele	242.7	241.9
Goldstone Tech	16.1	16.25
Granules (I)	88.65	89.85
HBL Nife Pow	27.35	27.55
HYDIndus	1995.75	2023.25
Heritage Food	533.9	521.5
HindFlurocarb	16.5	16.85
IDL Industrs	297.75	293.95
IKF Soft	0.28	0.29
IVRCL Infras	1	1.02
Incap	40	40.95
IndoNationl	719	710.75
Infotech En	606.45	608.7
Invinex Lab	46	46
JSTL	35.2	36.95
KCP LTD	91.95	89.85
KNR Constructio	217.5	217.65
Kabsons Indu	6.7	6.95
KakatiCem	196	198
Kallam Spg	18.55	18.2
Kernex Micro	23.75	23.15
LGS Global	2.69	2.67
LancoIndus	181.6	183.55
Lokesh Mach	45.4	45.45
Lotus Choc	24.1	24.05
MIC Elec	1.34	1.41
Madhucon Proje	6.92	6.6
Maytas Infra	14.8	15
Medinova Dia	16.35	15.6
Mold-tek	44.3	43
Moldtek Plastic	260.25	261.65
Moschip Semi	23.4	24.15
NCCBlue Wat	4.13	3.94
NETTLINX	49	52.3
NMDC Ltd	95.05	94.3
NagarAgrich	28	27.45
NagarConst	88.1	88.9
Natco Pharma	692	702.95
Nava Bh Ventur	117.3	117.9
Neha Inter	4.43	4.32
Neocure Ther	2.59	2.43
Neuland Lab	486	486.3
Nihar Info Glo	15	14.75
Nile	376.1	377.35
Northgate Tech	0.95	1
Oil Country	16.2	16.2
Ortin Lab	15.25	15.15
PL Enterpri	2.16	2.16
Padmalaya Tele	2.48	2.38
Panyam Cemen	13.55	13.7
PennInd	37	36.55
Phytochem I	47.75	46.5
Pitti Lamin	66.85	68.45
Pokarna	159	154.55
Prajay Engs	8.85	8.75
PremiExpl	242.2	246.05
Prism Cement	87.9	90.3
Raasi Refrac	11.25	10.73
Ragsan Petro	56.1	57.95
Rain Industries	121.35	127.15
Raj Packagin	28	27.75
Ram Informat	40	40.25
Reg.Ceramic	3.55	3.53
Restile Cer	3.81	3.74
Roopa Indus	11.21	11.8
SS Organics	9.92	9.45
Sagar Cem	653	673.05
Sai Wires(I)	1.14	1.16
Samkrg Pist	189.25	187.5
SangInd	60.9	60.7
Satvah. Ispat	9.55	9.8
Saven Techno	26.3	25.15
Sibar Auto	33.2	34.9
Softsol	39.2	41.25
SrRayAlk	33.2	34
Srinivasa Ship	46.9	45.65
Starchik Sp	22.55	23.6
Sujana Metal	0.39	0.39
Sujana Towers	1.05	1
Surana Tele	4.75	4.6
Suryachakra Pow	0.37	0.37
Suryalata Sp	127.3	127.35
SuvarCem	63.8	65.5
Suven Pharma	230.65	232.55
TCI Finance	14.95	14.95
Taj Gvk Hotel	174.45	172.6
Tanla Solutions	30.65	31.25
Trans Biotek	3.55	3.51
Transport Co	283.85	282.9
Trendy Knit	0.19	0.19
Usher Agro	2.27	2.38
V&K Soft	4.1	4.1
VBC Ferro	44.85	43.05
VST Indus	3240	3069.5
Vamshi Rubb	33.5	31.05
Viceroy Hotels	4.82	5
VijayGrowth	9.5	10
VijayTextil	42.2	41.6
Vimta Labs	299.05	306.6
Virat Crane	33.55	34.45
Virinchi Con	81.05	81.5
VisakaInd	431.75	423.15
Vista Pharma	28.9	30.4
Vivimed Labs	35.7	36.1
Vjil Consult	47.5	47.7
ZenoTech Lab	35.55	36.1

ప్రత్యక్ష పన్ను వసూళ్ల వృద్ధి రేటు 14 శాతం

ఏప్రిల్–డిసెంబర్ మధ్య రూ.8.74 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు 2018 ఏప్రిల్–డిసెంబర్ మధ్య (2017 ఇదే కాలంతో పోల్చి) స్థూలంగా 14.1 శాతం పెరిగాయి. విలువలో ఇది రూ.8.74 లక్షల కోట్లు. ఆర్థికశాఖ సోమవారం ఈ గణాంకాలను విడుదల చేసింది.

ముఖ్యాంశాలు చూస్తే...

- 2018 ఏప్రిల్–డిసెంబర్ మధ్య రిఫండ్స్ విలువ రూ.1.30 లక్షల కోట్లు. 2017 ఇదే కాలంతో పోల్చిచూస్తే, ఇది 17 శాతం అధికం. రిఫండ్స్ తరువాత, నికర వసూళ్లు 13.6 శాతం వృద్ధితో రూ.7.43 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.11.50 లక్షల కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు జరగాలన్నది లక్ష్యం. ఇప్పటికి జరిగిన వసూళ్లు ఇందులో 64.7 శాతానికి సమానం.
- ముందస్తు వసూళ్లు 14.5 శాతం వృద్ధితో రూ.3.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- కార్పొరేట్ పన్ను వసూళ్లు స్థూలంగా 14.8 శాతం పెరిగాయి. వ్యక్తిగత ఆదాయ వసూళ్లలో 17.2 శాతం వృద్ధి నమోదయ్యింది. రిఫండ్స్ తరువాత ఈ వృద్ధి రేట్లు వరుసగా 16 శాతం, 14.8 శాతంగా ఉన్నాయి.

బీఎస్ఎన్ఎల్ నుంచి అపరిమిత సినిమాలు..

ఈరోస్ నౌ సంస్థతో జట్టు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ తన ప్రీ–పెయిడ్ ఖాతాదారులకు అపరిమిత సినిమాలు, వీడియోలను అందిస్తోంది. ఈ సేవలను అందించేందుకు ఈరోస్ నౌ సంస్థతో జత కట్టినట్లు సంస్థ చైర్మన్, ఎండీ అనుపమ్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఈ నెల చివరకు వరకు అపరిమిత సేవలు అందుబాటులో ఉండనుండగా.. మొత్తం 11,000 సినిమాలు, మ్యూజిక్ వీడియోలు, వెబ్ కార్యక్రమాలు, ప్రత్యేక వీడియోలను ఈరోస్ నౌ యాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఈరోస్ డిజిటల్ సీఈవో రిషికా లుల్లా సింగ్ మాట్లాడుతూ.. '2023 నాటికి భారత ఓటీటీ (ఓవర్ ది టాప్) పరిశ్రమ 5 బిలియన్ డాలర్లకు (రూ.34,882 కోట్లు) చేరుకోనుందని అంచనా. డేటా వినియోగంలో పల్లె ప్రాంత వాటా గణనీయంగా పెరుగుతోంది.' అని రిషికా లుల్లా సింగ్ చెప్పారు.

విదేశీ అప్పు మొత్తం తీర్చేశాం

వెల్లడించిన ఎస్సార్ గ్రూప్



న్యూఢిల్లీ: ఎస్సార్ గ్రూప్ విదేశీ అప్పులన్నింటినీ తీర్చేసినట్లు ఆ గ్రూప్ హోల్డింగ్ కంపెనీ, ఎస్సార్ గ్లోబల్ తెలియజేసింది. చివరి దశ రూ.12,000 కోట్ల రుణ చెల్లింపులతో విదేశీ అప్పు మొత్తం తీరిపోయిందని పేర్కొంది. ఎస్సార్ ఆయిల్ కంపెనీని రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ కంపెనీకి విక్రయించడంతో వచ్చిన నిధులను ఈ విదేశీ అప్పులు తీర్చడానికి వినియోగించామని వివరించింది. 2008–14 మధ్య కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌ల నుంచి మొత్తం రూ.31,500 కోట్లు సమీకరించామని పేర్కొంది. తాజాగా చెల్లించిన రూ.6,300 కోట్లతో కలుపుకొని ఈ బ్యాంక్‌ల మొత్తం రుణాలు కూడా చెల్లించినట్లయిందని వివరించింది.

టెక్నాలజీతో నూతన ఉద్యోగ అవకాశాలు..!



ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి వ్యాఖ్య

బెంగళూరు: కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల కారణంగా భవిష్యత్తులో ఉద్యోగాలు పోయే అవకాశం లేదని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. టెక్నాలజీ ఉద్యోగాలను సృష్టిస్తుందే తప్పించి అంతం చేయదన్నారాయన. ఈ అంశంపై తన విశ్లేషణను వెల్లడిస్తూ... 'అమెరికా, యూకే, జపాన్ దేశాల్లో టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెంది.. నిరుద్యోగ రేటును గణనీయంగా తగ్గించింది. గడిచిన 50 ఏళ్లలో ఏ దేశాలైతే టెక్నాలజీని అందిపుచ్చుకున్నాయో, అవే దేశాలు ఉద్యోగాలను సృష్టించాయి. టెక్నాలజీ సేవలను సులభతరం చేస్తుంది. ఇందుకు ఆటోమెటిక్ టెల్లర్ మెషిన్ (ఏటీఎం) ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.' అని నారాయణ మూర్తి వివరించారు.

కొనసాగుతున్న ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ డిఫాల్ట్

ఈ సారి డివిడెండ్ చెల్లింపుల్లో



న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్) గ్రూప్ కంపెనీలు రుణాల చెల్లింపుల్లో డిఫాల్ట్ అవుతూనే ఉన్నాయి. తాజాగా ఈ గ్రూప్‌నకు చెందిన ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ నెట్‌వర్క్స్ కంపెనీ రూ.7.12 కోట్ల డివిడెండ్ చెల్లింపుల్లో విఫలమైంది. నాన్ కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లకు చెల్లించాల్సిన రూ.7.12 కోట్ల డివిడెండ్ చెల్లింపుల్లో విఫలమైనట్లు ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ నెట్‌వర్క్స్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు నివేదించింది. తగినంతగా నిధులు లేని కారణంగా ఈ చెల్లింపులు జరపలేకపోయినట్లు పేర్కొంది. గత ఏడాది అక్టోబర్ నాటికి ఈ గ్రూప్ రుణభారం రూ.94,000 కోట్లుగా ఉంది.

ఏయాన్ క్యాపిటల్ చేతికి ఇంటర్‌గ్లోబ్ టెక్నాలజీస్



ముంబై: ఇండిగో విమానయాన సంస్థకు చెందిన బాక్–ఎండ్ సర్వీసెస్ విభాగం, ఇంటర్‌గ్లోబ్ టెక్నాలజీస్ (ఐజీటీ) కంపెనీని ఏయాన్ క్యాపిటల్ కొనుగోలు చేసింది. ఐసీఐసీఐ వెంచర్, అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్‌ల జాయింట్ వెంచర్ అయిన ఏయాన్ క్యాపిటల్... ఐజీటీని ఎంతకు కొనుగోలు చేసిందీ వివరాలు వెల్లడించలేదు. ఇండిగో విమానయాన కంపెనీని నిర్వహిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ 1998లో ఐజీటీని ఏర్పాటు చేసింది. ఈ కంపెనీ పర్యాటక, ఆతిథ్య రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 70కు పైగా సంస్థలకు బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సేవలను అందిస్తోంది. ఐజీటీ కంపెనీలో దాదాపు పదివేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఐజీటీ తర్వాతి దశ వృద్ధికి ఇతోధికంగా తోడ్పాటు అందిస్తామని ఏయాన్ క్యాపిటల్ పార్ట్‌నర్ ఉత్సవ్ బైజాల్ చెప్పారు.

నూతన ఈ-కామర్స్ నిబంధనల ప్రభావం స్వల్పమే..

నియామక సంస్థల అభిప్రాయం



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ రంగానికి సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల విదేశీ పెట్టుబడుల పరంగా ఆందోళన ఉన్నప్పటికీ.. ఉద్యోగ నియామకాల్లో మాత్రం ప్రతికూల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని పలు నియామక సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఉద్యోగాలపై ఈ ప్రభావం 5–10 శాతం మేర ఉండవచ్చని గ్లోబల్ హంట్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ గోయల్ అంచనావేశారు. గిడ్డంగులు, రవాణా వంటి సప్లై చైన్ సంబంధిత రంగాల్లో వచ్చే 12 నెలల్లో 50,000 ఉద్యోగ అవకాశాలు తగ్గవచ్చు అని రాండ్‌స్టాడ్ సీఈఓ, ఎండీ పాల్ అభిప్రాయపడ్డారు.

ఆంధ్ర 132 ఆలౌట్

మధ్యప్రదేశ్ 24/3

ఇండోర్: మధ్యప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర తడబడింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో సోమవారం మొదలైన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే కుప్పకూలింది. క్రీజులో దిగిన వాళ్లెవరూ 30 పరుగులైనా చేయలేకపోయారు. ఓపెనర్ ప్రశాంత్ చేసిన 29 పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోర్. కరణ్ శర్మ 23 పరుగులు చేశాడు. మధ్యప్రదేశ్ పేసర్లు ఈశ్వర్ పాండే (4/43), గౌరవ్ యాదవ్ (3/21), స్పిన్నర్ కార్తికేయ (3/23) ఆంధ్ర బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ కూడా ఆదిలోనే తడబడింది. ఓపెనర్లు ఆర్యమాన్ బిర్లా (3), అజయ్ రొహెరా (1)లతో పాటు కార్తికేయ (0) కూడా ఔట్ కావడంతో ఆట నిలిచే సమయానికి 13 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో విజయ్, గిరినాథ్, మనీశ్ తలా ఒక వికెట్ తీశారు.

త్రిపుర 35...

రాజస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో త్రిపుర పేకమేడలా 35 పరుగులకే కూలింది. ఇందులో ఆరుగురు బ్యాట్స్‌మెన్ కౌశల్ (0), బోస్ (0), మురాసింగ్ (0), రాజిబ్ (0), హర్మీత్ (0), సౌరభ్ (0) డకౌట్ కాగా, నీలంబుజ్‌వత్స్ (11) రెండంకెల స్కోరు చేశాడు. లేదంటే ఇదే రాజస్తాన్ చేతిలో 'హైదరాబాద్ 21 ఆలౌట్' చెత్త రికార్డును త్రిపుర చెరిపేసేది. రాజస్తాన్ బౌలర్లలో అనికేత్ చౌదరి 5, తన్వీరుల్ హక్ 1 పరుగుకే 3 వికెట్లు తీశారు. తర్వాత రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగుల వద్ద ఆలౌటైంది. మురాసింగ్‌కు 4 వికెట్లు దక్కాయి. మొత్తానికి తొలి రోజే 20 వికెట్లు పడ్డాయి.

జాఫర్ రికార్డు...



రంజీ ట్రోఫీ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లాడిన ఆటగాడిగా వసీమ్ జాఫర్ (విదర్భ) రికార్డులకెక్కాడు. తాజాగా సౌరాష్ట్ర, విదర్భ మధ్య జరుగుతున్న మ్యాచ్ అతని రంజీ కెరీర్‌లో 146వ మ్యాచ్. దీంతో గతంలో దేవేంద్ర బుందేలా ఆడిన 145 మ్యాచ్‌ల రికార్డు కనుమరుగైంది. 146 మ్యాచ్‌ల్లో జాఫర్ 11,403 పరుగులు చేశాడు. ఇందులో 39 సెంచరీలు, 84 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఈ చురుకైన ఫీల్డర్ 191 క్యాచ్‌లు కూడా అందుకున్నాడు.

సెమీస్‌లో అవధ్ వారియర్స్



4-3తో చెన్నైపై గెలుపు

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్-4)లో అవధ్ వారియర్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన పోరులో వారియర్స్ 4-3తో చెన్నై స్మాషర్స్‌పై విజయం సాధించింది. పురుషుల డబుల్స్‌లో లీ యంగ్-క్రిస్టియన్సెన్ ద్వయం 15-8, 15-6తో క్రిస్ అడ్‌కాక్-సుమీత్ రెడ్డి (చెన్నై) జంటపై అలవోక విజయం సాధించింది. ఈ మ్యాచ్ అవధ్‌కు 'ట్రంప్' కావడంతో 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. పురుషుల సింగిల్స్ తొలి పోరులో లీ డాంగ్ క్యున్ (వారియర్స్) 15-7, 15-13తో వీ ఫెంగ్ చోంగ్ (చెన్నై)పై గెలుపొందగా, చెన్నైకి 'ట్రంప్' అయిన మహిళల సింగిల్స్‌లో సుంగ్ జీ హ్యున్ 15-13, 15-8తో బీవెన్ జాంగ్ (వారియర్స్)ను ఓడించింది. దీంతో అవధ్ ఆధిక్యం 3-2కు తగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్రిస్ అడ్‌కాక్-గ్యాబ్రియెల్ అడ్‌కాక్ (చెన్నై)జోడీ 15-13, 9-15, 15-14తో క్రిస్టియన్సెన్-అశ్విని పొన్నప్ప (వారియర్స్) జంటపై నెగ్గడంతో స్కోరు 3-3తో సమమైంది. నిర్ణాయక పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో సన్ వాన్ హో (వారియర్స్) 15-6, 15-6తో రాజీవ్ ఉసెఫ్ (చెన్నై)పై గెలిచి అవధ్‌కు విజయాన్నందించాడు. ఇప్పటికే ముంబై రాకెట్స్, హైదరాబాద్ హంటర్స్ సెమీస్ బెర్తులు సాధించాయి. నేడు బెంగళూరు రాప్టర్స్‌తో ముంబై రాకెట్స్ తలపడుతుంది.

'ఆసీస్' ద్రాక్ష అందిందిలా..

బ్యాట్స్‌మెన్ బాధ్యతాయుత ప్రదర్శన ● పేస్ బౌలర్ల ప్రతాపం ● కొత్త కుర్రాళ్ల పోరాటపటిమ ● వెరసి టీమిండియా అద్భుతం

సాక్షి క్రీడా విభాగం

అది 2003-04 సిరీస్. నాలుగు టెస్టు మ్యాచ్‌లకు గాను మొదటిది 'డ్రా' కాగా, రెండో దాంట్లో భారత్ గెలుపొంది... ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి ఆధిక్యంలో నిలిచింది. కానీ, మూడో టెస్టులోఓడటంతో గణాంకాలు సమమయ్యాయి. సిరీస్ ఫలితాన్ని తేల్చే కీలకమైన చివరి టెస్టులో టీమిండియా కంగారూలకు 443 పరుగుల అతి భారీ లక్ష్యం విధించింది. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో ఐదో రోజు మైదానంలో దిగిన ఆసీస్... ఓ దశలో 196/4తో నిలిచింది. అప్పటికింకా 40 ఓవర్ల ఆట మిగిలుంది. ప్రత్యర్థి ప్రధాన బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేసి మన బౌలర్లు ఊపు మీదున్నారు. టీమిండియా విజయం ఖాయం అనుకుంటున్న ఇలాంటి స్థితిలో కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న నాటి కెప్టెన్ స్టీవ్ వా (159 బంతుల్లో 80), సైమన్ కటిచ్ (96 బంతుల్లో 77 నాటౌట్)తో కలిసి గోడ కట్టాడు. ఓవర్లన్నీ కరగదీసి... 'డ్రా'గా ముగించాడు. అలా, అప్పుడు సిడ్నీలో త్రుటిలో చేజారిన 'చారిత్రక విజయం' సరిగ్గా పదిహేనేళ్లకు, అదేచోట, అటుఇటుగా అవే తేదీల్లో ఖాయమైంది. టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంకుకు తాము అర్హులమేనని కోహ్లి సేన సగర్వంగా చెప్పుకొనేలా చేసింది. ఈ గొప్పదనంలో ఎవరి పాత్ర ఏంటంటే..?

అహో పుజారా...

521 పరుగులు, 74.22 సగటు, మూడు శతకాలు, ఒక అర్ధ శతకం! సిరీస్‌లో పుజారా గణాంకాలివి. అడిలైడ్‌లో టాపార్డర్ కుప్పకూలిన సందర్భంలో, మెల్‌బోర్న్‌లో జట్టుకు అత్యవసర సమయంలో, సిడ్నీలో ఆధిక్యాన్ని పెంచాల్సిన స్థితిలో పుజారా చేసిన శతకాలను పోల్చేందుకు ఏ గణాంకాలూ సాటి రావు. అతడు విఫలమైన పెర్త్‌లోనే టీమిండియా ఓడటం గమనార్హం. దీన్నిబట్టి విజయంలో తన పాత్రేమిటో చెప్పేయొచ్చు. అపరిమిత సహనం, చెక్కుచెదరని ఏకాగ్రత, సడలని డిఫెన్స్‌తో ఆసీస్ పేసర్ల బంతులను కాచుకున్న విధానం, క్రీజు వదిలి ముందుకొచ్చి స్పిన్నర్ లయన్‌ను దెబ్బకొట్టిన తీరు, ఇంత గొప్ప విజయంలో భాగమైనా కాసింతైనా గర్వం లేని నైజం కొత్త కుర్రాళ్లకు అచ్చమైన టెస్టు పాఠమే. ఇక అనేకానేక కారణాలతో జట్టులో చోటు కుర్చీలాటగా మారిన పరిస్థితుల్లో ఈ ఒక్క పర్యటన పుజారాను ఎక్కడికో తీసుకెళ్లింది. మరోవైపు ఈ సిరీస్‌తో కోహ్లికి తాను సమఉజ్జీనని చాటుకున్నాడు. తన కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిపోయే ఆటతో ఇకపై ఏ సిరీస్‌కూ తప్పించే ఆలోచనే రాకుండా చేశాడు.

భళా బుమ్రా...

సొంతగడ్డపై ఆసీస్ పేసర్లే తేలిపోతే, జస్‌ప్రీత్ బుమ్రా చెలరేగిపోయాడు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో 21 వికెట్లు (సిడ్నీలో ఆసీస్ రెండో ఇన్నింగ్స్ మినహా) పడగొట్టి ప్రత్యర్థి పనిపట్టాడు. అతడి 140 కి.మీ. నిలకడైన వేగం, వైవిధ్య శైలి, తెలివైన బౌలింగ్ ముందు కంగారూ బ్యాట్స్‌మెన్ నిలవలేకపోయారు. మెల్‌బోర్న్‌లో కేవలం 115 కి.మీ. వేగంతో బుమ్రా



పుజారాతో డ్యాన్స్ చేయిస్తున్న పంత్, కోహ్లి

> **41/4...**
> అడిలైడ్‌లో తొలి టెస్టు గంటన్నర గడిచిందో లేదో టీమిండియా స్కోరిది. ఓపెనర్ల పేలవ ఫామ్... కెప్టెన్ విరాట్ కోహ్లి అనూహ్య వైఫల్యం... వైస్ కెప్టెన్ అజింక్య రహానే సైతం చేతులెత్తేయడంతో ఇంకేముంది? అంతా పాత కథే అనుకున్నారు. ఎన్నో అంచనాలు, మరెన్నో విశ్లేషణలు, ఇంకెన్నో ఆశలతో ఆస్ట్రేలియా గడ్డపై అడుగు పెట్టిన భారత్... 'కొత్త చరిత్ర' సృష్టించడం అటుంచి, 'పాత చరిత్ర'నే పునరావృతం చేస్తుందని భావించారు. కానీ, ఇక్కడి నుంచి కథ మారింది. సరిగ్గా నెల రోజులు తిరిగేసరికి సిరీస్ దాసోహమైంది. దీని వెనుక పుజారా నిలకడ, బుమ్రా అద్భుతాలు, కోహ్లి వెన్నుదన్నుతో పాటు 'టాస్' రూపంలో అదృష్టం కూడా వెంట నడిచింది. ఫలితంగా, ఇంతకాలం అందని ద్రాక్షగా ఊరిస్తున్న ఆసీస్‌లో సిరీస్ విజయం మన సొంతమైంది. దేశ క్రికెట్‌లో సువర్ణాధ్యాయం నమోదైంది. జట్టు సమష్టిగా సాధించిన ఈ ఘనతలో ఓ ఐదు అంశాలు కీలకంగా నిలిచాయి. అవేంటంటే!

సంధించిన బంతిని షాన్ మార్ష్ వంటి సీనియర్ సైతం ఆడలేకపోయాడు. పాదాలను చితగ్గొట్టే పదునైన యార్కర్లు బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాయి. సుదీర్ఘ స్పెల్స్ వేయడంతో పాటు జట్టుకు కావాల్సిన సందర్భాల్లో వికెట్లు తీస్తూ బుమ్రా పైమెట్టులో నిలిచాడు. అతడి ఆరు వికెట్ల ప్రదర్శనే మెల్‌బోర్న్ టెస్టును భారత్ పరం చేసింది. ఈ పర్యటనతో ప్రపంచంలో ఎలాంటి పిచ్‌పైనైనా తాను రాణించగలనని బుమ్రా చాటాడు.

లయన్ జూలు విదిల్చకుండా...

కోహ్లిలాంటి బ్యాట్స్‌మన్‌ను పదేపదే ఔట్ చేస్తూ, అడిలైడ్, పెర్త్‌లో ఏకంగా 16 వికెట్లు నేలకూల్చి కలవరపెట్టాడీ ఆఫ్ స్పిన్నర్. ఇతడి జోరు చూస్తే భారత్ ఆశలకు గండికొట్టేవాడిలానే కనిపించాడు. కానీ, మెల్‌బోర్న్‌లో లయన్ జూలు పీకేశారు భారత బ్యాట్స్‌మెన్. అతడిని వ్యూహాత్మకంగా, ప్రణాళిక ప్రకారం ఎదుర్కొన్నారు. ఓవర్లకు ఓవర్లు వేసినా వికెట్ దక్కకుండా చేసి చివరకు ఎటూ పాలుపోని స్థితికి తీసుకొచ్చారు. దీంతో చివరి రెండు టెస్టుల్లో 328 పరుగులిచ్చి ఐదే వికెట్లు పడగొట్టగలిగాడు.

'టాస్' కూడా మేలు చేసింది...

ఏ దేశంలోనైనా ఈ కాలంలో టెస్టు విజయానికి సగం మార్గం టాస్‌తోనే పడుతోంది. ఇంగ్లండ్‌లో భారత్‌ను వెక్కిరించిన టాస్ ఈసారి మాత్రం కరుణించింది. పెర్త్ మినహా అన్నిచోట్లా కోహ్లినే టాస్ నెగ్గగా... బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారి భారత్ మంచి స్కోర్లతో మ్యాచ్‌ను లాగేసుకుంది.

కుర్రాళ్ల తోడ్పాటు...

యువ పృథ్వీ షా గాయంతో దూరమై, మురళీ విజయ్, కేఎల్ రాహుల్ దారుణంగా విఫలమై, ఓపెనింగ్ రెండు స్థానాలూ ఖాళీగా కనిపించిన స్థితిలో కొత్త కుర్రాళ్లు మయాంక్ అగర్వాల్, హనుమ విహారి ఇన్నింగ్స్‌ను ఆరంభించి జట్టును కాపాడారు. సిరీస్ 1-1తో ఉన్న స్థితిలో మెల్‌బోర్న్‌లో దాదాపు తొలి సెషన్ అంతా నిలిచి టీమిండియా ఆశలు నిలిపారు. ఆపద సమయంలో వీరు చూపిన సంయమనాన్ని స్కోర్లతో కొలవలేం. భిన్న నేపథ్యాల నుంచి నేరుగా క్రీజులో అడుగుపెట్టినా, ఏమాత్రం బెదురు లేకుండా ఆడారు. మయాంక్ తనదైన దూకుడుతో లయన్‌ను దెబ్బకొట్టిన తీరు చెప్పుకోదగ్గది. చివరి టెస్టులో అగర్వాల్ ఇన్నింగ్స్ శతకానికి పూర్తిగా అర్హమైనది. ఇక విహారి అప్పగించిన బాధ్యతను సమర్థంగా నెరవేర్చి తాను జట్టు మనిషినని చాటుకున్నాడు. సిడ్నీలో చక్కటి షాట్లతో అలరించాడు.

తొలిసారి మనం...

సిరీస్	విజేత	తుది ఫలితం
1947-48	ఆస్ట్రేలియా	4-0
1967-68	ఆస్ట్రేలియా	4-0
1977-78	ఆస్ట్రేలియా	3-2
1980-81	'డ్రా'	1-1
1985-86	'డ్రా'	0-0
1991-92	ఆస్ట్రేలియా	4-0
1999-2000	ఆస్ట్రేలియా	3-0
2003-04	'డ్రా'	1-1
2007-08	ఆస్ట్రేలియా	2-1
2011-12	ఆస్ట్రేలియా	4-0
2014-15	ఆస్ట్రేలియా	2-0
2018-19	భారత్	2-1

రాష్ట్ర రహదారుల విస్తరణకు రూ.386 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర రహదారుల విస్తరణ, అభివృద్ధికి రూ.386.10 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. 13 జిల్లాల్లో మొత్తం 43 రహదార్ల విస్తరణకు అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'గిరిజన ఉప ప్రణాళిక' రోడ్లకు రూ.97.37 కోట్లు

గిరిజన ఉప ప్రణాళిక కింద చింతూర్, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 343 కిలోమీటర్ల రహదార్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.97.37 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది.

17 నుంచి సాహస పర్యాటక నిర్వాహకుల సదస్సు

సాక్షి, అమరావతి: ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధి గాంచిన అరకు కేంద్రంగా ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర సాహస పర్యాటక నిర్వాహకుల సదస్సు నిర్వహించనున్నారు. సోమవారం సచివాలయంలో సదస్సు కార్యాచరణకు సంబంధించి పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహస పర్యాటక భవిష్యత్తు, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహిసున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పారా మోటరింగ్, వాటర్ రోలర్, హాట్ ఎయిర్ బెలూనింగ్, కయాకింగ్, సైకిలింగ్, హైక్స్, జార్బ్ తదితర సాహస పర్యాటక అంశాల ప్రదర్శన ఉంటుందన్నారు. రోప్ యాక్టివిటీ, జిప్ లైన్ వంటివి సదస్సు ప్రాంగణంలోనే జరగనుండగా, మిగిలిన అంశాలు బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తామని మీనా వివరించారు. వైఎస్సార్ జిల్లాలోని గండికోట రాష్ట్రానికి ప్రధాన సాహస పర్యాటక ప్రాంతం కాగా, తలకోన, ఓర్వకల్లు, మహానంది, అరకు, మారేడుమిల్లి ప్రాంతాలు భౌగోళికంగా సాహస పర్యాటకానికి అనువైనవన్నారు. జల ఆధారిత సాహస క్రీడలకు అమరావతిలోని ఎన్టీఆర్ సాగర్, తాడిపత్రి రిజర్వాయర్, గోదావరి జలాలు అనువుగా ఉన్నాయని మీనా వివరించారు.

జగన్‌పై హత్యాయత్నం వెనుక బాబు హస్తం

- అందుకే ఎన్‌ఐఏ విచారణంటే చంద్రబాబు వణికిపోతున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత ఇక్బాల్ ధ్వజం
- కేసు దర్యాప్తులో ప్రభుత్వ తీరు అనుమానాస్పదంగా ఉండటంతోనే కోర్టుకెళ్లాం



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం వెనుక చంద్రబాబు హస్తముందని వైఎస్సార్‌సీపీ నేత షేక్ మహ్మద్ ఇక్బాల్ ఆరోపించారు. హత్యాయత్నం జరిగినప్పటి నుంచి చంద్రబాబు ప్రవర్తన, డీజీపీ స్టేట్‌మెంట్ అనేక అనుమానాలకు తావిచ్చాయన్నారు. అందుకే కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాటం చేశామని చెప్పారు. ఎన్‌ఐఏ విచారణకు చంద్రబాబు ఎందుకు జంకుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హత్యాయత్నం జరిగిన గంటలోపే డీజీపీ మీడియా ముందుకు వచ్చి నిందితుడు ఎస్సీ అని, వైఎస్సార్‌సీపీ అభిమాని అని, చిన్న కత్తి అంటూ ఇష్టారీతిన మాట్లాడారని మండిపడ్డారు. చంద్రబాబు సైతం కోడి కత్తి అంటూ అవహేళన చేశారని గుర్తుచేశారు. వీరిద్దరూ ఒకరి వెంట ఒకరు వెనువెంటనే స్పందించిన తీరు, ప్రవర్తనతో తమ అనుమానం బలపడిందన్నారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక.. ఆపరేషన్ గరుడ పేరుతో హత్యాయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజానాయకుడైన వైఎస్ జగన్‌ను ఫినిష్ చేయాలని కుట్ర పన్నారన్నారు. నిందితుడు శ్రీనివాసరావు పనిచేసే ఫ్యూజన్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల అనుచరుడని చెప్పారు. విశాఖ పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో జగన్‌పై జరిగింది హత్యాయత్నమని క్లియర్‌గా చెప్పారన్నారు.

చట్టాలు చంద్రబాబుకు వర్తించవా..

లైన్ ఆఫ్ ఎంక్వైరీని చంద్రబాబు ఇచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందనే నమ్మకం ఎలా ఉంటుందని ఇక్బాల్ ప్రశ్నించారు. అందుకే కోర్టుకు వెళ్లి థర్డ్ పార్టీతో విచారణ చేయించాలని కోరామన్నారు. చంద్రబాబు పెదరాయుడు సినిమాలో విలన్‌లా చట్టాలు తనకు వర్తించవన్నట్లుగా వ్యవహరిస్తున్నాడని ఇక్బాల్ మండిపడ్డారు. నార్త్ కొరియా ప్రెసిడెంట్ కిమ్ జోంగ్ ఉన్ లా ప్రవర్తిస్తున్నాడని దుయ్యబట్టారు. కుట్రలు, కుంతంత్రాలు చేసి ఏమీ ఎరగనట్లు మాట్లాడటం బాబుకే చెల్లిందన్నారు. టీడీపీ.. పచ్చ కామెర్ల పార్టీ అని దుయ్యబట్టారు. అక్టోబర్‌లో ఘటన జరిగితే దాన్ని జనవరి వరకు చంద్రబాబు ప్రభుత్వం సాగదీసిందని మండిపడ్డారు. ఈ కేసులో చంద్రబాబు కుట్ర లేకపోతే కేసు ఎప్పుడో ఒక రూట్‌కు వచ్చేదన్నారు. ఎన్‌ఐఏ విచారణ కూడా జరగకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాణిపాకం ఆస్థాన సిద్ధాంతి పీఏ రామన్ మృతి



సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): కాణిపాకం దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి డాక్టర్ పీఏ రామన్ సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. విజయవాడ సత్యనారాయణపురం శివరావు వీధిలో నివాసముంటున్న పెరిసెపల్లి అనంతరామన్ (64) 2009 నుంచి కాణిపాకం దేవస్థానం ఆస్థాన సిద్ధాంతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు భార్య జ్ఞానప్రసూనా రామన్, కుమారుడు సంపన్ ఉన్నారు. సోమవారం ఓ వ్యక్తికి జాతక వివరాలు తెలిపి భోజనం చేసి కుర్చీలో కూర్చున్నారు. అనంతరం ఒక్కసారిగా కిందపడిపోయారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొంతకాలంగా రామన్ మధుమేహం, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. 1995 నుంచి 2008 వరకు శ్రీకాళహస్తి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతిగా ఉన్నారు. ప్రస్తుతం కాణిపాకం సిద్ధాంతిగా కొనసాగుతూ భువనేశ్వరీ పీఠం, హనుమద్దీక్షా పీఠం తదితర ఆలయాలకు సిద్ధాంతిగా కొనసాగుతున్నారు. వీటితోపాటు రామన్ పంచాంగకర్తగా ఉంటూ పలు టీవీ చానల్స్, వార్తాపత్రికలకు ఆస్థాన సిద్ధాంతిగా ఉన్నారు. పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. కాగా కుమారుడు సంపన్ ఉద్యోగం రావడంతో సోమవారం రోజునే హైదరాబాద్ వెళ్లాడు.

పోలవరానికి పూర్తి నిధులు అందేలా చూడండి

కేంద్ర మంత్రి ఉమాభారతిని కోరిన చలసాని

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమయ్యే నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ఉమా భారతిని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలని కోరారు.

బీజేపీ అధికార ప్రతినిధి రామకోటయ్య రాజీనామా

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): బీజేపీ పార్టీకి ఆ పార్టీ అధికార ప్రతినిధి రామకోటయ్య రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడికి పంపించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న బీజేపీ ఆంధ్రప్రదేశ్‌పై మాత్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నైతిక విలువలకు లోబడి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. విశాఖపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి బ్రాహ్మణుల సమస్యలపై నివేదికను సమర్పించే బ్రాహ్మణ సంక్షేమ సంఘం బోర్డు కమిటీలో సభ్యుడిగా పనిచేయబోతున్నట్లు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా 'ఎన్టీఆర్'

నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ



మాట్లాడుతున్న హీరో బాలకృష్ణ

పామర్రు: తన తండ్రి పాత్రను నటించే అరుదైన అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతమని సినీ హీరో, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం నిమ్మకూరు గ్రామంలో 'ఎన్టీఆర్-కథానాయకుడు' చిత్ర యూనిట్ సోమవారం పర్యటించింది. గ్రామంలోని బసవతారకం, తారకరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ సినిమాను రెండు భాగాలుగా తీస్తున్నామని, అందులో మొదటి భాగాన్ని 9న విడుదల చేస్తున్నామని, రెండో భాగాన్ని చిత్రీకరిస్తున్నామన్నారు. బాలకృష్ణ వెంట సినీ నటి విద్యాబాలన్, నటుడు కళ్యాణ్‌రామ్, శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇనాక్

నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్ల ఎంపిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగు కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు చైర్మన్‌లను ఎంపిక చేశారు. ఏపీ స్టేట్ క్రిస్టియన్ (మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మద్దిరాల జోసెఫ్ ఇమాన్యుయేల్, సాహిత్య అకాడమీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, సంగీత నృత్య అకాడమీ చైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ (ఫోక్ అండ్ క్రియేటివ్ అకాడమి) చైర్మన్‌గా పొట్లూరి హరికృష్ణను ఎంపిక చేశారు. ఈ నియామకాలకు సంబంధించి నేడో, రేపో ఉత్తర్వులు జారీ కానున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

అరవై ఏళ్ల మత బోధకుడికి 30 ఏళ్ల జైలు

- మరో ఇద్దరికి చెరో నాలుగు యావజ్జీవాలు
- మరొకరికి మూడు యావజ్జీవాలు
- ముగ్గురు మహిళలు సహా నలుగురికి తలా రెండు యావజ్జీవాలు, 42 ఏళ్ల జైలుశిక్ష
- ఇద్దరు మైనర్ బాలికలతో వ్యభిచారం, అత్యాచారం కేసులో తమిళనాడు కోర్టు సంచలన తీర్పు

సాక్షి ప్రతినిధి, చెన్నై: మైనర్ విద్యార్థినులను వ్యభిచార కూపంలోకి నెట్టిన కేసులో నేరం నిరూపణ కావడంతో పలువురు నిందితులకు కఠిన శిక్ష పడింది. మతబోధకునికి 30 ఏళ్ల జైలు, మరో ఇద్దరికి చెరో నాలుగు యావజ్జీవాలు, ఒకరికి మూడు యావజ్జీవాలు, ఆరుగురికి తలా రెండు యావజ్జీవాలతో తమిళనాడు రాష్ట్రం కడలూరు కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా తిట్టకుడి ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న ఇద్దరు మైనర్ విద్యార్థినులు 2014 జూలై 11వ తేదీ నుంచి కనిపించకుండా పోయారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించగా.. కడలూరులోని సతీష్‌కుమార్ (28) అనే వ్యభిచార బ్రోకర్ వద్ద చిక్కుకున్నట్లు బయట పడింది. దీంతో సుమారు రెండేళ్ల క్రితం ఇద్దరు బాలికలను పోలీసులు రక్షించి ప్రభుత్వ బాలికల శరణాలయానికి అప్పగించారు. శరణాలయంలో తలదాచుకుంటున్న ఆ బాలికలు పలువురి చేతుల్లో చిక్కి తమ జీవితాలు ఎలా నాశనమయ్యాయో పోలీసులకు వివరించారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలికకు తమ పాఠశాలకు సమీపంలోని చిల్లర దుకాణానికి వెళ్లి చిరుతిళ్లు కొనుక్కోవడం అలవాటు. ఇలా ఒకసారి వెళ్లినపుడు దుకాణ యజమాని ధనలక్ష్మి.. ఆనందరాజ్ అనే స్నేహితుడితో అత్యంత సన్నిహితంగా ఉండడం బాలిక చూసింది. ఈ విషయం బయట ఎక్కడ చెబుతుందోనని కంగారుపడిన ధనలక్ష్మి ఆ బాలికను ఆనందరాజ్ వద్దకు బెదిరించి పంపించింది. అతడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాలను గోప్యంగా ఉంచకుంటే నీ గురించి తల్లిదండ్రులకు, పాఠశాలలో చెబుతాను అని లొంగదీసుకుంది. అంతేగాక మరో బాలికను తీసుకురావాలని బెదిరించింది. ధనలక్ష్మి మాటలకు భయపడిన బాలిక తన క్లాస్‌మేట్‌ను తీసుకొచ్చింది. ఇద్దరు బాలికలను తన భర్త సెంథిల్‌కుమార్, స్నేహితుడు ఆనందరాజ్ వద్దకు పంపింది. అంతేగాక తిట్టకుడిలోని అరుల్‌దాస్ (60) అనే మతబోధకుడి వద్దకు పంపగా అతడు ఈ ఇద్దరు మైనర్ బాలికల జీవితాలతో ఆటలాడుకున్నాడు. 2016 జూలై 4వ తేదీన ఈ కేసు విచారణ సీబీసీఐడీ చేతుల్లోకి వెళ్లింది. సీబీసీఐడీ విచారణలో పలువురు మహిళలు సహా 23 మంది నిందితులుగా తేలారు. 23 మంది నిందితుల్లో ఆరుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోగా నిందితుల్లో మహాలక్ష్మి అనే మహిళ మినహా 16 మందిపై నేరం నిరూపితం కావడంతో కడలూరు కోర్టు సోమవారం తీర్పు చెప్పింది.మత బోధకుడు అరుళ్‌దాస్‌కు 30 ఏళ్ల జైలు, రూ.5లక్షల జరిమానా, ఆనందరాజ్, బాలసుబ్రమణియన్‌కు చెరో నాలుగు యావజ్జీవాలు, సెల్వరాజ్ అనే వ్యక్తికి మూడు యావజ్జీవాలు, కళ (48), ధనలక్ష్మి (43), ఫాతిమా (35), శ్రీధర్ (23), మోహన్‌రాజ్, మదివానన్.. ఈ ఆరుగురికి రెండు యావజ్జీవ శిక్షలు విధించింది. అంతేగాక, కళ, ధనలక్ష్మి, ఫాతిమా, శ్రీధర్.. ఈ నలుగురు రెండు యావజ్జీవ శిక్షలతోపాటు మరో 42 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మిగిలిన వారికి సైతం కోర్టు తగిన శిక్ష వేసింది. ఇద్దరు బాధిత బాలికలకు చెరో రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం
8-1-2019



చెట్టు నీడ

నాకు ఆ నమ్మకం ఉంది!

ఒక ఊరిలో ఇద్దరు స్నేహితులున్నారు. వారిలో ఒకరు భక్తిపరుడు. ప్రతిరోజూ పూజ చేసేవాడు. పూజలో భాగంగా దేవుడికి రకరకాల పండ్లను, పదార్థాలను నైవేద్యంగా సమర్పించి, అందులో ఒక ఫలాన్నో, ఆహార పదార్థాన్నో ప్రసాదంగా కళ్లకద్దుకుని తినేవాడు. రెండోవ్యక్తికి దైవం అంటే నమ్మకం ఏ మాత్రం లేదు. ఒకరోజు ఇతను వచ్చే టప్పటికి దైవభక్తుడైన మిత్రుడు దేవుడికి నైవేద్యం పెడుతున్నాడు. అది చూసి నాస్తిక మిత్రుడు ఎగతాళిగా ''నువ్వు రోజూ దేవునికి నైవేద్యం పెడుతున్నావు. ఆ పండు నువ్వు పెట్టిన చోటే ఉంటోంది. దానిలో ఎలాంటి మార్పూ రావడం లేదు. దీనిని బట్టి నీకిష్టమైన వాటిని దేవుని పేరు చెప్పి, ఆయన ముందుపెట్టి, ఆనక నువ్వే తింటున్నావు. నువ్వు చేసేది పొట్ట పూజే కానీ దైవపూజ కాదు'' అంటూ నవ్వాడు.

అందుకు ఆ భక్తుడు చిరునవ్వుతో ఇలా సమాధానం చెప్పాడు. ''గీతలో కృష్ణుడు- భక్తులు భక్తితో తనకు పువ్వు, పండు లేదా కనీసం నీటిని సమర్పించినా, దానిని తాను స్వీకరిస్తానన్నాడు. దానిని బట్టే నేను సమర్పించేదానిని ఆయన తప్పక తీసుకుంటాడన్న భావనతో ప్రతిరోజూ నైవేద్యం పెడుతున్నాను. ఆయన సర్వశక్తి మంతుడైనందువల్ల ఆ ఫలాన్ని లేదా పదార్థాన్ని పూర్తిగా అదృశ్యం చేయవచ్చు లేదా దానిని వినియోగించినా కూడా అలాగే ఉండేటట్లు చేయగలడు. నాకు సంబంధించినంతవరకు భగవంతుడు ఆరగించిన తరువాత మిగిలిన ఫలాన్నే నేను ప్రసాదంగా స్వీకరిస్తున్నాను. ఇప్పుడు నేనొక చిన్న ప్రశ్న అడగవచ్చా?'' అన్నాడు.

''సరే, అడుగు'' అన్నాడు నాస్తిక మిత్రుడు.

''మనం రోజూ వార్తాపత్రికలు చదువుతాం కదా, అందులోని అక్షరాలు ఏమైనా మాయం అవుతున్నాయా?'' అనడిగాడతను.

''లేదు. అయినా, అలా ఎలా మాయం అవుతాయి?'' అనడిగాడితను.

''అవి మాయం కాకుండానే వాటి సారం మీకు తెలుస్తోందా లేదా? ఇదీ అంతే అని ఎందుకనుకోవు? మరో విషయం- ఈ మధ్య నీ అభిమాన నటుడు ఒకతను మన ఊరికి వచ్చినప్పుడు మీరందరూ ఆయనకు పూలదండలు వేశారు. తనకు వేసిన దండల్లో ఒకదానిని ఆయన తిరిగి నీకే ఇస్తే, సంతోషంతో తీసుకున్నావా లేదా? అలాగే ఆయన కొన్ని పూలదండలను తన అభిమానుల మీదికి విసిరితే అందరూ ఆనందించారా లేదా? నీ అభిమాన నటుడు తనకు వేసిన పూలదండలన్నింటినీ తన దగ్గర ఉంచుకోక పోయినా మీరు పూలదండలు వేయడం మానుకున్నారా? అలాగే నేను చిత్తశుద్ధితో దేవునికి నైవేద్యం సమర్పించి, దానిని ప్రసాదంగా స్వీకరిస్తున్నాను.?'' అన్నాడు. అంగీకార సూచకంగా తల ఊపాడు నాస్తిక మిత్రుడు.

– డి.వి.ఆర్.

కాస్ట్యూమ్స్

ఝాన్సీ రాణి టైలర్

రెండు దశాబ్దాలుగా చారిత్రక చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు నీతా లుల్లా! ఖుదా గవా, చాందినీ, లమ్హే, దేవ్‌దాస్, జోధా అక్బర్.. ఇంకా ఎన్నో సినిమాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. తన సుదీర్ఘ ప్రయాణంలో ప్రశంసలతో పాటు అవార్డులు కూడా అందుకున్నారు నీతా. 2016లో అషుతోష్ తీసిన 'మొహెంజదారో' చిత్రం తరవాత ఇప్పుడు 'మణికర్ణిక' చిత్రంలో ఝాన్సీరాణిగా నటిస్తున్న కంగనా రనౌత్‌కి డిజైనర్‌గా పనిచేశారు. నీతా రూపొందించిన దుస్తులలో కంగనా ఝాన్సీరాణిలాగ ఎంతో సాహసోపేతంగా కనిపించడం ఇప్పటికే ట్రైలర్‌లలో, టీజర్‌లలో మీరు చూసే ఉంటారు. జనవరి 25న విడుదల కానున్న ఈ చిత్రానికి కంగనే డైరెక్టర్.

నీతా తన టీమ్‌తో కలిసి ఝాన్సీరాణి వస్త్రాల మీద బాగా పరిశోధన చేశారు. నాలుగు మాసాల పాటు తయారు చేసిన వస్త్రాలు రాణి పాత్రకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని పరీక్షించారు. ''అంతకు ముందే ఈ అంశం మీద చిత్రాలు తీద్దామనుకున్న కొందరు వ్యక్తులు నన్ను కలిశారు. అందువల్ల ఈ చిత్రం తీసే నాటికి నాకు ఈ పాత్రకు తగ్గ ఆహార్యం మీద అవగాహన కలిగింది. మణికర్ణిక కోసం నా దగ్గరకు వచ్చినప్పుడు, నేను ఫ్రెష్ మైండ్‌తో పని ప్రారంభించాను'' అంటారు నీతా లుల్లా. గ్రంథాలయాలు, మ్యూజియమ్‌లు గాలించి, మణికర్ణిక వస్త్రాలకు సంబంధించిన సమాచారం సేకరించారు నీతా. అంత లోతుగా పరిశీలించడం వల్ల ఝాన్సీలక్ష్మీబాయిని ఎంత శక్తిమంతంగా చూపాలో నీతాకి అర్థమైంది. ఎక్కడెక్కడివో పెయింటింగ్స్, ఇలస్ట్రేషన్స్, ఫ్యాబ్రిక్ శాంపుల్స్ కూడ పరిశీలించారు. దానితో రాజరికాన్ని ఏ విధంగా ప్రతిబింబించాలో తెలుసుకున్నారు.



ఇంతలా ఎప్పుడూ శ్రమించలేదు

నేను 12 వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాను. నాకు చరిత్ర గురించి అస్సలు తెలియదు. సంప్రదాయ చదువుల పట్ల నాకు ఆసక్తి లేదు. ఇప్పటికి 100 కు పైగా చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశాను. నిరంతరం ఏదో ఒకటి కొత్తగా చేయడం మీద నాకు ఆసక్తి ఎక్కువ. మణికర్ణికలో నేను రనౌత్‌కి చేసిన కాస్ట్యూమ్స్‌కి ఎప్పుడూ లేనంతగా శ్రమించాన. ఆమె శిరస్సు కోసం చేసిన అలంకారాలు, రనౌత్‌కు కొత్త అందాలు తీసుకువచ్చాయి. ఆవిడ జీవితంలో ఆ మేకప్ ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

– నీతా లుల్లా

సందర్భానికో వస్త్రధారణ

''యుద్ధవీరురాలికి వస్త్రాలు తయారు చేయడంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లక్ష్మీబాయి వేసిన రకరకాల వేషాలకు సంబంధించిన వస్త్రాలను డ్రామా కంపెనీల దగ్గరకు వెళ్లి తెలుసుకున్నాను. లక్ష్మీబాయి లేదా మణికర్ణిక.. యవ్వనంలో ఉండగా ఆమెను ఒక యోధురాలిగా, పెళ్లికూతురిగా, రాణిగా, విధవరాలిగా చూపాలి. చివరగా ఆమెను ఒక విప్లవ నాయకురాలిగా చూపాలి. ప్రతి దశలోను రకరకాల రంగులను ఉపయోగించాను. తొమ్మిది గజాల ఎమరాల్డ్ గ్రీన్ చీరలో రనౌత్‌ను చూస్తుంటే పోరాటయోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఆకుపచ్చ రంగు సిరిసంపదలకు, విశాల హృదయానికి ప్రతీక'' అంటారు నీతా. కంగన కూడా ఆ వస్త్రాలకు దీటైన నటన కోసం శ్రమించారు. ''ఈ పాత్రకు సంబంధించి రకరకాల భావాలు ప్రదర్శించడం చాలా కష్టంగా ఉందని, కాని ఆ పాత్రకు న్యాయం చేయడం కోసం శతవిధాల ప్రయత్నిస్తున్నానని కంగనా అనేవారని'' చెబుతున్నారు నీతా.



యుద్ధంలో అంగ్రఖా కుర్తా

రాచరికం ప్రతిబింబించేలా హ్యాండ్‌స్పన్ ఫ్యాబ్రిక్, ఖాదీ వస్త్రాల మీద సహజ రంగులతో డిజైన్ చేశారు నీతా. రాణిగా లక్ష్మీబాయి పాత్రకు రిచ్ రెడ్ కలర్, ఆరెంజ్, గ్రీన్ రంగులను ఉపయోగించారు. ఆమెలోని విషాదాన్ని చూపడానికి లేత రంగులను ఉపయోగించారు. యుద్ధరంగంలో ఉన్న సమయంలో రనౌత్ 'అంగ్రఖా కుర్తా' వేసుకున్నారు. మరాఠా వీరులకు సంబంధించిన బొమ్మలను, తెల్లటి వస్త్రాల మీద బంగారు, ఎరుపు రంగులలో చిత్రించారు. కవచాన్ని లెదర్‌తో రూపొందించారు. అది కూడా చేతితో చేయించారు.

కాస్ట్యూమ్స్ కోసం నీతా ఇంత కృషి చేసిన విధంగానే నగల ఎంపికకు మరో విభాగం పెద్ద అధ్యయనమే చేసింది. మణికర్ణిక మరాఠా మహారాణి కావడంతో వివాహానికి ముందు ధరించే నగల విషయంలో ప్రత్యేకత చూపారు. ముక్కుకి నత్తు, కంఠానికి తుషీ చోకర్ తయారుచేశారు. వివాహం అయ్యాక ఆవిడ కుందన్స్, ముత్యాలు ధరించేలా నగలు తయారుచేశారు. పెద్ద పాపిడి బిళ్ల, చేతులకు కంకణాలు, నెక్‌లేస్.. ఉపయోగించారు. వీటన్నిటినీ త్వరలోనే మనం తెర మీద కళ్లారా చూడొచ్చు.

– జయంతి

బాలీ హామీలు




రాజకీయం
ప్రజల కోసం ఉండాలి.
ప్రజల కోసం.. ప్రజలచేత..
ప్రజల వలన సాగాలి.
రాజకీయం ప్రజలను ఒక్కటి చేయాలి.
రాజకీయం ప్రేమను,
శాంతిని పెంపొందించాలి.
ఇవన్నీ రాజకీయాలకైతే ఓకే.
కానీ బాలీవుడ్ రాజకీయాన్ని
బ్లాక్‌బస్టర్‌గా మార్చడానికి వాడుకుంటుంది.
ఎలా అయితేనేమి ఎలా చెబితేనేమి
ప్రజలకు అర్థమయ్యేలా చెబితే చాలు.
సినిమాను మించిన మెస్సేజ్ ఉండదేమో!
ప్రస్తుత రాజకీయాలను,
రాబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని
బాలీవుడ్ తెచ్చిన కొన్ని చిత్రాలపై విశ్లేషణ

బయోపిక్స్

సినిమాల్లోంచి రాజకీయాల్లోకి వచ్చి నేతలుగా మారిన వాళ్ల లైఫ్ బయోపిక్స్‌గా వస్తున్నాయి . అలాగే జన నేతలుగా పేరుగాంచిన నాయకుల జీవితాలుకూడా సినిమాలుగా తెరకెక్కాయి. అవన్నీ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. మన్‌మోహన్ సింగ్, ఎన్.టి.ఆర్, వై.ఎస్.రాజశేఖరరెడ్డి బయోపిక్స్ ఇందుకు ఉదాహరణ.

రాజకీయాలు, సినిమాలు ఆర్ ది మోస్ట్ సేలబుల్ సబ్జెక్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్‌లో. ఈ రెండూ కలిస్తే చెప్పేదేముంది బంపర్ బొనాంజే! 2018 సంవత్సరాంతంలో అయిదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా సినిమాతో రాజకీయాన్ని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో కావల్సినంత వినోదాన్ని పంచారు. క్రియేటివిటీకి ఓ న్యూవేవ్ వేశారు ఉత్సాహవంతులు. హిట్ అయిన తెలుగు, హిందీ సినిమాల్లోని హీరో, విలన్‌లకు అధికార పార్టీ, ప్రత్యర్థి పార్టీ నేతల మొహాలను పెట్టి సృజన తృష్ణతోపాటు విజయకాంక్షనూ తీర్చుకున్నారు. ఇటు సోషల్ మీడియా ఆడియెన్సూ వాటికి విపరీతంగా వ్యూస్ ఇచ్చి, షేర్స్ పెంచి బ్లాక్‌బస్టర్స్‌ను చేశారు. ఆ ట్రెండ్ ఈ యేడు జరగబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకూ స్ట్రెచ్ అయ్యే దృశ్యం కనపడుతోంది. అయితే ఒకరినొకరు తిట్టుకోవడం..మార్ఫింగ్ చేసుకోవడం నేలబారు పోకడ. కొత్త ప్లాన్ ఏంటంటే.. కొన్ని బాలీవుడ్ సినిమాల థీమ్‌ను ఎన్నికల ప్రచార అస్త్రాలుగా.. వాగ్దానాలుగా మలచుకోవడం! మల్టీప్లెక్స్, సింగిల్, స్మాల్, వెబ్ స్క్రీన్ (అన్ని వర్గాల) ఓటర్లనూ ఆకర్షించి కమర్షియల్ హిట్ లాంటి ఆల్ టైమ్ ఫేవరేట్ గవర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం. అలాంటి సినిమాల ప్రస్తావనతో ఓ చిన్న పొలిటికల్ మూవీ క్రియేటివ్ ఎక్సర్‌సైజ్...

పీప్లీ లైవ్..



ఇది రైతు కథ. కాలంలేక, పంటలు పండక, పెట్టిన పెట్టుబడి రాక ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాడు పీప్లీ ఊళ్లోని ఓ రైతు. రైతు ఆత్మహత్య చేసుకుంటే ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తుంది ప్రభుత్వం. అందుకని ఆ డబ్బుకోసం ఈ రైతు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు.

ఎజెండా: ఇప్పటికే దేశంలో చాలా చోట్ల రైతులకు రుణమాఫీ, మద్దతు ధర వంటి పథకాలను అందచేస్తున్నాయి ప్రభుత్వాలు. అయినా రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల రైతుల ఇటీవలి ర్యాలీనీ విస్మరించకూడదు. అన్నం పెట్టే రైతు రుణాల్లో మునగకుండా చూడాలి.

టాయ్‌లెట్..



మహిళల బహిర్భూమి సమస్యతో తెరకెక్కిన సినిమా. కనీస అవసరాల్లో ఇంట్లో టాయ్‌లెట్ ముఖ్యమైనది. దాని కోసం పోరాటం చేసి, సాధించిన ఓ కోడలి కథ.

ఎజెండా: స్వచ్ఛభారత్ కింద కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ టాయ్‌లెట్ అనే నినాదంతో ఇప్పటికే వీటి నిర్మాణాన్ని చేపట్టింది. అయినా తెలుగు రాష్ట్రాల్లో ఇళ్లే లేవు ఇక టాయ్‌లెట్లు ఎక్కడ ఉంటాయి? చెరువులు, కాల్వల గట్లే ప్రత్యక్ష ఉదాహరణలు. టాయ్‌లెట్ ఉన్న ఇల్లు అంటే ఆడపడుచుకి గౌరవమిచ్చే ఇల్లు అని. ఆ క్రెడిట్ ప్రాంతీయ పార్టీల ఖాతాలోనూ చేరాలి.

ఓ మై గాడ్..



దేవుడికి, నాస్తికుడికి మధ్య ఉన్న భక్తివిశ్వాసాల సారం ఈ చిత్రం. విశ్వంలో జరిగే ప్రతి కర్మ, క్రియకు కర్త ఆ భగవంతుడే. సర్వమత సారాంశం ఇదే. ఈ సినిమా చర్చా దీని మీదే.

ఎజెండా: దేవుడు ఉంటే అందరికీ ఉంటాడు. లేకపోతే ఎవరికీ లేడు. ఉన్నాడనేదే మెజారిటీ నమ్మకం. కనుక ఆడ,మగ, కుల,వర్గ భేదం లేకుండా ఏ గుడిలోకైనా అందరికీ ప్రవేశం కావాలి. దేవుడితో రాజకీయాలు వద్దు. దేవుడి జన్మస్థానం పేరుతో మత యుద్ధాలు వద్దు. హేతుబద్ధమైన ఆలోచనాతీరును పెంపొందించే విద్యావిధానానికి శ్రీకారం చుట్టాలి. అత్యున్నత న్యాయస్థానాల తీర్పును గౌరవించే వాతావరణాన్ని కల్పించాలి.

రాజ్‌నీతి



మహాభారత కథకు ఆధునిక రూపం ఈ సినిమా. కుటుంబ పాలన, అధికారం కోసం రక్తసంబంధీకుల మధ్య కలహాలు, మైనారిటీ ఓట్ల కోసం ఆరాటం, ఆధిపత్య పోరాటమే ఈ మూవీ స్టోరీ.

ఎజెండా: ప్రజాస్వామ్యం అంటే అధికారం ప్రజలకు బంటు అనే కదా! ఈ నమూనా కుటుంబ పాలనకు ఫక్తు వ్యతిరేకం. మైనారిటీ సంక్షేమం వాళ్ల ఓటు బ్యాంకులో మురగొద్దు. వాళ్ల అభివృద్ధి కనపడాలి.

మసాన్..

సమాజంలో అన్ని రకాల దోపిడీకి గురవుతున్న వర్గాల కథ. బడుగు, బలహీనుల మీద దాడులు కూడదని చూపించే చిత్రం.

ఎజెండా: కులాల మధ్య అంతరాలు పోవాలని, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలూ సమాజంలో గౌరవ మర్యాదలు అందుకోవాలనే రిజర్వేషన్స్ కల్పించింది. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ను తెచ్చింది. కాని పురోగమించాల్సిన మనం తిరోగమనానికి సిద్ధపడ్డాం. దేశంలో దళితులపై దమనకాండలు పరువు హత్యల పేరుతో రూపం మార్చుకున్నాయి. చట్టాలను కాలరాస్తున్నాం. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. బడుగు, బలహీనులకు అండగా ఉన్న చట్టాలను పరిరక్షించే ప్రయత్నం చేయాలి.




అయ్యారీ..



రక్షణశాఖలో జరిగిన కుంభకోణానికి సంబంధించిన సినిమా ఇది. దేశానికి కంచెగా ఉన్న డిఫెన్స్ మినిస్ట్రీయే డబ్బుకి ఆశపడి ప్రజల రక్షణను లంచానికి పణంగా పెట్టే కహానీ అయ్యారీ.

ఎజెండా: ఓటు అంటే నమ్మకం. గెలుపు అంటే బాధ్యత. ఈ రెండిటినీ సమన్వయం చేసుకునేదే అధికారం. ప్రజల మంచిచెడులకు బాధ్యత వహించడానికి ముందుకు వస్తున్న పార్టీలు ఈ అంశాన్ని విస్మరించకూడదు. దేశ రక్షణకు సంబంధించి గతంలో జరిగినవి, ఇప్పుడు దుమారంలో ఉన్న డిఫెన్స్ డీల్స్ కుంభకోణాలు కావనే విశ్వాసాన్ని ప్రజలకు కల్పించాలి. వారి భద్రతకు తామే కాపలా అన్న భరోసానివ్వాలి.

రాజీ..



'అయ్యారీ'కి విరుద్ధమైన కథే రాజీ. దేశం కోసం సొంత కూతురి జీవితాన్నే బలిగా పెట్టిన ఓ గూఢచారి కథ.

ఎజెండా: జాతీయవాదం అంటే మతం పేరుతో దేశంలోని ప్రజలను విడగొట్టడం కాదు. మతానికి అతీతంగా దేశం కోసం నిలబడ్డం. ప్రజల మధ్య ఐకమత్యాన్ని చాటడం. అంతర్గత భద్రత లేకుండా సరిహద్దు రక్షణ ఎలా సాధ్యం? 'రాజీ'ని ఇలా స్ఫూర్తిగా తీసుకొని ఐక్యతను ఎజెండాలో భాగం చేసుకోవాలి. కార్యాచరణకు అడుగులు వేయాలి.


పింక్..



''అవునంటే కాదనిలే.. కాదంటే అవుననిలే.. ఆడవారి మాటలకే అర్థాలే వేరులే'' అన్న ఈ పాదం తప్పు. 'నో' అంటే 'నో' అనే. దానికి ఇంకా వేరే అర్థాలేం లేవు. 'వద్దు' అనే స్ట్రయిట్ మీనింగే. పింక్ సినిమా చెప్పేదీ ఇదే. స్త్రీలను గౌరవించమని. ఇష్టం లేదు అని ఆమె అంటే వినమని. ఆ మాటకు విలువివ్వమని.

ఎజెండా: ఆకాశంలో సగం మాట దేవుడెరుగు దేశంలో సగం జనాభా ఉన్న మహిళలకు ఎక్కడా సమాన హక్కులు లేవు. అవకాశాలు అంతకన్నా లేవు. రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ చర్చల్లో వినిపిస్తోంది తప్ప బిల్లుగా కనిపించట్లేదు. ఉద్యోగాల్లో అన్నిరకాల వేధింపులే బోనస్. కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు పుట్టకుండా కుట్రలు నూరుతున్నారు. భూమ్మీదున్న వాళ్లనైతే రకరకాల అవమానాలతో చంపేస్తున్నారు. చట్టాలు చేసి ఊరుకోవడం కాదు.. అమలు జరిగేలా, అతిక్రమణ లేకుండా చూడాలి. ప్రతి పార్టీ ప్రాక్టికల్ ఎజెండాలో మహిళ భాగం కావాలి. అప్పుడే ఆమె అభివృద్ధిలో అర్ధభాగంగా, ఉత్పాదక శక్తిగా సముచిత స్థానం పొందుతుంది.

రోటీ.. కపడా.. ఔర్ మకాన్..



ఎప్పటిదో ఈ సినిమా. ఇప్పటికీ ఈ మూడు ఉన్న జనాభా చాలా తక్కువ మన దేశంలో.

ఎజెండా: ఎన్నిటినో సాధిస్తున్నారు. అంతరిక్షంలోకి వెళ్లడానికీ బడ్జెట్‌ను కూడబెడ్తున్నారు. కాని కూడు, గుడ్డ, గూడుకే కరువు చూపిస్తున్నారు. ఈ కనీస అవసరాలను సమకూర్చుకోలేకపోతున్నాం. ఈసారైనా వీటిని సంపూర్ణంగా సాధిస్తే మిగిలిన పురోభివృద్ధిలో ప్రజలూ పార్ట్‌నర్స్ అవుతారు.

న్యూటన్..



నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా చూసే ఓ ప్రభుత్వ ఉద్యోగి కథ ఇది.

ఎజెండా: పైనవన్నీ సాధించాలన్నా ప్రజాస్వామ్య స్ఫూర్తి సజావుగా సాగాలన్నా ఎన్నికలు సక్రమంగా జరగాలి. బ్యాలెట్ బాక్స్‌లు ఉంటే రిగ్గింగు జరిగే అవకాశం ఎక్కువని ఈవీఎంలకు వెళ్లాం. ఈవీఎంలనూ ట్యాంపర్ చేయొచ్చనే వాదనా వినపడుతోంది. అందుకని ప్రతి పార్టీ తమ ఎజెండాల్లో ముందుగా పోలింగ్‌లో అవినీతికి పాల్పడమనే స్వీయవాగ్దానం చేసుకోవాలి.

– సరస్వతి రమ

(ది ఎకనమిక్ టైమ్స్ సౌజన్యంతో..)

ముగ్గు-ముచ్చట





ఎన్. మాధవి
ప్రాసంగులపాడు,
ప్రకాశం జిల్లా

15 చుక్కలు
1 వచ్చే వరకు
అటు ఇటు
చుక్క వదిలి చుక్క

ముగ్గులకు ఆహ్వానం ... ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

పాశుర ప్రభాతం 24వ రోజు



దుష్ట శిక్షణ, శిష్టరక్షణ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా దశావతారాల ఆవిర్భావం జరిగింది. లోక సముద్ధరణే తన కర్తవ్యమని తలంచిన శ్రీమన్నారాయణుని అవతార పరమార్థం ఆనందకారకం.

"అన్నివ్వులగ మళన్దాయ్! అడిపోత్తి!
శెన్రఙ్గు తెన్నిలఙ్గై శెత్తాయ్! తిరల్ పోత్తి;
పొన్రచ్చగడ ముదైత్తాయ్! పుగళ్‌పోత్తి;
కన్రుకుణిలా ఎరిన్దాయ్! కళల్ పోత్తి;
వెన్రు పగైకెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్‌పోత్తి;
ఎన్రెన్రున్ శేవగమే యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్రియామ్ వన్దోమ్ ఇరఙ్గేలో రెమ్బావాయ్"

భావం: ఇంతింతై వటుడింతై వామనుడు లోకాలను పీడిస్తున్న బలిచక్రవర్తిని మూడడుగులతో ఆక్రమించి అణచిన శుభపాదాలకు మంగళం. సీతమ్మను తీసుకెళ్ళి గర్వంతో విర్రవీగిన రావణుని దర్పాన్ని అణచి అందమైన బంగారు లంకను విభీషణునికి అప్పగించిన శౌర్యపరాక్రమానికీ, ఔదార్యానికీ మంగళం. కృష్ణ లీలల్లో అసురులను మట్టుబెట్టిన గంభీర సందర్భాలకూ, చిలిపి చేష్టల్లో అలరించిన సన్నివేశాలకూ మంగళం. ఇంద్రుడు యాగం ఆచరించిన గోకులంపై వర్షరూప కోపాన్ని చూపించి చలింపచేసినప్పుడు గోవర్ధనగిరినెత్తి ఆదుకున్న వాత్సల్యానికి మంగళం. అనేక వీరచరిత్రలకూ, అగాధ తత్త్వాలకూ ఆలవాలమైన భగవంతుడు పరయనే వ్రత సాధనమునకు ఇష్టసులభుడు. అనుగ్రహించు, తరింపజేయు అంటూ కీర్తిద్దాం.

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



చెప్పుకోలేనే బాధ నీతోనే
దాచుకోలేనే గుండెల్లో నేనే ॥2॥

నిన్నే నమ్మి చేశానే నేరం
కళ్లే తెరిచి వెళ్తున్నా దూరం
ఊపిరి ఆగేలా ప్రాణం పోయేలా
ఉందే నువ్వు చేసిన మోసమే
గుప్పెట్లో దాచే నిప్పులే ఉందే
నీతో గడిపిన ఆ కాలమే
కన్నీరంటూ రాకున్నదే
బాధే తీరే దారుందే
మగువకు మరుపంటే ఎంతో తేలికని
నిన్నే చూశాకే తెలిసెను నేడే
కాలం చేసే గాయం మానే దారే లేనే లేదా
నా గుండెల్లో ముల్లే గుచ్చి చంపేసావే నన్నిలా
॥చెప్పుకోలేనే॥

చిత్రం : హుషారు
రచన : కిట్టు విస్సప్రగడ
గానం : సిడ్ శ్రీరామ్
సంగీతం : రథన్

కట్‌చేయ్...దాచేయ్...



● తనయుడు అవ్రామ్‌తో మంచు విష్ణు

అవ్రామ్ మంచు @1

మంచు మోహన్‌బాబు మనవడు అవ్రామ్ మంచు తొలి పుట్టినరోజు ఆదివారం ఘనంగా జరిగింది. సినిమా పరిశ్రమ నుంచి నటుడు చిరంజీవితో పాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఇంకా పలువురు రాజకీయ నాయకులు కూడా హాజరై, చిన్ని అవ్రామ్‌ని ఆశీర్వదించారు. తనయుడి పుట్టినరోజు వేడుకను విష్ణు, విరానికా వీలైనంత పసందుగా జరిపారు. ఇక తమ్ముడి జన్మదిన వేడుకలో అరియానా, వివియానా కూడా బాగా సందడి చేశారు.

శ్రీమతి అండ్ శ్రీవారిగా!



● రణ్‌వీర్ సింగ్

బాలీవుడ్ నటి దీపికా పదుకోన్‌కి వృత్తిపరంగా, వ్యక్తిగతంగా 2018 ది బెస్ట్ ఇయర్ అనొచ్చు. గతేడాది 'పద్మావత్'తో సూపర్ హిట్ అందుకుని, కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న రణ్‌వీర్ సింగ్‌ను పెళ్లాడి కొత్త ఏడాదిని హ్యాపీగా ఆరంభించారు. అంతేకాదు గతేడాది ఫోర్బ్స్ మేగజీన్‌లో అత్యధికంగా సంపాదించే హీరోయిన్‌గా టాప్ 5లోను, ఐయండీబీ మోస్ట్ పాపులర్ స్టార్‌గా టాప్ చైర్‌లోను కూర్చున్నారు. 2019 కూడా బెస్ట్‌గా ఉండాలనుకుంటున్నారామె. ఈ ఏడాది నిర్మాతగా ఎంట్రీ ఇవ్వనున్నారు. జనవరి 5న దీపిక బర్త్‌డే. ఈ సందర్భంగా తన పేరు మీద 'డబ్ల్యూడబ్ల్యూదీపికాపదుకోన్‌డాట్ కామ్' అనే వెబ్‌సైట్‌ను ఓపెన్ చేశారు. ప్రస్తుతం యాసిడ్ బాధితురాలు లక్ష్మీ జీవితం ఆధారంగా 'చప్పక్' అనే సినిమాలో నటిస్తున్నారు దీపిక.

రణ్‌వీర్ సంకల్పం బలమైనది

'రామ్‌లీల, భాజీరావ్ మస్తానీ' సినిమాల్లో రణ్‌వీర్ సింగ్, దీపికాల కెమిస్ట్రీ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. తాజాగా మరోసారి జంటగా స్క్రీన్ పంచుకోవాలనుందంటున్నారు ఆమె భర్త రణ్‌వీర్. ''దీపికాతో కలసి యాక్ట్ చేయడాన్ని ఎంజాయ్ చేస్తాను. నటిగా తన సామర్థ్యాన్ని ఇంకా పూర్తి స్థాయిలో ఉపయోగించలేదనుకుంటున్నాను. దీపిక ఎమోషనల్‌గా ఇంకా బాగా నటించగలదు. మేమిద్దరం మళ్లీ ఎప్పుడు సినిమా చేస్తామో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అని పేర్కొన్నారాయన. రణ్‌వీర్ అలా సంకల్పించుకున్నారో లేదో దర్శకుడు కబీర్ ఖాన్ తథాస్తు అన్నారని బాలీవుడ్ మీడియా టాక్. ప్రస్తుతం1983 క్రికెట్ ప్రపంచ కప్ ఆధారంగా కబీర్ ఖాన్ '83' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందించనున్న సంగతి తెలిసిందే. ఇందులో కపిల్ దేవ్ పాత్రను రణ్‌వీర్ సింగ్ పోషించనున్నారు. కపిల్ భార్య రోమీ భాటియా పాత్ర కోసం దీపికను సంప్రదించినట్టు సమాచారం. ఇండియా ఓడిపోతుందని భావించి రోమీ భాటియా స్టేడియంను విడిచి బయటకు వెళ్లిపోవడం, మళ్లీ తిరిగొచ్చే సమయానికి ఇండియా గెలిచే స్టేజ్‌లో ఉండటం వంటి సన్నివేశాలు ఈ చిత్రంలో హైలైట్‌గా ఉండబోతాయట. చిన్న పాత్ర అయినప్పటికీ ఎమోషనల్‌గా ఉంటుంది కాబట్టి దీపిక అయితే బావుంటుందని టీమ్ భావించిందట.

భారతీయ కట్టు.. భలే ఆకట్టు

● 2019 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో మనస్వీ హైలైట్



● లేడీ గాగా

హాలీవుడ్‌లో అవార్డ్స్ సీజన్ మొదలైంది. ఈ సీజన్‌కు శ్రీకారం చుట్టేది గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్. ప్రతి ఏడాది జనవరిలో ఈ వేడుక జరుగుతుంది. 76వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ఫంక్షన్ సోమవారం ఉదయం (భారతకాలమాన ప్రకారం) జరిగింది. ఎన్నో విశేషాలతో పాటు పలు ఆశ్చర్యాలు కూడా ఈ వేడుకలో చోటు చేసుకున్నాయి. అన్ని అవార్డ్స్ చేజిక్కించుకుంటాయనుకున్న సినిమాలు ఉత్త చేతులతో వెళ్లడం, అంచనాలు లేకుండా వచ్చినవి ఉత్తమ చిత్రాలుగా మిగలడం, నటుడిగా క్రిస్టిన్ బేల్ తొలి అవార్డు దక్కించుకోవడం, ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంటుందనుకున్న 'స్టార్ ఈజ్ బోర్న్' చిత్రం కేవలం ఒక్క అవార్డ్‌తో సరిపెట్టుకోవడం, అంచనాలు లేని 'గ్రీన్ బుక్' సినిమా అనూహ్యంగా ఎక్కువ అవార్డ్స్ సంపాదించడం, సూపర్ హీరో (బ్లాక్ పాంథర్) సినిమా గ్లోబ్ అవార్డ్స్‌కు నామినేట్ అవ్వడం ఇదే తొలిసారి. పొడుగు గౌన్లతో రెడ్ కార్పెట్ మీద వయ్యారంగా కొందరు తారలు వాక్ చేస్తే, ఎర్ర తివాచీపై చీరగాలి కూడా తగలడం మరో విశేషం. ఆస్కార్‌కు ముందుగా జరిగే ఈ అవార్డ్ ఫంక్షన్ కేవలం సినిమాలకే కాదు టెలివిజన్‌కు కూడా అవార్డ్స్ అందిస్తుంది. మొత్తం 25 విభాగాల్లో అవార్డ్స్ అందించే ఈ షోలో 14 విభాగాలు సినిమాకు, 11 విభాగాలు టెలివిజన్‌కు అందిస్తారు.. 'గోల్డెన్ గ్లోబ్ విన్నర్' అనే ట్యాగ్ ఆస్కార్ అవార్డ్ ఓటింగ్‌లో ఎంతో కొంత ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

మొదటి గ్లోబ్ అవార్డ్



● క్రిస్టిన్ బేల్

పాత్రలా మారడానికి శరీరాన్ని ఎలా కావాలంటే అలా మార్చుకుంటుంటారు నటుడు క్రిస్టిన్ బేల్. ఇప్పటికే మూడుసార్లు గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో నామినేషన్ సంపాదించినప్పటికీ నిరాశతోనే వెనుదిరిగారు. కానీ 'వైస్'లో చేసిన అమెరికన్ వైజ్ ప్రెసిడెంట్ ఆడమ్ మెక్కే పాత్రకు ఆయన తొలి గ్లోబ్ అవార్డుని అందుకున్నారు. ఈ పాత్ర కోసం సుమారు నలభై పౌండ్ల (20 కిలోల) బరువు పెరగడంతో పాటు కనుబొమలను బ్లీచ్ చేయించుకున్నారు. 2011లో సహాయ నటుడి (ది ఫైటర్)గా ఈ అవార్డ్ అందుకున్నప్పటికీ బెస్ట్ యాక్టర్‌గా తొలి అవార్డ్ ఇది.

కార్పెట్‌పై చీరగాలి



● మనస్వీ మంగై

రెడ్ కార్పెట్‌పై ఎక్కువగా పొడుగు గౌన్లు మాత్రమే కనిపిస్తాయి. కానీ తొలిసారి ఈ కార్పెట్‌కు చీరగాలిని తగిలించారు బాలీవుడ్ భామ మనస్వీ మంగై. ఈ అవార్డ్స్ ఫంక్షన్స్‌కు ప్రియాంకా చోప్రా హైలైట్‌గా నిలుస్తారని ఊహించారంతా కానీ ఆమె హాజరు కాలేదు. అప్పటివరకూ వస్తున్న గౌన్ల ట్రెండ్‌ని పక్కన పెట్టి, మనస్వీ మంగై చీరలో ప్రత్యక్షం కావడం వీక్షకులను ఆశ్చర్యపరిచింది. 'టాక్ ఆఫ్ ది ఈవినింగ్' అయ్యారామె. ''హాలీవుడ్‌కు ఇది ఫస్ట్ అవార్డ్ సీజన్, అలాగే నాకు కూడా. అందుకే ఈ ఫంక్షన్‌కు కొత్తగా మన భారతీయ స్టైల్‌లో డ్రెస్ చేసుకుందాం అనుకున్నాను. అందుకే చీర కట్టుకుని హాజరయ్యాను. ఇక్కడి ప్రెస్, హాలీవుడ్ నటీనటులు చాలా మంది నేనెవర్ని, ఆ డ్రెస్సింగ్ స్టైల్ ఏంటి? అని కనుక్కున్నారు'' అంటూ తన ఫస్ట్ అవార్డ్ ఫంక్షన్ ఆనందాన్ని పంచుకున్నారు మనస్వీ.



● దీపికా పదుకోన్

అవార్డ్స్ లిస్ట్ :

- **బెస్ట్ డైరెక్టర్:** అల్ఫోన్సో కువారన్ (రోమా)
- **ఉత్తమ చిత్రం:** గ్రీన్ బుక్
- **ఉత్తమ నటుడు (డ్రామా):** రామి మలెక్ (బోమియన్ రాప్సోడీ)
- **ఉత్తమ నటుడు (కామెడీ, మ్యూజికల్):** క్రిస్టిన్ బేల్ (వైస్)
- **విదేశీ చిత్రం:** రోమా
- **ఒరిజినల్ సాంగ్:** షాలో (స్టార్ ఈజ్ బోర్న్)
- **ఒరిజినల్ స్కోర్:** జస్టిన్ హర్విట్జ్ (ఫస్ట్ మ్యాన్)
- **యానిమేషన్ మూవీ:** స్పైడర్ మేన్-ఇన్ టు ది స్పైడర్ వెర్స్
- **స్క్రీన్ ప్లే:** నిక్ వెల్లెలోంగ, బ్రియన్ క్యూరీ, పీటర్ ఫరేల్లీ (గ్రీన్‌బుక్)
- **సహాయ నటుడు:** మహెర్షలా అలీ (గ్రీన్ బుక్)
- **సహాయ నటి:** రెగీనా కింగ్ (ఈఫ్ బీల్ స్ట్రీట్ కుడ్ టాక్)

సడన్‌గా సంక్రాంతికి రిలీజ్ అంటే ఎలా?

\- 'దిల్' రాజు



● 'దిల్' రాజు, తమన్నా, మెహరీన్, వెంకటేశ్, వరుణ్ తేజ్, అనిల్ రావిపూడి

''నిన్న ఒక సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వాళ్లు తొందరపడి స్టేట్‌మెంట్ ఇచ్చారేమో నాకు తెలియదు. పండక్కి వస్తున్న 3 సినిమాలు 6 నెలల క్రితం అనౌన్స్ అయ్యాయి. 3 పెద్ద సినిమాలకు థియేటర్స్ ఎలా సెట్ చేసుకోవాలని స్ట్రగుల్ అవుతున్నాం. అలాంటిది 20 రోజుల ముందు సినిమాను కొనుక్కొచ్చి సంక్రాంతికి రిలీజ్ అంటే ఎలా? 3 తెలుగు సినిమాలున్నప్పుడు పక్క రాష్ట్రం నుంచి వచ్చే సినిమాకు థియేటర్స్ ఎలా అడ్జస్ట్ అవుతాయి?'' అని 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన మల్టీస్టారర్ మూవీ 'ఎఫ్ 2'. (ఫన్ అండ్ ఫ్రస్టేషన్). తమన్నా, మెహరీన్ కథానాయికలు. 'దిల్' రాజు నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానున్న సందర్భంగా ట్రైలర్ రిలీజ్ చేసి, 'దిల్' రాజు మాట్లాడుతూ – ''రాజా ది గ్రేట్' తర్వాత అనిల్ ఈ ఐడియా చెప్పాడు. బాగా నచ్చింది. జర్నీ అంతా ఫన్‌గా సాగిపోయింది. మొన్న ఇద్దరం మాట్లాడుకుంటూ 'ఏంటి అనిల్.. 3 సినిమాలు చేసేశాం. చిన్న క్లాష్ కూడా రాలేదు' అని నవ్వుకున్నాం. తను అనుకున్నట్టు సినిమా చేశాడు. పండక్కి మా సినిమా ఫన్ ఇస్తుందని నమ్ముతున్నాం. అలాగే థియేటర్స్ ఇష్యూలో రెండో పాయింట్.. ఆ నిర్మాతే గత నాలుగు నెలల్లో 'నవాబ్, సర్కార్' సినిమాలు రిలీజ్ చేశారు. 'సర్కార్'కు ఎన్ని థియేటర్స్ కావాలో అన్ని థియేటర్స్‌లో వేసుకున్నారు. ఇప్పుడు దొరకడం లేదంటే? తెలుగు సినిమాలను తగ్గించుకుని రిలీజ్ చేయలేం కదా. ఈ సీజన్‌లో మన తెలుగు సినిమా కాకుండా వేరే భాష చిత్రాలకు థియేటర్స్ ఇచ్చే పరిస్థితి లేదు. 18న రిలీజ్ చేయొచ్చుగా? అలా చేస్తే రెండు రాష్ట్రాల్లో థియేటర్స్ దొరుకుతాయిగా. ఇలాంటివి ఆలోచించకుండా కాంట్రవర్సీ స్టేట్‌మెంట్స్ ఇచ్చి, నోరు జారారు. అలా మేమూ మాట్లాడగలం. కానీ ఇక్కడ మనం చేస్తున్నది వ్యాపారం. డబ్బు సంపాదించడానికే. డిస్ట్రిబ్యూషన్‌లో ఎన్నో డబ్బులు పోయాయి. అయినా సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో సినిమాలు చేస్తున్నాం. ఎవరి మీదా స్టేట్‌మెంట్లు ఇవ్వాలన్నది నా ఉద్దేశం కాదు. 6 నెలల క్రితం అనౌన్స్ అయిన సినిమాలకు థియేటర్స్ ఉండాలా వద్దా? మూడూ క్రేజీ సినిమాలకు థియేటర్స్ అడ్జస్ట్ చేసుకుంటున్నాం. అది తెలియకుండా స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు'' అన్నారు.

''ఈ మధ్యలో 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్' స్టైల్‌లో ఫుల్ కామెడీ సినిమా చేయలేదు. అనిల్ కథ చెప్పిన విధానం నాకు బాగా నచ్చింది. మల్టీస్టారర్ అయితే ఇంకా ఫన్ ఉంటుందనుకుని చేశాం. వరుణ్‌తో పని చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్. ఎంటర్‌టైన్ చేసిన ప్రతిసారీ నన్ను ఆదరించారు. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనుకుంటున్నాను'' అన్నారు వెంకటేశ్. ''నా కెరీర్‌లో చేయాల్సిన కామెడీ అంతా ఈ సినిమాలో చేయించాడు అనిల్. ఇలాంటి టీమ్‌తో పని చేయడం హ్యాపీగా ఉంది. వెంకీ గారితో పని చేయాలంటే టెన్షన్ పడ్డా. ఫ్రేమ్‌లో ఆయనతో పోటీపడటం పెద్ద చాలెంజ్. ఆయన ఇచ్చిన కంఫర్ట్ వల్లే బాగా చేయగలిగాను. సీట్లో కూర్చోకుండా సినిమాను ఎంజాయ్ చేస్తారు'' అన్నారు వరుణ్ తేజ్. ''ఈ బ్యానర్‌లో ఇది నాకు మూడో సినిమా. నిర్మాతలు ఫ్యామిలీలా మారిపోయారు. వాళ్లతో ఓ ఎమోషనల్ బాండింగ్ ఏర్పడింది. మా కాంబినేషన్ మంచి సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను. రెండు నిమిషాల ట్రైలర్‌లో కొన్ని నవ్వులే. రెండు గంటల ఇరవై నిమిషాల సినిమాలో చాలా నవ్వులుంటాయి. వెంకటేశ్, వరుణ్, తమన్నా మెహరీన్‌లు ఈ సినిమాకు 4 పిల్లర్స్'' అన్నారు అనిల్ రావిపూడి. ''కెరీర్ స్టార్టింగ్‌లో రాజుగారు నాదో సినిమా చూసి డిస్ట్రిబ్యూట్ చేశారు. ఆ రోజు నుంచి నా లైఫ్‌లో 'హ్యాపీడేస్' వచ్చేశాయి. అప్పటి నుంచి ఆయనతో ఎప్పుడు సినిమా చేస్తానా అనుకున్నాను. ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. అనిల్‌గారు ఓన్లీ ఫన్ నో ఫ్రస్టేషన్. వెంకీ సార్ ఎన్ని పాత్రలు చేసినా అంత ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనిపిస్తారో అర్థం కాదు. వరుణ్ చేస్తున్న సినిమాలు నాకు ఇష్టం. మెహరీన్ నా హనీ'' అన్నారు తమన్నా. ''200 శాతం ఈ సినిమాకు ఇచ్చాను. వెంకటేశ్ సార్, వరుణ్, తమన్నాలతో కలసి పని చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్. ఫస్ట్ టైమ్ డబ్బింగ్ చెప్పుకున్నాను'' అన్నారు మెహరీన్.

గుర్తుపట్టారా?



ఈ ఫొటోలో ఉన్న అమ్మాయిని గుర్తుపట్టారా? పట్టకపోయినా నో ప్రాబ్లమ్. చెప్పడానికి మేం ఉన్నాం కదా. చిన్న క్లూ. తను లేడీ సూపర్ స్టార్. సూపర్ స్టార్ సినిమాతోనే ఈ తారకి కథానాయికగా సూపర్ స్థాయి వచ్చింది. ఆ తార నయనతార. రజనీకాంత్ సరసన 'చంద్రముఖి'లో నటించాక నయన కెరీర్ వేగం పుంజుకుంది. ఆ సినిమాలో బొద్దుగా కనిపించి, ఆ తర్వాత ఎవరూ ఊహించనంత సన్నబడిపోయారామె. క్రేజీ హీరోయిన్‌గా ముందుకు దూసుకెళ్తున్నారు.

క్యారెక్టర్ డిమాండ్ చేస్తే చాలు.. కొత్త లుక్‌లోకి మారిపోవడానికి రెడీ అయిపోతారు. ఇప్పుడు 'ఐరా' సినిమా కోసం అలానే మారారు. ఇందులో రెండు పాత్రల్లో కనిపిస్తారు నయనతార. ఒక పాత్రలో నల్ల పిల్లలా కనిపించనున్నారు. ఇక్కడున్న ఫొటో ఈ పాత్రకు సంబంధించినదే. నల్ల మేకప్‌తో గుర్తుపట్టలేనంతగా మారిపోయారు కదూ. 'ఐరా'

ఆరోసారి.. ఒకటోసారి!



● మణిశర్మ

అదేంటి.. ఎవరైనా ఒకటోసారి.. రెండోసారి.. ఇలా మొదలు పెడతారు. కానీ ఆరోసారి.. ఒకటోసారి అంటున్నారేంటి? అనేగా మీ సందేహం. మరి ఆ డౌట్ తీరాలంటే మ్యాటర్‌లోకి వెళ్లాల్సిందే. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇస్మార్ట్ శంకర్' అనే సినిమా రూపొందనుంది. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ బ్యానర్స్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల చివర్లో మొదలు కానుంది. ఈ సినిమాకి మణిశర్మ సంగీతం అందించనున్నారు. గతంలో పూరి జగన్నాథ్, మణిశర్మ కలిసి చేసిన ఐదు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. వీరి కాంబినేషన్‌లో చివరగా 'టెంపర్' సినిమా వచ్చింది. ఆ చిత్రానికి నేపథ్య సంగీతం అందించారు మణిశర్మ. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్'తో ఆరోసారి వీళ్లిద్దరూ కలిసి పని చేయనున్నారు. కాగా రామ్, మణిశర్మ కాంబినేషన్లో వస్తున్న తొలి సినిమా ఇదే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ: లావణ్య.



● అశ్రిత

విజయమ్మలా...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితం ఆధారంగా 'యాత్ర' సినిమా రూపొందిన సంగతి తెలిసిందే. మహి వి.రాఘవ్ దర్శకత్వంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 8న విడుదలవుతోంది. ఈ చిత్రంలో వైఎస్ పాత్రలో మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి నటించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూస్తే వైఎస్ పాత్రలో మమ్ముట్టి చక్కగా ఒదిగిపోయారంటున్నారు సినీ అభిమానులు. ఇందులో వైఎస్ తండ్రి రాజారెడ్డి పాత్రలో జగపతిబాబు నటించారు. మరి వైఎస్ సతీమణి విజయమ్మ పాత్రను ఎవరు చేశారు? అనే ఆసక్తి అటు సినీ వర్గాలతో పాటు ఇటు వైఎస్ అభిమానులు, ప్రేక్షకుల్లో నెలకొంది. తాజాగా 'యాత్ర' బృందం వైఎస్ విజయమ్మ పాత్రధారి అశ్రిత వేముగంటి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ చూసినవాళ్లు అచ్చం విజయమ్మలాగే అశ్రిత ఉందంటున్నారు. 'బాహుబలి 2'లో అనుష్క వదిన పాత్రలో నటించారు అశ్రిత.



● కల్యాణ్ దేవ్

హీరోయిన్ దొరికింది

మొదటి చిత్రం ఫలితంతో సంబంధం లేకుండా రెండో సినిమా పనుల స్పీడ్ పెంచారు చిరంజీవి చిన్నల్లుడు కల్యాణ్ దేవ్. పులి వాసు దర్శకత్వంలో ఆయనో సినిమాలో హీరోగా చేస్తున్న సంగతి తెలిసిందే. రిజ్వాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా పలు పేర్లు వినిపించినప్పటికీ బాలీవుడ్ భామ రియా చక్రవర్తిని హీరోయిన్‌గా ఫైనలైజ్ చేశారని ఫిల్మ్‌నగర్ సమాచారం. లేటెస్ట్ బాలీవుడ్ చిత్రం 'జలేబి'లో తన పర్ఫార్మెన్స్‌కు మంచి మార్కులు సంపాదించారు రియా. ఆ సినిమానే ఈ చాన్స్‌కు కారణం అని టాక్. గతంలో 'తూనీగ తూనీగ' సినిమా ద్వారా తెలుగు ఇండస్ట్రీకు పరిచయం అయ్యారు రియా. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది.



● 'బన్నీ' వాసు

సహనం కోల్పోనివ్వకండి

'థియేటర్స్ దొరకనివ్వకుండా ఓ మాఫియా జరుగుతోంది. సినిమాను సాఫీగా రిలీజ్ చేసుకోలేకపోతున్నాం. థియేటర్స్ అన్నీ నలుగురైదుగురు చేతుల్లోనే ఉండిపోయాయి' అంటూ 'పేటా' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నిర్మాత ప్రసన్నకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి సమాధానంగా నిర్మాత 'బన్నీ' వాసు, తన సోషల్ మీడియాలో ''ప్రసన్నగారు, తమరు తెలిసీ తెలియని మిడి మిడి జ్ఞానంతో మాటలు జారుతున్నారు. మేము సహనం కోల్పోయే పరిస్థితికి తీసుకొస్తున్నారు. తిట్టాలి అనుకుంటే మేము సంస్కారం హద్దుని దాటడం మాత్రమే మిగిలింది'' అని రాసుకొచ్చారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ మంగళవారం ॥ 8-1-2019

నిండా ముంచారు



రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల సంఖ్య	9,37,683
డ్వాక్రా సంఘాల్లోని మహిళలు	93,74,350
సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉన్న అప్పు కోట్లలో	21,479.40

- బాబును నమ్మి మోసపోయామని డ్వాక్రా సంఘాల మహిళలు కన్నీటిపర్యంతం
- డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో వారిని అప్పులపాలు చేసిన చంద్రబాబు
- ఆయన మాటలు నమ్మి అప్పులు కట్టకపోవడంతో వడ్డీలు పెరిగిపోయిన వైనం
- ఆ అప్పు చెల్లించేందుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి రుణాలు
- కూలినాలి చేసి సంపాదించిన సొమ్మంతా వడ్డీలకే సరిపోతోందని ఆవేదన
- గుదిబండగా మారిన అప్పుల మొత్తాన్ని 4 దఫాలుగా నేరుగా వారి చేతికే ఇచ్చేస్తానని వైఎస్ జగన్ భరోసా
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మళ్లీ తమ బతుకుల్లో వెలుగు వస్తుందని డ్వాక్రా సంఘాల ఆశాభావం
- కూలినాలి చేసి సంపాదించిన సొమ్మంతా వడ్డీలకే సరిపోతోందని ఆవేదన
- గుదిబండగా మారిన అప్పుల మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా వారి చేతికే ఇచ్చేస్తానని వైఎస్ జగన్ భరోసా
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మళ్లీ తమ బతుకుల్లో వెలుగు వస్తుందని డ్వాక్రా సంఘాల ఆశాభావం

చంద్రబాబు వైఖరి చూస్తుంటే 'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్నట్లుందంటున్నారు డ్వాక్రా మహిళలు. 'డ్వాక్రా మహిళలందరికీ చెబుతున్నా.. మీ అప్పులన్నీ నేను మాఫీ చేస్తాను.. బ్యాంకులకు వాయిదాలు కట్టొద్దు. మీరిక నిశ్చింతగా ఉండొచ్చు' అని 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఊరూరా నమ్మకంగా చెప్పడంతో లక్షలాది మంది మహిళలు ఆయన మాటలు నమ్మారు. తీరా అధికారంలోకి రాగానే ఆ ఊసే ఎత్తలేదు. వడ్డీతో సహా కట్టాల్సిందేనని బ్యాంకర్లు నోటీసుల మీద నోటీసులు ఇవ్వడంతో పాటు అవమానాలకు గురి చేస్తోండటంతో అధిక వడ్డీకి బయట అప్పులు తెచ్చి కడుతున్నారు. బాబు మోసంతో నిండా మునిగాం.. కాపాడండంటూ కన్నీటిపర్యంతమవుతున్నారు.

– సాక్షి, అమరావతి /సాక్షి నెట్‌వర్క్

బాబు దెబ్బకు డ్వాక్రా సంఘాలు కుదేలు

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి ఇప్పుడు 9.37 లక్షల డ్వాక్రా పొదుపు సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు బ్యాంకులు 9.02 లక్షల లోను ఖాతాల ద్వారా రూ.21,479 కోట్లు అప్పుగా ఇచ్చాయి. చంద్రబాబు ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలన్నింటినీ బేషరతుగా మాఫీ చేస్తానని చెప్పారు. దీంతో అప్పట్లో చాలా సంఘాలు అప్పులు చెల్లించడం ఆపేశాయి. దీనికితోడు మహిళలు డ్వాక్రా వ్యవహారాలకు దూరంగా జరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నెలా రూ.21 కోట్ల మేర సంఘాల పేరిట జరగాల్సిన పొదుపు రూ.7 లక్షలకు పడిపోయింది. సంఘాల్లో మహిళలు పొదుపు చేసుకుంటున్న తీరు, ప్రతి నెలా సమావేశాల ఏర్పాటు, బ్యాంకు లోను తిరిగి చెల్లింపుల ఆధారంగా సంఘాలకు గ్రేడింగ్‌లు ఇస్తే.. 2015, 2016 సంవత్సరాల్లో దాదాపు 90 శాతం సంఘాలు సీ, డీ గ్రేడ్‌లకే పరిమితమయ్యాయి. మరోవైపు కొత్తగా పొదుపు సంఘాలలో చేరే మహిళల సంఖ్య క్రమంగా సన్నగిల్లింది. రాష్ట్రంలో 18 ఏళ్లకు పైబడిన మహిళలు దాదాపు రెండు కోట్ల మంది ఉంటారని అంచనా ఉండగా, పొదుపు సంఘాల్లో కేవలం 93.74 లక్షల మందే సభ్యులుగా ఉన్నారు. గత నాలుగున్నరేళ్లలో కొత్త సంఘాల్లో చేరిన సభ్యుల సంఖ్య కేవలం ఐదు లక్షలు కూడా లేకపోవడం గమనార్హం.

జగన్ హామీతో మహిళలకు భరోసా

'వైఎస్సార్ ఆసరా' పథకం కింద డ్వాక్రా మహిళల అప్పుల మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా వారి చేతికే ఇస్తామన్న జగన్ హామీపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు పది మంది సభ్యులున్న వెంకటేశ్వర పొదుపు సంఘం పేరిట ఎన్నికల నాటికి రూ.5 లక్షలు అప్పు ఉందనుకుంటే, ఒక్కొక్కరికి రూ.50 వేల మొత్తాన్ని 4 దఫాలుగా చెల్లిస్తారు. సున్నా వడ్డీ రుణాలు కూడా ఇప్పిస్తామని చెప్పడం మరింత ఊరట కలిగిస్తోంది. ఉదాహరణకు ఓ డ్వాక్రా సంఘం రూ.5 లక్షలు అప్పు తీసుకుంటే దానికి నెల నెలా దాదాపు రూ.4 వేలు వడ్డీ అవుతుందనుకుంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ఇలా బ్యాంకులకు వడ్డీ డబ్బులు చెల్లించక పోవడంతో డ్వాక్రా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందడం లేదు. వైఎస్సార్ పథకం వల్ల రాష్ట్రంలో దాదాపు 90 లక్షల మంది డ్వాక్రా మహిళల కుటుంబాలకు దాదాపు రూ.30 వేల కోట్లకు పైగా ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఎన్నికల నాటికి సంఘాల పేరిట ఉండే దాదాపు రూ.22 వేల కోట్ల అప్పు డబ్బులను మహిళలకు నేరుగా అందజేసే అవకాశం ఉండగా.. జీరో వడ్డీ రూపేణా ఏటా రూ.1,200 నుంచి రూ.1,500 కోట్ల చొప్పున ఆరేడు వేల కోట్ల రూపాయల మేర మహిళలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుందని అంచనా.

- డబ్బు నేరుగా మహిళల చేతికే అందడంతో ఆ డబ్బుతో కొత్త వ్యాపారమో, పాడి గేదెలు, ఆవుల కొనుగోలు, లేదా స్వయం ఉపాధి కార్యక్రమంపై పెట్టుబడి పెట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. బ్యాంకులో ఉన్న అప్పును దీనిపై వచ్చే ఆదాయంతో చెల్లించవచ్చు.
- వ్యాపారం, స్వయం ఉపాధి ద్వారా వచ్చే ఆదాయంలో కొంత నెలవారీ కిస్తీల చెల్లింపునకు పోను మిగిలేది కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోవడం ద్వారా కొత్తగా బయట అప్పులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు.
- ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్న లక్ష్యంతో 2005 – 07 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పావలా వడ్డీ పథకానికి రూపకల్పన చేశారు. అప్పట్లో అది పెద్ద సంచలనమై మహిళలు పెద్ద సంఖ్యలో పొదుపు సంఘాల్లో చేరారు. రేపు వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసరా, చేయూత పథకం అమలవ్వడం ద్వారా ఇప్పుడు స్తబ్ధుగా ఉన్న డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు మళ్లీ ఊపందుకోవడంతో పాటు, కొత్తగా పెద్ద సంఖ్యలో మహిళలు సంఘాల్లో చేరే అవకాశం ఉంటుంది.

కోర్టు చుట్టూ తిప్పుతున్నారు..

విశాఖపట్నం జిల్లా ఎస్.రాయవరం మండలం వెంకటాపురం ఎస్సీ కాలనీలో 40 కుటుంబాలున్నాయి. 250 మందికి పైగా జనాభా ఉన్నారు. ఇక్కడ నివసిస్తున్న వారంతా నిరుపేదలే. కూలీ పనులు చేసుకునే వారే. ఇక్కడ శ్రీచైతన్య, శ్రీదుర్గ, వెంకటేశ్వర –1, వెంకటేశ్వర – 2 పేరిట నాలుగు డ్వాక్రా సంఘాలున్నాయి. దాదాపు 80 శాతం కుటుంబాల్లోని ఒకరిద్దరు ఈ సంఘాల్లో సభ్యులే. 2014 వరకు ఈ సంఘాలు చక్కగా పని చేశాయి. తొలుత రూ.50 వేల చొప్పున రుణాలు పొందాయి. క్రమం తప్పకుండా బకాయిలు చెల్లించేవారు. 2010 నాటికే ఒక్కో సంఘం రూ.4.50 లక్షల వరకు రుణ పరపతిని పొందే స్థాయికి ఎదిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ అయిపోతాయని చంద్రబాబు నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రా రుణ మాఫీని అటకెక్కించారు. దీంతో వడ్డీతో సహా పేరుకుపోయిన రుణ బకాయిలు తలకు మించిన భారం కావడంతో వారు చెల్లించలేకపోయారు. మూడుసార్లు నోటీసులు ఇచ్చిన



కోర్టు నోటీసులందుకున్న డ్వాక్రా సంఘాల సభ్యులు

ఎస్.రాయవరం స్టేట్ బ్యాంక్ చివరకు కోర్టు నుంచి నోటీసులు జారీ చేయించింది. రూ.4.50 లక్షల రుణం తీసుకున్న శ్రీచైతన్య సంఘానికి రూ.9,42,098, రూ.3.60 లక్షల రుణం తీసుకున్న శ్రీ దుర్గ సంఘానికి రూ.7,36, 280, రూ.4 లక్షల రుణం తీసుకున్న వెంకటేశ్వర –1 సంఘానికి రూ.7.5 లక్షలు, రూ.4 లక్షల రుణం తీసుకున్న వెంకటేశ్వర –2 సంఘానికి రూ.7,60,645 బకాయిలున్నాయని నోటీసులు అందాయి. వెంటనే చెల్లించకపోతే జప్తు నోటీసులు ఇవ్వాల్సి వస్తుందని అందులో హెచ్చరించాయి. ఇప్పుడు వారంతా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

చచ్చిపోయినా వదలట్లేదు



మా డ్వాక్రా సంఘానికి 2010 పాడేరు యూనియన్ బ్యాంకు పావలా వడ్డీపై రూ.3 లక్షలు రుణం మంజూరు చేసింది. 2014 ఎన్నికలకు ఏడాది ముందు నుంచి తాము అధికారంలోకి రాగానే డ్వాక్రా రుణాలను వడ్డీతో సహా మాఫీ చేస్తామని చంద్రబాబు ప్రకటించడంతో ఆనందపడ్డాం. అసలు, వడ్డీ చెల్లించలేదు. 2014లో ఆయనకే ఓట్లు వేసాం. చంద్ర బాబు సీఎం అయ్యాడు. ఆరు నెలల్లోనే రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు ఆ తర్వాత మాట మార్చాడు. రుణ మాఫీ చేయలేదు. దీంతో వడ్డీకి చక్రవడ్డీ కలిపి తడిసి మోపెడైంది. మేము చెల్లించాల్సిన అప్పు వడ్డీతో సహా కొండలా పేరుకుపోయింది. ప్రస్తుతం అసలు, వడ్డీ కలిపి రూ.9 లక్షల 67 వేలు చెల్లించాలని యూనియన్ బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నోటీసులు ఇచ్చారు. చివరకు మా వ్యక్తిగత ఖాతాలో ఉన్న పొదుపు సొమ్ము రూ.19 వేలు కూడా జమ చేసుకున్నారు. మా గ్రూప్‌లో అప్పు తీసుకున్న ఓ సభ్యురాలు లలితాకుమారి చనిపోయింది. ఆమె అప్పు కూడా మిగతా సభ్యులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. మమ్మల్ని నమ్మించి చంద్రబాబు చివరకు ఇలా తీవ్ర అన్యాయం చేశారు.

– జంపరంగి వనజ, అధ్యక్షురాలు, ఉమా నీలకంఠేశ్వర డ్వాక్రా సంఘం, అడ్డుమండ, హుకుంపేట మండలం, విశాఖపట్నం జిల్లా.

ఇంతగా మోసం చేస్తారనుకోలేదు..

ఆంజనేయస్వామి మహిళా సంఘంలో 12 మంది సభ్యులమున్నాం. ఎన్నికల ముందు చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతో మేము చాలా సంతోషించాం. ఇక మా కష్టాలన్నీ తీరినట్లేనని సంబరపడ్డాం. మా సంఘానికి బ్యాంకులో రూ.3.60 లక్షలు అప్పు ఉండేది. రుణమాఫీ అవుతుందని సంఘ సభ్యులందరం ఆశతో అప్పు చెల్లించలేదు. మాతో ఓట్లు వేయించుకుని చంద్రబాబు అధికారంలోకి అయితే వచ్చారు కానీ మాకు ఇచ్చిన హామీ నిలుపుకోలేదు. డ్వాక్రా రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకులో మాత్రం అసలు, వడ్డీ కలిపి రూ.4.44 లక్షలు అయ్యింది. అంతా చెల్లించాల్సిందేనని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేశారు. గత్యంతరం లేక సభ్యులందరం బయట అప్పు తెచ్చి బ్యాంకులో కట్టాం. ప్రతి రోజు కూలి పని చేసుకొని కష్టపడి సంపాదించిన సొమ్మంతా వడ్డీకే సరిపోతోంది. బయట తెచ్చిన అప్పులకు వడ్డీ కడుతూనే ఉన్నాం. అసలు ఎప్పుడు చెల్లిస్తామో తెలీదు. బతకడం కష్టమైంది.



– ఆంజనేయస్వామి మహిళా సంఘం సభ్యులు, యర్రగుంట్ల, గార్లదిన్నె మండలం, అనంతపురం జిల్లా.

అప్పు కడితేకాని పుస్తెలతాడు ఇవ్వమంటున్నారు



మా ఆయన నా పుస్తెల తాడు తాకట్టు పెట్టి రూ.10 వేలు తెచ్చాడు. ఆ డబ్బులతో గేదె కొన్నాం. ఆ తర్వాత వడ్డీ రూ.2 వేలతో సహా అప్పు మొత్తం తీర్చేశాం. ఈలోగా మా ఆయన కూడా కాలం చేశాడు. మా ఆయన పెట్టిన నా పుస్తెల తాడు ఇమ్మని బ్యాంకోళ్ల దగ్గరకు పోతే.. ముందు నీ డ్వాక్రా అప్పు కట్టు.. ఆ తర్వాత నీ పుస్తెలతాడు ఇస్తామంటున్నారు. మూడేళ్లుగా తిప్పించుకుంటున్నారు. బ్యాంకోళ్లు నరకం చూపిస్తున్నారు. లక్షల్లో ఉన్న అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. *– గారా రమణమ్మ, శ్రీ చైతన్య డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, వెంకటాపురం. విశాఖపట్నం జిల్లా.*

జగన్ వస్తే అభాగ్యులకు చేయూత



మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారిని చదివించలేక చదువు మాన్పించి పెద్దమ్మాయికి పెళ్లి చేసి పంపాం. ప్రస్తుతం పూట గడవని పరిస్థితితో అల్లాడిపోతున్నాం. ఇప్పుడు 65 ఏళ్లు దాటితేనే పింఛను వస్తుంది. జగనన్న వస్తే వైఎస్సార్ చేయూత పేరుతో 45 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలందరికీ నాలుగేళ్లలో రూ.75 వేలు ఉచితంగా ఇస్తానని చెప్పడం సంతోషం. ఆ రోజులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. మాలాంటి నిరుపేద మహిళలకు దీని ద్వారా చేయూత దొరుకుతుంది.

– మీసాల ఏసమ్మ, కేశానుపల్లి, దాచేపల్లి మండలం, గుంటూరు జిల్లా

బడుగు వర్గాలకు ఎంతో మేలు



వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం బడుగు, బలహీన వర్గాల వారికి ఎంతో మేలు చేస్తుంది. ఇప్పుడున్న కార్పొరేషన్ల ద్వారా ఎలాంటి ఉపయోగం లేదు. పలుకుబడి ఉన్నోళ్లకు మాత్రమే పనులు జరుగుతున్నాయి. జగన్ రాగానే కార్పొరేషన్లను ప్రక్షాళన చేసి పారదర్శక ప్రమాణాలు తీసుకు వస్తారని నమ్ముతున్నాం. 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలందరికీ వైఎస్సార్ చేయూత పథకం కింద ఎంతో మేలు జరుగుతుంది. డ్వాక్రా సంఘాల వాళ్లకు సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని చెప్పడం ఎంతో మంచిది.

– జి.విజయసుందరి, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా

అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటా

- 2019లో అసెంబ్లీ ఎన్నికల నాటికి డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఉన్న పొదుపు సంఘాల రుణాల మొత్తం సొమ్మును 4 దఫాలుగా నేరుగా వారి చేతికే ఇస్తాం.
- మళ్లీ సున్నా వడ్డీకే రుణాల విప్లవం తెస్తాం. ఆ వడ్డీ డబ్బును అక్కచెల్లెమ్మల తరఫున మేమే బ్యాంకులకు కడతాం. 'వైఎస్సార్ ఆసరా' పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తాం.

రూ. 50,000 లబ్ధి

- *45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు పెన్షన్ ఇస్తామంటే కొందరు వెటకారం చేశారు. అందులో ఉన్న స్ఫూర్తిని అర్థం చేసుకోలేకపోయారు. అయినా వారి సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని తీసుకొస్తున్నాం.*
- *వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని అక్కలందరికీ తోడుగా ఉంటాం.*
- *ప్రస్తుత కార్పొరేషన్ల వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ అందరికీ మేలు జరిగేలా, ఏ కొందరికో అరకొరగా ఇస్తూ.. అది కూడా లంచం లేనిదే ఇవ్వని పరిస్థితులను మారుస్తూ పారదర్శక ప్రమాణాలను తీసుకొస్తాం.*
- *45 ఏళ్లు నిండిన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కలకు ఈ పథకం ద్వారా రూ.75,000 ఉచితంగా ఇస్తాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన రెండవ ఏడాది నుంచి వరుసగా నాలుగేళ్లలో నాలుగు విడతలుగా ఈ మొత్తాన్ని ఆయా కార్పొరేషన్ల ద్వారా ఉచితంగా అందజేస్తాం. – వైఎస్ జగన్*

రూ. 75,000 లబ్ధి



సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
8-1-2019

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI ACADEMY
Biology

గ్రూప్స్ స్పెషల్

- కొత్తగా ఉద్యోగ నోటిఫికేషన్లపై జరుగుతున్న చర్చ.
- ఒకే ప్రిపరేషన్‌తో పలు పోటీ పరీక్షలు రాసే అవకాశం
- పరీక్ష ఏదైనా సిలబస్‌లో 60 శాతం ఉమ్మడి అంశాలే
- ప్రణాళికతో చదివితే.. విజేత కావచ్చంటున్న నిపుణులు

విజేతగా మారాలంటే..!



తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా నోటిఫికేషన్లు, కొలువుల భర్తీపై మళ్లీ చర్చమొదలైంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-3 నోటిఫికేషన్ల విడుదల దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవచ్చన్నది తాజా సమాచారం. ఏపీపీఎస్సీ అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. దాంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్ర పోటీ నెలకొంది. అలానే పోలీసు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కొలువులు, రైల్వే ఉద్యోగాలు, బ్యాంకు జాబ్స్, టీచర్ పోస్టులు, గ్రూప్స్.. మొదలైన ఉద్యోగ పోటీ పరీక్షల నోటిఫికేషన్లు 2019లో స్వాగతం పలికే అవకాశముంది. వీటికి తోడు ఇరు రాష్ట్రాల విద్యార్థులు ఇప్పటికే గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాల ప్రిపరేషన్‌లో నిమగ్నమయ్యారు. సరైన ప్రణాళిక, పుస్తకాల ఎంపికలో జాగ్రత్త, కష్టపడేతత్వంతో పోటీ పరీక్షల్లో విజయాన్ని సొంతం చేసుకోవచ్చు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులు.. ప్రణాళికతో చదవడం ద్వారా పోటీలో విజేతలుగా నిలవొచ్చు.

సహనానికి పరీక్ష!

పోటీ పరీక్షలు.. గెలిస్తే విజేత. ఓడితే పాఠం. గెలిచి నిలిస్తే ఉద్యోగం, పోరాడి ఓడితే మరోసారి రాసేందుకు అనుభవం. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే.. తెలివి తేటలు, ప్రణాళిక, కష్టపడే తత్వం, కొంతమేర అదృష్టం ఉండాలి. వీటితోపాటు విజయతీరానికి చేరుకోలేకపోతే కెరీర్‌లో ప్రత్యామ్నాయ మార్గాలు ఏంటో చూసుకొని పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపాలి. గ్రూప్స్, ఎస్ఎస్‌సీ పరీక్షలు, పోలీసు నోటిఫికేషన్లలో సక్సెస్ పొందాలంటే.. కనీసం ఏడాది పాటు చదవాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో నియామక ప్రక్రియలో జాప్యం జరగొచ్చు. గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కుటుంబం, సమాజం, సహచరుల నుంచి రకరకాల ఒత్తిళ్లు ఎదురవుతుంటాయి. వీటన్నింటితోపాటు ఆర్థిక సమస్యలు ఉండనే ఉంటాయి. కాబట్టి అన్నింటిని తట్టుకునే సహనం, మానసిక సంసిద్ధతతోపాటు అవసరమైన ఆర్థిక వనరులు ముందే ఏర్పాటు చేసుకోవాలి. ముఖ్యంగా సానుకూల ఆలోచనలతో ముందడుగు వేయాలి. ఒకరకంగా చెప్పాలంటే.. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడం అనేది అభ్యర్థిలోని సహనానికి పరీక్ష!

ప్రత్యేక వ్యూహం

ఆయా పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ విషయంలోనూ ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించాలి. ఏ పరీక్షలకు సన్నద్ధమవ్వాలి.. అందుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన.. సదరు పరీక్ష సిలబస్.. గత విజేతల ప్రిపరేషన్ తీరు వంటి వాటిని ముందుగా అధ్యయనం చేయడం లాభిస్తుంది. ఇటీవల గ్రూప్స్, సివిల్స్ పరీక్షలకు ఇంజనీరింగ్ పట్టభద్రులు, ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సన్నద్ధమవ్వడం ఎక్కువగా కనిపిస్తోంది. ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు జనరల్ స్టడీస్‌పై పట్టును ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాలి. ప్రిపరేషన్ కోసం ప్రత్యేక వ్యూహాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

పరీక్షలెన్నో.. సిలబస్ ఒకటే!

ఐబీపీఎస్, స్టేట్ బ్యాంకు నుంచి పీవో, క్లర్క్ నోటిఫికేషన్స్.. జాతీయ బ్యాంకుల సొంత ఉద్యోగ ప్రకటనలు.. రైల్వే నియామక బోర్డు నుంచి గ్రూప్-డి, లోకో పైలట్, టెక్నీషియన్ పోస్టులు.. రైల్వే రక్షణ దళంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలు.. వీఆర్వో, గ్రూప్ 4, బిల్ కలెక్టర్, పంచాయతీ సెక్రటరీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎస్ఐ, కానిస్టేబుల్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నుంచి వచ్చే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్) ఎగ్జామినేషన్, కానిస్టేబుల్ (జీడీ)... మొదలైన ఉద్యోగ పరీక్షలకు అభ్యర్థులు ఏకకాలంలో సన్నద్ధమయ్యే అవకాశముంది. కారణం.. ఈ పరీక్షల్లో పాఠ్యాంశాలు కామన్‌గా ఉండటమే! సుమారు 60-70 శాతం వరకు సిలబస్ ఉమ్మడిగా ఉన్నందున్న సరైన ప్రణాళికతో ప్రిపేరైతే అభ్యర్థులు.. ఏకకాలంలో అనేక రకాల పోటీ పరీక్షలు రాయొచ్చు. ఆయా పరీక్షల సిలబస్‌లో సాధారణంగా కనిపించే అంశాలు.. జనరల్ స్టడీస్, అర్థమెటిక్ (క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్), మెంటల్ ఎబిలిటీ(రీజనింగ్), ఇంగ్లిష్. వీటిపై పట్టు సాధిస్తే.. ఏ పరీక్షలో అయినా విజయం సొంతం చేసుకోవచ్చు.

జనరల్ స్టడీస్.. చాలా విస్తృతం

చాలా విస్తృతమైన విభాగం.. జనరల్ స్టడీస్. ఇది వివిధ సబ్జెక్టుల సమ్మిళితంగా ఉంటుంది. రాష్ట్రస్థాయి పరీక్షల్లో సింహభాగం జనరల్ స్టడీస్‌దే. కరెంట్ అఫైర్స్.. జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న సమకాలీన అంశాలు.. నిత్యజీవితంలో సైన్స్ ప్రాముఖ్యత.. పర్యావరణ శాస్త్రం, విపత్తు నిర్వహణ.. జాగ్రఫీ, ఎకానమీ.. భారత రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ.. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారతదేశ చరిత్ర.. తెలంగాణ/ఏపీ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, సాహిత్యం.. తెలంగాణలో ఉద్యమ చరిత్ర.. సంబంధిత రాష్ట్రం అవలంబిస్తున్న విధానాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు.. మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ మొదలైన ఎన్నో అంశాల్లో అభ్యర్థులకున్న పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

అర్థమెటిక్

సివిల్స్ సీ-శాట్ నుంచి వీఆర్వో పరీక్ష వరకు.. అన్నింటిలో అర్థమెటిక్ ఉంటుంది. కొన్ని పరీక్షల్లో సుమారు 40 శాతం వరకూ ప్రశ్నలు ఈ అంశం నుంచే వస్తుంటాయి. ఉద్యోగం సొంతమవ్వాలంటే.. ఈ విభాగంలో మంచి స్కోరు చేయడం తప్పనిసరి. ఇందులో పర్సంటేజ్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పెర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, పార్టనర్‌షిప్‌పై దృష్టిసారించాలి.

- భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మస్ రూల్స్‌కు సంబంధించి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి. వీటివల్ల సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్ ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించొచ్చు. సమయం ఆదా అవుతుంది. కొన్ని అంశాలను ప్రత్యేకంగా బ్యాంకింగ్ పరీక్షల్లోనే అడుగుతారు. అవి.. డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్.
- ఎస్ఎస్‌సీ, రైల్వే, పోలీస్ రిక్రూట్‌మెంట్ మొదలైన వాటిల్లో జామెట్రీ, ఆల్జీబ్రా, ట్రిగనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, మెన్సురేషన్ టాపిక్స్‌పై ఎక్కువగా ప్రశ్నలు ఉంటాయి.
- **డేటా ఇంటర్‌ప్రిటేషన్:** పట్టికలు, గ్రాఫ్‌ల ద్వారా సమాచారమిస్తూ ప్రశ్నలు అడిగే విభాగం.. డేటా ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో ప్రశ్నలకు వేగంగా సమాధానాలు గుర్తించేందుకు పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలపై అవగాహన వుండాలి. వివిధ రకాల గ్రాఫ్‌లను సాధన చేయాలి.

మెంటల్ ఎబిలిటీ/రీజనింగ్

- అభ్యర్థుల అనలిటికల్ సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం.. రీజనింగ్. దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ఉంటుంది. బ్యాంకింగ్ పరీక్షల్లో ఫలితాన్ని నిర్దేశించే విభాగమిది. ఇది వివిధ సందర్భాలలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సంక్లిష్ట పరిస్థితుల్లో సమస్యలను తెలివిగా పరిష్కరించే నేర్పును పరీక్షిస్తుంది.
- బ్యాంకింగ్ పరీక్షల్లో హై లెవల్ రీజనింగ్ మీద ప్రశ్నలు ఉంటాయి. అసంప్షన్స్, ఆర్గ్యుమెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, ప్రాబ్లమ్ సాల్వింగ్ టాపిక్స్ ముఖ్యమైనవి. ఈ విభాగానికి సంబంధించి వెర్బల్ రీజనింగ్‌పై దృష్టి పెట్టాలి. కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి.
- కోడింగ్-డీకోడింగ్ కోసం.. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి.
- రాష్ట్రస్థాయి పరీక్షలకు కోడింగ్-డీకోడింగ్, క్యాలెండర్స్, డైరెక్షన్స్, డైస్, నాన్ వెర్బల్(చిత్రంలో దాగి ఉన్న మొత్తం పటాల సంఖ్య), అనాలజీ మొదలైనవి ముఖ్యం. బ్యాంకింగ్‌లో మాత్రం హైలెవల్ ప్రశ్నలు అడుగుతారు. అనలిటికల్ రీజనింగ్, సిలాయిజమ్స్, ఇన్ ఈక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాల్లో నుంచే బ్యాంకింగ్ పరీక్షల్లో ఎక్కువగా ప్రశ్నలు ఉంటాయి. కాఠిన్యత స్థాయి ఎక్కువగా ఉంటుంది.


ఇంగ్లిష్

- ప్రతి పోటీ పరీక్షలోనూ కచ్చితంగా ఉండే సబ్జెక్ట్.. ఇంగ్లిష్. బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షల్లో దీనికి వెయిటేజీ ఎక్కువ. టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షలో ప్రాథమిక స్థాయి ప్రశ్నలు ఎదురవుతాయి.
- ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రెహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు వస్తుంటాయి. వీటితో పాటు స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, రీ అరేంజ్ ది సెంటెన్స్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్‌లో పట్టు కోసం మొదట బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి.

మెటీరియల్ సేకరణ... పెద్ద సవాలు

పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో మెటీరియల్ సేకరణ సవాలుగా మారింది. విద్యార్థులు మార్కెట్లో లభించే అకాడమీ పుస్తకాలు, ప్రముఖ టీచర్ల పుస్తకాలు చదవడం మేలు. పాలిటీ, ఎకానమీ, కరెంట్ అఫైర్స్ కోసం ప్రతి రోజు క్షుణ్నంగా ఏదైనా ప్రామాణిక దినపత్రిక చదివితే సరిపోతుంది.

- **కరెంట్ అఫైర్స్:** రోజూ పేపర్ చదువుతూ సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి. మార్కెట్‌లో దొరికే ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని చదివితే సరిపోతుంది. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మ్యాగజైన్లు, యోజన వంటివి ఉపయుక్తం.
- జనరల్ సైన్స్‌కు అకాడమీ పుస్తకాలు చదవడం మేలు. పర్యావరణం, విపత్తు నిర్వహణకు ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు దోహదం చేస్తాయి.
- **జాగ్రఫీ:** అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్; పాలిటీకి లక్ష్మీకాంత్ పుస్తకాలు అనుకూలంగా ఉంటాయి. పాలిటీకి సంబంధించి సమకాలీన రాజకీయ అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి రెగ్యులర్‌గా పేపర్ చదువుతూ.. సమకాలీన అంశాలకు సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకోవాలి.
- **భారతదేశ చరిత్ర:** చరిత్రకు సంబంధించి అకాడమీ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవొచ్చు. ఆధునిక భారతదేశ చరిత్రకు బిపిన్ చంద్ర, ప్రాచీన చరిత్రకు సతీష్ చంద్ర, మధ్యయుగ చరిత్రకు ఆర్ఎస్ శర్మ పుస్తకాలు మేలనేదని నిపుణుల అభిప్రాయం. ఆయా పుస్తకాల్లో సమగ్ర సమాచారం లభిస్తుంది. అలానే తెలుగు రాష్ట్రాల్లో పేరున్న గ్రూప్స్ ఫ్యాకల్టీ నోట్స్‌ను సేకరించుకొని చదివితే సరిపోతుంది. అభ్యర్థి రాస్తున్న పరీక్షని బట్టి పుస్తకాన్ని ఎంచుకోవాలి.
- తెలంగాణ ప్రాచీన చరిత్రకు తెలుగు అకాడమీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఉద్యమ చరితకు తెలుగు అకాడమీ పుస్తకాలు ఉపయోగపడుతున్నాయి. ఏపీ చరిత్రకు బీఎస్ హన్మంతరావు, రఘునాథరావు పుస్తకాలు ఉపయుక్తం.
- ఎకానమీకి సంబంధించి ప్రభుత్వాలు విడుదల చేసే ఆర్థిక సర్వేలు చాలా కీలకం. వీటి నుంచే ఎక్కువగా ప్రశ్నలు కనిపిస్తుంటాయి. దాంతోపాటు అకాడమీ బుక్స్ చదవొచ్చు.
- మెంటల్ ఎబిలిటీకి ఆర్.ఎస్.అగర్వాల్ పుస్తకం రిఫర్ చేయొచ్చు. వీటితో పాటు ఏదైనా ప్రామాణిక మెటీరియల్ సేకరించుకొని చదవాలి.
- ప్రభుత్వ పథకాల కోసం వెబ్‌సైట్లు చూస్తే సరిపోతుంది.
- జనరల్ ఇంగ్లిష్‌కు లెనిన్-మార్టిన్ పుస్తకం ఉపయోగపడుతుంది. తెలుగు మీడియం విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా జయాకర్‌రావు పుస్తకం ఉపయోగపడుతుంది.
- ఎథిక్స్‌కు తెలుగు అకాడమీ పుస్తకం, సోషియాలజీకి తెలుగు అకాడమీ పుస్తకాలు ఉపయుక్తం



ప్రశ్నల సరళి క్లిష్టం

పోటీ పరీక్షల్లో ప్రశ్నల సరళి కఠినంగా మారుతోంది. ముఖ్యంగా జనరల్ స్టడీస్‌లో ప్రశ్నలు క్లిష్టంగా ఉంటున్నాయి. ఇటీవల తెలంగాణ, ఏపీల్లో నిర్వహించిన వీఆర్వో, కానిస్టేబుల్, ఎస్ఐ, పంచాయతీ సెక్రటరీ పరీక్షల్లో ప్రశ్నలు కఠినంగా వచ్చాయి. అభ్యర్థులకు సబ్జెక్టుపై సమగ్ర పరిజ్ఞానం ఉంటేనే సమాధానాలు గుర్తించే పరిస్థితి ఉంది. గతంలో ఆబ్జెక్టివ్ ఓరియెంటేషన్‌లో బిట్లు ప్రాక్టీస్ చేసి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించే వీలుండేది, పోటీ విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా సబ్జెక్ట్‌ను లోతుగా పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతున్నారు. జనరల్ స్టడీస్‌కు సంబంధించి సమకాలీన అంశాలకు అధిక ప్రాధాన్యం ఉంటోంది.

ఉద్యోగ సమాచారం

బీఎస్ఎఫ్‌లో 63 ఖాళీలు

భారత హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటాలో 63 కానిస్టేబుల్ (జీడీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **క్రీడా విభాగాలు:** ఆర్చరీ, ఆక్వాటిక్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, తదితర క్రీడలు...
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి. ప్రకటనలో తెలిపిన క్రీడా ఈవెంట్లలో పాల్గొనడం తప్పనిసరి. పురుషులు మాత్రమే వీటికి అర్హులు. ✦ **వయసు:** 18-23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, సంబంధిత క్రీడల ట్రయల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా. ✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (2019, జనవరి 5 నుంచి 11)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://bsf.nic.in

నేవీలో 102 ఖాళీలు

ఇండియన్ నేవీ ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచీలో పర్మినెంట్ ప్రాతిపదికన 102 పోస్టుల భర్తీకి అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ- బ్రాంచీ/కేడర్ వారీ ఖాళీలు
   - నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ కేడర్: 12
   - జనరల్ సర్వీస్/హైడ్రోగ్రఫీ సర్వీస్ కేడర్: 30
2. టెక్నికల్ బ్రాంచీ: ✦ ఇంజనీరింగ్ బ్రాంచీ (జనరల్ సర్వీస్): 28
   - ఎలక్ట్రికల్ బ్రాంచీ (జనరల్ సర్వీస్): 32

- **అర్హత:** సంబంధిత బ్రాంచీల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలుండాలి. ఇంజనీరింగ్ డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జనవరి 2, 1995 నుంచి జులై 1, 2000 మధ్య జన్మించి ఉండాలి. ఈ రెండు తేదీలను పరిగణలోకి తీసుకుంటారు.
- **ఎంపిక:** ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ రెండు స్టేజ్‌లలో ఉంటుంది. స్టేజ్-1లో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్, స్టేజ్-2లో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తులు ప్రారంభం:** జనవరి 12, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 1, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in



- క్యాట్ రాత పరీక్ష ఫలితాలు వెల్లడి
- తుది దశ ప్రక్రియకు ఐఐఎంల కసరత్తు
- తుది దశలో జీడీ/పీఐ/రిటెన్ ఎబిలిటీ టెస్ట్
- దేశవ్యాప్తంగా 20 ఐఐఎంల్లో 4 వేలకుపైగా సీట్లు
- ఏటా 2 లక్షల మందికిపైగా పోటీపడుతున్న వైనం

ప్రతిష్టాత్మక బిస్కూల్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే క్యాట్.. 2018, నవంబర్ 25న జరిగింది. దాదాపు 2 లక్షల మందికిపైగా పరీక్షకు హాజరయ్యారు. తాజాగా కామన్ అడ్మిషన్ టెస్టు(క్యాట్) ఫలితాలు వెల్లడయ్యాయి. ప్రముఖ ఐఐఎంలు కటాఫ్ పర్సంటైల్స్‌తోపాటు తుది దశ ఎంపిక ప్రక్రియకు కసరత్తు ప్రారంభించాయి. విద్యార్థుల ముందున్న తక్షణ కర్తవ్యం క్యాట్ స్కోర్‌కు అనుగుణంగా ఆయా ఐఐఎంలకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు తుది దశలో సత్తా చాటడమే! ఈ నేపథ్యంలో ఐఐఎంల తుదిదశ ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఇందులో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఫోకస్..

- ప్రస్తుతం దేశంలో 20 ఐఐఎంలు 4000లకు పైగా పీజీపీ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఐఐఎంలు క్యాట్ స్కోరుతోపాటు గ్రూప్ డిస్కషన్(జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ), రిటెన్ ఎబిలిటీ టెస్ట్(ఆర్ఏటీ), పని అనుభవం, అకడెమిక్ ప్రతిభ వంటి భిన్న ప్రామాణికాల ఆధారంగా కోర్సుల్లో ప్రవేశాలను ఖరారు చేస్తున్నాయి. ఆయా ప్రామాణికాలకు ఒక్కో ఐఐఎం ఒక్కోరకమైన వెయిటేజీ ఇస్తున్నాయి.
- 2019-21 బ్యాచ్‌కు సంబంధించి ఐఐఎం అహ్మదాబాద్, కోల్‌కతా, లక్నోలు తుదిదశ ఎంపిక ప్రక్రియను ప్రకటించాయి. మిగిలిన ఐఐఎంలు సైతం త్వరలోనే ప్రకటించే అవకాశముంది. బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం పర్సంటైల్ ఉన్న అభ్యర్థులనే తుది దశ ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 45 శాతం ఉత్తీర్ణత ఉంటే సరిపోతుంది.

జీడీ/పీఐ

ఐఐఎంలు క్యాట్ స్కోరు ఆధారంగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తాయి. జాబితాలోని అభ్యర్థులకు రిటెన్ ఎబిలిటీ టెస్ట్(డబ్ల్యూఏటీ), పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. ఎక్కువ శాతం ఐఐఎంలు క్యాట్ స్కోరు, గ్రూప్ డిస్కషన్ (జీడీ), పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ)కు ఎక్కువ వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్ ఉత్తీర్ణులు జీడీ, పీఐలకు ప్రత్యేకంగా సన్నద్ధం కావాలి. మొత్తం వంద మార్కుల వెయిటేజీ ఫార్మాట్‌లో జీడీ, పీఐల వెయిటేజీ 35 నుంచి 50 శాతం మేర ఉంటుంది. ఈ రెండు దశల్లో ఎదురయ్యే ప్రశ్నలు/అంశాలు అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్, కాంటెంపరరీ అవేర్‌నెస్‌లను పరీక్షించేవిగా ఉంటున్నాయి. వీటితోపాటు చదువుల్లో అభ్యర్థి చూపిన ప్రతిభ, పని అనుభవం, జెండర్ డైవర్సిటీ తదితర ప్రామాణికాలను సైతం ఐఐఎంలు పరిగణనలోకి తీసుకునే అవకాశముంది.

సామాజికం-సమకాలీనంపై అవగాహన

మలిదశ ఎంపిక ప్రక్రియలో ఐఐఎంలు ముందుగా గ్రూప్ డిస్కషన్స్ నిర్వహిస్తాయి. ఇందులో భాగంగా అభ్యర్థులను బృందాలుగా విభజించి.. ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి చర్చించమంటారు. ఐఐఎంలు గ్రూప్ డిస్కషన్‌లో నిర్దేశిస్తున్న అంశాల్లో అధిక శాతం సామాజిక అంశాలు, సమకాలీన పరిణామాలకు సంబంధించినవి ఉంటున్నాయి. నిర్దిష్టంగా ఒక రంగానికే పరిమితం కాకుండా.. అన్ని రంగాలకు చెందిన అంశాలను గ్రూప్ డిస్కషన్‌లో పేర్కొంటున్నారు. వీటిలో బిజినెస్, మేనేజ్‌మెంట్‌తో ఏ మాత్రం సంబంధం లేని అంశాలు కూడా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు అన్ని రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఆయా అంశాలను అన్ని కోణాల్లో చర్చించేలా సిద్ధమవ్వాలి.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో ఒక నిర్దిష్ట అంశాన్ని పేర్కొని దానిపై అభ్యర్థి తన అభిప్రాయాలు వ్యక్తంచేసేలా ప్రశ్నలు అడుగుతారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాలతో అభ్యర్థులు సమాధానం రాయాల్సి ఉంటుంది. రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో పేర్కొనే అంశాలు సైతం సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

గుర్తించాల్సిన అంశాలు

- గ్రూప్ డిస్కషన్ సందర్భంగా ఒకే అంశంపై పది లేదా ఇరవై మంది బృందంలో చర్చించాల్సి ఉంటుంది. ఆ సమయంలో స్వీయ అభిప్రాయాలను అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో చెప్పగలగాలి. అభిప్రాయాలను వ్యక్తం చేసిన విధానానికి ఐఐఎంలు ప్రత్యేక మార్కులు ఇస్తున్నాయి.
- రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో అభ్యర్థి తన అభిప్రాయాలను రాతపూర్వకంగా వ్యక్తం చేయాల్సి ఉంటుంది. ఇందులో వాడిన పదాలు, పదజాలం, వాక్య నిర్మాణం, స్థూల వ్యక్తీకరణల ఆధారంగా మార్కులు లభిస్తాయి.

వ్యక్తిగత ఆసక్తులు

ఇటీవల కాలంలో ఐఐఎంల ఔత్సాహికుల్లో ఇంజనీరింగ్ నేపథ్యం కలిగిన విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఐఐఎంలు ఆయా అభ్యర్థులకు బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై ఉన్న ఆసక్తిని ఇంటర్వ్యూ ద్వారా లోతుగా తెలుసుకుంటున్నాయి. దీంతోపాటు పత్రికల్లో వచ్చే వార్తలు, ప్రభుత్వ పథకాలు, వాటి అమలు తీరుపై అభిప్రాయాలు అడుగుతున్నారు. కాబట్టి జీడీ/పీఐ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌ల్లో విజయం సాధించాలంటే.. సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన అంశాలపైనా అవగాహన తప్పనిసరి.

ఇవీ కీలకమే

ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో క్యాట్ స్కోర్, జీడీ/పీఐలకు అదనంగా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

వైవిధ్యం

ఐఐఎంలు, ఐఐటీలు కొంత మందికే పరిమితమవుతున్నాయనే విమర్శల నేపథ్యంలో అన్ని వర్గాలకు ఐఐఎంల్లో చదివే అవకాశం లభించేలా డైవర్సిటీ(వైవిధ్యం)కి పలు చర్యలు చేపట్టాయి.

జండర్ డైవర్సిటీ: మహిళా అభ్యర్థుల సంఖ్యను పెంచేందుకు ఐఐఎంలు జెండర్ డైవర్సిటీని పాటిస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ మూడు నుంచి అయిదు శాతం మధ్య ఉంటుంది.

అకడమిక్ డైవర్సిటీ: ఐఐఎంలు అకడమిక్‌గా వివిధ నేపథ్యాల విద్యార్థులకు అవకాశం కల్పించే ఉద్దేశంతో అకడమిక్ డైవర్సిటీని పరిగణలోకి తీసుకుంటున్నాయి. దీనికి కూడా మూడు నుంచి అయిదు శాతం వెయిటేజీ లభిస్తోంది. దాంతోపాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో సాధించిన మార్కులకు ప్రత్యేక వెయిటేజీ లభిస్తుంది. అభ్యర్థులు ఆయా కోర్సుల్లో పొందిన జీపీఏ/ఉత్తీర్ణత శాతం ఆధారంగా నిర్దిష్ట వెయిటేజీ మొత్తాలను గణిస్తారు.

ఆ కోర్సులకూ వెయిటేజీ

క్యాట్ రాసేందుకు కనీస అర్హత బ్యాచిలర్ డిగ్రీ! ఐఐఎంలు తుది దశలో ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ వెయిటేజీ పేరుతో బ్యాచిలర్ డిగ్రీకి అదనంగా చదివిన కోర్సులకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతంగా ఉంటోంది. పని అనుభవానికి ఐదు నుంచి పది శాతం వెయిటేజీ లభిస్తుంది.

సక్సెస్ టిప్స్

- ఐఐఎంల తుది దశ ప్రవేశ ప్రక్రియకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు లక్ష్యంపై స్పష్టతతో అడుగులు వేయాలి. క్రేజ్ కారణంగా మేనేజ్‌మెంట్ కోర్సును ఎంపిక చేసుకున్నామనో లేదా ఐఐఎంలకున్న ప్రాధాన్యం మేరకు క్యాట్‌కు హాజరయ్యామనే రీతిలో వ్యవహరించకూడదు.
- ఐఐఎంల్లో చేరాలనుకునే అభ్యర్థులు భవిష్యత్తుకు సంబంధించి ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.
- ప్రిపరేషన్‌లో కరెంట్ ఈవెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో మంచి భావవ్యక్తీకరణ కోసం వొకాబ్యులరీని పెంచుకోవాలి. దీనికోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం లాభిస్తుంది.
- ఐఐఎంల తుది దశ ఎంపిక ప్రక్రియలో నైతిక విలువలు, సామాజిక దృక్పథాలపై ప్రశ్నలు ఎదురవుతాయి. ఈ దిశగా ఉద్యోగం పరంగా వేతనానికి ప్రాధాన్యమివ్వాలా? లేదా ఆసక్తికి ప్రాధాన్యమివ్వాలా? అనే అంశంపై అభిప్రాయాలు చెప్పమని అడగొచ్చు.